సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 247

శుక్రవారం 28-11-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

దీప్తి ధమాకా

రూ.3.20 కోట్లకు సొంతం చేసుకున్న యూపీ వారియర్స్ - 13లో

బుల్ సరికొత్త రికార్డుల్..

వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలు.. సూచీల జీవితకాల గరిష్టాలు నమోదు - 13లో

నా డ్యూటీ నేను చేస్తే టార్గెట్ చేస్తున్నారు

దళితుడిగా పుట్టడమే నా తప్పా.. నాయుడిగా పుట్టాల్సింది

- ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా, పేకాటపై సమాచారం ఇచ్చానని వేధింపులు.. తాగుబోతులను అరెస్ట్ చేస్తే పెద్దల పేరు చెప్పి విడిపించారు..
- అక్రమ బియ్యం రవాణా వాహనంతో నన్ను తొక్కిచ్చేస్తామంటున్నారు.. ఎస్ఐ, సీఐ, డీఎస్పీలనూ బెదిరిస్తున్నారు.. నన్ను డీఎస్పీ ఆఫీస్‌కు పిలిపించి హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు
- కలకలం రేపుతున్న హోంగార్డు సెల్ఫీ వీడియో
- రాష్ట్రంలో దోపిడీ ఏ విధంగా సాగుతుందో చెప్పడానికి ఇదో నిదర్శనం అంటున్న విశ్లేషకులు

10 లో

"పేకాట, అక్రమ రేషన్ బియ్యం, అక్రమ ఇసుక రవాణాను పట్టుకుంటే ఎస్ఐ, సీఐ, డీఎస్పీని సైతం బెదిరిస్తారు. నిజాయితీగా డ్యూటీ చేయడానికి వీలులేదంటారు. అక్రమ బియ్యం రవాణా వాహనంతో నన్ను తొక్కిచ్చేస్తామంటున్నారు. యాక్సిడెంట్‌గా చిత్రీకరిస్తామని బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. నా పై అధికారులు చెప్పింది చేయడమే నా డ్యూటీ. నా పనితీరు గురించి విచారించండి. నాది తప్పు ఉంటే మీరు ఏ శిక్ష విధించినా భరిస్తా. నేను దళితుడిగా పుట్టడమే తప్పా? - హోంగార్డు రాజేష్

న్యూస్‌రీల్

బంగాళాఖాతంలో 'దిత్వా' తుపాను

నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని శ్రీలంక తీరంలో తుపాను ముప్పు పొంచి ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్ర, శనివారాల్లో ఉత్తర కోస్తా, యానాంలో తేలికపాటి వర్షాలు, దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.

వివరాలు 14లో

వైఎస్సార్‌సీపీ శ్రీకాళహస్తి మండలాధ్యక్షుడి ఇంటిపై దాడి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి ఆయన తల్లి జయమ్మను హతమార్చి.. తండ్రిని తీవ్రంగా గాయపరిచాడు.

వివరాలు 5లో

ధాన్యం.. దళారుల భోజ్యం!

పంట కొనుగోలులో పూర్తిగా చేతులెత్తేసిన చంద్రబాబు ప్రభుత్వం

మిల్లర్లు, దళారుల ఇష్టారాజ్యానికి పచ్చ జెండా

రెండు మూడు గ్రామాలను ఓ దళారికి అప్పగించిన వైనం

- గోనె సంచులు లేవు.. టార్పాలిన్లు లేవు.. రవాణా వాహనాలు లేవు.. కొనుగోలు కేంద్రాలు లేవు.. అన్నీ దళారుల గుప్పిట్లోనే.. వారు చెప్పిందే రేటు
- అతి తక్కువ ధరకు అడుగుతూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్న దుస్థితి
- మిల్లులోకి రైతు నేరుగా ప్రవేశించే పరిస్థితే లేదు
- ఏ దశలోనూ కనిపించని సర్కారు పర్యవేక్షణ
- పంట కొనుగోలు చేద్దామనే చిత్తశుద్ధి అంతకంటే లేదు
- ఉత్సవ కేంద్రాలుగా మారిన ఆర్బీకేలు, సొసైటీలు
- వెరసి 75 కిలోల బస్తాకు రూ.400-500 నష్టపోతున్న రైతులు
- సర్కారు కుట్రలకు తోడు తుపాను హెచ్చరికలతో అన్నదాతల్లో తీవ్ర ఆందోళన

2 లో

ఈ చిత్రంలో కనిపిస్తున్న ధాన్యం ఆరబోసిన దృశ్యం చంద్రబాబు క్యాబినెట్‌లోని మంత్రి పార్థసారథిని అవాక్కయ్యేలా చేసింది. కృష్ణా జిల్లా మొవ్వ మండలం కారకంబాడు గ్రామం నుంచి పామర్రు సెంటరు-గుడివాడ వెళ్లే రహదారిలో ఈ దృశ్యం కనిపించింది. కృష్ణా జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో స్పష్టం చేస్తోంది. వ్యవసాయ కుటుంబాలన్నీ రోడ్లపై ధాన్యాన్ని పోసి పగలంతా ఆరబెట్టుకోవడం.. రాత్రి అయితే అక్కడే చలిలో కాపలా ఉండటం తప్పనిసరిగా మారింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులు 75 కిలోల బస్తాను రూ.వెయ్యికి కొనుగోలు చేస్తున్న దుస్థితి. బుధవారం ఈ రహదారిలో వెళ్తున్న మంత్రి పార్థసారథి రోడ్లపై ధాన్యాన్ని చూసి కారు దిగేసరికి.. అన్నదాతలు ఆయన్ను చుట్టుముట్టి నిలదీశారు. మిల్లర్లు, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో వాహనాలు రాక ధాన్యం కొనుగోలు చేయట్లేదని, రంగు మారిన ధాన్యాన్ని తీసుకోవడానికి మిల్లర్లు నిరాకరిస్తున్నారని వాపోయారు. మంత్రి జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని చెప్పి.. అక్కడి నుంచి వెళ్లిపోయారు.

విక్రమ్-1ను రిమోట్ కంట్రోల్ ద్వారా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఈ శతాబ్ది జెన్‌జీ దే

ఇతర దేశాల జెన్‌జీ తరానికి ఆదర్శంగా భారత యువత: ప్రధాని మోదీ

- అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లు అద్భుతాలు సృష్టిస్తున్నాయన్న ప్రధాని
- త్వరలో అణుశక్తి రంగంలోనూ ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పిస్తామని వెల్లడి
- శంషాబాద్‌లో స్కైరూట్ ఆఫీస్ 'ఇన్ఫినిటీ క్యాంపస్' ప్రారంభించిన ప్రధాని
- స్కైరూట్ మొట్టమొదటి ఆర్బిటల్ వెహికల్ 'విక్రమ్- 1'ఆవిష్కరణ

10 లో

నెయ్యి సరఫరాపై నిర్దిష్ట విధానాలు

- టీటీడీలో చాలా ఏళ్లుగా అమలులో కట్టుదిట్టమైన ప్రక్రియ
- ఎన్‌ఈడీబీ నుంచి క్లియరెన్స్ తీసుకున్నాకే ట్యాంకర్లకు అనుమతి.. టీటీడీ దీన్ని పరిశీలించి నిర్ధారించుకున్నాకే లోపలకు పంపుతుంది
- ఇక కల్తీకి ఆస్కారం ఎక్కడ?
- నేను ఎలాంటి తప్పూ చేయలేదు.. లై డిటెక్టర్ పరీక్షకూ సిద్ధమే
- గత పదేళ్లుగా నెయ్యి కొనుగోళ్లపై విచారించాలి
- టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

3 లో

దళిత ఐపీఎస్‌ల పట్ల వివక్ష, వేధింపులు

సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌కు సీఐడీ సమన్లు

- న్యాయస్థానం తోసిపుచ్చిన కేసులో చంద్రబాబు ప్రభుత్వం అత్యుత్సాహం
- ఇప్పటికే సంజయ్ అక్రమ అరెస్టు.. జైలుపాలు.. సస్పెన్షన్ పొడిగింపు
- జాషువాకు పోస్టింగ్ ఇవ్వకుండా వేధింపులు.. విశాల్ గున్నీపై తప్పుడు కేసు పెట్టి సస్పెన్షన్.. రిటైర్డ్ అధికారి విజయ్ పాల్‌పైనా అక్రమ కేసు
- ఐపీఎస్‌లు మొదలు కానిస్టేబుళ్ల వరకు వందలాది మందిపై కక్ష సాధింపు
- చంద్రబాబు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న దళిత సంఘాలు

10 లో

పదోన్నతుల్లో ఎస్సీల ఉప వర్గీకరణ మేరకు

రిజర్వేషన్లు

పబ్లిక్ సర్వీస్, రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు నియమావళిలో సవరణలు

10 లో

అమెరికాపై ఉగ్రదాడి!

వైట్‌హౌస్ సమీపంలో అఫ్గాన్ యువకుడి కాల్పులు

- ఇద్దరు వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డు జవాన్లకు గాయాలు
- ఎదురు కాల్పుల్లో గాయపడి ప్రాణాలతో చిక్కిన నిందితుడు
- ఇది ముమ్మాటికీ ఉగ్రవాద దాడేనన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- అమెరికాలోని అఫ్గాన్ జాతీయులపై విచారణ జరపాలని ఆదేశం
- అఫ్గాన్ పౌరుల ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులను రద్దు చేయాలని స్పష్టీకరణ

6 లో

వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వద్దు

- అదే జరిగితే ట్రయల్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది
- వారి వాంగ్మూలాలు నమ్మదగ్గవి కావు
- నన్ను ప్రతివాదిగా చేర్చుకుని నా వాదనలు వినండి
- హైకోర్టులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుబంధ పిటిషన్లు
- నేడు విచారణ జరపనున్న ధర్మాసనం

- వివరాలు 14లో

ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణకు స్వతంత్ర వ్యవస్థ

- స్వీయ నియంత్రణ సరిపోదు..
- అది విఫలమైంది కూడా
- అశ్లీల, వికృత పోకడలను అడ్డుకునేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరం
- యూట్యూబ్, ఓటీటీ కంటెంట్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

6 లో

నేటి గుడ్డు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్	108 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	196 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	135 కిలో	స్కిన్ లెస్	223 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది



జస్ట్ ల్యాండ్స్!.. మొత్తం రాష్ట్రాన్నే అమ్మడం లేదుగా..!!

రామ.. రామ.. రాక్షసకాండ!

అంగన్‌వాడీ హెల్పర్‌పై టీడీపీ వర్గీయుల దాడి

- సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరిలో దుశ్శాసన పర్వం
- ఇంట్లోంచి చీరపట్టుకుని లాక్కెళ్లి చీపురుతో దాడి
- ఈడ్చుకెళ్లి కాళ్లతో తన్నుతూ చితకబాదిన వైనం
- రాజీనామా చేయకపోతే చంపుతామని బెదిరింపు
- ఫిర్యాదుకు వెళ్లగా ఎస్ఐ లేరని చెప్పిన పోలీసులు
- నిందితుడు గతంలో దళితుడిపై దాడిచేసినా చర్యలు శూన్యం.. ఎమ్మెల్యే పరిటాల సునీత అండతో చెలరేగుతున్న టీడీపీ నేతలు

2 లో

అంగన్‌వాడీ హెల్పర్ ఇంద్రజపై దాడి చేస్తున్న టీడీపీ వర్గీయులు

ఔను.. ఒంటరి మహిళ నుంచి డబ్బు తీసుకున్నా

అంగీకరించిన మంత్రి అనధికారిక పీఏ సతీష్

- అతడి 'కీచక' పర్వంపై ఎస్పీకి ఫిర్యాదు
- దగాపడ్డ ఆడబిడ్డకు అండగా నిలవని మహిళా మంత్రి
- పైగా ఆమే నిందితుడిని వెనకేసుకొచ్చారు: బాధితురాలు
- 'నా పీఏతోనే గొడవ పడతావా?' అని మంత్రి బెదిరించారు.. నిందితుడికే ఆమె వత్తాసు పలికారు
- బాధిత మహిళ పక్షాన నిలిచిన 'సాక్షి'కి బెదిరింపులు

2 లో

ధాన్యం.. దళారుల భోజ్యం!

పంట కొనుగోలులో పూర్తిగా చేతులెత్తేసిన చంద్రబాబు ప్రభుత్వం

మోంథా తుపానుతో అతలాకుతలమైన ధాన్యం రైతుల పట్ల చంద్రబాబు ప్రభుత్వం డబుల్ గేమ్ ఆడుతోంది. ఓ వైపు నష్టపోయిన రైతులకు రూపాయి పరిహారం ఇవ్వకపోగా, ఇప్పుడు అంతంత మాత్రంగా చేతికందిన పంటను కొనుగోలు చేయడంలో దళారులకు మేలు జరిగేలా అంతర్గతంగా సహకరిస్తోంది. రంగు మారిన ధాన్యాన్ని కూడా కొంటామని చెప్పి.. నిర్దయగా తిరస్కరిస్తోంది. గోనె సంచులు లేవు.. టార్పాలిన్లు లేవు.. రవాణా వాహనాలు లేవు.. కొనుగోలు కేంద్రాలు లేవు.. ఈ ఇబ్బందులన్నీ అధిగమించి రైతులు ధాన్యాన్ని అమ్ముకుందామంటే కనీస మద్దతు ధర కూడా లేదు.. ఈ దళారీ ప్రభుత్వం చెప్పేదొకటి.. చేస్తున్నది మరొకటని అన్నదాతలు దుమ్మెత్తిపోస్తున్నారు.

తుపాను వస్తేనే పరదాలు ఇస్తారట!

ఈ రైతు పేరు ఆరుమళ్ల రాజశేఖర్‌రెడ్డి. కృష్ణా జిల్లా పామర్రు గ్రామం. సొంత పొలం మూడెకరాలు, మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని మొత్తం ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. ప్రస్తుతం మిషన్ సహాయంతో రెండు ఎకరాలు నూర్పిడి చేశాడు. ఎకరాకు రూ.35 వేల వరకు ఖర్చు అయింది. దిగుబడి ఎకరాకు 25–27 బస్తాలే వచ్చింది. పంటను ఆరబెట్టుకునేందుకు పరదాలు (టార్పాలిన్లు) కావాలని ఆర్బీకేకు వెళ్లి అడిగాడు. 'ప్రస్తుతం పరదాలు ఇవ్వట్లేదు.. తుపాను వస్తేనే ఇస్తాం' అని చెప్పారని చెప్పాడు. గోనె సంచులతో చిరిగిపోయినవి ఇస్తున్నారు. కష్టపడి పంటను ఆరబెట్టుకుంటే లోడింగ్‌కు లారీలు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

తక్కువకు రేటు కడదామని చూస్తున్నారు

గుంటూరు జిల్లా పొన్నూరు మండలం వెల్లలూరుకు చెందిన ఎస్ సత్యనారాయణ ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఇటీవల మోంథా తుపాను వల్ల పొలం నీట మునిగి పోవడంతో నష్టపోయాడు. ఒక్క రూపాయి పరిహారం రాలేదు. ఇప్పుడు పంట చేతికి వచ్చే సమయానికి మళ్లీ తుపాను హెచ్చరిక రావడంతో భయంతో కోతలు ప్రారంభించాడు. అధిక వ్యయంతో యంత్రాలతో కోతలు నిర్వహిస్తే ఎకరాకు 33 బస్తాల ధాన్యమే దిగుబడి వచ్చింది. మద్దతు ధర దక్కడం గగనంగా మారింది. పొలాల వద్దకు వచ్చే వ్యాపారులు 75 కిలోల బస్తా రూ.1,300కే అడుగుతున్నారు. విక్రయించేందుకు సిద్ధమైనా సిండికేట్‌గా ఏర్పడి కొనుగోలు చేయకుండా మరింత తక్కువ రేటు కడదామని చూస్తున్నారని వాపోయాడు.

సాక్షి, అమరావతి/సాక్షి, నెట్‌వర్క్: ధాన్యం సేకరణలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసింది. మిల్లర్ల ఇష్టారాజ్యానికి వదిలేసింది. రెండు మూడు గ్రామాలకు ఒక దళారీ చొప్పున అప్పగించి, అందినకాడికి దోచుకోవాలని పచ్చ జెండా ఊపింది. సంచులు, లారీలు, ధర విషయంలోనూ వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. మొత్తంగా ధాన్యం కొనుగోలు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్న వారు అతి తక్కువ ధరకు అడుగుతుండటం ఊరూరా ప్రత్యక్షంగా కనిపిస్తోంది. దళారులు, మిల్లర్లు చెప్పిన రేటుకు అమ్ముకోవడం తప్ప అన్నదాతలకు మరో మార్గం లేకుండా చేసింది. రైతు నేరుగా మిల్లుకో ప్రభుత్వ పరిస్థితి లేకుండా కుతంత్రం సాగిస్తోంది. ధాన్యం కొనుగోలు విషయంలో ఏ దశలోనూ ప్రభుత్వ పర్యవేక్షణ అన్నదే లేదు. ధాన్యం కొనాలని చిత్తశుద్ధి అంతకంటే లేదు. రాష్ట్రంలో రైతులకు చంద్రబాబు సర్కార్ కంటి మీద కునుకు లేకుండా చేయడంతో పాటు ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా నిలువునా దోపిడీ చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలకు తోడు దళారుల దందాకు వత్తాసు పలుకుతూ రైతులను నిలువునా ముంచేస్తోంది. కనీసం పెట్టిన పెట్టుబడి రాకపోగా, రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఒక వైపు ఖరీఫ్‌లో ధాన్యం కోతలు ఊపందుకున్నా, మరోవైపు కొనుగోళ్లు మాత్రం ముందుకు కదలట్లేదు. ఇటీవల వరుస వాయు గుండాలు, మొంథా తుపాన్ రైతులను తీవ్రంగా దెబ్బ తీశాయి. మిగిలిన అరకొర పంటలను దక్కించుకున్నా, అమ్ముకునే పరిస్థితి లేదు. రైతు భరోసా కేంద్రాలు, సొసైటీలు ఉత్సవ కేంద్రాలుగా మారాయి. కనీసం పంట పట్టుబడికి గోనె సంచులూ సమకూర్చలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వ యంత్రాంగం మిన్నకుండిపోయింది. ఫలితంగా రోజుల తరబడి రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి ఎత్తుకోవడం.. లేదా దళారులు అడిగిన రేటుకు ఇచ్చేయడం తప్ప మరో దారి కనిపించట్లేదు.

దళారుల దోపిడీ పర్వం

చంద్రబాబు ప్రభుత్వంలో ఎన్నడూ రైతులకు మద్దతు ధర అందించిన పాపాన పోలేదు. ధాన్యం కొనుగోళ్లలో దళారుల దోపిడీ పర్వానికి తెరతీసి వేడుక చూస్తోంది. పేరుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెట్టినా, దళారుల అనుమతి లేకుండా ఒక్క గింజ కూడా పంట పొలం నుంచి మిల్లులకు చేరే పరిస్థితి లేదు. పంటను మద్దతు ధరకు విక్రయించేందుకు రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లినా, నిరాశే ఎదురవుతోంది. రోజుల తరబడి షెడ్యూల్ ఇవ్వకపోవడం, గోనె సంచులు సమకూర్చక పోవడంతో కోసిన పంటను నిల్వ చేసుకునేందుకు అగచాట్లు

ఏలూరులో రోడ్డుపై ధాన్యం ఆరబోస్తున్న దృశ్యం

పడాల్సి వస్తోంది. ఒకవేళ పట్టుబడి చేసినా రోజుల తరబడి లోడ్ మిల్లులకు చేరట్లేదు. అదే, దళారులు చెప్పిన రేటుకు ధాన్యాన్ని ఇస్తే మాత్రం క్షణాల్లో తరలించేస్తున్నారు. ఫలితంగా రైతులు 75 కిలోల బస్తాకు రూ.400–500 తక్కువ రేటుకు అమ్ముకోవాల్సి వస్తోంది. అంటే, సాధారణ రకానికి రూ.1,777, ఏ–గ్రేడ్‌కు రూ.1,792 మద్దతు ధర ఉంటే.. దళారులు ఇచ్చేది రూ.1,200–1,300 మాత్రమే.

ఆరు కోట్ల గోనె సంచులు ఎక్కడ?

ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు ఏకంగా 7,53,000 కోట్ల గోనె సంచులను అందుబాటులో ఉంచినట్టు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. కానీ, క్షేత్ర స్థాయిలో రైతులకు పంట పట్టుబడికి మాత్రం సంచులు దొరకట్లేదు. ఏలూరు జిల్లా చింతలపూడిలో గోనె సంచుల కోసం రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. మరో వైపు 30 వేలకు పైగా రవాణా వాహనాలు సిద్ధం చేసినట్టు ప్రభుత్వం చెబుతున్నా, లోడింగ్‌కు మాత్రం కనీసం ట్రాక్టర్లు కూడా అందుబాటులో ఉండట్లేదు. ఇదిలా ఉండగా, ఇటీవల పౌర సరఫరాల సంస్థ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ కాంట్రాక్టును, వాటి సాఫ్ట్‌వేర్‌ను ఉత్తర భారతదేశానికి చెందిన ఓ సంస్థకు అప్పగించింది. ఇప్పుడు ఒకే సంస్థ పరిధిలో అన్ని రకాల జీపీఎస్ డివైజ్‌లను అనుసంధానం చేసింది. సాంకేతిక సమస్యల కారణంగా చాలా చోట్ల జీపీఎస్‌లు పనిచేయక పోవడంతో లారీల్లో లోడింగ్‌కు ముందుకు రావట్లేదు.

బ్యాంకు గ్యారంటీలు కట్టని మిల్లర్లు

ప్రభుత్వం 3,013 రైతు భరోసా కేంద్రాలు, 2,061 పీఏసీ (పీఏసీఎస్)ల ద్వారా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేసినట్టు చెబుతోంది. కానీ, చాలా చోట్ల ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను తెరుచుకోలేదు. ఇక్కడ అధికారులు, దళారులు కుమ్మక్కుల్లో భాగంగా రైతులను కొనుగోలు కేంద్రాలను నిర్వీర్యం చేస్తున్నారు. ఈ క్రమంలో రైతులను గత్యంతరం లేక దళారులను ఆశ్రయించేలా పరోక్షంగా కుట్ర చేస్తున్నారు. అంటే.. ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనకపోగా.. దళారులతో కలిసి రైతులను దోపిడీ చేస్తూ.. మళ్లీ అదే దళారీ, రైతు పేరుతోనే ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్ముకుని లాభపడేలా దోపిడీ వ్యవస్థను ప్రోత్సహిస్తుండటం గమనార్హం. ఈ క్రమంలో మిల్లర్లు రూ.3 వేల కోట్లకు బ్యాంకు గ్యారంటీలు ఇవ్వాల్సి ఉండగా కేవలం 50 శాతం కూడా ఇవ్వలేదు. ఫలితంగా ఆ ప్రాంతాల్లో మిల్లులకు ధాన్యాన్ని తరలించలేక అధికార యంత్రాంగం చేతులు ఎత్తేస్తోంది. దీనికి తోడు ప్రభుత్వం వాట్సాప్‌లో 'హాయ్' అని మెసేజ్ పెట్టగానే.. ధాన్యం కొంటామంటూ విస్తృతంగా ప్రచారం చేసింది. కానీ, రైతు నేరుగా కొనుగోలు కేంద్రానికి వెళ్లినా పట్టించుకునే నాథుడే లేడు.

తేమ.. తూకంలోనూ మోసం!

మోంథా తుపాన్ దెబ్బతిన్న పంటను కోత కోయించే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఎకరానికి రూ.4 వేలు పెట్టి మిషన్ల ద్వారా కోతలు కోయిస్తున్నారు. కోసిన పంటను కోసినట్టు అమ్ముకుందామంటే ప్రభుత్వం 17 శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే నిరాకరిస్తోంది. ప్రభుత్వం రైతులకు పంట ఒబ్బిడికి టార్పాలిన్లు ఇవ్వకపోగా, తేమ శాతం పేరుతో కొనుగోలుకు నిరాకరిస్తోంది. రంగుమారిన ధాన్యాన్నీ కొనడం లేదు. దీనికి తోడు గోనె సంచికి రెండు కిలోల బరువు కట్టి, అంతే మొత్తాన్ని రైతుల ధాన్యంలో నుంచి లాగేస్తున్నారు. ఇదిలా ఉండగా ఖరీఫ్ సీజన్‌లో సుమారు 81 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో 51 లక్షల టన్నుల ధాన్యాన్ని కొంటామని చెప్పింది. అయితే తుపాను, ఇతర కారణాల వల్ల అంత దిగుబడి రాలేదు. ఇప్పటిదాకా 7.19 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

క్షేత్ర స్థాయిలో పట్టించుకునే వారేరీ?

- బాపట్ల జిల్లాలో ధాన్యం సేకరణ రైతుల పాలిట శాపంగా మారింది. వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో 1.60 లక్షల ఎకరాలకుగాను 40 వేల ఎకరాల్లో కోతలు పూర్తి చేశారు. జిల్లాలో 117 కొనుగోలు కేంద్రాలు పెట్టినా, 200 టన్నుల ధాన్యం కూడా కొనలేదు. జిల్లాలో 2.80 లక్షల ఎకరాల్లో 6.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ప్రభుత్వం 2 లక్షల టన్నుల ధాన్యం సేకరిస్తామని చెబుతోంది.
- తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా సుమారు 6 లక్షల టన్నుల ధాన్యం దిగుబడికి గాను 4 లక్షల టన్నులు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అయితే కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడంతో రైతులు దిక్కుతోచక 75 కిలోల బస్తాకు రూ.300–400 నష్టానికి దళారులకు విక్రయించిన దుస్థితి. మరో వైపు కేవలం మూడు లారీల ధాన్యం పట్టే మేర సంచులు ఇస్తున్నారు. ఒకసారి లారీ మిల్లుకు వెళ్లి వస్తే గానీ రైతులకు సంచులు దొరకట్లేదు. ఎలక్ట్రానిక్ కాటాలో మోసంతో 4 నుంచి 5 కిలోలు దోచేస్తున్నారు.
- శ్రీకాకుళం జిల్లాలో 6.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 3,900 టన్నులు మాత్రమే సేకరించారు. ఇంకా 406 కొనుగోలు కేంద్రాల్లో నాలుగో వంతు కూడా ప్రారంభం కాలేదు. 264 మిల్లులకు గాను 81 మంది మిల్లర్లు మాత్రమే బ్యాంకు గ్యారంటీలు ఇచ్చారు. ఇంకా రూ.10.29 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉంది. కానీ, ఇంత వరకు రూ.2 లక్షలు మాత్రమే రైతులకు చెల్లింపులు చేయడం గమనార్హం. గోనె సంచులను ఏజెన్సీ ద్వారా ఇవ్వాలా? మిల్లర్ల ద్వారా ఇవ్వాలా? అన్నదానిపై అధికారులు ఇంకా తర్జనభర్జన పడుతున్నారు. మరో వైపు 80 కిలోల బస్తాకు అదనంగా 6–7 కేజీల ధాన్యాన్ని తీసుకుంటున్న దుస్థితి. వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ధాన్యాన్ని కాపాడుకోలేక భయంతో 80 కిలోల బస్తాను మద్దతు ధర కంటే రూ.600–700 తక్కువకు విక్రయిస్తున్నారు.
- కాకినాడ జిల్లాలో మోంథా తుపానుతో ముంపునకు గురైన వరి పొలాల్లో 33 శాతం పంట నష్టం సంభవించిన పొలాల్లో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయమని అధికారులు తెగేసి చెబుతున్నారు. ఎకరాకు 35 బస్తాలు దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తే, 25 బస్తాలు కూడా వచ్చేలా లేదు. పెట్టుబడులు, పంట నష్టాలకు తోడు గత ఏడాది గంటకు రూ.2 వేలు ఉన్న వరి కోత యంత్రం అద్దె ప్రస్తుతం గంటకు రూ.3,400 నుంచి రూ.4000 వరకు పెరిగిపోయింది. తుపాన్ దెబ్బకు పంట నేల వాలడంతో గంట పట్టాల్సిన కోత రెండున్నర గంటలు పడుతోంది. అంటే, ఎకరా కోతకే రూ.8,500 అవుతుంది. ఇక తేమ శాతం పేరుతో మద్దతు ధరలో 75 కిలోల బస్తాకు రూ.400 వరకు తగ్గిస్తున్నారు.

ధాన్యం ఎవరికి అమ్మాలి?

గత నెలలో తుపాను కారణంగా కురిసిన వర్షాలకు ధాన్యం బాగా దెబ్బతింది. తేమ అధికంగా వస్తోంది. రెండు రోజుల కిందట కోతలు మొదలు పెట్టాం. వాతావరణంలో మార్పులు రావడంతో హడావిడిగా ఒబ్బిడి చేస్తున్నాం. ధాన్యం కల్లాల్లోనే బరకాలతో కప్పి ఉంది. ఆర్‌బీకేలో సవాలక్ష నిబంధనలు పెట్టారు. వ్యాపారులు కూడా తక్కువ ధరకు అడుగుతున్నారు. ఈ పరిస్థితిలో ధాన్యాన్ని ఏం చేయాలో అర్థం కావడం లేదు. – పెద్దిరెడ్డి సత్యనారాయణ, గాడిలంక, ముమ్మిడివరం మండలం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

రోజుకో రేటు

నేను రెండు ఎకరాల్లో వరి సాగు చేశా. కొనుగోలు కేంద్రంలో స్పందన లేకపోవడంతో ఏజెంట్లను అడిగితే రోజుకో రేటు చెబుతున్నారు. మూడు రోజుల కిందట రూ.1,400 ఉంటే, ఇప్పుడు అది రూ.1,330కి పడిపోయింది. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం అమ్మాలంటే సవాలక్ష నిబంధనలు పెట్టారు. తేమ శాతం, పొట్టు, మట్టి గెడ్డలు, పూర్తిగా ఆరబెట్టినవి మాత్రమే కొనుగోలు చేస్తారట. ధాన్యం ఆరబెట్టడానికి జాగా లేని మేము ఏం చేయాలి? – కట్టేపోగు నాగులు, శృంగారపురం గ్రామం, దుగ్గిరాల, గుంటూరు జిల్లా

గోనె సంచులు ఇవ్వట్లేదు

నేను ఎకరానికి రూ.20 వేలు వంతున ఖర్చు చేసి 13 ఎకరాలలో వరి సాగు చేశా. నూర్పిడులు కూడా పూర్తయ్యాయి. వాతావరణ మార్పుల హెచ్చరికలతో గుండెల్లో గుబులు మొదలైంది. నాకు ఈ ధాన్యం పట్టడానికి 500 గోనె సంచులు అవసరం. కానీ, 200 మాత్రమే ఇచ్చారు. తుపాను ఆందోళనతో గోనెలు లేకపోతే పంట నష్టపోవడం కంటే దళారులకు అమ్ముకోవడం ఉత్తమం అనిపిస్తుంది. అయితే, క్వింటాకు రూ.400 నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం గోనె సంచులు ఇవాలి. – కనకల శ్రీనివాసరావు, బోని, ఆనందపురం మండలం, విశాఖపట్నం

జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణకు

ప్రాథమిక నోటిఫికేషన్లు

- జారీ చేసిన రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్

సాక్షి, అమరావతి: జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణకు రెవెన్యూ శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ గురువారం ప్రాథమిక నోటిఫికేషన్‌లను జారీ చేశారు. కొత్తగా పోలవరం, మార్కాపురం, మదనపల్లె జిల్లాలతోపాటు అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్లు జారీ చేశారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు ఇంగ్లిష్, తెలుగులో గెజిట్‌లో ప్రచురించాక 30 రోజుల్లోగా అభ్యంతరాలను, సూచనలను ఆయా కలెక్టర్లకు తెలియజేయాల్సిందిగా వాటిలో స్పష్టం చేశారు. అనంతరం తుది నోటిఫికేషన్లు జారీ చేస్తారు.

ఔను.. ఒంటరి మహిళ నుంచి

డబ్బు తీసుకున్నా

అంగీకరించిన మంత్రి అనధికారిక పీఏ సతీష్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉద్యోగం ఇప్పిస్తానని పార్వతీపురం మన్యం జిల్లా సాలూరుకు చెందిన ఒంటరి మహిళను ఆర్థికంగా దోచుకుని, తర్వాత లైంగికంగానూ వేధించిన మంత్రి అనధికారిక పీఏ సతీష్ నిజం ఒప్పుకొన్నాడు. అతడి ఆగడాలను.. ''మంత్రి కొడుక్కి నీపై మనసైంది'' శీర్షికన గురువారం 'సాక్షి' వెలుగులోకి తేవడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో తన దుర్మార్గాన్ని సమర్థించుకునే క్రమంలో సతీష్ వాస్తవాన్ని చెప్పేశాడు. బాధిత మహిళ నుంచి తాను డబ్బు తీసుకున్నది నిజమేనని అంగీకరించాడు. అది అప్పుగా మాత్రమేనని బుకాయించాడు. అయితే, భర్త చనిపోయి.. తీవ్ర అనారోగ్యం పీడితురాలైన బిడ్డతో.. కారుణ్య ఉద్యోగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మహిళ నుంచి సాక్షాత్తు రాష్ట్ర మంత్రి అనుచరుడు అప్పు తీసుకున్నానని చెప్పడంతోనే అతడి వాదన డొల్ల అని స్పష్టమైంది. మరోవైపు బాధిత మహిళతో పాటు ఆమె పక్షాన నిలిచిన 'సాక్షి'పై కేసులు పెడతామని సతీష్ బెదిరింపులకు దిగాడు. అధికారం అండతో అనధికారిక పీఏగా ఉంటూ.. మహిళను వేధించింది కాక మరింత బరితెగించాడు.

డబ్బు దండుకున్నది కాక మానప్రాణాలతో చెలగాటం

''ఆడబిడ్డకు అన్యాయం జరిగితే, అండగా నిలవాల్సిన మహిళా మంత్రే నిందితుడిని వెనకేసుకొస్తున్నారు. ఉద్యోగం పేరుతో డబ్బు దండుకున్నది కాక మానప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు'' అని బాధిత మహిళ వాపోయింది. మంత్రి అనధికారిక పీఏ సతీష్ ఆగడాల నుంచి రక్షణ కల్పించాలని ఐద్వా, శ్రామిక మహిళా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటేశ్వర రావుకు ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ కడప జిల్లాలో ముగిసిన

వైఎస్ జగన్ పర్యటన

సాక్షి కడప: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల వైఎస్సార్ కడప జిల్లా పర్యటన గురువారం ముగిసింది. పులివెందులలోని క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ఉదయం ఆయన బయలుదేరి వెళ్లారు. వైఎస్సార్ కడప జిల్లా పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ తొలిరోజు పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజలు, పార్టీ నాయకులతో మమేకమయ్యారు. రెండో రోజు పులివెందుల పరిధిలోని బ్రాహ్మణపల్లె సమీపంలో అరటి తోటలను పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. పలువురు నేతలను పరామర్శించడంతోపాటు వివాహ వేడుకకు హాజరయ్యారు. ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మూడోరోజు కూడా ఇల్లు, కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలతో మమేకమయ్యారు.

వివాహితకు టీడీపీ నేత

లైంగిక వేధింపులు

- రక్షణ కల్పించాలంటూ వేడుకుంటున్న బాధితురాలు
- నెల్లూరు జిల్లా కావలిలో ఘటన

మాట్లాడుతున్న గీతాంజలి

కావలి(అల్లూరు): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరి తనను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నారని ఓ మహిళ వాపోయింది. ఆయన నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని.. రక్షణ కల్పించాలని కోరింది. నెల్లూరు జిల్లా కావలికి చెందిన గీతాంజలి తన తల్లి కామాక్షి, బిడ్డతో కలిసి గురువారం మీడియాతో మాట్లాడారు. దగదర్తి మండలం మనుబోలుపాడుకు చెందిన చేజర్ల మహేష్‌రెడ్డితో తనకు 2016లో వివాహమైందని చెప్పారు. హైదరాబాద్‌లో భర్తతో కలిసి ఉంటున్న తమ మధ్య రవికుమార్ చౌదరి గొడవలు పెట్టాడని ఆరోపించారు. భర్త లేని సమయంలో ఇంటికి వచ్చి తనను వేధించేవాడని వాపోయారు. రవికుమార్‌చౌదరికి చెందిన అతిథిగృహంలో భర్త ముందే తనపై గురువారం దాడి చేయించాడని కన్నీరు పెట్టుకున్నారు. దీంతో తన భర్తపైనా, రవికుమార్‌చౌదరిపైనా కావలి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. ఆ తర్వాత కావలి కోర్టుకు వెళ్లి.. బయటకొస్తుండగా తనతో పాటు తన తల్లిపై భర్త మహేష్‌రెడ్డి, మరికొందరు దాడి చేశారని చెప్పారు. దీనిపై కూడా పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. రవికుమార్‌చౌదరి తన భర్తను కూడా దగ్గరే పెట్టుకొని తమ కాపురాన్ని నాశనం చేశాడని వాపోయారు. అధికారం అండతో.. చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడని తెలిపారు. ఇంటి చుట్టూ రెక్కీ నిర్వహిస్తున్నారని.. తమను రక్షించాలని వేడుకున్నారు.

రామ.. రామ.. రాక్షస కాండ!

అంగన్‌వాడీ హెల్పర్‌పై టీడీపీ వర్గీయుల దుశ్శాసన పర్వం

అనంతపురం సెంట్రల్/సాక్షి, పుట్టపర్తి: పేరులో రాముడు ఉన్న రాప్తాడు నియోజకవర్గం రామగిరిలో ఆటవిక రాజ్యం నడుస్తోంది..! రాక్షసత్వం రాజ్యమేలుతోంది..! రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి ఇక్కడ అరాచకం పేట్రేగుతోంది..! స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత అండతో పచ్చమూకలు చెలరేగుతున్నాయి! కొత్తగాదికుంటలో పొలాలు దున్నేయడం.. పేరూరులో దళిత బాలికపై సామూహిక అత్యాచారం.. పాపిరెడ్డిపల్లిలో బీసీ వర్గానికి చెందిన కురుబ లింగమయ్య దారుణ హత్య.. మహిళా ఎంపీటీసీ సభ్యురాలి కిడ్నాప్..! ఇలా ఒకటేమిటి..? అనేక దారుణాలు జరుగుతున్నాయి..! తాజాగా అంగన్‌వాడీ హెల్పర్‌పై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. మహిళా ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మహిళలకే రక్షణ కరువైంది..! వివరాల్లోకి వెళ్తే.. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం మంగాపురం గ్రామంలో ఇంద్రజ 2019 నుంచి అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అదే గ్రామానికి చెందిన ఆ పార్టీ కార్యకర్త గొల్ల శ్రీనివాసులు కుమారుడు విష్ణు హెల్పర్ పోస్టు తమవారికి కావాలని రాజీనామా చేయాలని ఇంద్రజను బెదిరిస్తున్నాడు. ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారుడు శ్రీరామ్ అండ చూసుకుని వేధించసాగాడు. రోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లడం, సెల్‌ఫోన్‌కు మెసేజ్‌లు పంపడం చేస్తున్నాడు. ఇతడి ఆగడాలపై ఏడాది క్రితమే ఇంద్రజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కానీ, ఎస్ఐ సుధాకర్‌యాదవ్ పెద్దగా పట్టించుకోకుండా రాజీ చేసి పంపారు. తర్వాత కూడా ఇంద్రజకు వేధింపులు ఆగలేదు.

పట్టపగలే ఇంట్లోకి చొరబడి...

ఈ క్రమంలో బుధవారం పట్టపగలే గొల్ల శ్రీనివాసులు, విష్ణు, అతడి భార్య నాగమ్మ, బావమరిది ఓబయ్యలు ఇంద్రజ ఇంట్లోకి చొరబడ్డారు. ఆమెను, భర్త నరసింహమూర్తిని చెప్పులు, కట్టెలతో కొట్టారు. చీర పట్టుకుని బయటకు లాక్కెళ్లి చీపురుతో కొట్టారు. ఈడ్చుకెళ్లి కాళ్లతో తన్నుతూ చితకబాదారు. రాజీనామా చేయకపోతే చంపుతామని బెదిరించారు. ఇంద్రజ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. నరసింహమూర్తి అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఎస్ఐ లేరు.. కేసు తీసుకోం...

ఇంద్రజ దంపతులపై దౌర్జన్యం జరిగి 24 గంటలైనా, టీడీపీ వర్గీయులు ఇంద్రజ ఇంటిపై దాడి చేసిన వీడియోలు, ఆమె తీసిన సెల్ఫీ వీడియోలు సోషల్ మీడియాలో వైరలైనా పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. పైగా ఘటనపై ఫిర్యాదు చేయడానికి బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం సాయంత్రం రామగిరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. ఎస్ఐ సుధాకర్ యాదవ్ లేరని, కేసు తీసుకోబోమని పోలీసులు చెప్పడం గమనార్హం. దిక్కుతోచని స్థితిలో బాధితురాలు ఇంద్రజ సెల్ఫీ వీడియో ద్వారా గురువారం సాయంత్రం తనపై జరిగిన దాడిని వెల్లడించారు.

బాధితురాలు ఇంద్రజ

నిందితుడిపై గతంలోనూ ఫిర్యాదులు

టీడీపీ కార్యకర్త గొల్ల విష్ణు నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన దళితుడిని చితకబాదాడు. అప్పుడు కూడా పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదు. దీన్నిబట్టే రాప్తాడు నియోజకవర్గంలో పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది. ఎమ్మెల్యే సునీత అండతో విష్ణు పోలీసుల నుంచి రక్షణ పొందుతున్నట్లు సమాచారం. పోలీసులు సైతం ఏకపక్షంగా అధికార పార్టీ వారి వైపే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

టీడీపీ వారినుంచి మా కుటుంబానికి ప్రాణహాని

- మా ముగ్గురు పిల్లలను కిడ్నాప్ చేస్తామంటున్నారు
- మిమ్మల్ని బతకనీయమని బెదిరిస్తున్నారు: ఇంద్రజ

టీడీపీ అధికారంలోకి వచ్చాక గ్రామానికి చెందిన ఆ పార్టీ నాయకులు నన్ను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. హెల్పర్ పోస్టు వదిలిపెట్టాలని వేధిస్తున్నారు. గొల్ల విష్ణు రాత్రివేళ ఫోన్లతో పాటు అసభ్య మెసేజ్‌లు పెడుతున్నాడు. నేరుగా అంగన్‌వాడీ సెంటర్‌కి వచ్చి దౌర్జన్యానికి దిగుతున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మా ముగ్గురు పిల్లలను కిడ్నాప్ చేస్తామని, మిమ్మల్ని బతకనీయమని బెదిరిస్తున్నారు. వారితో మా కుటుంబానికి ప్రాణహాని ఉంది. పోలీసు ఉన్నతాధికారులే కాపాడాలి.

పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

చంద్రబాబు సర్కారు వచ్చిన రోజు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అరాచకాలు ఎక్కువయ్యాయి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది. మహిళా ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్న రాప్తాడులో, అదికూడా పరిటాల సునీత సొంత మండలంలో ఇప్పటికే గ్యాంగ్ రేప్ జరిగింది. తాజాగా మంగాపురంలో అంగన్‌వాడీ హెల్పర్‌పై దాడి చేయడం బాధాకరం. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలి. – తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

హోంమంత్రిగా మహిళ.. కానీ, మహిళలకు రక్షణ కరువు

రాష్ట్ర హోం మంత్రిగా అనిత, జిల్లా మంత్రిగా సవిత, రాప్తాడు ఎమ్మెల్యే సునీత ఇలా అందరూ మహిళలే. కానీ, రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఈ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైంది. మంత్రులు, ఎమ్మెల్యే సునీతలు మంగాపురంలో అంగన్‌వాడీ హెల్పర్‌పై దాడి ఘటన మీద స్పందించాలి. దుర్మార్గంగా వ్యవహరించినవారిపై చర్యలు తీసుకోవాలి. – ఉషశ్రీ చరణ్, వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

పార్లమెంటు సమావేశాలకు మిథున్‌రెడ్డి

అనుమతించిన ఏసీబీ కోర్టు

విజయవాడలీగల్: మద్యం అక్రమ కేసులో బెయిల్‌పై ఉన్న పార్లమెంటు సభ్యుడు మిథున్ రెడ్డి పార్లమెంటు సమావేశాలలో పాల్గొనేందుకు అనుమతిస్తూ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి పి.భాస్కరరావు గురువారం ఆదేశాలిచ్చారు. ఈ నెల 28 నుండి వచ్చే నెల 20 వరకు మిథున్‌రెడ్డికి వెసులుబాటు లభించింది.

చెవిరెడ్డికి ప్రత్యేక వసతులకు అనుమతి

ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న మాజీ శాసనసభ్యుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డికి టేబుల్ వసతి, ఇంటి భోజనంతోపాటు ములాఖత్‌ల పెంపునకు కోర్టు అనుమతించింది. చెవిరెడ్డికి ఈ వసతులు కల్పించాలని న్యాయవాది ఎం.వాణిరెడ్డి పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కాగా చెవిరెడ్డిసహా చెరుకూరి వెంకటేష్ నాయుడు, గుంటూరు జైలులో వున్న బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ తరపున దాఖలైన బెయిల్ పిటిషన్లపై విచారణను కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ముంబైకి చెందిన ఏ–49 అనిల్‌చోక్రాను మూడు రోజులపాటు– డిసెంబరు 1 నుండి 3వ తేదీ వరకు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

పంచాయతీల విభజన, విలీనాలకు పచ్చజెండా

వీటిపై ఉన్న నిషేధం ఎత్తివేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: పంచాయతీల విభజన, విలీనాలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గ్రామ పంచాయతీల విభజన, పునర్వ్యవస్థీకరణపై ఉన్న నిషేధాన్ని ఎత్తేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ గురువారం జీవో నంబరు 97ను జారీ చేశారు. రాష్ట్రంలో 13,371 పంచాయతీలున్నాయి. వీటిలో కొన్ని వివాదాల్లో ఉన్నాయి.

సాగర్‌పై సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు సహకరించండి

రాష్ట్ర ప్రభుత్వానికి కృష్ణా బోర్డు లేఖ

సాక్షి, అమరావతి: నాగార్జునసాగర్ జలాశయానికి కుడివైపున ఏపీ భూభాగం పరిధిలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు విషయంలో ఏపీ తన వైఖరిని పునఃసమీక్షించి తుది నిర్ణయం తెలపాలని కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కోరింది. సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కోసం జలాశయంపై తమ ఇంజనీర్లు, సిబ్బందిని అనుమతించాలని తెలంగాణ విజ్ఞప్తి చేయగా డిసెంబర్ 31 వరకు ఏపీ వైపు ఉన్న డ్యామ్‌పై వారికి కృష్ణా బోర్డు గతంలో అనుమతి ఇచ్చింది. ఈ మేరకు డ్యామ్‌పై బందోబస్తు నిర్వహిస్తున్న సీఆర్పీఎఫ్ కమాండింగ్ అధికారికి కృష్ణా బోర్డు లేఖ రాసింది. దీనికి ఏపీ సహకరించకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో గత జనవరి 21న జరిగిన కృష్ణా బోర్డు సమావేశంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకి ఏపీ అంగీకరించిన విషయాన్ని గుర్తుచేస్తూ బోర్డు తాజాగా ఏపీ జలవనరుల శాఖ ఈఎన్‌సీకి లేఖ రాసింది.

పోలీసుల అదుపులో దేవ్‌జీ

లేఖ విడుదల చేసిన మావోయిస్టు నేత వికల్ప్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పార్టీకి చీఫ్‌గా కొనసాగుతున్నాడని పేర్కొంటున్న తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ పోలీసుల అదుపులో ఉన్నాడని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ పేరుతో ఈనెల 22న విడుదల అయిన లేఖ గురువారం వెలుగుచూసింది.

జాయింట్‌గా 'దండు'కో..!

అస్మదీయుడనేదే ఏకైక అర్హత / అనుభవం లేకపోయినా సరే మరో సంస్థతో జత చేసి దోపిడీకి ప్లాన్

- వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ టెండర్లలో గోల్‌మాల్
- రూ.370.42 కోట్ల కాంట్రాక్టు విలువతో అక్టోబర్ 1న పనులకు టెండర్ నోటిఫికేషన్
- 4.59 శాతం అధిక ధరకు కోట్ చేసి ఎల్-1గా నిలిచిన కేఎమ్వీ-జీడీఆర్(జేవీ) సంస్థ రూ.387.42 కోట్ల పనులు అప్పగించిన చంద్రబాబు సర్కారు
- కేఎమ్వీ ప్రాజెక్ట్స్‌కు ప్రధాన కాంట్రాక్టర్‌గా అనుభవం లేదంటోన్న ఇంజినీరింగ్ నిపుణులు
- అందుకే జేడీఆర్ కన్‌స్ట్రక్షన్స్‌తో జతకట్టించి పనులు అధిక ధరకు కట్టబెట్టారంటోన్న కాంట్రాక్టు వర్గాలు
- ప్రభుత్వ ఖజానాపై అదనంగా రూ.17 కోట్లకుపైగా భారం
- అధిక ధరలకు అస్మదీయునికి పనులు కట్టబెట్టేలా చక్రం తిప్పిన ప్రభుత్వ పెద్దలు
- భారీ ఎత్తున ముడుపులు చేతులు మారాయంటూ ఆరోపణలు

ఫీడర్ కెనాల్ (ఫైల్)

సాక్షి, అమరావతి: అనుభవం, అర్హతా లేని అస్మదీయ కంపెనీకి భారీ కాంట్రాక్టు కట్టబెట్టేందుకు సర్కారు పెద్దలు నిబంధనలు తుంగలోతొక్కారు. మరో కంపెనీని జత చేసి మరీ జాయింట్‌గా దండుకునేలా చక్రం తిప్పారు. వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ టెండర్లలో జరిగిన ఈ గోల్‌మాల్ ఇంజినీరింగ్ నిపుణులను సైతం విస్తుపోయేలా చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో భారీఎత్తున ముడుపులు చేతులు మారాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అత్యంత సన్నిహిత సంస్థ కాబట్టే..!

జలవనరుల శాఖ టెండర్ నిబంధనల ప్రకారం వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ టెండర్లలో పనులు అప్పగించాలంటే సదరు కాంట్రాక్టు సంస్థ 2015–16 నుంచి 2024–25 వరకూ ఏదైనా ఒక ఏడాదిలో రూ.148.16 కోట్ల విలువైన కాలువ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులను ప్రధాన కాంట్రాక్టర్‌గా పూర్తి చేసి ఉండాలి. కానీ.. కేఎమ్వీ ప్రాజెక్ట్స్ సంస్థకు ప్రధాన కాంట్రాక్టర్‌గా ఆ మేరకు అనుభవం లేదు. ఆ సంస్థ ప్రభుత్వ పెద్దలకు అత్యంత సన్నిహితుడిది. అదే సంస్థకు పనులు కట్టబెట్టాలని టెండర్ నోటిఫికేషన్ ముందే నిర్ణయం జరిగిపోయినట్టు కాంట్రాక్టు వర్గాలు చెబుతున్నాయి. దీంతో జీడీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థతో కేఎమ్వీ ప్రాజెక్ట్స్ సంస్థను జత కట్టించి.. జాయింట్ వెంచర్(జేవీ)గా ఏర్పాటుచేసి కాంట్రాక్టు విలువ రూ.370.42 కోట్ల కంటే 4.59 శాతం అధిక ధర అంటే రూ.387.42 కోట్లకు కోట్ చేయించి బిడ్ దాఖలు చేయించారు. అదే సంస్థ ఎల్–1గా నిలవడంతో పనులను కట్టబెట్టారు. దీని వల్ల ఖజానాపై అదనంగా రూ.17 కోట్లకుపైగా భారం పడింది. అంచనాల దశలోనే పనుల వ్యయాన్ని పెంచేసి.. అధిక ధరలకు అస్మదీయునికి కట్టబెట్టేలా ప్రభుత్వ పెద్దలు చక్రం తిప్పారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఇంజినీరింగ్ నిపుణులు ఆరోపిస్తున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి రోజుకు 11,584 క్యూసెక్కులు తరలించి.. కొత్తగా 53.85 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే నల్లమలసాగర్‌లో నిల్వ చేసి.. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లోని 4,47,300 ఎకరాలకు నీళ్లందించడంతోపాటు 30 మండలాల్లోని 15.25 లక్షల మంది దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో వైఎస్ రాజశేఖరరెడ్డి 2004 అక్టోబర్ 27న వెలిగొండ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు రూ.3,581.57 కోట్లు ఖర్చు చేసి.. అధిక శాతం పనులు పూర్తి చేశారు. అనంతరం కీలకమైన సొరంగాల పనులను రూ.1,046.46 కోట్లు ఖర్చు చేసి గత సీఎం వైఎస్ జగన్ పూర్తి చేశారు.

కిలోమీటర్ లైనింగ్‌కు రూ.17కోట్లు!

శ్రీశైలం జలాశయం నుంచి సొరంగాల ద్వారా నల్లమలసాగర్‌కు కృష్ణా జలాలు తరలించడానికి 23 కిలోమీటర్ల పొడవున 11,585 క్యూసెక్కులు తరలించేలా ఫీడర్ చానల్‌నూ ఇప్పటికే తవ్వారు. 2014 నుంచి కురిసిన భారీ వర్షాల వల్ల ఫీడర్ కెనాల్ గట్లు 0 కిలోమీటర్ల నుంచి 21.8 కిలోమీటర్ల వరకు కొన్ని చోట్ల దెబ్బతిన్నాయి. ఫీడర్ కెనాల్ గట్లు బలహీనంగా ఉన్న చోట కాంక్రీట్ రిటైనింగ్ వాల్, మిగతా ప్రాంతాల్లో కాంక్రీట్ లైనింగ్ చేసే పనులకు రూ.370.42 కోట్లను కాంట్రాక్టు అంచనా విలువగా నిర్ణయించి, అక్టోబర్ 1న జలవనరుల శాఖ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పనులను 15 నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశించింది. ఈ పనులకు అంచనాల దశలోనే భారీ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కిలోమీటర్ లైనింగ్‌కు రూ.17 కోట్లను అంచనాగా నిర్ణయించడం గమనార్హం. అస్మదీయునికి పనులు కట్టబెట్టి ప్రజాధనాన్ని దోచేసే ఎత్తుగడలో భాగంగానే అంచనా వ్యయాన్ని భారీగా పెంచేసేలా చక్రం తిప్పారని ఇంజినీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ముందే అనుకున్నట్లుగా అంచనా వ్యయాన్ని పెంచి.. అధిక ధరలకు అస్మదీయునికే ఆ పనులు కట్టబెట్టారు.

నెయ్యి సరఫరాపై నిర్దిష్ట విధానాలు

టీటీడీలో చాలా ఏళ్లుగా అమలులో కట్టుదిట్టమైన ప్రక్రియ: వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: టీటీడీ నెయ్యి వ్యవహారంలో తాను ఏ తప్పూ చేయలేదని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీనేత, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. కల్తీ జరిగిన 20 కోట్ల లడ్డూలు పంపిణీ చేశారని 'సిట్' తేల్చిందంటూ ఎల్లో మీడియా అసత్య ప్రచారాలు చేయడం దారుణమన్నారు. ఈ విషయంలో లై డిటెక్టర్ టెస్టుకు కూడా సిద్ధమేనని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. సిట్ అధికారులు తనను మీడియా ఎదుట విచారించవచ్చన్నారు. టీటీడీలో నెయ్యి కొనుగోలు, సరఫరాకు సంబంధించి చాలా ఏళ్లుగా నిర్దిష్ట విధానం, ప్రక్రియ ఉందని తెలిపారు. నెయ్యి లోడ్‌తో లోపలకు వెళ్లే వాహనాలు ఎన్‌డీడీబీ (జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు) నుంచి క్లియరెన్స్ తీసుకున్నాకే వస్తాయని, టీటీడీ దీన్ని క్షుణ్నంగా పరిశీలించి నిర్ధారించుకున్నాకే లోపలకు పంపుతుందని పేర్కొన్నారు. అలాంటప్పుడు కల్తీ నెయ్యి సరఫరాకు ఆస్కారం ఎక్కడుంటుందని ప్రశ్నించారు. టీటీడీలో గత పదేళ్లుగా నెయ్యి కొనుగోళ్లపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తాను బోర్డు చైర్మన్‌గా పని చేయటాన్ని దేవుడికి సేవ చేసే గొప్ప అవకాశంగా భావించానేగానీ, టీటీడీ నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఆశించలేదన్నారు. తన కుటుంబ సభ్యులు సైతం బోర్డు వ్యవహారాల్లో కలగచేసుకోలేదని పునరుద్ఘాటించారు. నిజాయితీగా దేవుడికి సేవ చేశాను కాబట్టే చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తూ, సీబీఐ విచారణ కోరుతూ సుప్రీంకోర్టులో ముందుగా తానే పిటిషన్ వేశానని గుర్తు చేశారు. తాను ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నందున శుక్రవారం వస్తానని సిట్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. వైవీ సుబ్బారెడ్డి గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

14 సార్లు ట్యాంకర్లు వెనక్కి పంపాం..

తిరుమలకు సరఫరా అయ్యే నెయ్యిలో నాణ్యత సరిగా లేకుంటే వెనక్కి పంపుతారు. దీనికి సంబంధించి కట్టుదిట్టమైన విధి విధానాలున్నాయి. ప్రతి ట్యాంకర్‌నూ టీటీడీ ల్యాబ్ పరీక్షించాల్సిందే. మా హయాంలో నాణ్యతా ప్రమాణాలు సరిగా లేని 14 ట్యాంకర్లను వెనక్కి పంపాం. చంద్రబాబు హయాంలో కూడా నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవని దాదాపు 18 ట్యాంకర్లు తిప్పి పంపారు. మా హయాంలో ట్యాంకర్లను తిప్పి పంపడమే మీ విష ప్రచారాలకు ఆధారం అయితే, మరి అది చంద్రబాబు ప్రభుత్వానికి కూడా వర్తిస్తుంది కదా? సిట్ ఛార్జ్‌షీట్ ప్రకారం చూస్తే.. గతేడాది జూన్, జూలైలో తిప్పి పంపిన నాలుగు ట్యాంకర్ల నెయ్యిని తిరిగి 2024 ఆగస్టులో వేర్వేరు సరఫరాదారుల ద్వారా చేరవేసి లడ్డూ తయారీలో ఉపయోగించారని ఉంది. మరి అలా చూసినా అప్పుడున్నది చంద్రబాబు ప్రభుత్వమేగా? ఇక వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీలో కూటమి ప్రభుత్వం వైఫల్యంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు దుర్మరణం చెందారు.

మా హయాంలో కీలక సంస్కరణలు..

మా హయాంలో టీటీడీలో ఎన్నో సంస్కరణలు తెచ్చాం. ల్యాబ్‌ను బలోపేతం చేశాం. జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ)తో ఒప్పందం చేసుకుని మరిన్ని పరికరాలు సమకూర్చాం. దాదాపు రూ.80 లక్షల విలువైన అధునాతన పరికరాలు విరాళంగా అందించేలా కృషి చేశాం. 'ఎల్–1, ఎల్–2 బ్రేక్ దర్శనాలను రద్దు చేసి బ్రేక్ దర్శనాల వేళల్లో మార్పులు చేశాం. పారదర్శకంగా శ్రీవాణి ట్రస్టు తెచ్చాం. తొలిసారిగా తిరుమలలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాం. మేం తెచ్చిన విధానాలనే ఈరోజుకూ అనుసరిస్తున్నారు. గుడికో గోమాత కార్యక్రమాన్ని 141 ఆలయాల్లో అమలు చేశాం. 516 గోశాలలకు ఆర్థిక సహాయం చేశాం. గో మహా సమ్మేళనం నిర్వహించాం. స్వామివారి నైవేద్యానికి వినియోగించే పదార్థాలకు పూర్తిగా గో ఆధారిత సేంద్రియ ఉత్పత్తులనే వినియోగించాం. టీటీడీ గోశాల నుంచి 100 ఆవులను తిరుమలకు తరలించి ఆ పాలతో తయారు చేసిన నెయ్యినే వాడే సంప్రదాయానికి అంకురార్పణ చేశాం. హృద్రోగ బాధిత చిన్నారుల కోసం రూ.350 కోట్లతో శ్రీ పద్మావతి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాం. మా హయాంలో 3 వేల మంది చిన్నారులకు అక్కడ గుండె చికిత్సలు ఉచితంగా చేయించాం. అన్నింటికి మించి టీటీడీ ఆస్తులపై తొలిసారి శ్వేతపత్రం విడుదల చేశాం. దేవుడికి సంబంధించిన ఈ ఆస్తులు అమ్మరాదని బోర్డులో నిర్ణయం తీసుకున్నాం. అప్పన్న అనే వ్యక్తితో 2018 నుంచి నాకు ఏ విధమైన సంబంధం లేదని సిట్‌కు చెప్పా. అలాంటప్పుడు ఆ లావాదేవీలతో నాకేం సంబంధం? అధికారులు సిద్ధం చేసిన అంశాలే బోర్డు దృష్టికొస్తాయి. బోర్డు సభ్యుల ఆమోదం మేరకే ఏ నిర్ణయాలైనా జరుగుతాయిగానీ చైర్మన్ వ్యక్తిగత నిర్ణయం ఉండదు.

పదేళ్లుగా కొనుగోళ్లపై విచారించాలి..

కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 జూన్– జూలైలో వెనక్కి పంపిన ట్యాంకర్ల నెయ్యిని ఆగస్టులో ఎలా వాడారు? వైఎస్సార్‌సీపీ హయాంలో కేజీ నెయ్యి రూ.326కి కొన్నారు కాబట్టే కల్తీ జరిగిందని ఆరోపిస్తున్న కూటమి నేతలు టీడీపీ హయాంలో రూ.276కే కొన్నప్పుడు కల్తీ జరిగినట్లు కాదా? బాబు హయాంలో రూ.276, రూ.279, రూ.295 చొప్పున నెయ్యి కొనుగోలు చేశారు. అందుకనే గత పదేళ్లుగా నెయ్యి కొనుగోళ్లపై విచారణ చేయాలని కోరా.

శ్రీనివాససేతు, డిపాజిట్లపై విచారణకు సిద్ధమా?

శ్రీనివాస సేతు నిర్మాణం, ఎస్ బ్యాంకులో టీటీడీ సొమ్ము డిపాజిట్ల వ్యవహారంపై బాబు ప్రభుత్వం విచారణకు సిద్ధమా? టీడీపీ హయాంలో శ్రీనివాస సేతు టెండర్ రేటు పెంచితే మేం సమీక్షించి దాదాపు రూ.60–70 కోట్లు తగ్గించి నిర్మాణాన్ని పూర్తి చేశాం. టీటీడీ సొమ్మును చట్టవిరుద్ధంగా ప్రైవేటు బ్యాంకు ఎస్ బ్యాంకులో ఎలా డిపాజిట్ చేశారు? మేం వచ్చిన తర్వాత ఆ డిపాజిట్లను ప్రభుత్వ బ్యాంకులోకి మార్చాం. అనంతరం కొద్దిరోజులకే ఎస్ బ్యాంకు సంక్షోభంలో కూరుకుపోయింది.

ఒకవైపు దోపిడీ, మరోవైపు కక్ష సాధింపు రాజకీయాలు

- రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్న చంద్రబాబు, లోకేశ్
- మాజీ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

సాక్షి,అమరావతి: సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ ఒకవైపు రాష్ట్రాన్ని దోపిడీ చేస్తూనే మరోవైపు కక్ష సాధింపు రాజకీయాలు పాల్పడుతున్నారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిద్దరికీ పల్లకీ మోస్తూ... డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా ఆయన వాటా అందుకుంటున్నారని మండిపడ్డారు. అందులో భాగంగా ప్రభుత్వ వైఫల్యాలు బయటపడిన ప్రతిసారీ.. వైఎస్సార్‌సీపీని విమర్శించడం అలవాటుగా మారిందన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం అంబటి మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. సంక్షేమ హాస్టళ్లు అత్యంత అధ్వానంగా తయారైనా చినబాబు పట్టించుకోవడం లేదని, అయితే అన్ని శాఖల్లోనూ జోక్యం చేసుకుంటూ సకలశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. సోషల్ మీడియాలో టీడీపీ వారితో వైఎస్ జగన్‌పై ఏఐ వీడియోలు పోస్ట్ చేయించి లోలోన పైశాచిక ఆనందం పొందుతున్న లోకేశ్ బయటకు మాత్రం తీరిగ్గా ప్రవచనాలు చెబుతున్నారని అంబటి మండిపడ్డారు. కోనసీమలో కొబ్బరిచెట్లపై పవన్ కళ్యాణ్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని... 40 ఏళ్లుగా ఉప్పునీటి సమస్యతో చెట్లు నాశనమవుతుంటే.. ఆ నెపాన్ని వైఎస్ జగన్‌పై నెట్టే యత్నం చేయడాన్ని తప్పు పట్టారు. రైతులు వాస్తవాలు వెల్లడిస్తూ. తనను తిరిగి ప్రశ్నిస్తే తట్టుకోలేని పిరికి వ్యక్తి పవన్ కళ్యాణ్ అని తేల్చి చెప్పారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

సాధారణ / కాంట్రాక్టు ప్రాతిపదికన స్పెషలిస్టు అధికారుల నియామకం

భారతీయ స్టేట్ బ్యాంకు సాధారణ / కాంట్రాక్టు ప్రాతిపదికన క్రింద పేర్కొనిన స్పెషలిస్టు ఉద్యోగాల కొరకు భారత పౌరుల నుండి దరఖాస్తులు కోరుచున్నది:

ప్రకటన నం. CRPD/SCO/2025-26/16 (సాధారణ పొజిషన్)

పోస్టు పేరు	గ్రేడ్	ఖాళీ	01.11.2025 నాటికి వయస్సు (సంవత్సరాలు) కనీసం	గరిష్ట
మేనేజర్ (రిస్క్ స్పెషలిస్ట్ - మోడల్ రిస్క్ మేనేజ్‌మెంట్)	ఎంఎంజీఎస్ III	5	28	40
డిప్యూటీ మేనేజర్ (రిస్క్ స్పెషలిస్ట్ - మోడల్ రిస్క్ మేనేజ్‌మెంట్)	ఎంఎంజీఎస్ II	5	25	35

ప్రకటన నం. CRPD/SCO/2025-26/13 (కాంట్రాక్ట్ పొజిషన్)

పోస్టు పేరు	ఖాళీ	01.11.2025 నాటికి వయస్సు (సంవత్సరాలు) కనీసం	గరిష్ట
రిలేషన్‌షిప్ మేనేజర్ (మ్యూచువల్ ఫండ్)	1	35	45
రిలేషన్‌షిప్ మేనేజర్ (ఇన్సూరెన్స్ సెక్టార్)	1	35	45
రిలేషన్‌షిప్ మేనేజర్ (స్టాక్ బ్రోకింగ్ & FII/FPI)	3	35	45

అర్హతా ప్రమాణాలు (వయస్సు, అర్హతా, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ https://sbi.bank.in/web/careers/current-openings లో లాగ్‌ఆన్ అయ్యి, ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలను నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి. ఏవైనా సందేహాలు ఉన్నచో, దయచేసి మాకు - "CONTACT US" —> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ (https://bank.sbi/web/careers/post-your-query) లో లభించును.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 11.11.2025 నుండి 01.12.2025 వరకు.

స్థలం: ముంబై
తేదీ: 11.11.2025
మహానిర్వాహణాధికారి (ఆర్‌పి & పీఎం)

పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి టెండర్

- కేంద్రప్రభుత్వ సంస్థల నుంచి అన్ని రకాల అనుమతులు పొందడానికి సహకారం
- కాంట్రాక్టు విలువ రూ.7.68 కోట్లు
- ఈపీసీ పద్ధతిలో ఏడాదిలోగా పనులు పూర్తిచేయాలని షరతు

సాక్షి, అమరావతి: పోలవరం–బనకచర్ల అనుసంధానం (లింక్) ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతానికి పోలవరం–నల్లమలసాగర్ వరకే పరిమితం చేసింది. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మార్గదర్శకాల ప్రకారం పోలవరం–నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు చేపట్టడానికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీతోపాటు కేంద్రప్రభుత్వ సంస్థల నుంచి అన్ని రకాల అనుమతులు తెచ్చేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించే పనులకు జలవనరులశాఖ గురువారం టెండర్ నోటిఫికేషన్ జారీచేసింది. కాంట్రాక్టు విలువను రూ.7,68,33,372గా నిర్ణయించింది. ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో ఏడాదిలోగా ఈ పనులు పూర్తిచేయాలని నిర్దేశించింది. ఈ టెండర్‌లో బిడ్‌ల దాఖలుకు డిసెంబర్ 11వ తేదీని తుదిగడువుగా తెలిపింది. డిసెంబర్ 17న ఆర్థిక బిడ్ తెరిచి.. తక్కువ ధరకు కోట్‌చేసి ఎల్–1గా నిలిచిన కాంట్రాక్టు సంస్థకు పనులు అప్పగించనుంది. డీపీఆర్ తయారీలో భాగంగా లైడార్ సర్వే చేయాలని నిర్దేశించింది. ఈ లింక్ ప్రాజెక్టును మూడుభాగాలుగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో పోలవరం నుంచి కృష్ణానదిలోకి, రెండో దశలో కృష్ణా నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు, మూడో దశలో బొల్లాపల్లి నుంచి నల్లమలసాగర్‌కు గోదావరి జలాలు తరలించేలా పనులు చేపట్టాలని నిర్ణయించింది. లైడార్ సర్వేలో ఈ మూడు భాగాల్లో అలైన్‌మెంట్‌ను ఖరారు చేసి గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు ఏర్పాటుచేయాలని.. పనులు చేపట్టడానికి అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేయాలని టెండర్లలో షరతు విధించింది.

గతనెలలో పిలిచిన టెండర్లు రద్దు

సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారం పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ తయారీ, అవసరమైన పరిశోధనలు, కేంద్రం నుంచి చట్టపరమైన అనుమతులు పొందడానికి సహకారం అందించే పనులకు అక్టోబర్ 7న జారీచేసిన నోటిఫికేషన్‌కు సంబంధించిన టెండర్లను జలవనరులశాఖ రద్దుచేసింది. రూ.9.20 కోట్ల విలువైన ఈ పనులకు బిడ్‌ల దాఖలు గడువు గత నెల 22తో ముగిసింది. కానీ.. ఎవరూ బిడ్లు దాఖలు చేయకపోవడంతో ఆ టెండర్లను రద్దుచేసింది. ఇప్పుడు ఆ లింక్ ప్రాజెక్టును పోలవరం–నల్లమలసాగర్‌కే పరిమితం చేసి డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచింది.

ఇకపోతే.. పోలవరం నుంచి బనకచర్లకు 200 టీఎంసీల గోదావరి జలాలను తరలించే ప్రాజెక్టుకు అనుమతి కోసం సీడబ్ల్యూసీకి మే 22న పీఎఫ్ఆర్ (ప్రీ ఫీజుబులిటీ రిపోర్టు)ను రాష్ట్ర జలవనరులశాఖ సమర్పించింది.. దీనిపై సీడబ్ల్యూసీ బేసిన్ పరిధిలోని అన్ని రాష్ట్రాలు.. గోదావరి, కృష్ణా బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అభిప్రాయాలను కోరింది. ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి కోసం దరఖాస్తు చేయడానికి పర్యావరణ ప్రభావ అంచనా (ఈఏఐ)పై అధ్యయనం చేయడానికి నియమ, నిబంధనల (టీవోఆర్) రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను కేంద్ర అటవీ, పర్యావరణశాఖ ఈఏసీ (ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ) జూన్ 30న తోసిపుచ్చింది. గోదావరి నదిలో వరద జలాల లభ్యత.. అంతర్‌రాష్ట్ర అనుమతి తీసుకున్న తర్వాతే టీవోఆర్ కోసం దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేసింది.

ఇదిలా ఉండగా పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు పనుల నిమిత్తం పర్యావరణ, వైల్డ్‌లైఫ్ (వన్యప్రాణులు), అటవీ అనుమతుల కోసం అవసరమైన నివేదికల తయారీ పనులను జనవరి 26న రూ.1.77 కోట్లకు ఎన్వీ ఎన్విరో ల్యాబ్స్ అండ్ కన్సల్టెంట్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.

పోలవరం-బనకచర్ల డీపీఆర్ టెండర్‌పై వాస్తవ పరిస్థితి చెప్పండి

రాష్ట్ర ప్రభుత్వానికి గోదావరి బోర్డు మరోసారి లేఖ

సాక్షి, అమరావతి : పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి జారీచేసిన టెండర్ నోటిఫికేషన్‌పై వాస్తవ పరిస్థితి ఏమిటో వారంలోగా చెప్పాలని ఏపీ ప్రభుత్వానికి గోదావరి బోర్డు సభ్య కార్యదర్శి రంగస్వామి అజగేశన్ గురువారం మరోసారి లేఖ రాశారు. ఇదే అంశంపై గతనెల 16న లేఖ రాశామని.. కానీ, స్పందనలేదని అందులో గుర్తుచేశారు. తక్షణమే ఆ టెండర్ వాస్తవ పరిస్థితిని తెలపాలని ఆయన కోరారు.

గర్వంగా, భిక్కారంతో భూమిపై నడవకండి.
మీరు భూమిని బద్దలు చేయలేరు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 28 నవంబర్ 2025

చైనా వింత పోకడ!

భారత–చైనాల మధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశం కనబడుతున్నప్పుడల్లా ఏదో ఒక పేచీకి దిగటం చైనాకు అలవాటైపోయింది. ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన యువతి ప్రేమా వాంగ్జోమ్ థోంగ్డాక్‌ను షాంఘై విమానాశ్రయంలో 18 గంటల పాటు నిర్బంధించిన వైనం ఇటువంటిదే. భారతీయ కాన్సులేట్ అధికారి జోక్యం చేసుకోబట్టి ఆమె విడుదలయ్యారు. లేకుంటే మరెంతసేపు వేధించేవారో తెలియదు. ఇది యథాలాపంగా జరిగిన ఉదంతం కాదు. అరుణాచల్‌ప్రదేశ్ విషయంలో ఉద్దేశపూర్వకంగా దశాబ్దాలుగా ఇలా చేస్తోంది. ఆమె ఉద్యోగరీత్యా బ్రిటన్‌లో స్థిరపడిన భారతీయ వనిత. సెలవుల్లో గడపటానికి జపాన్ వెళ్తూ విమానం మారటానికి షాంఘైలో దిగాల్సి వచ్చింది. మరో మూడు గంటల్లో జపాన్ విమానం ఎక్కాల్సి ఉండగా చైనా అధికారులు తమ వింత ప్రవర్తనతో ఆమెను ఇబ్బంది పెట్టారు. ఆమె దగ్గర చట్టబద్ధమైన వీసా ఉంది. భారత పాస్‌పోర్ట్ ఉంది. కానీ స్వస్థలం అరుణాచల్ అనేసరికి చైనా అధికారులకు చిర్రెత్తుకొచ్చినట్టుంది. జపాన్ వెళ్లటానికి చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్ విమానం టిక్కెట్ కొంటేనే పాస్‌పోర్టు వెనక్కిస్తామని షరతు పెట్టారు.

అరుణాచల్ తమ భూభాగంలోనిదని వితండవాదనకు దిగటం చైనాకు ఎప్పటి నుంచో అలవాటు. అది దక్షిణ టిబెట్ అనీ, దాని పేరు జంగ్నాన్ అనీ చెప్పుకోవటం, దాన్ని 'వివాదాస్పద ప్రాంతం'గా అభివర్ణించటం, తరచుగా అరుణాచల్ పరిధిలోని గ్రామాల పేర్లు మార్చి, మాండరిన్ భాషలో ఏదో ఒక పేరు పెట్టుకుని మురియటం కూడా పాత కథే. ఇలా వివాదానికి దిగిన ప్రతిసారీ మన దేశం కూడా అరుణాచల్ భారత్‌లో అంతర్భాగమని చెప్పక తప్పడం లేదు. అరుణాచల్ ఒక్కటే కాదు... ఇరు దేశాల సరిహద్దుల్లో పలు ప్రాంతాలు తన ఖాతాలో వేసుకోవటం చైనా తరచూ చేసే పని. ఇరుగు పొరుగుతో సఖ్యతతో మెలగటం, ఇచ్చిపుచ్చుకోవటం వంటి సంస్కృతి చైనాకు అలవడలేదు. బలహీనంగా ఉన్న దేశాలను రుణ ఊబిలోకి లాగటం, తనపై ఆధారపడక తప్పని స్థితి కల్పించటం చైనా తీరుకు నిదర్శనం. చివరకు ఆ దేశాలు సంక్షోభాల్లో చిక్కుకుని విలవిల్లాడటం దాని పుణ్యమే. ఇందుకు మన ఇరుగుపొరుగునున్న శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ వగైరాలు ఉదాహరణ.

చాన్నాళ్ల తర్వాత ఇటీవలే చైనా తీరుతెన్నులు మారిన జాడలు కనబడ్డాయి. ఏడేళ్ల తర్వాత తొలిసారిగా మొన్న సెప్టెంబర్ మొదటివారంలో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశాన్ని సందర్శించారు. అంతకుముందు నిరుడు అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మోదీ సమావేశమయ్యారు. ఇరు దేశాల సంబంధాలనూ మళ్లీ పూర్వస్థితికి తీసుకెళ్లాలన్న ఆకాంక్షను వారిద్దరూ వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్యా విమాన రాకపోకలు ప్రారంభమై నెల్లాళ్లు కూడా కాలేదు. ఇందువల్ల టూరిజం, వ్యాపారం, ప్రజల మధ్య సంబంధాలు మెరుగవుతాయని చైనా కూడా భావిస్తోంది. కానీ అంతా బాగుందనుకుంటున్న తరుణంలో అందుకు భిన్నమైన ప్రవర్తనతో దిగ్భ్రాంతిపరచటం దానికే సాధ్యం.

ఇలా మైత్రి ఒకడుగు ముందుకు... రెండడుగులు వెనక్కి అన్నట్టు ఊగిసలాట ధోరణిలో ఉండిపోవటానికి చైనా తీరే ప్రధాన కారణం. ఆమెను ఒత్తిడి చేయటం, నిర్బంధించటం, వేధించటం వంటివి లేనేలేవని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ బుకాయిస్తున్నారు. మరి భారత పాస్‌పోర్టు ఉన్న యువతిని 18 గంటల పాటు కదలనివ్వక పోవటాన్ని ఏమంటారో ఆమె చెప్పాలి. ఇది జరిగి అయిదారు రోజులు గడుస్తున్నా ఈ ఉదంతంలో తమ అధికారుల తీరు గురించి సరైన సంజాయిషీ ఇవ్వటంలో చైనా విదేశాంగ శాఖ విఫలమైంది. తమ దేశంలో విమానం మారదల్చుకుంటే 24 గంటల లోపు వీసా అవసరమే లేదన్న స్వీయ నిబంధనను సైతం చైనా ఉల్లంఘించింది. దీంతో పాటు అంతర్జాతీయ పౌర విమానయాన నిబంధనల్ని సైతం బేఖాతరు చేసింది. ఇలాంటి ఉదంతాల వల్ల తన విశ్వసనీయత దెబ్బతినటం మినహా మరే ప్రయోజనమూ లేదని ఇప్పటికైనా చైనా గ్రహించాలి. హుందాగా ప్రవర్తించటం నేర్చుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.అష్టమి రా.6.39 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** శతభిషం రా.10.26 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** తె.4.42 నుండి 6.17 వరకు (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.06 నుండి 12.51 వరకు, **అమృత ఘడియలు:** ప.3.06 నుండి 4.43 వరకు.

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

మీకు తెలిసినవే!

మీరు కొత్త వ్యాయామాలు కనిపెట్టాల్సిన పని లేదు. మీ శరీరానికి తెలిసున్న వాటినే చేయండి. నడక మాత్రమే తెలుసా? అయితే రోజూ కనీసం 30 నిమిషాలు నడవండి. బరువు పెరగకుండా ఉంటారు. వ్యాయామం మీ గుండెకు నమ్మకస్థుడైన స్నేహితుడు.

– మొహ్సిన్ వలీ, కార్డియాలజిస్టు

అక్కడితో ఆగరు!

మీరు దేనినైనా సాధించగలరు. కానీ, సంతృప్తిని గెలుచుకున్న విజేత మాత్రం ఎప్పటికీ కాలేరు. మీరొక లక్ష్యం పెట్టుకుంటారు. ఆ లక్ష్యాన్ని చేరుకుంటారు. "ఓ, మొత్తానికి రీచ్ అయ్యాను" అనుకుంటారు. అక్కడి నుంచీ మళ్లీ ఇంకొక లక్ష్యం మొదలవుతుంది. ఇది ఇలాగే ఉంటుంది.

– యామీ గౌతమ్, నటి

పైకి లేచాను



ఒంటి చేత్తో నేను నా కెరీర్‌ని ధ్వంసం చేసుకున్నాను. తిరిగి ప్రతీక్ 2.0గా పైకి లేచాను. చేసిన తప్పులు వెనక్కు తీసుకునే అవకాశాన్ని జీవితం ఇవ్వదు. కానీ ముందుకు నడిచే ధైర్యాన్ని ఇచ్చి, దారిని చూపిస్తుంది. ఇప్పుడు నేను ఆ దారిలోనే ఉన్నాను. అదృష్టవంతుడిని!

– ప్రతీక్ బబ్బర్, నటుడు

ఇప్పుడే, ఈ క్షణమే...

జీవితం అందమైనది. ఆస్వాదించండి; పెళుసైనది. బలాన్ని ఇవ్వండి. బాంధవ్యాలతో కూడినది. ఆత్మీయతను పంచండి. ఇవాళ్టి నుండే, ఈ క్షణం నుండే ఇవన్నీ మొదలు పెట్టండి. పాత గాయాలు మర్చిపోయి, కొత్త భయాలు వదిలేస్తే జీవితం బాగుంటుంది.

– కురువిల్ల పండికట్టు, మత గురువు

అసలు పరీక్ష

ప్రభుత్వం కోరుకుంటే తప్ప, ఎలాంటి అల్లర్లయినా 24 గంటలకు మించి కొనసాగవు. అంటే... శాంతి భద్రతల వైఫల్యాలు చాలా అరుదుగా మాత్రమే జరుగుతాయని! ఒక పోలీసు అధికారి వ్యక్తిత్వానికి నిజమైన పరీక్ష... అల్లర్లలో బలహీన పక్షాల రక్షణకు ఎలా స్పందించాడన్నదే!

– విభూతి నారాయణ్ రాయ్, మాజీ ఐపీఎస్ అధికారి

గౌరవం పొందాలి

తప్పుగా అర్థం చేసుకోకండి. మహిళలు తమకు నచ్చిన పనిని తాము స్వేచ్ఛగా చేయాలని అంటాన్నేను. సమాజం మీ మీద పెట్టుకున్న అంచనాలను నిజం చేయటానికి మీరు కుంగిపోనవసరం లేదు. అయితే ఏ పని చేసినా అందులో మీరు గౌరవం పొందేలా ఉండాలి.

– ఈశా గుప్తా, మోడల్ – నటి

ఫెడరలిజంను బలహీనపరిచే సలహా

అభిప్రాయం

మాడభూషి శ్రీధర్

తమిళనాడు గవర్నర్ అనేక బిల్లులను, అవినీతి కేసులపై దర్యాప్తు అనుమతి ఫైళ్ళను, ఖైదీల విడుదల ప్రతిపాదనలను నెలల తరబడి నిలిపివేసి పరిపాలనను దెబ్బకొట్టారు. ఇలా నిలిపివేయడంపై సుప్రీంకోర్టు ఇద్దరు న్యాయమూర్తుల బెంచ్ 'ఇది రాజ్యాంగ విరుద్ధం' అంటూ గతంలో సూటిగా చెప్పింది. కానీ ఆశ్చర్యకరంగా, అదే అంశంపై, 14 ప్రశ్నలతో రాష్ట్రపతి కోరిన సలహా కేసులో (ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్ కేసు) మాత్రం ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ పీఠం అందుకు విరుద్ధమైన తీర్పు ఇచ్చింది. మన రాష్ట్రపతికి ధర్మాసనం అద్భుతమైన 'సలహా' రూపొందించింది. ఆ సలహా అర్థం ఇదీ: ఎ) గవర్నర్‌కు కాల గడువు (టైమ్ లిమిట్) విధించలేం. బి) రాష్ట్రపతి నిర్ణయాలను కోర్టు ప్రశ్నించలేదు. (సి) గవర్నర్ పరిపాలనను నిలి పేసినా, ఏమీ చేయలేం. ఎంత అన్యాయం? దేశ ప్రధాన న్యాయ మూర్తి తన పదవీ విరమణ చేయడానికి ముందు ఇటువంటి సలహా తీర్పును ఇచ్చి రాజ్యాంగ ఆత్మకు, ఫెడరలిజానికి, పరిపాలనా సమతౌల్యానికి పెద్ద దెబ్బ కొట్టారు.

కేంద్ర ప్రతినిధిగా మార్చే పరిస్థితి

ఈ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సలహా ఎందుకు ప్రమాదకరం? దీనివల్ల ఒక్క తమిళనాడుకే కాదు, ప్రతి బీజేపీయేతర రాష్ట్రంలో కొత్త రాజ్యాంగ సంక్షోభం వచ్చిపడింది. బిల్లులు గవర్నర్ దగ్గరే నెలల తరబడి నిలిచిపోవడం, విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్ నియామకాల్లో పూర్తిగా పక్షపాతం, అవినీతి కేసుల్లో అభియోగ అనుమతులపై నిర్ణయాలు పెండింగ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాల నిలిపివేత వంటి దారుణమైన వైఫల్యాలకు ఈ సంక్షోభం కారణం కానుంది. అంతా గవర్నర్ ఇష్టం ప్రకారం చేయడానికి ఉంటే ఇక జనం ఎన్నుకున్న ప్రజాప్రభుత్వం పరిపాలన సాగించడం సాధ్యమా? ఫైళ్ళు, నియామకాలు అన్నీ ఆగిపోయే పనులను గవర్నర్ చేయడానికి రాజ్యాంగం ఒప్పుకుంటుందా? ఇది రాజ్యాంగాధికారి అయిన రాజ్ ప్రముఖ్‌ను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా మార్చే పరిస్థితి.

రాష్ట్రపతి గారు సార్వభౌమ ప్రజల తరఫున పనిచేసే అత్యున్నత రాజ్యాంగాధికారే. కానీ గవర్నర్ గారు కేంద్ర ప్రభుత్వం వారు నియమించేవారు. (ఎన్నికల్లో గెలవకుండా) ఎంపిక చేయబడినవారే రాజ్ ప్రముఖ్ అవుతారు. ఈ సలహా వంటి తీర్పు వల్ల రాష్ట్రపతినీ, గవర్నర్‌నూ ఒకే స్థాయిలో గానీ, హోదాలో గానీ (కాన్‌స్టిట్యూషనల్ పెడెస్టల్) పెట్టడం రాజ్యాంగ ఆత్మను అవమానించడమే!

◆ రాష్ట్రపతి సలహా కేసులో సుప్రీం కోర్టు ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు... రాష్ట్రం ఆమోదించిన బిల్లులను గవర్నర్ నెలల తరబడి అడ్డుకునే పరిస్థితిని అన్యాయంగా రాజ్యాంగ బద్ధం చేసింది. ఇది రాష్ట్ర ప్రభుత్వాల కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తుంది. ఫెడరలిజం మూల సూత్రానికి విరుద్ధం అవుతుంది.

సరైన కాలం అంటే?

గవర్నర్ల రాజకీయ పక్షపాతం ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పెను సమస్యగా మారింది. 'గవర్నర్ సరైన సమయంలో నిర్ణయం తీసుకోవాలి' అని సుప్రీంకోర్టు తన సలహా తీర్పు వెలువరించింది. ఎంత వ్యవధి సమంజసం? ఒక నెల సరైనదా? ఒక సంవత్సరం సరైనదా? మూడు సంవత్సరాలు సరైనవా? ఎవరికీ తెలియదు. ఈ అస్పష్టత రాజకీయ పక్షపాతంతో వ్యవహరించే గవర్నర్లకు పెద్ద ఆయుధం. దీనివల్ల పరిపాలన నిలిచిపోతుంది, లెజిస్లేచర్ సంకల్పానికి అడ్డుకట్ట పడుతుంది. ప్రజాభిప్రాయం నీరుగారిపోతుంది.

గవర్నర్ 'రబ్బర్ స్టాంప్' కాదు. కానీ పాలనకు స్పీడ్ బ్రేకర్ అయిపోవడం న్యాయమా? గవర్నర్ బిల్లులను ఆపాలని అనుకుంటే పూర్తిగా ఆపగలిగే అవకాశం కొనసాగుతుంది. ఒకసారి బిల్లును ఆమోదించకుండా అసెంబ్లీకి తిప్పిపంపిన తరువాత, మళ్లీ అదే బిల్లును పంపితే గవర్నర్ వెంటనే ఒప్పుకోవాలి. కానీ ఆ పనీ చేయకుండా, రాష్ట్రపతికీ పంపకుండా వదిలేస్తూ పోతూ ఉంటే పరిపాలన స్తంభించిపోతుంది. ఈ లోగా అయిదేళ్ల పాలన 'కాలధర్మం' చెందుతుంది. బిల్లులు, చట్టాలను నిష్క్రియ, ఆలస్యాలతో చంపేస్తారా? చేతలలో చంపరు. కానీ తిండి ఇవ్వక వదిలేస్తే వాడే చస్తాడు అన్నట్టుంది.

ఫెడరలిజంపై చావు దెబ్బ

సమాఖ్య విధానంలో కేంద్రం–రాష్ట్రాల మధ్య సంబంధాలు సమతౌల్యంగా ఉండటం కీలకం. కానీ సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ సలహా (అడ్వైజరీ ఒపీని యన్) రాష్ట్రం ఆమోదించిన బిల్లులను... రాష్ట్ర ప్రజా మద్దతుతో వచ్చిన లెజిస్లేచర్ బిల్లులను, గవర్నర్ ఒకరే నెలల తరబడి అడ్డుకునే పరిస్థితిని అన్యాయంగా రాజ్యాంగబద్ధం చేసిపెట్టింది. ఇది రాష్ట్ర ప్రభుత్వాల కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తుంది. కేంద్ర అధికారుల అతి చర్యలను బలపరుస్తుంది. అంతేగాక ఫెడరలిజం మూల సూత్రానికి విరుద్ధం అవుతుంది.

ఈ సలహా తీర్పులో ''రాజ్యాంగాధికారులు తమ విధులు నిర్వర్తించకపోతే కోర్టు నిష్క్రియగా ఉండదు'' అని చెప్పడానికి బాగానే ఉంది. కానీ దీనివల్ల ప్రయోజనం ఉండదు. ఈ సలహా వినాల్సిన అవసరం లేదు. గడువు (టైమ్ లైన్) పెట్టలేమనీ, ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి నిర్ణయాలను ప్రశ్నించలేమనీ అన్నారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్నప్పుడు కచ్చితంగా అటువంటి అధికారాలను వాడుకుంటాయి. అంటే, మన సుప్రీంకోర్టు అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం సమస్యను గుర్తించినప్పటికీ, పరిష్కారాన్ని చూపలేదన్న మాట! ఇది ఫెడరల్ రాజ్యాంగ సంక్షోభ నివారణకు సరైన మార్గం కాదు.

గవర్నర్ తన ఇష్టానుసారం ఆలస్యాలు చేయడం రాజ్యాంగ విలువలకు వ్యతిరేకం. ప్రజాస్వామ్య సంకల్పాన్ని, రాష్ట్రాల పరిపాలనను అణగదొక్కడం అవుతుంది. అధికారాలను సరిగ్గా సమంగా విభజించే సిద్ధాంతాన్ని వక్రీకరించడం అవుతుంది. ఇది రాజకీయ అవినీతి మాత్రమే కాదు. రాజ్యాంగ అనైతికం కూడా అవుతుంది. ఈ అవినీతిని ఆపడానికి సుప్రీంకోర్టు ధర్మాసనం సలహా తీర్పు ప్రభావవంతమైన పరిష్కారం ఇవ్వలేదు. ప్రజాస్వామ్యంలో రాష్ట్రపతి పాత్ర అత్యంత కీలకం. ఆర్టికల్ 143 కింద ఇచ్చే కోర్టు సలహా బైండింగ్ కాదు. అందుకే రాజ్యాంగాన్ని మనస్సాక్షి ప్రకారం, నమ్మిన దేవుడి ముందు ప్రమాణం చేసిన అత్యున్నతాధికారి అయిన రాష్ట్రపతి గారూ! మీ ప్రమాణాన్ని గుర్తు చేసుకోండి. మీరు మన రాజ్యాంగపు ఆత్మను రక్షించవలసిన బాధ్యత కలిగినవారు. ఫెడరల్ సమతౌల్యతను, ప్రజాస్వామ్య కర్తవ్యాలను పరిరక్షించవలసి ఉంటుంది. కనుక రాజ్యాంగ విరుద్ధమైన, ఫెడరలిజాన్ని బలహీనపరిచే ఈ అడ్వైజరీ ఒపీనియన్‌ను తిరస్కరించడం రాష్ట్రపతి ప్రాథమిక రాజ్యాంగ బాధ్యత.

వ్యాసకర్త కేంద్ర సమాచార సంఘం మాజీ కమిషనర్

సింపుల్‌గా....

అంతుచిక్కని అగ్నిశిఖల ముప్పు

దీర్ఘకాలంగా సుప్తావస్థలో ఉన్న ఇథియోపియా ఉత్తర ప్రాంతంలోని హేలీ గబ్బ అగ్నిపర్వతం అసాధారణ రీతిలో బద్దలైన ఘటన అనూహ్యంగా ఆందోళనలోకి నెట్టింది. పేలుడుతో అత్యంత భారీగా రేగిన ధూళి మేఘాలు ఎర్ర సముద్రం మీదుగా యెమన్, ఒమన్ సహా చివరకు పాకిస్తాన్ ఉత్తర ప్రాంతం నుంచి భారతదేశం వైపు కమ్ముకొస్తూ ఉండడం మన ఆందోళనకు కారణం. ఎదుట ఉన్నదేదీ కనిపించనివ్వని ఆ భారీ దుమ్ము, ధూళి ఏకంగా కొన్ని వందల కిలోమీటర్లు ప్రయాణించి వివిధ ఖండాలకు విస్తరించింది. ఇప్పటికే భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా అనేక దేశాల విమాన ప్రయాణ సర్వీసులకు చిక్కులు తెచ్చింది.

ఏం జరిగింది?

ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాకు ఈశాన్యాన 800 కి.మీల దూరంలో అఫార్ ప్రాంతంలో ఉందీ హేలీ గబ్బి అగ్నిపర్వతం. ముఖ్యంగా భూ ఉపరితలంపై కదిలే పెద్ద శిలల పొరల మీద ఉంది. తూర్పు ఆఫ్రికన్ రిఫ్ట్ జోన్ కిందకొచ్చే ఆ ప్రాంతంలో అటు ఆఫ్రికన్, ఇటు అరేబియన్ భూ ఫలకాలు ఘర్షించుకుంటూ, ఏటా 0.4 నుంచి 0.6 అంగుళాల మేర పరస్పర వ్యతిరేక దిశలో కదులుతుంటాయి. 12 వేల ఏళ్ళుగా గమ్మునున్నట్టు తోచిన సదరు వాల్కనో ఈ నవంబర్ 23న విస్ఫోటనం చెంది, అనేక గంటలు నిప్పులు విరజిమ్మింది. ఆ ఘటనలో ఎవరూ మరణించలేదు కానీ, ఆ ప్రాంత ప్రజలు, జీవజాలంపై సుదీర్ఘ ప్రభావం ఉండనుంది.

ముందస్తు హెచ్చరికలు లేవా?

ఇథియోపియాలో దాదాపు 50 అగ్నిపర్వతాలున్నాయి. వాటిలో అనేకం కొన్ని వేల ఏళ్ళుగా నిద్రాణంగా ఉన్నాయి. నిజానికి, ఈ జూలైలోనే దగ్గరలోని ఎర్తా ఆలె అగ్నిపర్వతం బద్దలైంది. భూగర్భంలో 30 కిలోమీటర్ల కింద అంతశ్శిలాద్రవం చొచ్చుకుపోయింది. భూగర్భ కదలికలతో హేలీ గబ్బి సైతం విస్ఫోటనం చెందే ప్రమాదం ఉందని సూచనలు అందాయి. గత ఆదివారం అదే జరిగింది. భారీ శబ్దంతో అగ్నిపర్వతం పేలినప్పుడు 14 కి.మీ.ల మేర ఆకాశంలోకి ధూళి మేఘాలు విస్తరించాయి. పర్వతాలంత ఎత్తున గగన భాగాన్ని కప్పేసిన ఆ బూడిద పర్యాటక ప్రాంతాలైన చుట్టుపక్కలి పర్వతప్రాంత గ్రామాలను చుట్టేసింది. దట్టమైన పొగ, గాఢాంధకారంతో గాలి పీల్చడానికైనా లేదు. తాజా ఘటనను బట్టి ఆ అగ్నిపర్వత ప్రాంతం గురించి లోతైన అధ్యయనం జరగనే లేదనీ, ఆ లోటు పూరించాల్సి ఉందనీ తేలింది.

ఎంత కష్టం... ఎంత నష్టం...

అగ్నిపర్వత భస్మ మేఘాల్లో కరకైన కణాలుంటాయి. లక్షల టన్నుల ఆ కణాలు లోపలికి చొచ్చుకుపోయి విమానాల ఇంజన్లను చెడగొడతాయి. విమాన యానం ప్రమాదకరమవుతుంది. 1982లో బ్రిటీష్ ఎయిర్‌వేస్ విమానం ఇలానే భస్మ మేఘం గుండా వెళ్ళి 4 ఇంజన్లూ ఆగిపోయాయి. కష్టపడి పావుగంటలో పైలట్లు 3 ఇంజన్లను పునరుద్ధరించేసరికి జనం బతికిపోయారు. మునుపు 2010లో ఐస్‌ల్యాండ్‌లో ఓ అగ్నిపర్వతం కొద్ది నెలలు నిరంతరం విస్ఫోటనం చెంది, 11 కి.మీ.ల మేర బూడిదను విరజిమ్మింది. బ్రిటన్, ఇతర యూరోపియన్ దేశాలను ఈ భస్మ మేఘాలు తాకాయి. బ్రిటన్ 6 రోజులు వైమానిక మార్గాన్ని మూసేయాల్సి వచ్చింది. 95 వేల విమానాలు రద్దయ్యాయి. యూరప్‌లో అనేక దేశాలు గగనతలాన్ని మూసేశాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతి పెద్ద వైమానిక షట్‌డౌన్ అదే! రోజూ 12 లక్షల మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. బ్రిటన్ 145 కోట్ల డాలర్లు నష్టపోయింది.

గతిని మార్చేసిన గతం...

అగ్నిపర్వత విస్ఫోటనాలంటే ఆషామాషీ కాదు. అవి మానవాళి చరిత్రనే మార్చేసిన ఘట్టాలున్నాయి. 1783 నాటి లకీ విస్ఫోటనంతో యూరప్‌లో వాన రాకడే మారింది. ఫ్రాన్స్‌లో ఆకలి మంటలు రేగి, ఫ్రెంచ్ విప్లవానికి దారి తీసింది. ఆ తర్వాత మూడు దశాబ్దాలకు ఇండొనేసియాలోని తంబోరాలో విస్ఫోటనం యూరప్‌లో ఎడతెగని వానలు సహా కొన్నేళ్ళు ప్రపంచ పర్యావరణాన్నే మార్చేసింది. వర్షంతో చిత్తడిగా మారిన నేల వల్లే వాటర్‌లూ యుద్ధంలో నెపోలియన్ ఓటమి పాలయ్యారట. ఏమైనా, ఇప్పుడు హేలీ గబ్బి దెబ్బకు ఆఫ్రికాలోని అతి పెద్ద వైమానిక కేంద్రాల్లో ఒకటైన ఇథియో పియా సహా అనేక ఖండాల్లో విమాన సర్వీసులు ఇరుకున పడ్డాయి. 4 వేల కి.మీ.ల దూరంలో ఉన్న రాజస్థాన్, మహారాష్ట్ర, ఢిల్లీ, హరియాణా, పంజాబ్‌లకు ఈ ధూమం విస్తరించింది. విమాన సర్వీసులు అనేకం రద్దయ్యాయి. కొద్ది రోజుల్లో ఈ ధూళి తగ్గినా, ఆ మేఘాల్లోని హానికారక వాయువులతో జాగ్రత్త పడక తప్పదు. ❑

ఇన్ బాక్స్

సామాజిక విప్లవ వీరుడు

19వ శతాబ్దంలో జ్యోతిరావు ఫూలే సమకాలీన కుల, లింగ వివక్షలకు వ్యతిరేకంగా చేసిన పోరాటం మొత్తం భారత సామాజిక చరిత్రలో ఒక ప్రధాన అధ్యాయంగా నిలిచింది. 1827లో మహారాష్ట్రలో గోవిందరావు, చిన్నాబాయి దంపతులకు జన్మించిన ఫూలే విద్యార్థిగా ఉన్నప్పుడు 'అమెరికా స్వతంత్ర ఉద్యమం', 'శివాజీ జీవిత చరిత్ర', థామస్ పెయిన్ రచన 'మానవుని హక్కులు', జాన్ స్టువర్ట్ రాసిన 'స్వతంత్రం' వంటివి ప్రభావితం చేశాయి.

ఫూలే జీవితంలో ఒక అసాధారణ సంఘటన, ఆయన భవిష్యత్ జీవితాన్ని సామాజిక సేవకు అంకితమయ్యేటట్లుగా మార్చింది. తన బ్రాహ్మణ మిత్రుని ఆహ్వానం మేరకు అతడి పెండ్లి ఊరేగింపులో పాల్గొన్నందుకు బ్రాహ్మణులు ఫూలేను పక్కకు నెట్టివేసి కులం పేరుతో దూషించారు. 'శూద్రుడివి ఈ ఊరేగింపులో పాల్గొనడానికి ఎంత ధైర్యం?' అని అవమానించారు. ఈ అవమానం గురించి తన తండ్రికి వివరించాడు. తండ్రి కొడుకును బుజ్జగిస్తూ... పీష్వాల పాలనలో ఇది మామూలే అని చెప్పాడు. ఈ అన్యాయాన్ని ఎదుర్కోవడానికి శూద్రులు విద్యావంతులు అవ్వడం ఒక్కటే మార్గమని ఆయన భావించారు. ఉన్నత కులాలకు సంబంధించిన సామాజిక సమస్యలైన సతీసహగమనం వంటి ఆచారాలనూ ఆయన వ్యతిరేకించారు. భర్త మరణించిన స్త్రీలు, అనాథ బాలల పునరావాసానికి అంకితభావంతో పనిచేశారు. స్త్రీ విద్య కోసం పాఠశాలలను ఏర్పాటు చేశారు. తన భార్య సావిత్రీబాయికి తనే చదువు చెప్పి ఆమెను టీచర్‌గా తయారు చేసి, ఈ పాఠశాలల నిర్వహణ బాధ్యతను అప్పగించారు.



జ్యోతిరావు ఫూలే

ఫూలే తన సంస్థల నిర్వహణకు అవసరమైన ఆదాయ ఆర్జనకు కొంత కాలం క్వారీ కాంట్రాక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలో క్వారీ కార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. సమస్యల పరిష్కారానికి ఎన్నోసార్లు అర్జీలను, విన్నపాలను బ్రిటిష్ గవర్నమెంట్‌కు సమర్పించారు. అమాయకులైన కార్మికులను చైతన్యవంతులుగా మార్చడానికి వారికి అర్థమయ్యే భాషలో క్వారీల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలను రాశారు.

'సత్యశోధక సమాజ్' అనే సంస్థను 1873లో స్థాపించి దాని ద్వారానే శూద్రులకు విద్యను అందించడానికి ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఆయన సమాజ సేవకు మెచ్చిన ప్రజలు 'మహాత్మా' అనే బిరుదునిచ్చారు. ఆ అవిశ్రాంత పోరాట యోధుడి స్ఫూర్తి ఎప్పటికీ చెరిగిపోనిది.

– కిరణ్ ముదిరాజ్ | హైదరాబాద్
(నేడు జ్యోతిబా ఫూలే వర్ధంతి)

డేటా పాయింట్

'మార్పు' మరింత కిందకి

వాతావరణ మార్పు పనితీరు సూచీ (సీసీపీఐ)లో మనదేశం గతేడాదితో పోలిస్తే 13 స్థానాలు కిందకు పడిపోయి 23వ స్థానంలో నిలిచింది. 60కి పైగా దేశాల్లో మార్కులను బట్టి టాప్–3లోకి ఒక్క దేశమూ అర్హత సంపాదించలేదు. డెన్మార్క్ 4, యూకే 5వ స్థానాల్లో నిలిచాయి.



ఆధారం: సీసీపీఐ 2026

అసలు సందేశం

ఇస్లాం అనే పదం 'సలాం' అనే అరబిక్ మూలం నుండి వచ్చింది. దాని అర్థం 'శాంతి', 'భద్రత', 'ఆత్మ సమర్పణ'. అందువల్ల ఇస్లాం మత మూలం శాంతి, సదాచారం, మానవతా విలువల మీద ఆధారపడి ఉంది. కానీ ఆధునిక ప్రపంచంలో 'ఇస్లాం' అనే పదం అనేక సందర్భాలలో 'ఉగ్రవాదం' అనే పదంతో కలిపి వాడబడటం విచారకరం.

ఇస్లాం మత గ్రంథం ఖురాన్ స్పష్టంగా చెబుతుంది – 'ఒక నిరపరాధిని చంపినవాడు, సమస్త మానవజాతిని చంపినట్లే.' (ఖురాన్ 5:32) అంటే, మానవ ప్రాణం పవిత్రం అనీ, దాని హననం అత్యంత పెద్ద పాపం అనీ ఇస్లాం చెబుతోంది. ప్రవక్త ముహమ్మద్ జీవితమే శాంతి, క్షమ, ప్రేమకు ప్రతీక. ఆయన తన శత్రువులను కూడా క్షమించారు. మక్కా జయించిన రోజు ఆయన ఇలా చెప్పారు: 'ఈ రోజు ప్రతీకారం కాదు, క్షమాభిక్ష దినం.' ఇది ఇస్లాం అసలు సందేశం. అయితే కొంతమంది స్వార్థపరులు, రాజకీయ ప్రయోజనాల కోసం ఇస్లాం పేరుతో హింసను ప్రోత్సహించారు. ఇలాంటి వారు మత శత్రువులు మాత్రమే కాదు, మానవతకు కూడా శత్రువులే! ఉగ్రవాదం అనేది రాజకీయ, సామాజిక లేదా ఆర్థిక కారణాలతో పుట్టిన ఒక వ్యాధి. దాన్ని మతానికి ఆపాదించడం అన్యాయం. ఇస్లాం మతం ప్రతి మనిషినీ సమానంగా చూస్తుంది. జాతి, వర్ణం, దేశం అనే తేడాలు ఇస్లాంలో లేవు. 'మానవులు ఒకే మూలం నుండి సృష్టించబడ్డారు' అని ఖురాన్ చెబుతుంది.

ఇస్లాం మతంలో 'జిహాద్' అనే పదం ఉంది. దీనిని కొంతమంది తప్పుగా అర్థం చేసుకుంటారు. 'జిహాద్' అంటే యుద్ధం కాదు. అది 'ధర్మపరమైన పోరాటం' లేదా 'తనలోని చెడుపై ఆత్మపోరాటం'. 'పెద్ద జిహాద్ అంటే మనలోని చెడు అలవాట్లపై పోరాటం' అని ప్రవక్త చెప్పారు. అంటే, ఇస్లాం మనిషిని న్యాయబద్ధమైన జీవితం వైపు తీసుకెళ్తుంది కానీ హింస, ద్వేషం, రక్తపాతం వైపు కాదు. ఉగ్రవాదం అంటే చీకటి! ఇస్లాం అంటే వెలుగు!!

– మొహమ్మద్ ఇర్ఫాన్ ఖాన్ | నిజామాబాద్

సర్కారు నిర్లక్ష్యం.. గిరిజన విద్యార్థులకు సంకటం

కనీసం మంచినీరు కల్పించలేని దుస్థితి | **కలుషిత ఆహారం.. దారుణంగా పారిశుధ్యం**

వైద్య సేవల్లో ఘోర వైఫల్యం

ఏజెన్సీలో ఇప్పటికే 22 మంది పిల్లలు మృత్యువాత

558 ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో 1.35 లక్షల మంది విద్యార్థుల హాహాకారాలు

పచ్చకామెర్ల బారిన పడి పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న గిరిజన విద్యార్థులు (ఫైల్)

- పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో మంచినీటి ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడంతో విద్యార్థులు పచ్చకామెర్ల బారి న పడ్డారు. సుమారు 184 మంది అస్వస్థతకు గురి కాగా చిన్నారులు పువ్వల అంజలి (కంబగూడ), తోయక కల్పన (దండనూరు) కామెర్లు ముది రి పోయి మృత్యువాత పడ్డారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు పరిధిలోని డుంబ్రిగుడా మండలం జామిగూడ గిరిజన బాలికల హాస్టల్‌లో కలుషిత ఆహారం (పాడైన గుడ్ల కూర) తిని 60 మందికి పైగా ఆస్పత్రి పాలయ్యారు.
- అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ప్రైవేట్ ట్రస్ట్ హాస్టల్‌లో కలుషిత ఆహారం (మిగిలిపోయిన సాంబార్ అన్నం) తిని ముగ్గురు గిరిజన విద్యార్థులు (శ్రద్ధ, జాషువా, నిత్య) చనిపోయారు. 70 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు.

సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న చంద్రబాబు సర్కారు గిరిజన బిడ్డల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. నాడు – నేడుతో ప్రైవేట్ స్కూళ్లను మించి సదుపాయాలు కల్పించిన ప్రభుత్వ పాఠశాలలను ప్రస్తుతం కనీసం రక్షిత మంచినీరు కూడా ఇవ్వలేని దుస్థితికి దిగజార్చింది. ఫలితంగా గిరిజన ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో మరణ మృదంగం మోగుతోంది. వరుసగా పిల్లలు మృత్యువాత పడుతున్నా.. వందల మంది అనారోగ్యంతో ఆస్పత్రుల పాలవుతున్నా పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకోకపోవడం నివ్వెరపరుస్తోంది.

కలుషిత నీరు, ఆహారమే కారణం..!

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పార్వతీపురం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో 14 మంది, సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఒకరు, పాడేరు ఐటీడీఏ పరిధిలో ఏడుగురు మృతి చెందినట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఇది మరింత అధికంగా ఉంటుందని అంచనా. వీరంతా కలుషిత నీరు తాగడం, నిల్వ ఆహారం తినడం, పారిశుధ్య లోపం, సకాలంలో సరైన వైద్యం అందకపోవడం లాంటి ప్రధాన కారణాల వల్లే మృతి చెందారన్నది తేటతెల్లమవుతోంది. విద్యార్థుల మరణాలను అరికట్టాలంటూ కొద్ది రోజుల క్రితం తూర్పు గోదావరి జిల్లాలో ఆందోళనలు నిర్వహించారు.

ఏఎన్‌ఎంల నియామకం ఎప్పుడు?

ఏజెన్సీలోని 558 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లకు ఒకరు చొప్పున ఏఎన్‌ఎంలను నియమిస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రతి సందర్భంలో చెబుతున్నా అడుగు ముందుకు పడలేదు. ప్రతి వంద మంది విద్యార్థులకు ఒక ఏఎన్‌ఎంను నియమిస్తే తక్షణం ప్రాథమిక వైద్యం అందించడంతోపాటు ఆరోగ్య సమస్య తీవ్రతను గుర్తించి ఆస్పత్రికి తరలించేలా అప్రమత్తం చేసే వీలుంది. విద్యాసంస్థల్లో పారిశుధ్య నిర్వహణ, ఆహార నాణ్యతను ఏఎన్‌ఎంల ద్వారా పరిశీలించవచ్చు. వరుస ఘటనలతో గ్రామ సచివాలయాల్లో అరకొరగా ఉన్న ఏఎన్‌ఎంలను ఆయా విద్యా సంస్థల్లో తాత్కాలిక సేవలు అందించాలని ఆదేశించారు.

మంత్రి బాధ్యతారాహిత్యం..!

గిరిజన విద్యా సంస్థలు, హాస్టళ్లలో మంచినీటి (ఆర్వో) ప్లాంట్లు, మరుగుదొడ్లు, భవనాల మరమ్మతులకు కేవలం రూ.వంద కోట్లు అవసరం కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు మాత్రమే కేటాయించడంతో సమస్యలు తప్పడం లేదు. 558 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో 1.35 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. ఇంతమంది గిరిజన విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసి చంద్రబాబు సర్కారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి పాఠశాలలో పిల్లలు జ్వరాలు, పచ్చ కామెర్లతో బాధపడుతున్నారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారంటూ గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బాధ్యతా రాహిత్యంగా వ్యాఖ్యలు చేశారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేష్ గురువారం తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

గాయత్రి మెడికల్ కాలేజీలో ఈడీ సోదాలు

పీఎం పాలెం: నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) స్కాం కేసులో దేశవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ముమ్మర సోదాలు నిర్వహించింది. ఈ స్కాంలో భారీ మొత్తంలో ముడుపులు చేతులు మారినట్లు గతంలోనే సీబీఐ గుర్తించింది. ఈ కేసు మూలాలు విశాఖలోని మధురవాడ గాయత్రి మెడికల్ కాలేజీలో ఉన్నాయన్న సమాచారంతో ఈడీ అధికారులు గురువారం ఆస్పత్రి కార్యాలయంలో తనిఖీలు చేశారు. కాలేజీ రికార్డులు, కంప్యూటర్ డేటాను పరిశీలించారు. ఈ కేసులో గాయత్రి మెడికల్ కాలేజీ డైరెక్టర్ వెంకట కృష్ణ కిషోర్ పేరును ఎఫ్ఐఆర్‌లో సీబీఐ నమోదు చేసింది. కాగా, గాయత్రి మెడికల్ కాలేజీ అనుమతులకు సంబంధించి అనంతపురం డాక్టర్ హరేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు హవాలా మార్గం ద్వారా ఢిల్లీలోని వీరేంద్ర కుమార్ అనే వ్యక్తికి లంచం బదిలీ అయినట్లు ఎఫ్ఐఆర్‌లో సీబీఐ తెలిపింది. ఈ వ్యవహారంలో దేశవ్యాప్తంగా ఈడీ సోదాలు చేపడుతోన్న విషయం తెలిసిందే.

అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘాల ధర్నా

సాక్షి, అమరావతి/మంగళగిరి టౌన్: చంద్రబాబు ప్రభుత్వం అసైన్డ్ భూములను పెట్టుబడిదారులు, సంపన్నులకు కట్టబెట్టడానికి చట్ట సవరణ చేసిందని వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల స్వాధీనంలో ఉన్న భూములను పెత్తందారులకు 99 ఏళ్ల లీజుకు ఇచ్చేలా అసైన్డ్ చట్టాన్ని సవరించిందని మండిపడ్డారు. వెంటనే అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని.. పేదల సాగులో ఉన్న భూములు, ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ మురళికి డిమాండ్ల పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, నాయకులు సుబ్బారావు, ఆవుల శేఖర్, కోటేశ్వరరావు, శివ, నాగరాణి కోట కల్యాణ్, ఈమని అప్పారావు, కేశవరెడ్డి పాల్గొన్నారు.

నెయ్యి కేసులో టీటీడీ మాజీ ఉద్యోగి అరెస్ట్

తిరుపతి క్రైం: తిరుమల నెయ్యి కేసులో సీబీఐ–సిట్ మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుంది. టీటీడీ ప్రొక్యూర్‌మెంట్ మాజీ జీఎం ఆర్ఎస్‌వీవీ సుబ్రహ్మణ్యంను గురువారం ఆయన ఇంటివద్ద అధికారులు అరెస్టు చేశారు. అనంతరం వైద్యపరీక్షల కోసం తిరుపతి రుయాకి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరు ఏసీబీ కోర్టుకు తీసుకెళ్లారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు సీబీఐ–సిట్ 9 మందిని అరెస్టు చేసింది.

వైఎస్సార్‌సీపీ శ్రీకాళహస్తి మండలాధ్యక్షుడి ఇంటిపై దుండగుడి దాడి

తల్లిని హత్య చేసి ఆపై నగలతో పరారీ

తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న తండ్రి

జయమ్మ (ఫైల్)

ఏర్పేడు: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తి గురువారం దాడిచేసి ఆయన తల్లి జయమ్మను హతమార్చి, తండ్రిని తీవ్రంగా గాయపరిచాడు. శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగ గ్రామ శివారున వ్యవసాయ క్షేత్రంలో నిర్మించిన భవంతిలో చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తల్లిదండ్రులు జయమ్మ(70), మహదేవరెడ్డి(81) ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు ఓ ఆగంతకుడు స్టోర్ రూం కిటికీని గ్యాస్ కట్టర్‌తో తొలగించి వంటగదిలోకి దూరాడు. అక్కడ నుంచి బెడ్‌రూములో నిద్రిస్తోన్న జయమ్మ, మహదేవరెడ్డిపై మారణాయుధాలతో దాడి చేశాడు. మహదేవరెడ్డి ఒక్క దెబ్బకు స్పృహ తప్పి పడిపోయాడు. జయమ్మ ప్రతిఘటించడంతో ఆమెపై విచక్షణారాహితంగా కత్తితో దాడి చేసి హతమార్చాడు. ఆమె మెడలోని చైను, గాజులు, చెవి కమ్మలు తీసుకుని పరారయ్యాడు. గురువారం ఉదయం ఇంటి పనిమనిషి వచ్చి తలుపులు కొట్టింది. ఎవరూ తీయకపోవడంతో అనుమానం వచ్చి జయమ్మ బంధువులకు సమాచారమిచ్చింది. దీంతో వారి కుటుంబీకులు వచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా, రక్తపు మడుగులో జయమ్మ, మహదేవరెడ్డి పడి ఉన్నారు. అప్పటికే జయమ్మ మృతి చెందింది. మహదేవరెడ్డిని శ్రీకాళహస్తిలోని ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారించారు. ఏఎస్పీ రవిమనోహరాచారి హత్య జరిగిన తీరును పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. రాజకీయ కక్షతో ప్రత్యర్థులెవరైనా దాడిచేసి హతమార్చారా? లూటీ కోసం హతమార్చారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. శ్రీకాళహస్తి వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహదేవరెడ్డిని పరామర్శించారు. హంతకులను పోలీసులు వెంటనే పట్టుకుని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

మామ కాదు.. యమకింకరుడు

శ్రీసత్యసాయి జిల్లాలో గొంతునులిమి నాలుగేళ్ల బాలుడి దారుణహత్య

అసూయతో బావమరిది కుమారుడిని అంతమొందించిన వైనం

హర్షవర్ధన్ (ఫైల్)

నిందితుడు ప్రసాద్

తలుపుల/ఎన్‌పీకుంట/కదిరి టౌన్: బావమరిది డబ్బు ఇవ్వలేదనే కక్ష, తన కుమారుడి కంటే అతడి కుమారుడు ఆరోగ్యంగా ఉన్నాడని అసూయతో రగిలిపోతూ... నాలుగేళ్ల చిన్నారిని అంతమొందించాడు ఓ దుర్మార్గుడు. శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం గెరికపల్లిలో జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు... గెరికపల్లికి చెందిన గంగరాజు తన కుమార్తె నీలావతిని కదిరి మండలం మూర్తిపల్లి వాసి ప్రసాద్‌కు ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి కుమారుడు రూపేశ్, కుమార్తె ఉన్నారు. రూపేశ్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. గంగరాజు హైదరాబాద్‌లో కూలీ చేస్తూనే మనవడిని తీసుకెళ్లి వైద్యం చేయించాడు. అయితే, తాపీ పనులు చేసే ప్రసాద్ వ్యసనాలకు బానిసయ్యాడు. కుమారుడు రూపేశ్ చికిత్సకు బావమరిది గంగాధర్ నుంచి రూ.3 లక్షలు తీసుకున్నాడు. ఇంకా కావాలని కోరగా లేవని చెప్పాడు. దీంతో ప్రసాద్ కోపం పెంచుకున్నాడు. తన కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండగా, గంగాధర్ కుమారుడు హర్షవర్ధన్ (4) చురుగ్గా ఉండడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. 'నాలాగే మీరు కూడా క్షోభ అనుభవించాలన్న' పగతో హర్షవర్ధన్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. 2 నెలలుగా తరచూ గెరికపల్లి వెళ్తూ చిన్నారిని ముద్దుచేస్తున్నాడు. బుధవారం అంగన్‌వాడీ సెంటర్ నుంచి హర్షవర్ధన్‌ను ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడినుంచి తోటకు, తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు. హర్షవర్ధన్ తల్లిదండ్రులు పొలానికి వెళ్తూ త్వరగా వచ్చేస్తామనే ఆలోచనతో బాలుడిని ఇంటి వద్దే ఉంచారు. ఇదే అదనుగా హర్షవర్ధన్‌ను ప్రసాద్ బైక్‌పై ఎక్కించుకుని తీసుకెళ్లాడు. కొద్దిదూరం వెళ్లాక సంచిలో వేసుకున్నాడు. మాటలు రాని ఓ వ్యక్తి దీన్నంతటినీ గమనించి గ్రామస్తులకు తెలిపేందుకు ప్రయత్నించినా వారు అర్థం చేసుకోకపోయారు. ఈ లోగా ప్రసాద్ మార్గమధ్యంలోనే బాలుడిని గొంతునులిమి చంపేశాడు. మృతదేహాన్ని 15 కిలోమీటర్లపైగా దూరంలోని నంబులపూలకుంట మండలం మరికొమ్మదిన్ని గ్రామ సమీప పొలాల్లో పడేశాడు. ఏమీ ఎరుగనట్లు గెరికపల్లికి వచ్చాడు. హర్షవర్ధన్ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పలుచోట్ల వెదికారు. తలుపుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్ఐ నరసింహులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రసాద్ ప్రవర్తనపై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. గురువారం తెల్లవారుజామున హర్షవర్ధన్ మృతదేహాన్ని గుర్తించారు. తర్వాతా కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కదిరికి వచ్చి బాలుడి హత్య వివరాలను మీడియాకు వెల్లడించారు.

రాజీనామాలపై నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకోవాల్సిందే

కాలయాపన చేయడానికి వీల్లేదు

జయమంగళ రాజీనామాపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోండి

శాసనమండలి చైర్మన్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: చట్టసభలకు ఎన్నికైన సభ్యులు సమర్పించిన రాజీనామాల విషయంలో శాసనసభ స్పీకర్ లేదా శాసనమండలి చైర్మన్లకు గడువు నిర్దేశిస్తూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ తన పదవికి రాజీనామా చేస్తూ సమర్పించిన లేఖ విషయంలో నిర్దిష్ట గడువులోపు నిర్ణయం తీసుకుని తీరాల్సిందేనని తేల్చిచెప్పింది. కనిష్టంగా 15 రోజులు, గరిష్టంగా 30 రోజుల్లో నిర్ణయం తీసుకుని తీరాల్సిందేనని శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్లను ఆదేశించింది. ఎమ్మెల్సీ పదవికి జయమంగళ వెంకటరమణ సమర్పించిన రాజీనామా విషయంలో తగిన విచారణ జరిపి నాలుగు వారాల్లో నిర్ణయం వెలువరించాలని మండలి చైర్మన్‌ను ఆదేశించింది. నిర్ణయాన్ని జయమంగళ వెంకటరమణకు తెలియచేయాలని స్పష్టం చేసింది. విచక్షణ పేరుతో సుదీర్ఘ కాలం పాటు నిర్ణయం తీసుకోకపోవడం చట్టవిరుద్ధమని తేల్చి చెప్పింది. చట్టం చేసేవారు చట్టం కన్నా మిన్న అనుకోవడానికి వీల్లేదంది. రాజీనామాలపై విచక్షణాధికారం పేరుతో నిర్దిష్ట సమయంలోపు నిర్ణయం తీసుకోకపోవడం విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమే అవుతుందని హైకోర్టు పేర్కొంది. 33వ రాజ్యాంగ సవరణ సమయంలో జరిగిన పార్లమెంట్ చర్చలను పరిశీలిస్తే రాజీనామాల విషయంలో స్పీకర్, మండలి చైర్మన్లు గరిష్టంగా 30 రోజుల్లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని హైకోర్టు గుర్తు చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ గురువారం తీర్పు వెలువరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

ప్రభుత్వానికి ఆర్ఎస్‌యూ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా రూ.7వేల కోట్లకుపైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో పెట్టడంతో ఉన్నత విద్యా రంగం ప్రగతి కుంటుపడుతోందని రివల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) తీవ్రంగా మండిపడింది. గురువారం విజయవాడలో ప్రభుత్వ నిర్లక్ష్య తీరును వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టింది. ఈ నిరసనలో నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేస్తోందని దుయ్యబట్టారు. ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో 60 డిగ్రీ కళాశాలలు మూతపడ్డాయన్నారు. ఏకంగా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు బాబు ప్రభుత్వం దోచిపెడుతోందని మండిపడ్డారు. గతంలో 100 శాతం సీట్లను ప్రభుత్వ కోటాలోనే కేటాయిస్తామని లోకేశ్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సులు, పారామెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు, ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ప్రజలకు నాణ్యమైన వైద్యం దూరం అవుతోందన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు పేరుకుపోవడంతో ఆస్పత్రుల్లో పేదలకు వైద్యం అందట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు బాసిరెడ్డి రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత పథకాలతో ప్రజలు సోమరులవుతారు

మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

తెనాలి అర్బన్: ఉచిత పథకాలు ఇవ్వటం వల్ల ప్రజలు సోమరులవుతారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కావాలని ఎవరడిగారు? అని ప్రశ్నించారు. విద్య, వైద్యం ఉచితంగా ఇస్తే చాలని చెప్పారు. గుంటూరు జిల్లా తెనాలిలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో గురువారం ఏర్పాటుచేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పల్లెల్లో అక్షర జ్యోతిని వెలిగించిన డాక్టర్ పెమ్మరాజు దుర్గా కామేశ్వరరావు(డాక్టర్ పీడీకే రావు)కు సేవాజ్యోతి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యేలు చెబితేనే ప్రజలకు అధికారులు సేవలందిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు.

శ్రీవారి వైకుంఠద్వార దర్శనం ఈ-డిప్

తిరుమల: శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు జరగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి మొదటి మూడురోజుల ఆన్‌లైన్ ఈ–డిప్‌నకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన డిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మొదటి గంటలోనే రికార్డు స్థాయిలో 2,16,254 మంది భక్తులు నమోదు చేసుకున్నారు. ఇందులో టీటీడీ వెబ్‌సైట్లో 78,475, మొబైల్ యాప్లో 1,27,275, ఏపీ గవర్నమెంట్ వాట్సాప్ బాట్లో 10,504 రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. సాయంత్రానికి 4,60,000 మంది నమోదు చేసుకున్నారు. డిసెంబర్ 2వ తేదీన ఈ–డిప్‌లో టోకెన్లు పొందిన భక్తులకు ఫోన్ ద్వారా సందేశం పంపుతారు. మొదటి మూడు రోజులు ఆన్‌లైన్‌లో టోకెన్లు కలిగిన వ్యక్తులకు మాత్రమే వైకుంఠద్వార దర్శనం కల్పిస్తారు. చివరి ఏడు రోజులు ఎలాంటి టోకెన్లు లేని భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పిస్తారు. అలాగే, రోజుకు 15వేలు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, వెయ్యి శ్రీవాణి దర్శన టికెట్లను డిసెంబర్ 5న ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. చివరి మూడు రోజులు స్థానికులకు ప్రాధాన్యత కల్పిస్తూ రోజుకు 5 వేల టోకెన్లు ఆన్‌లైన్‌లో డిసెంబర్ 10న విడుదల చేస్తారు.

దొంగనోట్ల మార్పిడి.. గంజాయి అక్రమ రవాణా

నెల్లూరులో నలుగురి అరెస్ట్

22.4 కిలోల గంజాయి.. రూ.37.5 లక్షల విలువైన నకిలీ నోట్ల స్వాధీనం

నెల్లూరు సిటీ: గంజాయి విక్రయాలతో పాటు నకిలీ నోట్లను మార్పిడి చేస్తున్న ముఠా గుట్టును నెల్లూరు రూరల్ పోలీసులు రట్టు చేశారు. ఈ కేసు వివరాలను నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు గురువారం వెల్లడించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఇసుకపల్లి పంచాయతీలోని కుర్రులబ్బిపాళేనికి చెందిన హసన్ అలియాస్ మున్నా అలియాస్ అశోక్ అలియాస్ కార్తీక్‌రెడ్డి, ముత్తుకూరు మండలం బీసీ కాలనీకి చెందిన రియాజ్, అదే ప్రాంతానికి చెందిన ముస్తఫా, పిడతాపోలూరుకు చెందిన అనిల్ స్నేహితులు. వీరు ఒడిశా నుంచి గంజాయిని తీసుకువచ్చి నెల్లూరుతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమందితో ముఠాగా ఏర్పడి విక్రయాలు చేపడుతున్నారు. దీంతో పాటు నకిలీ నోట్లనూ మారుస్తున్నారు. ఎస్పీ ఆదేశాలతో రూరల్ సీఐ వేణు, ఎస్ఐ లక్ష్మణ్ తమ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ప్రధాన నిందితుడు హసన్..కారులో చెన్నై వైపు వెళ్తున్నాడని పోలీసులు తెలుసుకుని మాటువేశారు. బూదనం టోల్‌ప్లాజా సమీపంలో పోలీసులున్నారని తెలుసుకున్న హసన్ ముందే కారు దిగి తప్పించుకునేందుకు యత్నించాడు. పోలీసులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. దర్యాప్తులో ధనలక్ష్మీపురంలోని సాయిశ్రీ సిటీ లేఅవుట్లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని అక్రమ రవాణాకు అడ్డాగా ఏర్పాటు చేసినట్లు తేలింది. హసన్‌ను అక్కడికి పోలీసులు తీసుకుని వెళ్లగా, అప్పటికే అక్కడ గ్యాంగ్ సభ్యులు రియాజ్, ముస్తఫా, అనిల్ ఉన్నారు. అక్కడున్న 22.4 కిలోల గంజాయి, రూ.37.5 లక్షల నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురినీ అరెస్ట్ చేశారు. కాగా, గతంలో వీరిపై నెల్లూరు రూరల్, ముత్తుకూరులో దొంగనోట్ల మార్పిడి, కొన్ని కేసులున్నట్లు డీఎస్పీ చెప్పారు. ఈ గ్యాంగ్‌తో సంబంధాలున్న మరో నిందితుడు నందన్‌ను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. నిందితుల గుట్టురట్టు చేసిన పోలీస్ సిబ్బంది, రూరల్ ఇన్‌స్పెక్టర్ వేణు, ఎస్ఐ లక్ష్మణ్‌కు డీఎస్పీ శ్రీనివాసరావు రివార్డులను ప్రకటించారు.

మహారాష్ట్ర పార్థీగ్యాంగ్ ముఠా సభ్యుల అరెస్ట్

బెజవాడ బస్టాండ్‌లో మహిళ ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు

పట్టుబడిన నలుగురి ముఠాలో ఇద్దరు మహిళలు

కృష్ణలంక (విజయవాడ తూర్పు): మహారాష్ట్ర పార్థీగ్యాంగ్ ముఠా సభ్యుల్లో నలుగురిని విజయవాడ కృష్ణలంక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. వారినుంచి రూ.5 లక్షల విలువైన 50 గ్రాముల బంగారు నగలు, రూ.44 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. గురువారం విజయవాడ బస్ కాంప్లెక్స్‌లోని పోలీస్ ఔట్‌పోస్ట్‌లో క్రైమ్ ఎస్ఐ జె.భానుప్రసాద్, ఎస్ఐ గిరిధర్‌బాబు ఈ వివరాలను మీడియాకు వివరించారు. ఎస్సై భానుప్రసాద్ మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని సమీప గ్రామాలకు చెందిన ప్రశాంత్ రాజేంద్ర భోంస్లే (26), భవన్ ఆనంద్ బోంస్లే (25), కవిత భగవాన్ భోంస్లే (50), మంజు పవర్ భోంస్లే (27) కలిసి రద్దీగా ఉండే ప్రదేశాల్లో సామాన్య ప్రయాణికులుగా నటిస్తారు. ఏమరపాటుగా ఉన్న ప్రయాణికులు నుంచి విలువైన వస్తువులను వారికి తెలియకుండానే చోరీ చేస్తుంటారు. వీరిపై మహారాష్ట్ర, రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల్లో చోరీ కేసులు నమోదై ఉన్నాయి. ఈ నలుగురు కలిసి చోరీలు చేసేందుకు ఈ నెల 22న మహారాష్ట్ర నుంచి విజయవాడ వచ్చారు. రద్దీ ప్రదేశాలపై రెక్కీ నిర్వహిస్తూ ఈ నెల 23న బస్టాండ్‌లో బస్సు ఎక్కే సమయంలో ఒక మహిళ హాండ్‌బ్యాగ్ జిప్పులను తెరిచి అందులోని రూ.44 వేల నగదును దొంగిలించారు. మరో ప్లాట్‌ఫామ్ వద్ద మహిళా ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్ జిప్పును తీసి బ్యాగ్‌లోని 26 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకుపోయారు. మంగళవారం మరో మహిళా ప్రయాణికురాలి కర్రల సంచిలోని 24 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను కొట్టేశారు. ముగ్గురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన కృష్ణలంక పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు నలుగురిని ప్రకాశం బ్యారేజీ సమీపంలోని సీతమ్మ వారి పాదాల వద్ద ఉన్నట్టు గుర్తించి అరెస్ట్ చేశారు.

చంద్రబాబు కేసుల కొట్టివేతపై కోర్టులో వాగ్వాదం

సర్టిఫైడ్ కాపీలు కావాలని కోరిన న్యాయవాది పొన్నవోలు

పీపీ అభ్యంతరంతో కోర్టులో తీవ్ర వాదోపవాదాలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): సీఎం చంద్రబాబుపై గతంలో నమోదైన కేసుల కొట్టివేతపై పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మధ్య కోర్టులో వాగ్వాదం జరిగింది. చంద్రబాబు కేసులో సాక్షులు ప్రభుత్వోద్యోగులు కావడంతో వారిని భయపెట్టి కేసులు కొట్టివేయించుకుంటున్నారని, అలా కొట్టేస్తూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు సంబంధించి సర్టిఫైడ్ కాపీలు ఇవ్వాలని పొన్నవోలు కోర్టును కోరారు. దీంతో.. ఈ కేసులతో సంబంధంలేని వ్యక్తులు సర్టిఫైడ్ కాపీలు ఎలా అడుగుతారని పీపీ అభ్యంతరం తెలిపారు. ఇది ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన కేసు అని, సర్టిఫైడ్ కాపీలు థర్డ్ పార్టీ ఎవరైనా కోరవచ్చని పొన్నవోలు చెప్పారు. ఇందుకు సంబంధించి గతంలో కోర్టు ఇచ్చిన తీర్పులను ప్రస్తావించారు. సాక్షులను ప్రభావితం చేసి, వారిని భయపెట్టి చంద్రబాబు కేసులు కొట్టివేయించుకుంటున్నారంటూ కోర్టులో ఆయన బలంగా వాదనలు వినిపించారు. ముఖ్యంగా అసైన్డ్ భూముల వ్యవహారంలో చంద్రబాబుపై నమోదైన కేసుకు సంబంధించి గురువారం పీపీకి, పొన్నవోలుకు మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరిగాయి. అసైన్డ్ భూముల కేసు కొట్టేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల సర్టిఫైడ్ కాపీ ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో తాము థర్డ్ పార్టీకి ఇచ్చేదిలేదని లిఖితపూర్వకంగా చెప్పాలని పొన్నవోలు కోరారు.

బెంగళూరులో ఈడీ దాడులు

బనశంకరి: కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు గురించి అధికార కాంగ్రెస్‌లో రగడ జరుగుతుంటే, మరోవైపు బెంగళూరు నగరంలో పలువురు మంత్రుల సన్నిహితుల నివాసాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (ఈడీ) ఆకస్మిక దాడులు చేసింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఈడీ అధికారులు గురువారం ఉదయం నుంచే సోదాలు చేపట్టారు. నగరంలోని ప్రముఖ బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇళ్లు, ఆఫీసుల్లో సోదాలు జరుగుతున్నాయి. వీరిలో ఎక్కువ మంది రాష్ట్ర మంత్రులకు దగ్గరి వారని సమాచారం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.టిఓ/44 టు 46/2025-2026, తేది: 24-11-2025
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా (Erstwhile) లోని సూళ్లూరుపేట మండలంలో 3 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనములు నిర్మాణము చేయుటకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 3 పనులకు అంచనా విలువ: రూ.126.00 లక్షలు. ఇ-ప్లాట్‌ఫారంలో టెండరు డాక్యుమెంట్ లభ్యత: 01-12-2025 నుండి 15-12-2025, మ.3.00 గం.ల వరకు. ఇతర వివరాలను ఈ కార్యాలయములో పొందగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు, పంచాయతీరాజ్ సర్కిల్, నెల్లూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
DIPR RO No.18187/CL/Advt/1/1/2021-22, Dt: 27-11-2025

SRI VENKATESWARA INSTITUTE OF MEDICAL SCIENCES
(A UNIVERSITY ESTABLISHED BY AN ACT OF A.P. STATE LEGISLATURE)
TIRUMALA TIRUPATI DEVASTHANAMS, TIRUPATI
e-PROCUREMENT TENDER NOTICE
SVIMS is inviting e-Tenders for supply of raw water to the three sumps at SVIMS premises through tractor and tanker and/or lorry and tanker. For more details, please visit the website https://tender.apeprocurement.gov.in.
For further inquiries, contact phone numbers 0877-2286231 & 2287777 Extn-2227
DONATE LIBERALLY TO "SVIMS GENERAL DONATION SCHEME" SVIMS ACCOUNT NO.62121045670, SBI, IFSC CODE: SBIN0020926, "80G BENEFITS AVAILABLE TO THE SCHEME"
ROC.No.AD(GM)/264/Water Supply/SVIMS/2019, Date: 04.11.2025 DIRECTOR - CUM - VC

వింటర్ ఎగ్ @ 236 కోట్లు!

భారీ ధర పలకనున్న వందేళ్లనాటి రష్యా రాచరిక వస్తువు

లండన్: రష్యా జార్ చక్రవర్తుల రాజరిక ఠీవికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే అత్యంత అరుదైన వింటర్ ఎగ్ ఒకటి ఇప్పుడు వేలంపాటలో రికార్డ్ మోత మోగించేందుకు సిద్ధమైంది. రష్యా జార్ చక్రవర్తి నికోలస్–2 తన తల్లి, రాజమాత మారియా ఫియోడరోవ్నాకు వందేళ్ల క్రితం ఈస్టర్ కానుకగా బహూకరించిన విలువైన వింటర్ ఎగ్ గురించే ఇప్పుడు చర్చ అంతా. డిసెంబర్ రెండో తేదీన క్రిస్టీస్ వేలంపాట సంస్థ తమ లండన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే వేలంపాటలో ఈ స్ఫటిక ఫాబెర్జే వింటర్ ఎగ్ ఏకంగా రూ.236 కోట్లకుపైగా ధర పలకవచ్చన్న అంచనాలు ఎక్కువయ్యాయి. దీనిని ప్రఖ్యాత వజ్రాభరణాల సంస్థ ఫాబెర్జే తయారుచేసింది. 1913 సంవత్సరంలో రాజు నికోలస్ దీనిని తన తల్లికి బహూకరించారు. రష్యా ప్రభుత్వ అధీనంలోకాకుండా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న ఏడింటిలో ఇదీ ఒకటని వేలంసంస్థ పేర్కొంది.

ఎన్నెన్నో ప్రత్యేకతలు

దవళవర్ణంలో ధగధగా మెరిసిపోయే ఈ వింటర్ ఎగ్ ఎత్తు 10 సెంటీమీటర్లు. తీరగా చూస్తే పూర్తి గుడ్డులాగా కనిపించినా దానిని రెండుభాగాలుగా తెరవొచ్చు. చలికాలంలో ఆరుబయట పేడితే మంచుబిందువులు పడి ఘనీభవించినట్లు స్ఫురించేలా దీనిని డిజైన్‌చేశారు. ప్లాటినమ్ లోహపు బుల్లి బుట్టలో అనిమోనిస్ పుష్పాలను, లిల్లీలను చూడచక్కటి పుష్పగుచ్ఛాన్ని తయారుచేసి లోపల పెట్టారు. గుడ్డు అంతర్భాగంగా మొత్తంగా ఏకంగా 4,500 చిన్న చిన్న వజ్రా లను పొదిగారు. అనిమో నిస్ పుష్పాలను క్వార్ట్జ్‌తో తయారుచేశారు. ఆకుల ను పచ్చలతో రూ పొందించారు. శీతాకాల చలిని చీల్చుకుంటూ వసంత రుతువులోకి కాలం అడుగుపెట్టేవేళ అనిమో నిస్ పుష్పాలు వికసిస్తా యి. కష్టకాలాన్ని దాటి కొత్త జీవితంలోకి అడుగు పెడుతున్నందుకు గుర్తుగా రష్యాలో ఈ పుష్పాలను బహుమతిగా ఇస్తారు. ఫాబెర్జే వజ్రాభరణాల సంస్థలోని ఏకైక కళాకృతి కళాకారిణి అల్మా పిహల్ దీనిని డిజైన్ చేశారు. స్వర్ణకారుడైన ఆల్బర్ట్ హోల్మ్‌స్ట్రోమ్, పిహల్ దీనిని తయారు చేశారు. "అద్భుతమైన చేతి పనితనం, ఆకర్షణీ యమైన డిజైన్లకు ఈ వింటర్ ఎగ్ పెట్టింది పేరు. అలంకరణ కళల్లో ఈ ఎగ్ ఒకరకంగా మోనాలిసా పెయింటింగ్‌లాంటిది'' అని క్రిస్టీస్ వేలంసంస్థలో రష్యా కళారూపాల విభాగ అధిపతి మార్గో ఒగానెసియాన్ వ్యాఖ్యానించారు. పీటర్ కార్ల్ ఫాబెర్జే సారథ్యంలోని వజ్రా భరణాల సంస్థ 1885 నుంచి దాదాపు పాతికేళ్ల పాటు రష్యా రాజకుటుంబాల కోసం దాదాపు 50 స్పెషల్ ఎగ్‌లను తయారు చేసి ఇచ్చింది. జార్ చక్రవర్తి అలెగ్జాండర్–3 తన సతీమణికి ప్రతి ఈస్టర్‌కు ఒక ఈస్టర్ ఎగ్‌ను బహూకరించి ఇలా ఎగ్‌ల బహూకరణ పర్వానికి తెరదీశారు. దీనిని నికోలస్–2 కొనసా గించారు.

నిలువెత్తు నిప్పుకణిక

హాంకాంగ్ అగ్నిప్రమాద ఘటనలో 83కు పెరిగిన మృతుల సంఖ్య

- ఇంకా 300 మంది జాడ గల్లంతు
- ఏడింట నాలుగు భవనాల్లో అదుపులోకి వచ్చిన మంటలు
- మసిబొగ్గులా మారిన భవనాలు
- సర్వం కోల్పోయి నిలువనీడలేక అపార్ట్‌మెంట్‌వాసుల రోదనలు

అపార్టుమెంట్లలో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న ఫైర్ ఫైటర్లు (ఇన్‌సెట్) దగ్ధమవుతున్న వెదురు ఫ్రేములు

హాంకాంగ్/బీజింగ్: హాంకాంగ్‌లో గత 100 సంవత్సరాల చరిత్రలో అతిపెద్ద అగ్నిప్రమాదంగా పరిణమించిన వాంగ్ ఫుక్ కోర్ట్ హౌసింగ్ కాంప్లెక్స్ ఘటనలో మరణాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నిలువెత్తు నిప్పుకణికగా తయారైన బహుళ అంతస్తుల భవనాల్లో ఇంకా మంటలు చెలరేగడంతో మరికొందరు అపార్ట్‌మెంట్‌వాసులు అగ్నికి ఆహుతయ్యారు. గురువారంనాటికి మరణాల సంఖ్య 83కు పెరిగింది. వీరిలో ఇండోనేసియా వలసకార్మికులు సైతం ఉన్నారు. 76 మంది గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు. వీరిలో 15 మంది ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. భవనాల్లో చిక్కుకుపోయిన దాదాపు 300 మంది జాడ తెలియాల్సి ఉందని హాంకాంగ్ స్థానిక యంత్రాంగం గురువారం ప్రకటించింది. పైఅంతస్తుల్లోకి మంటలు ఇంకా విస్తరిస్తూ, అగ్ని కీలలు ఎగసిపడుతుండటంతో వాటిని అదుపుచేయడం అగ్నిమాపక దళాలకు చాలా కష్టంగా మారింది. ఎనిమిది భవనాల సమాహారంగా నిర్మితమైన వాంగ్‌ఫుక్‌కోర్ట్‌లో ఏడింటికి నిప్పు అంటుకోగా నాలుగు భవనాల్లో మంటలను అదుపులోకి తెచ్చారు. మిగతా మూడు భవనాల్లో పరిస్థితి అదుపులోలేదు. ఒక్కోటి 32 అంతస్తుల ఎత్తుండటంతో ఆ ఎత్తులోకి వెళ్లి మంటల్ని ఆర్పడం అసాధ్యంగా మారింది. 304 ఫైర్‌ఇంజిన్లు, వందలాది మంది అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, పారామెడికల్ సిబ్బంది, వలంటీర్లు అన్వేషణ, సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. మసిబొగ్గులా మారిన ఒక్కో అపార్ట్‌మెంట్‌లోకి అగ్నిమాపక సిబ్బంది టార్చ్‌లైట్లు పట్టుకుని వెళ్లి మృతదేహాల కోసం వెతుకుతున్నారు. భవనాల ఆధునీకరణ బాధ్యతలు చూస్తున్న ఒక కాంట్రాక్టర్‌కు చెందిన ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌ను, ఇద్దరు డైరెక్టర్లను నిర్లక్ష్యానికి కారకులంటూ పోలీసులు గురువారం అరెస్ట్‌చేశారు. '' మంటలు ఎగసినప్పుడు నేను భవనంలో లేను. వెంటనే భార్యకు ఫోన్‌చేసి తప్పించుకో అని హెచ్చరించా. ఫ్లాట్ నుంచి బయటికొస్తే మెట్ల వద్ద, కారిడార్‌లో మొత్తం మంటలే ఉన్నాయి. దీంతో మళ్లీ ఆమె ఫ్లాట్‌లోకి పరుగులుతీసింది. తర్వాత ఆమె ఏమైందో తెలీడం లేదు'' అని అపార్ట్‌మెంట్‌వాసి లారెన్స్‌లీ బోరున విలపించారు. '' మంటలంటుకోగానే ఇంట్లోంచి బయటికొచ్చాం. ఇప్పుడు మా ఫ్లాట్ ఎలా గుందో. నిద్రలేని రాత్రిని గడిపాం'' అని 75 ఏళ్ల వృద్ధదంపతులు వింటర్, శాండీ చంగ్ కన్నీరుమున్నీరయ్యారు.

అగ్గిరాజేసిన స్టీరోఫోమ్ కిటికీలు

భవనాలకు ఆవలివైపు నుంచి దాదాపు రూ.379 కోట్లతో గత కొన్ని నెలలుగా మరమ్మత్తులు, ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. దుమ్ము, ధూళి, నిర్మాణసంబంధ పరికరాలు, శబ్దాల నుంచి రక్షణ కోసం దాదాపు ప్రతి అపార్ట్‌మెంట్ కిటికీలకు రక్షణగా స్టీరోఫోమ్‌తో చేసిన ఫ్రేమ్‌లను బిగించారు. అయితే వీటికి అత్యంత వేగంగా మండే స్వభావం ఉంది. వెదురుకర్రల చుట్టూతా కప్పిన ఆకుపచ్చ మెష్‌కు తొలుత మంటలు అంటుకుని, అవి వెనువెంటనే వెదురు కర్రలకు అంటుకున్నాయి. బహిరంగంగా ఉండటంతోపాటు ఎత్తయిన ప్రదేశంకావడంతో గాలులు తోడై ఆ మంటలు వెంటనే స్టీరోఫోమ్ కిటికీ ఫ్రేమ్‌లకు అంటుకోవడంతో అగ్నికీలలు అమాంతం ఎగసిపడి భారీ అగ్నిప్రమాదం సంభవించిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు.

40 శాతం మంది వృద్ధులే..

బాధితులకు తక్షణ సాయం అందించేందుకు హాంకాంగ్ ప్రభుత్వం రూ.385 కోట్లతో సహాయక నిధిని ఏర్పాటుచేసింది. వందలాది మంది అపార్ట్‌మెంట్‌వాసులను అధికారులు హుటాహుటిన తాత్కాలిక శిబిరాలకు తరలించి నిత్యావసర సరకులు అందిస్తున్నారు. ఈ హౌసింగ్ కాంప్లెక్స్‌ను 1,984 ఫ్లాట్‌లతో 1983 సంవత్సరంలో నిర్మించారు. 2021 జనాభా లెక్కల ప్రకారం వీటిల్లో దాదాపు 4,600 మంది నివసిస్తున్నారు. అపార్ట్‌మెంట్ జనాభాలో దాదాపు 40 శాతం మంది 65ఏళ్లు పైబడిన వృద్ధులేనని స్పష్టమవుతోంది.

పనిచేయని అలారమ్‌వ్యవస్థ

భవనాలు రిపేర్‌లో ఉండటంతో అలారమ్ వ్యవస్థలను పనిచేయకుండాచేశారని, అందుకే అగ్ని ప్రమాదం వేళ ఎలాంటి అలారమ్ శబ్దాలు రాలేదని అపార్ట్‌మెంట్ వాసులు చెప్పారు. తోటి అపార్ట్‌మెంట్ వాసుల ఇళ్లకు వెళ్లి బెల్ కొట్టడం, డబడబ అంటూ తలుపుతట్టడం, వాళ్లను అప్రమత్తంచేయడం, మళ్లీ మరో ఇంటికి వెళ్లడం ఇవే దృశ్యాలు అక్కడ కనిపించాయని మరో స్థానికుడు చెప్పారు. ప్రభావిత ఒక్కో అపార్ట్‌మెంట్‌వాసులకు తక్షణ సాయంగా రూ.1,14,000 ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. మృతులకు నివాళులర్పిస్తూ పోప్ లియో గురువారం హాంకాంగ్ బిషప్‌కు సంతాప సందేశలేఖను పంపించారు. మృతులకు అమెరికా, బ్రిటన్‌సహా పలు దేశాలు సంతాపసందేశాలు పంపాయి. ఘటనపై నేరం కోణం పోలీసులు, నిర్లక్ష్యం కోణంలో హౌసింగ్ బ్యూరో, అవినీతి కోణంలో అవినీతినిరోధక శాఖలు వేర్వేరుగా దర్యాప్తు ప్రారంభించాయి.

ఆధార్ కార్డున్న విదేశీయులు ఓటేయొచ్చా?

- ఓటు హక్కుకు ఆధార్‌కార్డ్ ఉంటే సరిపోతుందన్న పిటిషనర్లను సూటిగా ప్రశ్నించిన సుప్రీంకోర్టు
- ఆధార్‌కార్డ్ కేవలం సామాజిక, సంక్షేమ పథకాల కోసమేనన్న కోర్టు

న్యూఢిల్లీ: ఆధార్ కార్డు సంపాదించిన వయోజనులందరూ ఓటేయడానికి అర్హులేనన్న పిటిషనర్ల తరఫు వాదనలను సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. అక్రమమార్గంలో ఆధార్‌కార్డ్‌ను సంపాదించిన విదేశీయులు ఉన్నారని, అలాంటి వారికి ఓటేసే అవకాశంకల్పించలేమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం స్పష్టంచేసింది. పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సర్వే(ఎస్ఐఆర్) చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్లపై తుది వాదోపవాదనలను ధర్మాసనం ఆలకిస్తున్న సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులపై న్యాయమూర్తులు ప్రశ్నల వర్షం కురిపించారు. ''విదేశీయులు ఆధార్‌కార్డ్‌ను పొంది ఉంటే వాళ్లకూ ఓటరుగా ఓటేసేందుకు అవకాశం కల్పించాలా? అక్రమంగా వలసవచ్చిన శరణార్థులు సైతం రేషన్ బియ్యం కోసం ఆధార్ కార్డ్ తీసుకున్నారు. వాళ్లనూ ఓటేయనిద్దామా? విదేశాలకు చెందిన వలస కూలీలు భారత్‌కు వచ్చి కార్మికులుగా పనిచేస్తున్నారు. వాళ్లు అక్రమంగా ఆధార్‌కార్డ్ సంపాదిస్తే వాళ్లనూ ఓటర్‌లుగా పరిగణిద్దామా?'' అని సీజేఐ సూటి ప్రశ్నలు వేశారు. '' కేంద్ర ఎన్నికల సంఘం అనేది పోస్టాఫీస్ కాదు. నాకూ ఓటు హక్కు ఇవ్వాలంటూ దాఖలయ్యే ప్రతి ఆరోనంబర్ ఫారమ్‌ను స్వీకరించి వాళ్లకు ఓటు హక్కును ధరాదత్తం చేయడం కుదరదు. ఆధార్‌కార్డ్ ముఖ్యోద్దేశాలు పరిమితం. సామాజిక, సంక్షేమ పథకాల్లో అసలైన లబ్ధిదారులను గుర్తించి వాళ్లకు ప్రయోజనం చేకూర్చేందుకే ఆధార్‌కార్డ్‌ను తీసుకొచ్చారు. ఆధార్‌ను ఓటు హక్కు వంటి పౌరసత్వ సంబంధ అంశంతో ముడిపెట్టలేం'' అని అన్నారు. గతంలో దేశంలో ఎక్కడా ఇంతటి విస్తృతస్థాయిలో సమగ్ర సవరణ చేపట్టలేదన్న ఒకే ఒక్క కారణం చూపుతూ ఈసీ నిర్ణయాధికారాన్ని, ఈసీ నిర్ణయాల చట్టబద్ధతను ప్రశ్నించజాలరని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్‌లో ఎస్ఐఆర్ నిర్వహణను సవాల్‌చేస్తూ దాఖలైన ప్రత్యేక పిటిషన్లను వేర్వేరు తేదీల్లో విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది.

భారత్‌లోని ప్రాంతాలతో మ్యాప్..

రూ. 100 నోటుపై ముద్రించిన నేపాల్

కఠ్మాండు: భారత్‌లోని కాలాపానీ, లిపులేఖ్, లింపియధుర ప్రాంతాలు తమవంటూ వాదిస్తున్న నేపాల్ ప్రభుత్వం మరో వివాదానికి తెరతీసింది. తాజాగా విడుదల చేసిన రూ.100 నోటుపై ముద్రించిన నేపాల్ మ్యాప్‌లో ఆ మూడు ప్రాంతాలు ఉండటమే ఇందుకు కారణం. నేపాల్ రాష్ట్ర బ్యాంక్(ఎన్ఆర్‌బీ) గత గవర్నర్ మహా ప్రసాద్ అధికారి సంతకంతో కూడిన ఆ నోట్‌పై నేపాల్ క్యాలెండర్ ప్రకారం 2081లో విడుదల చేసినట్లుగా ఉంది. అంటే, ఆంగ్ల క్యాలెండర్ ప్రకారం ఇది గతేడాది 2024. 2020లో అప్పటి ప్రధాని కేపీ శర్మ ఓలి ప్రభుత్వం లిపులేఖ్, కాలాపానీ, లింపియధుర తమవేనంటూ ఆ దేశ కొత్త మ్యాప్‌ను విడుదల చేయడం వివాదం రేపింది. దీనిపై అప్పట్లో భారత్ తీవ్రంగా స్పందించింది. ఏకపక్ష చర్యగా అభ్యంతరం తెలిపింది. భూభాగాన్ని కృత్రిమంగా విస్తరించి చూపడాన్ని ఆమోదించబోమంది.

సంపూర్ణ ఆరోగ్యంతో ఇమ్రాన్

- ఆయన అడియాలా జైలులోనే ఉన్నారు
- ప్రకటించిన పాకిస్తాన్ రక్షణ మంత్రి ఆసిఫ్

లాహోర్: మాజీ క్రికెటర్, పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్(73) కస్టడీలో చనిపోయారంటూ వస్తున్న వార్తలు, అడియాలా జైలు వద్ద ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది. జైలులోనే ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని గురువారం ప్రకటించింది. ఇమ్రాన్‌ను ఎక్కడికీ తరలించలేదని, జైలులోనే పూర్తి స్థాయిలో అవసరమైన వైద్య సాయం అందుతోందని పేర్కొంది. 'తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఇమ్రాన్‌ను అడియాలా జైలు నుంచి ఆస్పత్రికి తరలించామంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు'అంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత కూడా అయిన ఇమ్రాన్ ఖాన్ వివిధ అవినీతి ఆరోపణలు, ఉగ్రవాదం కేసుల్లో 2023 ఆగస్ట్ నుంచి, జైలు జీవితం గడుపుతుండటం తెల్సిందే.

బహు భార్యత్వం నిషేధం బిల్లుకు అసోం అసెంబ్లీ ఆమోదం

గౌహతి: బహుభార్యత్వాన్ని నిషేధిస్తూ అసోం అసెంబ్లీ గురువారం ఒక బిల్లును ఆమోదించింది. ఒకరి కంటే ఎక్కువ మందిని వివాహమాడిన వారికి గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఇందుకు కొన్ని మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, రాష్ట్రంలో ఆరో షెడ్యూల్ అమల్లో ఉన్న గిరిజన ప్రాంతాలకు ఇది వర్తించదని తెలిపింది. అసోం ప్రొహిబిషన్ ఆఫ్ పాలిగమీ బిల్లు–2025ను గురువారం హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం హిమంత బిశ్వ శర్మ ప్రవేశపెట్టారు. ఇందులో మతంతో సంబంధం లేదని, ఇస్లాంకు వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలతోపాటు ఇతర అన్ని వర్గాలకు ఇది వర్తిస్తుందన్నారు. ఈ బిల్లున ఉమ్మడి పౌర స్మృతి దిశగా పడిన ముందడుగుగా అభివర్ణించారు.

అమెరికాపై ఉగ్రదాడి!

వైట్‌హౌస్ సమీపంలో అఫ్గాన్ యువకుడి కాల్పులు

- ఇద్దరు వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డు జవాన్లకు గాయాలు
- ఎదురు కాల్పుల్లో గాయపడి ప్రాణాలతో చిక్కిన నిందితుడు
- ఇది ముమ్మాటికీ ఉగ్రవాద దాడేనన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- అమెరికాలోని అఫ్గాన్ జాతీయులపై విచారణ జరపాలని ఆదేశం
- అఫ్గాన్ పౌరుల ఇమిగ్రేషన్ దరఖాస్తులను రద్దు చేయాలని స్పష్టీకరణ

వాషింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే అధ్యక్షుడి అధికారిక నివాస భవనం వైట్‌హౌస్ సమీపంలోనే కాల్పుల మోత మోగింది. అమెరికాకు వలసవచ్చిన అఫ్గానిస్తాన్ యువకుడు జరిపిన కాల్పుల్లో ఇద్దరు వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డు జవాన్లు సారా బెక్‌స్ట్రామ్(20), ఆండ్రూ వూల్ఫ్(24) తీవ్రంగా గాయపడ్డారు. జవాన్లలో ఒకరు జరిపిన ఎదురు కాల్పుల్లో సదరు యువకుడు సైతం గాయాలపాలయ్యాడు. అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రతిఏటా శ్వేతసౌధంలో ఘనంగా నిర్వహించే కృతజ్ఞతార్పణ దినానికి ముందురోజే కాల్పులు జరగడం, ఇద్దరు జవాన్లు క్షతగాత్రులుగా మారడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటన పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ఉగ్రవాద దాడేనని తేల్చిచెప్పారు. జో బైడెన్ హయాంలో అమెరికాకు వలసవచ్చిన అఫ్గాన్ జాతీయుల కార్యకలాపాలపై విచారణ జరపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అఫ్గాన్ పౌరుల ఇమిగ్రేషన్ దరఖాస్తులను వెంటనే రద్దు చేయాలని తేల్చిచెప్పారు. ఇది మొత్తం అమెరికాకు వ్యతిరేకంగా జరిగిన నేరంగానే భావిస్తున్నామని ట్రంప్ వ్యాఖ్యానించారు. తమ దేశాన్ని ప్రేమించనివారు తమకు ఎంతమాత్రం అవసరం లేదని స్పష్టంచేశారు.

అసలేం జరిగింది?

శ్వేతసౌధంలో జరిగే 'థ్యాంక్స్ గివింగ్ డే' కోసం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రంప్ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ జనం నిరసన వ్యక్తంచేసే అవకాశం ఉందన్న అనుమానంతో ముందు జాగ్రత్త చర్యగా ఇతర రాష్ట్రాల నుంచి నేషనల్ గార్డు సిబ్బందిని రప్పించారు. శ్వేతసౌధం చుట్టుపక్కల మోహరించారు. ఇక్కడికి సమీపంలోనే మెట్రో స్టేషన్ వద్ద బుధవారం మధ్యాహ్నం విధి నిర్వహణలో ఉన్న వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డు సిబ్బందిపై ఓ యువకుడు పాయింట్ 357 స్మిత్ అండ్ వెసన్ రివాల్వర్‌తో హఠాత్తుగా కాల్పులు జరిపాడు. మొత్తం ముగ్గురు జవాన్లపై కాల్పులు జరిగాయి. ఇద్దరు తీవ్రంగా గాయపడగా, మరో జవాను స్వల్పంగా గాయపడ్డాడు. అతడు వెంటనే స్పందించి, అఫ్గాన్ యువకుడిపై ఎదురు కాల్పులు ప్రారంభించాడు. తీవ్రస్థాయిలో గాయాలపాలైన ఇద్దరు జవాన్లను ఆసుపత్రికి తరలించారు. ఎదురు కాల్పుల్లో గాయపడిన అఫ్గాన్ యువకుడు భద్రతా సిబ్బంది చేతికి ప్రాణాలతో చిక్కాడు. అతడిని రహ్మానుల్లా లఖన్‌వాలా(29)గా గుర్తించారు.

కాల్పుల అనంతరం వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్ వద్ద అప్రమత్తంగా ఉన్న సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు

ఎవరీ రహ్మానుల్లా?

రహ్మానుల్లా లఖన్‌వాలా అఫ్గానిస్తాన్ జాతీయుడు. అక్కడే పుట్టిపెరిగాడు. 2021లో జో బైడెన్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక కారుణ్య పథకం కింద తన కుటుంబంతో కలిసి అమెరికాకు చేరుకున్నాడు. అప్పట్లో అమెరికా సైన్యం అఫ్గానిస్తాన్ నుంచి ఉపసంహరించుకుంది. స్వదేశానికి తిరిగివచ్చింది. తాలిబన్ల కారణంగా తమ ప్రాణాలకు ముప్పు ఉందంటూ వేలాది మంది అఫ్గాన్లు కూడా శరణార్థుల రూపంలో అమెరికా చేరారు. జో బైడెన్ ప్రభుత్వం వారిని స్వాగతించింది. ఆ సమయంలో దాదాపు 76,000 మంది అఫ్గాన్ పౌరులు అమెరికాకు వలసవచ్చినట్లు అంచనా. వీరంతా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. కొందరు అమెరికా సైన్యంలోనే అనువాదకులుగా పనిచేస్తున్నారు. రహ్మానుల్లా తన భార్య, ఐదుగురు సంతానంతో కలిసి వాషింగ్టన్ రాష్ట్రంలోని బెల్లింగ్‌హామ్ అనే ప్రాంతంలో స్థిరపడినట్లు తెలుస్తోంది. అతడు రాజధానికి వచ్చి, జవాన్లపై ఎందుకు కాల్పులు జరిపాడన్నది అంతుబట్టడం లేదు.

అనుమానాలు ఎన్నెన్నో..

ఇటీవలి కాలంలో భారత్, అఫ్గానిస్తాన్ మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. తాలిబన్ పాలకులు భారత్‌కు స్నేహహస్తం అందిస్తున్నారు. కలిసి పనిచేస్తామని చెబుతున్నారు. మరోవైపు పాకిస్తాన్ ప్రభుత్వం, తాలిబన్ పాలకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. అఫ్గాన్–పాక్ సరిహద్దుల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో అఫ్గాన్ యువకుడు అమెరికాలో కాల్పులు జరపడం, అధ్యక్షుడు ట్రంప్ అఫ్గానిస్తాన్‌పై కత్తి నూరుతుండడం చర్చనీయాంశంగా మారింది. తమను అప్రతిష్టపాలు చేయడానికి పాక్ ప్రభుత్వం కుట్రలు సాగిస్తోందని, వాషింగ్టన్ డీసీలో జరిగిన కాల్పులతో తమకు ఎలాంటి సంబంధం లేదని తాలిబన్లు తేల్చిచెప్పారు. ఈ ఘటన వెనుక పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ హస్తం ఉండొచ్చని వారు అనుమానం వ్యక్తంచేశారు. ఇదిలా ఉండగా, డొనాల్డ్ ట్రంప్ ఇటీవలి కాలంలో తన వ్యక్తిగత వ్యాపార ప్రయోజనాల కోసం పాకిస్తాన్‌ను బాగా ముద్దు చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి విషయంలోనూ ఆయన పాకిస్తాన్‌ను వెనకేసుకొస్తున్నారు. పాక్ ప్రత్యర్థి అయిన అఫ్గానిస్తాన్‌పై మళ్లీ దాడులకు ట్రంప్ కసరత్తు చేస్తున్నారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. తాజా కాల్పుల ఘటనను సాకుగా చూపించి, అఫ్గాన్‌పై పెద్ద ఎత్తున విరుచుకుపడినా ఆశ్చర్యం లేదని నిపుణులు అంటున్నారు.

ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణకు స్వతంత్ర వ్యవస్థ

- స్వీయ నియంత్రణ సరిపోదు.. అది విఫలమైంది కూడా
- అశ్లీల, వికృత పోకడలను అడ్డుకునేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరం
- యూట్యూబ్, ఓటీటీ కంటెంట్‌పై సుప్రీం వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ: ఆన్‌లైన్ వేదికలు, సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడిగా వస్తున్న అశ్లీల, అసభ్యకర కంటెంట్‌పై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు పాటిస్తున్నామని చెబుతున్న స్వీయ నియంత్రణ విధానం పూర్తిగా విఫలమైందని, అసలు అది ఓ బూటకమని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ అరాచకాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వ ప్రమేయం లేని, మీడియా సంస్థల ప్రభావం లేని ఒక అత్యంత శక్తివంతమైన 'స్వతంత్ర, తటస్థ స్వయం ప్రతిపత్తి'కలిగిన వ్యవస్థ అత్యవసరమని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం స్పష్టం చేసింది. 'ఇండియాస్ గాట్ లేటెంట్'అనే షోలో అశ్లీల కంటెంట్, దివ్యాంగులను కించపరిచేలా జోకులు వేశారన్న ఆరోపణలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను సవాల్ చేస్తూ పాడ్‌కాస్టర్ రణవీర్ అల్హాబాదియా తదితరులు చేసిన పిటిషన్ల విచారణ సందర్భంగా గురువారం ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది.

వికృత పోకడలు..

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. సమస్య కేవలం అశ్లీలతకే పరిమితం కాలేదని, యూజర్ జనరేటెడ్ కంటెంట్ పేరుతో వికృత పోకడలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన సీజేఐ.. 'ఎవరికి వారే సొంత చానల్స్ క్రియేట్ చేసుకుంటున్నారు. ఎవరికీ జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సిందే కదా. నేను ఎవరికీ జవాబుదారీ కాదంటే ఎలా కుదురుతుంది? సమాజంలో విషం చిమ్ముతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సిందే. అడిగే వారు లేరని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే చట్టం ఒప్పుకోదు'అని స్పష్టం చేశారు. వాక్‌స్వాతంత్ర్యం అమూల్యమైనదే కానీ, అది వికృత పోకడలకు దారితీయకూడదని సొలిసిటర్ జనరల్ పేర్కొన్నారు. అడల్ట్ కంటెంట్ ఉంటే కనీసం ముందస్తు హెచ్చరికలైనా ఉండాలని సీజేఐ అభిప్రాయపడ్డారు.

స్వయం ప్రకటిత సంస్థలతో పనికాదు

నెట్‌ఫ్లిక్స్ వంటి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల తరఫున సీనియర్ న్యాయవాది అమిత్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే ఐటీ రూల్స్–2021 అమల్లో ఉన్నాయని, జస్టిస్ గీతా మిట్టల్ నేతృత్వంలో స్వీయ నియంత్రణ వ్యవస్థ పనిచేస్తోందని తెలిపారు. దీనిపై సీజేఐ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'స్వయం ప్రకటిత సంస్థల వల్ల ప్రయోజనం లేదు. ఒకవేళ మీ స్వీయ నియంత్రణ అంత గొప్పగా ఉంటే, ఉల్లంఘనలు ఎందుకు పదేపదే జరుగుతున్నాయి?'అని ప్రశ్నించారు. వాణిజ్య ప్రయోజనాల కోసం పనిచేసే వారి ప్రభావం లేని, ప్రభుత్వానికి కూడా సంబంధం లేని ఒక తటస్థ వ్యవస్థ ద్వారానే నియంత్రణ సాధ్యమని సీజేఐ స్పష్టం చేశారు.

త్వరలో నూతన మార్గదర్శకాలు: కేంద్రం

ఆన్‌లైన్ కంటెంట్ నియంత్రణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను ప్రతిపాదిస్తోందని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. ముసాయిదా మార్గదర్శకాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచి, ప్రజలు, నిపుణుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని సూచించింది. అనంతరం న్యాయరంగ నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని పేర్కొంది. కేసుపై తదుపరి విచారణను ధర్మాసనం నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఎరువుల కోసం రెండు రోజులు ఎదురుచూసి..

క్యూలోనే ప్రాణాలు విడిచిన గిరిజన మహిళా రైతు

గుణ: గిరిజన మహిళా రైతు ఒకరు పంట పొలానికి అవసరమైన ఎరువుల కోసం దుకాణం వద్ద ఏకంగా రెండు రోజులపాటు క్యూలో ఉండాల్సి వచ్చింది. ఆ క్రమంలో క్యూలో ఉండగానే ఆమె ప్రాణాలు విడిచారు. ఈ దారుణం మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. కుషెపూర్ గ్రామానికి చెందిన భురియా బాయి (58) మంగళవారం ఉదయం నుంచి ఏకబిగిన లైన్‌లో ఉన్నారు. రాత్రంతా ఆమె అక్కడే ఉండిపోయారని కుటుంబసభ్యులు తెలిపారు. అయితే, మధుమేహంతో బాధపడుతున్న భురియా బాయి బుధవారం రాత్రి వాంతులు చేసుకోవడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం అందజేస్తామని గుణ ఎంపీ, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. మహిళా రైతు మరణానికి దారి తీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టిన నివేదిక ఇవ్వాలని అధికారులను ఆయన ఆదేశించారు.

సాక్షి గుంటూరు

శుక్రవారం । 28 । నవంబర్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం గురువారం 582.00 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 15,272 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2100 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు రెండు వేల క్యూసెక్కులు వదులుతున్నారు.

గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం

భట్టిప్రోలు: బ్రహ్మ విద్యాశ్రమంలో 51వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు కేంద్ర ఆర్థిక మంత్రి రాక

తాడికొండ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం రాజధానికి రానున్నారు. ఈ నేపథ్యంలో భద్రత, బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌లు తెలిపారు. తుళ్లూరు పరిధిలోని నేలపాడు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం 15 జాతీయ బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణం కోసం కేటాయించిన భూమిలో శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆ ఏర్పాట్లను వారు పరిశీలించారు. కేంద్ర మంత్రి శంకుస్థాపన కార్యక్రమం అనంతరం ఏపీ సీఆర్డీఏ కాన్ఫరెన్స్ హాల్లో పలు శాఖల అధికారులతో నిర్వహించనున్న ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో కలిసి హాజరు కానున్నారని అధికారులు తెలిపారు.

తెలుగు మహాసభలకు ఆహ్వానం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జనవరి 3, 4, 5 తేదీల్లో గుంటూరు నగరంలో జరగనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహను ఆహ్వానించినట్లు పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం జస్టిస్ శ్రీ నరసింహను ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసిన గజల్ శ్రీనివాస్ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాసభల ప్రారంభోత్సవానికి సతీసమేతంగా వచ్చేందుకు న్యాయమూర్తి అంగీకరించారని తెలిపారు.

పీజీ పరీక్షల షెడ్యూల్‌లో మార్పులు

సాక్షి ఎఫెక్ట్

ఏఎన్‌యూ (పెదకాకాని): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం ఆధ్వర్యంలో జరగనున్న పీజీ పరీక్షల షెడ్యూల్లో మార్పులు చేపట్టినట్లు గురువారం పరీక్షల నిర్వహణ అధికారి శివప్రసాదరావు తెలిపారు. ఏఎన్‌యూలో స్పాట్ అడ్మిషన్‌లు జరగకుండానే మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు షెడ్యూల్ ప్రకటించిన సీఈఓ పేరుతో ఈ నెల 26వ తేదీన సాక్షిలో కథనం వెలువడింది. దీంతో సీఈఓ ఆలపాటి మాట్లాడుతూ అన్ని పరీక్ష పేపర్లకు ఫీజు రూ.980 చొప్పున డిసెంబర్ 1వ తేదీలోగా చెల్లించాలన్నారు. పరీక్షలు డిసెంబర్ 8వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ప్రకటించిన నోటిఫికేషన్ రద్దు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సూచన మేరకు పీజీ పరీక్షలు జరిగే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

ఫైరింగ్ సమయంలో వేటకు వెళ్లొద్దు

బాపట్ల టౌన్: ఎయిర్‌ఫోర్స్ అధికారులు ఫైరింగ్ చేసే సమయంలో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. గురువారం బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బాపట్ల మండలం సూర్యలంక, పాండురంగాపురం గ్రామాల్లో మత్స్యకారులు ఈ నెల 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు వేటకు వెళ్లరాదన్నారు. సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ నుంచి మిస్సైల్ ఆపరేషన్ జరుగుతుందని వివరించారు.

టైప్ రైటింగ్ పరీక్షల తేదీల్లో మార్పు

రేపల్లె: రాష్ట్ర సాంకేతిక విద్యామండలి టైప్ రైటింగ్ పరీక్షల తేదీలను జనవరి 31, ఫిబ్రవరి 1వ తేదీలకు మార్పు చేసినట్లు ఏపీ టైప్ రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇనిస్టిట్యూట్స్ స్టేట్ గౌరవాధ్యక్షుడు సీవీ మోహనరావు గురువారం తెలిపారు. నవంబర్ 13న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వచ్చే జనవరి 31వ తేదీ మాత్రమే పరీక్ష నిర్వహించనున్నట్లు సూచించటంతో తమ ప్రతినిధులు అధికారులను సంప్రదించగా ఈ మార్పు చేశారని చెప్పారు.

అధికారంలో ఉన్నారని తెలుగుదేశం నేతలకు, వారి సంబంధీకులకు లబ్ధి చేకూర్చేందుకు గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ మేరకు కోడెల అల్లుడికి ఆయాచిత లబ్ధి చేకూర్చేందుకు పావులు కదిలాయి. ఎప్పుడో పదేళ్ల క్రితం కట్టిన ఆసుపత్రి భవనాల కొలతలు ఇప్పుడు మారాయి. ఆస్తిపన్ను రూ.లక్షల్లో తగ్గిపోయింది. ఇటు టీడీపీ వారు, అటు అధికారులు ప్రజాధనం పట్టపగలే దోచుకునేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదు.

కోడెల అల్లుడికి కార్పొరేషన్ నజరానా

- కోడెల అల్లుడికి చెందిన హాస్పిటల్‌కు పన్ను తగ్గింపు
- నిబంధనలు తుంగలో తొక్కి పన్ను రివిజన్
- తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక అర్జీ
- ఆగమేఘాలపై అధికారుల నిర్ణయం
- లాలాపేటలో కమర్షియల్ కాంప్లెక్స్‌కు కూడా పన్ను తగ్గింపు

సాక్షి ప్రతినిధి, గుంటూరు, నెహ్రూనగర్: మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ అల్లుడికి కార్పొరేషన్ నజరానా అందించింది. శివప్రసాద్ అల్లుడికి చెందిన హాస్పిటల్‌కు సంబధించిన ఆస్తి పన్నును ఆరు నెలలకు సుమారు రూ. 2,69,519 లక్షల వరకు తగ్గించి తమ స్వామి భక్తిని అధికారులు చాటుకున్నారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం ఆస్తి పన్నులు పెంచే కార్యక్రమాలను చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కానీ రివిజన్ పిటిషన్ పేరుతో పన్నును ఏకంగా రూ.లక్షల్లో కార్పొరేషన్ అధికారులు తగ్గించడం గమనార్హం.

రూ. రెండున్నర లక్షలకుపైనే..

గుంటూరు నగరంలో కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ వద్ద కోడెల శివప్రసాద్ అల్లుడికి చెందిన ఓ హాస్పిటల్ ఉంది. సిల్ట్, సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మరో నాలుగు ఫ్లోర్లు ఉన్న ఈ భవనానికి ఆరు నెలల కాలానికి సుమారు రూ.4.50 లక్షల వరకు ఆస్తిపన్ను ఉంది. కొద్ది సంవత్సరాలుగా పన్ను కడుతూ వచ్చారు. ఇప్పుడు సెల్లార్, సిల్ట్ కొలతలు తప్పు ఉన్నాయని, నాలుగో అంతస్తులో తాము నివాసం ఉంటున్నామని పిటిషన్ పెట్టుకున్నారు. ఇది సాధ్యం కాదని అధికారులు తిరస్కరించారు. మళ్లీ దరఖాస్తు చేసుకోగా చట్టం అనుమతించకపోయినా మళ్లీ కొలతలు వేసి పన్ను తగ్గించేయడం వివాదాస్పదంగా మారింది. వేసినవి కూడా కాకి లెక్కలుగా ఉన్నాయి. సెల్లారు, సిల్ట్‌కు చదరపు అడుగు విలువ కేవలం రూ.900గా చూపించగా, పై అంతస్తులకు సుమారు రూ.1,400 మాత్రమే చూపించి ఆస్తి విలువ గణనీయంగా తగ్గించేశారు. దీని ఆధారంగా పన్ను తగ్గించేశారు. గతంలో రూ.4,58,772 ఉన్న ఆస్తి పన్ను ఇప్పుడు ఏకంగా రూ.1,89,253 కు తగ్గించేశారు. ఈ సంవత్సరంలో పన్ను తగ్గించమని కోరిన వెంటనే ఎటువంటి పిటిషన్ లేకుండానే కార్పొరేషన్ కార్యాలయం సిబ్బంది వెళ్లి కొలతలు పరిశీలించి పన్నును తగ్గించడం గమనార్హం.

పదేళ్ల తర్వాత మారిన కొలతలు

సాధారణంగా ఒక ఆస్తి పన్నును తగ్గించాలంటే రెవెన్యూ సిబ్బంది ఎన్నో కొర్రీలు పెట్టి దానిని తగ్గించకపోగా.. పన్నును పెంచే ప్రయత్నాలు చేస్తుంటారు. ఇక్కడ మాజీ స్పీకర్, టీడీపీ నాయకులు కోడెల శివప్రసాద్‌కు చెందిన అల్లుడి హాస్పిటల్ కావడంతో ఆగమేఘాలపై పన్నును తగ్గించేశారు. దశాబ్దానికిపైగా పన్ను చెల్లిస్తుండగా, ఇప్పుడు రివిజన్ పిటిషన్ పేరుతో ఎలా తగ్గించారన్నది ఇక్కడ ప్రశ్న. అప్పట్లో భవనానికి ఇప్పుడు కొలతలు ఎలా తగ్గిపోయాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై మున్సిపల్ అదనపు కమిషనర్ చల్లా ఓబులేశును 'సాక్షి' వివరణ అడగగా, సదరు ఆసుపత్రి యాజమాన్యం రివ్యూ పిటిషన్ ప్రకారం కొలతలు వేయగా, మార్కెట్ విలువలను బట్టి పన్నులను సరిచేశామని వివరణ ఇచ్చారు.

కమర్షియల్ కాంప్లెక్స్‌కూ..

లాలాపేట మెయిన్‌రోడ్డులో ఓ కమర్షియల్ కాంప్లెక్స్‌కు రూ. రెండు లక్షల వరకు పన్ను ఉంది. దానిని కూడా రూ.90 వేల వరకు తగ్గించేశారు. రివిజన్ పిటిషన్ పేరుతో నగరంలో పదుల సంఖ్యలో పన్నులు తగ్గించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర అభివృద్ధికి ఆస్తి పన్నులే కీలకం. వాటి ద్వారానే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటారు. ఇలా తమకు అనుకూలమైన వారికి రూ.లక్షల్లో పన్నులు తగ్గించుకుంటూ పోతే కార్పొరేషన్‌కు ఆదాయం ఎలా పెరుగుతుందని కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. నగరంలోని ఒక ప్రముఖ హోటల్‌కు కూడా ఎటువంటి మ్యుటేషన్ చార్జీలు వసూలు చేయకుండానే కంపెనీ పేరు మార్పునకు అంగీకారం తెలిపినట్లు సమాచారం.

కొండెక్కిన గుడ్డు

- రోజుల వ్యవధిలో రూ. 5.50 నుంచి రూ.8కి పెరిగిన ధర
- ఉత్పత్తి తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు

తాడేపల్లి రూరల్: విద్యార్థులు, చిన్నారులకు ఎక్కువగా అందించే ఆహారమైన కోడిగుడ్డు ధర రోజుల వ్యవధిలోనే రూ. 5.50 నుంచి రూ.8కి పెరిగింది. 15 రోజుల క్రితం హోల్‌సేల్ దుకాణంలో 30 కోడిగుడ్లు కలిగిన ట్రే ధర రూ. 165 ఉండగా.. రూ. 210కి చేరింది. రిటైల్ దుకాణాల్లో ఒక గుడ్డు రూ. 7.50కి అమ్ముతున్నారు. గత 15 రోజుల్లో వ్యాపారుల వద్దకు ఒక ట్రే వచ్చేసరికి రూ. 45 పెరిగింది. గతంలో చిల్లర దుకాణాల్లో గుడ్డు రూ. 6కు అమ్మగా, ప్రస్తుతం రూ.7.50 నుంచి రూ. 8 వరకు అమ్ముతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గుడ్ల రేటు పెరిగిందని, గత సంవత్సరం ఫారాల్లో కోళ్లకు వివిధ వ్యాధులు రావడంతో వేల సంఖ్యలో చనిపోవడమే దీనికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. తమ పిల్లలకు గుడ్డు కూడా పెట్టుకునే పరిస్థితిలో లేమని పేదలు వాపోతున్నారు.

ఎప్పుడూ ఇంతలా పెరగలేదు

గతంలో ఎప్పుడూ గుడ్ల ధర ఇంతలా పెరగడం చూడలేదు. ఫారం నుంచి గుడ్లు తెచ్చే వ్యాపారస్తులు ఇంకా రేటు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం ట్రే రూ. 210 ఉంది. మరో వారంలో రూ. 220 అవుతుందని చెబుతున్నారు. రోజూ 15 ట్రేలు అమ్మేవాళ్లం. రేటు పెరిగిన తరువాత 7 నుంచి 9 ట్రేల వరకు అమ్ముతున్నాం.

– హరీష్, వ్యాపారి, ఉండవల్లి సెంటర్

సజావుగా ధాన్యం కొనుగోలు చేయాలి

– జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు వెస్ట్: జిల్లాలో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు సజావుగా కొనసాగేలా వ్యవసాయ, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో వరి కోతలు పూర్తిస్థాయిలో ప్రారంభమైనందున రైతులకు ఇబ్బంది లేకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల అంచనాల ప్రకారం రానున్న వారం రోజుల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు సరిపడా గన్నీ బ్యాగులు, వాహనాలను పౌర సరఫరాల అధికారులను సమన్వయం చేసుకుంటూ తహసీల్దార్లు అందుబాటులో ఉంచాలన్నారు. దళారులకు మద్దతు ధరకు కంటే తక్కువగా ధాన్యం అమ్మకాలు జరగకుండా క్షేత్రస్థాయిలో వ్యవసాయ సహాయకులతో నిరంతరం జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించాలన్నారు. వానలు పడతాయనే అధికారుల సూచన మేరకు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు వీలుగా వారికి తగిన సాయం అందించాలని సూచించారు. ధాన్యం సక్రమంగా కొనాలని పేర్కొన్నారు.

సమాజ సేవకుడు డీకే రావుకు అవార్డు

దుర్గాకామేశ్వరరావుకు సేవాజ్యోతి అవార్డును అందజేస్తున్న ఎం.వెంకయ్య నాయుడు

తెనాలి అర్బన్: ఎందరో పేదల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ పెమ్మరాజు దుర్గాకామేశ్వరరావుకు సేవాజ్యోతి అవార్డు ప్రదానోత్సవం కనులపండువగా జరిగింది. గుంటూరు జిల్లా తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గురువారం ఉదయం ఏర్పాటైన సభలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతులమీదుగా ఈ అవార్డును బహూకరించారు. సభకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. మాజీ ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ సమాజంలో మార్పు ప్రభుత్వాల వల్ల సాధ్యపడదని, ఎక్కువ మంది సంఘ సేవకులు ముందుకు వస్తేనే అది సాకారం కాగలని అభిప్రాయపడ్డారు. సమాజానికి సేవ చేయాలనే తపన అందిరిలో రావాలన్నారు. అమెరికా అందరూ వెళ్లాలని, అక్కడ డబ్బులు సంపాదించిన తర్వాత స్వదేశానికి వచ్చి ఇక్కడ సేవ చేయాలని పేర్కొన్నారు. ఇదే ఫార్ములాను డాక్టర్ పీడీకే రావు పాటించి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నాంది పలికారని కొనియాడారు. దేశంలో ఇంకా 18 శాతం నిరక్షరాస్యత ఉందని, దానిని పూర్తిగా రూపుమాపేందుకు అందరు కృషి చేయాలన్నారు.

తెలుగు జాతిగా అభివృద్ధి సాధించాలి

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కుల, మత ప్రాంతాలకు అతీతంగా అందరు ఎదగాలని పేర్కొన్నారు. అప్పుడే తెలుగు జాతి అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కళల కాణాచిగా పేరొందిన తెనాలిలో సేవాతత్పరులు డాక్టర్ పీడీకే రావుకు సేవా జ్యోతి పురస్కారాన్ని అందించటం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. అవార్డు గ్రహీత మాట్లాడుతూ తాను విజయవాడలో జన్మించానని, పదకొండేళ్లు అమెరికాలో ఉన్నానని తెలిపారు. అనంతరం చీపురపల్లి వచ్చి అన్యాక్రాంతంలో ఉన్న దళితుల భూములను న్యాయపోరాటం ద్వారా వారికి అప్పగించానని తెలిపారు. అలాగే దళితులు, బీసీలకు గృహాలు కూడా తన సంస్థ ద్వారా నిర్మించామని చెప్పారు. సమాజంలో మార్పు రావాలని, యువత ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. తొలుత పీడీకే రావుపై రూపొందించిన డాక్యుమెంటరీ వీడియో, పరిచయ సంచికను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాది కె. ఇంద్రనీల్ బాబు, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ అధినేత మునగాల మోహన్ శ్యాంప్రసాద్, కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడారు. నిర్వాహక రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం, తెనాలి ప్రచురణల బాధ్యులు నల్లూరి వెంకటేశ్వరరావు, చిలువూరు సురేష్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎండుతున్న పంటలు

ఎండుతున్న పంటలను పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట రూరల్: కాలువ మరమ్మతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కుప్పగంజి వాగు మళ్లింపు పథకంలోని వందల ఎకరాల చివరి భూములకు నీరు అందక పంటల ఎండిపోయే దశలో ఉన్నాయి. ఎండుతున్న పంటలను రక్షించుకునేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పంట కాలువ మరమ్మతు పనులు చేపట్టారు. కుప్పగంజి వాగు నీటి మళ్లింపు కాలువ పరిధిలో మండలంలోని కేఎం అగ్రహారం, గుంటగార్లపాడు, రంగారెడ్డిపాలెం, ములకలూరు, జొన్నలగడ్డ తదితర గ్రామాల్లో సుమారు 700 ఎకరాలు సాగులో ఉంది.

ఏళ్లతరబడి మరమ్మతులు లేవు...

కేఎం అగ్రహారం నుంచి ప్రారంభమయ్యే కాలువ గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోలేదు. కాలువ పూడికతో నిండిపోవడంతో చివరి భూములకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మిరప, మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. మిరప రైతులు ఎకరాకు రూ.50 వేలు, మొక్కజొన్న రైతులు ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి పెట్టారు. పంటలు ఎండిపోతున్నా అధికారుల్లో చలనం లేకపోవడంతో రైతులు కాలువ మరమ్మతు చేపట్టారు. జేసీబీతో పూడికతీత ప్రారంభించారు. కౌలు రైతు సంఘం జిల్లానాయకులు కామినేని రామారావు, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు కొరిటాల గోపాలరావు, కృష్ణారెడ్డి తదితరులు పంటలను పరిశీలించారు.

అపూర్వ సాయం

- గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి విరివిగా విరాళాలు
- ఏడాదిలో రూ. 7.50 కోట్లతో పలు పనులు
- చొరవ తీసుకున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి
- కళాశాల రూపురేఖలు మార్చిన పూర్వ విద్యార్థులు

నూతనంగా నిర్మించిన రహదారి

ఆధునికీకరించిన గెస్ట్ ఫ్యాకల్టీ భవనం

బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ (ఫైల్)

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తమవంతు సాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలో గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగాన్ని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్ది, ఇప్పుడు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా వచ్చిన డాక్టర్ సుందరాచారి కళాశాల అభివృద్ధిపై దృష్టి సారించారు. కళాశాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.7.50 కోట్లతో అభివృద్ధి పనులు చేయించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ, డీఎంఈ, ఇతర ఉన్నతాధికారులు సైతం మెచ్చుకునేలా తీర్చిదిద్దారు.

నాడు గుంటూరు జీజీహెచ్‌లో...

సుందరాచారి గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో ఒకేసారి నాలుగు పీజీ సీట్లు వచ్చేలా చేశారు. పలుమార్లు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో, డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పీజీ పరీక్ష ఫలితాల్లో ఆయన మార్గదర్శకంలో పీజీ వైద్యులు సత్తా చాటారు. ఉమ్మడి ఏపీలో ఎక్కడా లేనివిధంగా గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వార్డులో బ్రెయిన్ స్ట్రోక్ బాధితుల కోసం చిలకలూరిపేటకు చెందిన ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ, గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ కోయ రామకోటేశ్వర రావు, రోటరీ క్లబ్ ఆఫ్ అమెరికా సహాయంతో రూ. కోటితో 2015లో స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేయించారు. స్లీప్‌ల్యాబ్‌ను సైతం నాట్కో ఫార్మా సహాయంతో 2017లో అందుబాటులో తెచ్చారు. 2018 జూన్‌లో న్యూరాలజీ వైద్య విభాగానికి ఐఎస్ఓ గుర్తింపు వచ్చేలా కృషి చేశారు. ఉత్తమ బోధనకు 2023లో స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నారు. 2022లో ఫెలో ఆఫ్ ది అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీగా ఎంపికయ్యారు.

కళాశాల అభివృద్ధిపై దృష్టి

ప్రిన్సిపాల్ చొరవతో గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, ఆయన మిత్రులు రూ. 80 లక్షల విరాళంతో రెండు బస్సులు అందించారు. హాస్టళ్లలో క్రికెట్, షటిల్, టెన్నిస్ తదితర క్రీడా మైదానాలు, సామగ్రిని మరికొందరు దాతలు ఇచ్చారు. అంతర్గత రోడ్లను 1998 బ్యాచ్ పూర్వ వైద్య విద్యార్థి డాక్టర్ నలమోతు శరత్‌చంద్రకుమార్ తన తల్లి శైలజకుమారి జ్ఞాపకార్థం ఇచ్చిన రూ. 6 లక్షల విరాళంతో నిర్మించారు. కళాశాల ప్రధాన ద్వారాన్ని పూర్వ వైద్య విద్యార్థి డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్ ఇచ్చిన రూ. 7 లక్షలతో నిర్మించారు. ప్రముఖ స్పైయిన్ సర్జన్, గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థి డాక్టర్ జె.నరేష్‌బాబు కుటుంబం రూ. 25 లక్షలు, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి రూ. 10 లక్షలు, డాక్టర్ శారద రూ. 6 లక్షల విరాళం ఇవ్వడంతో కళాశాలలో క్యాంటీన్ ఏర్పాటు చేశారు. 1980 బ్యాచ్‌కు చెందిన పూర్వ వైద్య విద్యార్థులు రూ. 60 లక్షలు విరాళం ఇవ్వడంతో పలు లెక్చర్ గ్యాలరీలను ఆధునికీకరించారు. దాతల సహాయంతో రూ. 10 లక్షలతో ఎగ్జామినేషన్ హాలు ఏర్పాటు చేశారు. వాటర్ కూలర్లు, పలు విభాగాల ఆధునికీకరణ పనులకు పలువురు దాతల సహకరించారు. కళాశాలలో విద్యుత్ వ్యవస్థ మెరుగు, గ్రీన్ మ్యాట్ ఏర్పాటు, చెట్ల సంరక్షణ, గెస్ట్ ఫ్యాకల్టీ భవనం ఆధునికీకరణ, లైబ్రరీ ఆధునికీకరణ, విగ్రహాలతోపాటు ఫౌంటేన్‌ల అభివృద్ధి, వైద్య విద్యార్థులకు, బోధనా సిబ్బందికి ప్రత్యేక వెల్‌నెస్ క్లినిక్‌ను ఏర్పాటు వంటివి చేయించారు.

దాతల సహాయం మరువలేనిది

కళాశాల అభివృద్ధికి దాతల సాయం మరువలేనిది. సంస్థను దేశంలో టాప్ పది కళాశాలల్లో నిలబెట్టడమే ధ్యేయంగా కృషి చేస్తున్నా. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పూర్వ వైద్య విద్యార్థులు, నగరానికి చెందిన పురప్రముఖులు ప్రోత్సహిస్తున్నారు. బోధనలోనూ, వసతుల్లోనూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా తీర్చిదిద్దుతా. మాతృ సంస్థకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉంది.

– డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, ప్రిన్సిపాల్

క్రీడారంగంలో ముందుకు తీసుకెళ్తాం

బాపట్ల టౌన్: క్రీడలకు ఎంతో అనువైన ప్రాంతాలున్న బాపట్ల జిల్లాను క్రీడా రంగంలో ముందుకు తీసుకెళ్లేదుకు కృషి చేస్తానని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భరణి తెలిపారు. క్రీడా మైదానాల పరిశీలనలో భాగంగా గురువారం బాపట్ల చేరుకున్న ఆమె తొలుత కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌ను కలిశారు. క్రీడాభివృద్ధిపై చర్చించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ కళాశాల క్రీడా మైదానం, బాపట్ల మినీ స్టేడియం, చీరాల ఇండోర్ స్టేడియం, హైదర్‌పేట ఓపెన్ స్థలం, వాటర్ స్పోర్ట్స్‌కి అనువైన నాగరాజు కాలువ, పాండురంగాపురం బీచ్, సూర్యలంక బీచ్, చీరాల ఓడరేవులను పరిశీలించారు. సంబంధిత క్రీడా నిపుణులకు పిలిపించి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. డీఎస్‌పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,400

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)

వచ్చిన బస్తాలు	35,654
అమ్మకాలు	33,916
నిల్వ	12,710

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,500
నంబరు–5	11,000–15,300
341	10,500–17,300

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	11,000–17,200
నంబరు–5	10,500–15,800
341	12,000–17,400
4884	12,000–14,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,600
బాడిగ–355	10,500 – 17,600
దేవనూరు డీలక్స్	11,000 – 17,000
ఆర్మూర్	10,000 – 13,700
తాలుకాయలు	5,200 – 8,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,500–15,300
బాడిగ – 355	11,000–17,700
దేవనూరు డీలక్స్	10,500–16,500
తాలు	5,200 – 8,000

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 719

కొమ్ములు : 466 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,000	12,700	12,500

కాయలు : 253 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,300	12,190	12,190

మొత్తం అమ్మకాలు : 539.25 క్వింటాళ్లు

–దుగ్గిరాల

సచివాలయ ఏఎన్ఎంలు
వైద్య ఆరోగ్య శాఖ విధులకు హాజరు కారు

ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు

ఎన్జీఓ నేతలకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఏఎన్ఎంలు

గుంటూరు మెడికల్: సచివాలయ ఏఎన్ఎంలకు కేవలం వైద్య ఆరోగ్య శాఖ విధులకు పరిమితం చేసేవరకు వారు వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి విధులకు హాజరు కారని ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. పలువురు సచివాలయ ఏఎన్ఎంలు ఏపీ ఎన్జీఓ నేతలను కలిసి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన ఏఎన్ఎంలకు ఇతర విధులు అప్పజెప్పవద్దనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటి అమలులో విఫలమవుతున్నట్లు వెల్లడించారు. ఏఎన్ఎం సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తాము అండగా ఉంటామన్నారు. గుంటూరు అర్బన్ సచివాలయాల పరిధిలోని ఏఎన్ఎంలు వారి విభాగంలోని విధులే కాకుండా, మున్సిపల్ కార్పొరేషన్కు సంబంధించిన అనేక సర్వేలు నిర్వహించాలని మున్సిపల్ అధికారులు ఒత్తిడి చేస్తున్నట్లు వెల్లడించారు. ఏఎన్ఎంలపై ఒత్తిడి తగ్గించడానికి డీఎంహెచ్ఓ జోక్యం చేసుకుని కేవలం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన విధులు మాత్రమే ఏఎన్ఎంలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని పలుమార్లు విన్నపాలు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈనేపథ్యంలో శుక్రవారం నుంచి సచివాలయ ఏఎన్ఎంలు వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన విధులకు హాజరు కారని ఘంటసాల శ్రీనివాసరావు వెల్లడించారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆరాధ్యుల శ్యామ్సుందర శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, కార్యదర్శి సి.హెచ్.కళ్యాణ్కుమార్, శ్రీధర్రెడ్డి, కృష్ణకిషోర్, అబ్దుల్ కరీం, శేషగిరిరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నగర అధ్యక్షుడు సూరి, కార్యదర్శి కళ్యాణ్కుమార్లను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

పీఆర్సీ కమిటీ త్వరగా ఏర్పాటు చేయాలి..

పీఆర్సీ కమిటీ త్వరగా ఏర్పాటు చేయాలని ఈహెచ్ఎస్ ద్వారా క్యాష్లెస్ ట్రీట్మెంట్ జరగాలని ఏపీ ఎన్జీజీఓ కార్యవర్గం తీర్మానించింది. ఈమేరకు గురువారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన నగరశాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. నూతనంగా ఎన్నికైన నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 20 ఈసీ సభ్యుల కో–ఆప్షన్ ఎన్నిక నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కార్యదర్శి సి.హెచ్. కళ్యాణ్కుమార్ ప్రవేశపెట్టిన అజెండా తీర్మానాలపై చర్చ నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాల ఏఎన్ఎంలకు కేవలం వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన విధులు మాత్రమే అప్పజెప్పేలా విధంగా జిల్లా, రాష్ట్ర నాయకత్వాలు ప్రభుత్వ దృష్టికి సమస్య తీసుకెళ్లాలని తీర్మానించారు. ఎన్జీవో సమాచారం, సభ్యత్వం పెంపొందించాలని, రావాల్సిన బకాయిలు, జీపీఎస్ సరెండర్ లీవుల గురించి చర్చించారు. నూతనంగా ఎన్నికైన నగర అధ్యక్ష, కార్యదర్శులను జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఆరాధ్యుల శ్యామ్సుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ తదితరులు అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు పోరాట పటిమతో నగర నూతన కార్యవర్గం ముందుకు వెళ్లాలని నేతలు సూచించారు.

'కిల్కారి' నంబరును గర్భిణుల ఫోన్లలో సేవ్ చేయాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

గుంటూరు మెడికల్: కిల్కారి కాల్ వచ్చే 911600403660 నంబరును గర్భిణులు, బాలింతల మొబైల్ ఫోన్లో తప్పనిసరిగా సేవ్ చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. అలా నంబరు సేవ్ చేసినప్పుడు మాత్రమే గర్భిణులు తమకు ఫోన్ వచ్చినప్పుడు లిఫ్ట్ చేసి సమాచారాన్ని వినగలుగుతారన్నారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో కిల్కారి సేవలపై సమీక్ష జరిగింది. సమీక్షలో డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కిల్కారి కాల్స్ అందరికీ రావాలంటే ఆర్సీహెచ్ పోర్టల్లో గర్భిణుల వివరాలు సకాలంలో, ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. కిల్కారి కాల్ వచ్చినప్పుడు పూర్తిగా సమాచారాన్ని వినే గర్భిణులు, బాలింతల సంఖ్యలో జిల్లాలో పెరిగేలా సూపర్వైజర్లు క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేయాలన్నారు. ఏఎంసీ, పీఎంసీ సేవలు హైరిస్క్ గర్భం సూచనలు, కుటుంబ నియంత్రణ పద్ధతులు, బర్త్ ప్లాన్, రక్తహీనత, ప్రమాదకరమైన లక్షణాలు, టీకాలు, ఇలా ప్రతి గర్భిణి, బాలింతకు కావాల్సిన ప్రాథమిక ఆరోగ్య సమాచారాన్ని కిల్కారి కాల్ ద్వారా పొందవచ్చన్నారు. కేంద్ర ప్రభుత్వం కిల్కారి కాల్ కార్యక్రమాన్ని గర్భిణి, బాలింతల కోసం ప్రవేశపెట్టిందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇ.అన్నపూర్ణ, ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డీహెచ్ఎస్ఓ ఇన్చార్జి డాక్టర్ కె.ప్రియాంక, రవికుమార్, సురేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెథాలజీలో యూనివర్సిటీ టాపర్గా డాక్టర్ సాయిశ్రావ్య

గుంటూరు మెడికల్: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ బుధవారం విడుదల చేసిన పీజీ వార్షిక పరీక్షా ఫలితాల్లో పెథాలజీలో గుంటూరు వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ వి.సాయిశ్రావ్య యూనివర్సిటీ టాపర్గా నిలిచింది. పరీక్షా ఫలితాల్లో 800 మార్కులకు 575 మార్కులతో యూనివర్సిటీ ప్రథమస్థానం సాధించింది. ఈ నేపథ్యంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి యూనివర్సిటీ టాపర్గా నిలిచిన సాయిశ్రావ్యను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ శ్రీధర్, పలువురు అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

అప్తమాలజీలో డాక్టర్ హర్షితా రెడ్డి...

డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ బుధవారం విడుదల చేసిన పీజీ వార్షిక పరీక్ష ఫలితాల్లో అప్తమాలజీలో (కంటి వైద్యం)లో గుంటూరు వైద్య కళాశాల అప్తమాలజీ వైద్య విద్యార్థిని డాక్టర్ హర్షితారెడ్డి యూనివర్సిటీ టాపర్గా నిలిచారు. పరీక్షా ఫలితాల్లో 800 మార్కులకు గాను 585 మార్కులు సాధించి యూనివర్సిటీ ప్రథమ స్థానం సాధించారు. డాక్టర్ హర్షితారెడ్డిని గురువారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి సత్కరించారు. వైద్యవిభాగాధిపతి డాక్టర్ రవిబాబు, ఇతర కంటి వైద్యులను డాక్టర్ సుందరాచారి అభినందించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు డాక్టర్ పి.ఎస్.శ్రీదేవి, డాక్టర్ శిరీష, డాక్టర్ సాధనరెడ్డి, డాక్టర్ రాజ్కుమార్, డాక్టర్ ఉషాలత, డాక్టర్ షీలాదీప్, తదితరులు పాల్గొని డాక్టర్ హర్షితా రెడ్డిని అభినందించారు.

'కిసాన్ పక్వాడా'తో రైతులకు చేయూత

చెక్కు అందిస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రతినిధులు

గుంటూరు రూరల్: బ్యాంక్ ఆఫ్ బరోడా గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం పెదనందిపాడులో కిసాన్ పక్వాడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్, ఇనుమెల్ల వి.ఎల్.శ్రీధర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులకు బ్యాంకింగ్ సేవలు, వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. 'రైతు బలమే దేశ బలం – రైతు అభివృద్ధి దేశ అభివృద్ధి' అనే నమ్మకంతో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలబడుతోందని చెప్పారు. జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేష్ కుమార్ డిజిటల్ బ్యాంకింగ్ సౌకర్యాల ప్రాధాన్యాన్ని వివరించారు. రైతులు సులభంగా, సౌకర్యవంతంగా రుణాలు పొందడంలో, డిజిటల్ లావాదేవీలు నిర్వహించడంలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. చిన్న పొదుపుల ప్రాముఖ్యతను వివరించారు. రికరింగ్ డిపాజిట్ ద్వారా పొదుపు అలవాటు చేసుకోవాలని ప్రోత్సహించారు. గుంటూరు సంయుక్త వ్యవసాయ సంచాలకురాలు ఎం. పద్మావతి మాట్లాడుతూ డిమాండ్ ఆధారిత పంటల మార్పిడిపై దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు. వ్యవసాయ రుణ పథకాలు కిసాన్ క్రెడిట్ కార్డ్, పంట – అనుబంధ కార్యకలాపాల ఫైనాన్స్, సూక్ష్మ బీమా, సామాజిక భద్రత పథకాలు తదితర వివరాలను ప్రాంతీయ మేనేజర్ ఎస్.కె.కిరణ్ రెడ్డి రైతులకు వివరించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా రైతులకు అందిస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డ్, ఎస్హెచ్జీఎస్, ఇతర పథకాలను గుంటూరు ఎల్డీఎం రత్న మహిపాల్రెడ్డి, నాబార్డ్ డీడీఎం జి.శరత్బాబు, గుంటూరు డీఆర్డీఏ డీపీఎం కేశవ్ కుమార్ వివరించారు. బుర్రకథ రూపంలో బ్యాంక్ ఉత్పత్తులు, సేవలను వివరించే సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పథకాల కింద రైతులకు రూ. 60.25 కోట్ల విలువైన రుణాల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం, పెదనందిపాడు బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువు పొడిగింపు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు సంబంధించిన దరఖాస్తులు డిసెంబర్ 3వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.మయూరి గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన అభ్యర్థులు ఈ నెల 3వ తేదీలోగా రాజాగారితోట, గుంటూరులోని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు డిసెంబర్ 7వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఆయా సెంటర్లలలో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 0863–2358071 నంబర్లో సంప్రదించాలన్నారు.

డ్వాక్రా నిధుల గోల్మాల్పై విచారణ

తెనాలి రూరల్: డ్వాక్రా గ్రూపునకు సంబంధించి బ్యాంకులో నెల నెలా చెల్లించాల్సిన నగదు పూర్తిగా జమ కాకపోవడం, సుమారు రూ. 8లక్షలు పైగా అవకతవకలు జరగడంపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తెనాలి నందులపేట కవిరాజ పార్కు ప్రాంతంలోని ఓ డ్వాక్రా గ్రూపునకు మూడేళ్లగా క్రితం రూ. 15 లక్షల రుణం మంజూరైంది. సభ్యులందరూ ప్రతి నెల క్రమం తప్పకుండ 36 నెలల పాటు వాయిదాలు చెల్లించుకుంటూ వచ్చారు. అక్టోబరుతో వాయిదాల గడువు ముగియడంతో తమకు రావాల్సిన పొదుపు మొత్తం గురించి వాకబు చేయగా బ్యాంకుకు ఇంకా రూ.8 లక్షలు చెల్లించాల్సి ఉందని సభ్యులకు తెలిసింది. దీంతో అవాక్కైన సభ్యులు జిల్లా కలెక్టరుకు, డీఎస్పీకి, సబ్ కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం రాత్రి టూ టౌన్ పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు విచారిస్తున్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుబ్బారావు నియామకం

గుంటూరు మెడికల్: బీజేపీ కిసాన్ మోర్చా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వై.వి.సుబ్బారావును నియమిస్తూ పార్టీ రాష్ట్రకార్యవర్గం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీలో 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న తనను గుర్తించి, తనకు కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించిన కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమార స్వామికి సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతలను నిబద్ధత, నిజాయితీతో నిర్వర్తించి రైతుల సమస్యల పరిష్కారానికి అంకితమవుతానని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ప్రధాన కార్యదర్శి మధుకర్, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

EXPRESSION OF INTEREST
GUNTUR MUNICIPAL CORPORATION

Expression of Interest called for selection of NGO / Agency to the implementation of SMILE sub-scheme "Comprehensive Rehabilitation of persons engaged in the act of Begging" in Guntur Municipal Corporation.

The programme implemented by as per the guidelines / Instructions of the Government of India (Ministry of Social Justice & Empowerment Department of Social Justice & Empowerment (Economic Inclusion Division), New Delhi) from time to time.

Applications are invited from Interested NGO's/Agencies previouslywho working in the field of prevention of Beggary or Similar field of area of working. Selection of the NGO / Agency the based on the following criteria.

Strength of the Organization (60% weightage)
- Mandatory of having NITI Aayog NGO-Darpan Unique ID
- No. of staffs, No. of years of work in rehabilitation, running shelter-home and welfare schemes of beggary or related fields (Minimum experienced should be of 2 Years).
- Own / leased infrastructure for rehabilitation and capacity of shelter home.
- Reputation (as evidenced by newspaper reports / awards).

Strength of the project (40% weightage)
- Area / City proposed to be taken up (full / partial)
- Number of persons proposed to be rehabilitated
- Strategies for rehabilitation
- Infrastructure and facilities for rehabilitation
- Assistance required from Central government under SMILE scheme

Interested NGO's / Voluntary Organisations / Agencies submit their expression of Interest / Proposals with relevant documents of experience within 10 days i.e. on or before 5-12-2025 to the Commissioner, Guntur Municipal Corporation, AP.

Dated : 26-11-2025 Sd/- Commissioner,
Place : Guntur. Guntur Municipal Corporation.

జాతీయస్థాయి హాకీ పోటీలకు మేడికొండూరు విద్యార్థిని

మేడికొండూరు: జాతీయస్థాయి హాకీ పోటీలకు మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని చిరతనగండ్ల అనూష ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కె.జయప్రద తెలిపారు. ఈనెల 22 నుంచి 24 వరకు చిత్తూరు జిల్లా చంద్రగిరిలో జరిగిన స్కూల్ గేమ్స్లో అండర్–14 రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున హాకీ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ంది. మధ్యప్రదేశ్లోని గ్వాలియర్లో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీలలో విద్యార్థిని పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు టి.వాణి సునీల, కె.బాలకృష్ణ తెలిపారు. అనూషను గ్రామ సర్పంచ్ పూల నాగమణి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ షేక్ ఆదాం ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి అనూషను అభినందిస్తున్న హెచ్ఎం

పశ్చిమ డెల్టాకు 3,225 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాలలోని కొమ్మూరు కాలువ లాకులు

దుగ్గిరాల: విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్ నుంచి 3,225 క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటిమట్టం స్థిరంగా ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవల్కి 196 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్కు 388 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 30, పశ్చిమ కాలువకు 0, నిజాంపట్నం కాలువకు 87, కొమ్మూరు కాలువకు 1,983 క్యూసెక్కులను బ్యారేజీ నుంచి విడుదల చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

■ గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15000+3000. సం॥ 9121469383

■ తెనాలిలోని సర్వీస్ సెంటర్ నందు అనుభవం గల కంప్యూటర్ ఆపరేటర్, మేనేజర్, కార్ వాషింగ్ చేయుటకు సర్వీసింగ్ బాయ్స్, అనుభవం గల మెకానిక్ వర్కర్స్ తెనాలి పరిసర ప్రాంతాల వారు కావలెను. 9985982838

■ త్రివేణి హోంకేర్, హైదరాబాద్లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K-20K. Ph: 9640400073, 9160900024

■ బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్, గృహిణులు, రియల్ ఎస్టేట్, మార్కెటింగ్, టీచర్స్, RMP డాక్టర్స్ కావలెను. Q: 10th / ఇంటర్ / డిగ్రీ. ✆ 70134 81406

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబి కేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు. కావలెను. జీ : 18,000 to 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051

■ ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఇంట్లో వుండి వంట చేయుట కొరకు, పెద్దవారిని చూసుకొనుటకు లేడీస్ కావలెను. వివరాలకు సంప్ర. 93916 95908

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్స్)
ప్రతి అదనపు లైను రూ. 100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు వచ్చిన వాటిని యథాతథంగా ప్రచురిస్తున్నాం. ప్రతి ప్రకటనను పరిశీలించడానికి పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారులు తెలిపే లేదా శ్రేయస్సు చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

19, 20వ తేదీల్లో కళ్లం ఇంజినీరింగ్ కళాశాలలో 'సంకల్ప్'

సంకల్ప్ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాశాల చైర్మన్ తదితరులు

గుంటూరు రూరల్: మండలంలోని చౌడవరంలో గల కళ్లం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి విద్యార్థుల సాంకేతిక మేనేజ్మెంటు సదస్సు (సంకల్ప్ 2025) గోడ ప్రతులను గురువారం కళాశాల చైర్మన్ కళ్లం మోహన్రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్ప్ పేరుతో ఏటా విద్యార్థుల్లో నైపుణ్యతలను మెరుగు దిద్దేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంటామని తెలిపారు. కళాశాల డైరెక్టర్ ఎం. ఉమాశంకరరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ 19, 20వ తేదీల్లో సంకల్ప్ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో పెద్దఎత్తున రాష్ట్ర, జాతీయ స్థాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. సాంకేతిక, మేనేజ్మెంటు విభాగాలలో ప్రతిభ పాటవాలను ప్రదర్శించడం ద్వారా పెద్దఎత్తున పారితోషికాలు కూడా అందుకుంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.ఎస్.బి. రెడ్డి, కళ్లం భరద్వాజ, సంకల్ప్ నిర్వహణ సంచాలకులు హనుమంత్ప్రసాద్, కళాశాల డీన్ ఉపాధి కల్పన విభాగం పీఎల్ మాధవరావు పాల్గొన్నారు.

1 నుంచి ఏసీ బస్సు చార్జీల్లో రాయితీ

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): డిసెంబరు 1 నుంచి 20వ తేదీ వరకు ఏపీఎస్ఆర్టీసీ ఏసీ బస్సుల్లో పదిశాతం రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.సాంబ్రాజ్యం గురువారం తెలిపారు. గుంటూరు – బీహెచ్ఈఎల్ వయా మంగళగిరి అమరావతి బస్సు చార్జి గతంలో రూ. 870లు ఉండగా, ఇప్పుడు రూ. 790కి తగ్గిందన్నారు. గుంటూరు – బీహెచ్ఈఎల్ వయా విజయవాడ అమరావతి బస్సుల చార్జీ గతంలో రూ. 970లు ఉండగా, రూ. 880లకు తగ్గించినట్లు వెల్లడించారు. గుంటూరు – బీహెచ్ఈఎల్ వయా మంగళగిరి ఇంద్ర బస్సు చార్జీ రూ. 700 ఉండగా, డిసెంబరు 1 నుంచి రూ. 640 తగ్గిందన్నారు. తెనాలి – బీహెచ్ఈఎల్ ఇంద్ర బస్సు రూ. 710, తెనాలి – విశాఖపట్నం బస్సు చార్జీ రూ. 850లకు తగ్గించినట్లు తెలిపారు.

బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిపై కేసు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్కు చెందిన ఓ బాలిక ఇంటర్ చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన రాకేష్ అనే యువకుడు బాలికను గత రెండు నెలల క్రితం మాయమాటలు చెప్పి బలవంతంగా ఎత్తుకెళ్లాడు. పలు ప్రాంతాలకు తీసుకెళ్లి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ ఏపీ-520008, ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. [illegible] 17.12.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నది అది" అనే ప్రాతిపదికన [illegible]

ఇ-వేలం తేది & సమయం: 17.12.2025, మ॥ 3.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిముషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)	ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 17.12.2025, మ॥ 12.00 గం॥ల లోపు

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్లో చలానా జనరేట్ చేసుకొని చలాన్లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 17.12.2025, మ॥ 12.00 గం.ల లోపుగా పొందుపరచి జమచేయాలి.

క్ర. సం.	ఋణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ పేరు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయబడినవి)	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ. లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	[illegible] బ్రాంచ్ M/s. [illegible] తేది 21.11.2025 నాటికి బకాయి మొత్తం: రూ. 42,84,411.68/- + వడ్డీ – ఇతర ఖర్చులు.	[illegible]	రూ. 14.47 లక్షలు	రూ. 1.44 లక్షలు
2	[illegible] బ్రాంచ్ [illegible] తేది 24.11.2025 నాటికి బకాయి మొత్తం: రూ. 71,49,634.04 – వడ్డీ – ఇతర ఖర్చులు.	[illegible]	రూ. 14.67 లక్షలు	రూ. 1.467 లక్షలు
	[illegible]		రూ.14.67 లక్షలు	రూ. 1.467 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 10.12.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు.

[illegible] www.canarabank.com [illegible] 8331011695. [illegible] రూ. 10,000/- [illegible] రూ. 25,000/- [illegible] రూ. 50,000/- [illegible] రూ. 1,00,000/- [illegible] https://baanknet.com/eauction-psb [illegible] 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051 [illegible] support.baanknet@psballiance.com

తేది: 25.11.2025, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

పేదలకు వైద్యం, విద్య అందకుండా కుట్రలు

- ప్రజాతీర్పుతో ప్రభుత్వ కుట్రలను తిప్పికొడదాం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

సేకరించిన సంతకాల ప్రతులను వేమారెడ్డికి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి టౌన్: రాష్ట్రంలోని పేదలకు, ప్రజలకు నాణ్యమైన వైద్యం, వైద్యవిద్య అందకుండా కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) విమర్శించారు. మంగళగిరి మండల పరిధి ఆత్మకూరులో గల నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గురువారం కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా సేకరించిన పత్రాలను పార్టీ నాయకులు వేమారెడ్డికి అందజేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని 32వ వార్డులో జరిగిన సంతకాల సేకరణ కార్యక్రమం బుధవారం పూర్తయిన సందర్భంగా ఆ పత్రాలను పట్టణ విభాగ మహిళా అధ్యక్షురాలు సంకె సునీత ఆధ్వర్యంలో డీవీఆర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడారు. పీపీపీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.. ప్రభుత్వ కుట్రలను ప్రజా తీర్పుతో తిప్పికొడదామని దొంతిరెడ్డి వేమారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇచ్చేందుకు వారిని డాక్టర్లుగా చేయాలనే సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ జీవో ఉపసంహరించుకునే వరకూ ప్రజా ఉద్యమం కొనసాగుతుందని వేమారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్, విక్టర్ ఇమ్మానియేల్, ప్రదీప్, కోటేశ్వరరావు, షేక్ సర్దార్, సురేష్, షరీఫ్, బషీర్, ఋుతిక్, మహేష్, ప్రశాంత్, సంషాద్, మంజుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రారంభోత్సవ కార్యక్రమాలకు హాజరైన మంత్రి లోకేష్

మంగళగిరి టౌన్: యువత భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధిలో పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. మంగళగిరి పట్టణ పరిధి పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన నూర్ మజీద్‌ను లోకేష్ ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆత్మకూరు సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. కాగా ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెం సర్వే నంబరు 774ను అస్సైన్ భూముల జాబితా నుంచి తొలగించాలని లైబ్రరీ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి నారా లోకేష్‌కు యర్రబాలెం గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఆయా ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మోహనకృష్ణ, ఏపీ షెడ్యూల్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాషా పాల్గొన్నారు.

స్పెన్సర్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు!

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధిలోని యర్రబాలెం డాన్ బాస్కో స్కూల్ వద్ద గల ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం రాత్రి భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్పెన్సర్ వద్ద గల పలు దాబా హోటళ్లకు వచ్చే వాహనాల వల్ల తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు వాపోయారు. ఆయా హోటళ్లు, వైన్స్ వద్ద వాహనాలను అడ్డదిడ్డంగా పార్క్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలను నిలుపుదల చేయకుండా ఆ ప్రాంతంలోని ఆయా హోటళ్ల వద్దకు వచ్చే వాహనాలను నిర్దిష్ట పార్కింగ్‌లో ఏర్పాటు చేసుకునే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైతాంగ సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి జానారెడ్డి

మంగళగిరి టౌన్: ప్రజా సమస్యలు, రైతాంగ సమస్యలపై పోరాటం చేసిన వ్యక్తి కామ్రేడ్ భీమిరెడ్డి జానారెడ్డి అని సీపీఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి మధు కొనియాడారు. మంగళగిరి మండల పరిధి నూతక్కి గ్రామంలో గురువారం భీమిరెడ్డి జానారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. జానారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. జానారెడ్డి తుదిశ్వాస విడిచే వరకూ పార్టీ కోసం పని చేశారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోటిరెడ్డి, నేతాజీ, జొన్న శివశంకర్, బ్రహ్మారెడ్డి, ఎం.రవి, పిల్లలమర్రి బాలకృష్ణ, డి.శ్రీనివాసకుమారి, వల్లూరు భారతి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే వర్ధంతి నేడు

మంగళగిరి టౌన్: మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమం ఉదయం 11 గంటలకు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జరుగనున్నది.. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, మాజీ ఆప్కో చైర్మన్ చిల్లపల్లి మోహనరావులు పాల్గొంటారని.. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

మేడికొండూరు: వైద్యం వికటించి బాలిక మృతి చెందిన ఘటన మండల పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరేచర్ల గ్రామానికి చెందిన కుక్కపల్లి అక్షయ(16) నల్లపాడులోని ఓ కళాశాలలో చదువుతోంది. అక్షయ ఇంటి వద్ద ఒక్కసారిగా అస్వస్థతకు గురైంది. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పలు పరీక్షలు నిర్వహించి కిడ్నీలో రాళ్లు ఉన్నాయని తెలిపారు. దీంతో అక్షయను తల్లిదండ్రులు ఇంటికి తీసుకువచ్చారు. స్థానికంగా నాటువైద్యం గురించి తెలిసి చెప్పారు. ఓ ఆకు పసర వేస్తే సమస్య తగ్గుతుందని చెప్పారు. దీంతో ఆమె తల్లి కాంతి స్థానికులు చెప్పిన ఆకు తీసుకు వచ్చి అక్షయకు అందించారు. దీంతో అక్షయ ఆరోగ్యం ఒక్కసారిగా విషమించింది. తల్లిదండ్రులు ఆదివారం తిరిగి ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బాలిక మృతి చెందినట్లు మేడికొండూరు సీఐ నాగులమీరా సాహెబ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాడికొండ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం రాజధాని పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ గురువారం రాజధానిలోని మందడం సెంటర్లో సీపీఎం నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ.. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. ఏడీబీ, ప్రపంచ బ్యాంకు రాజధాని అమరావతి నిర్మాణానికి ఇచ్చిన అప్పులను కేంద్ర ప్రభుత్వమే భరించి రాజధాని నిర్మాణానికి గ్రాంటుగా ఇవ్వాలన్నారు. ఇప్పటికే అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మారుతున్న రాష్ట్రానికి ప్రపంచ బ్యాంకు అప్పు భారమై రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి దించుతుందని పేర్కొన్నారు. శుక్రవారం రాజధానిలో బ్యాంకుల నిర్మాణాలకు శంకుస్థాపన చేసేందుకు వస్తున్న నిర్మలా సీతారామన్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యల పరిష్కారానికి ఒత్తిడి తీసుకురావాలని రవి కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని నాయకులు షేక్ జానీ, ధనసిరి రామారావు ఎస్కే హుస్సేన్ నాగూర్ జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన అవసరం

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న నాగ కోటేశ్వరరావు

మంగళగిరి టౌన్: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన అవసరమని తెనాలి జిల్లా డైట్ సెంటర్ సైకాలజిస్ట్ నాగ కోటేశ్వరరావు అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్ల లోపు మైనర్ బాలికలపై లైంగిక నేరాలు జరిపితే పోలీస్, స్త్రీ శిశుసంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తీసుకునే చర్యలను వివరించారు. 9, 10 తరగతులు చదివే విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను యానిమేషన్ వీడియో ద్వారా వివరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇందిరానగర్ అర్బన్ ప్రైమరీ ఆరోగ్యకేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ పి.అనూష మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థుల పట్ల అనుచితంగా ప్రవర్తించరాదని.. దీంతో ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాల గురించి వివరించారు. విద్యార్థినులు ఆపదలో ఉంటే 100, 1098 టోల్‌ఫ్రీ నంబర్లను ఉపయోగించుకుని రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. జీవితంలో చదువుతో పాటు హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీవో సరిత, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శాంతి, ఎయిమ్స్ వైద్యశాల వైద్యవిద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువుల వితరణ

అంగన్‌వాడీ టీచర్‌కు ఫ్యాను, గ్యాస్‌స్టవ్ అందజేస్తున్న వీరవల్లి మురళి

తెనాలిటౌన్: రూరల్ మండలం అంగలకుదురుకు చెందిన గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి పట్టణంలోని అంగన్వాడీ కేంద్రానికి అవసరమైన వనరులను అందజేశారు. స్థానిక 32వ వార్డు అంగన్వాడీ కేంద్రం వారు చేసిన వినతికి స్పందించిన గణేష్ యూత్ వీరవల్లి మురళి గురువారం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. వారు చేసిన వినతిప్రకారం ఆ కేంద్రానికి కావాల్సిన గ్యాస్‌స్టవ్, సీలింగ్ ఫ్యాన్, పిల్లలు మంచినీరు తాగేందుకు అవసరమైన గ్లాసులను అందజేశారు. అందరి అభినందనలు అందుకున్నారు. అంగన్వాడీ కేంద్రానికి కావాల్సిన కనీస సౌకర్యాలు లేకపోవటంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగలకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, 32 వార్డు ఇన్‌చార్జ్ గాజులవర్తి సురేష్, పట్టణ మహిళా నాయకురాలు కొమ్ము బాలనాగమ్మ, తంగిరాల మరియదాసు, శశికుమార్, చిలక ప్రసన్న, గాజులవర్తి జాషువా, కొక్కిలగడ్డ మనోజ్, గౌరీష్, కృష్ణ, భాను తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయ రచయితలకు మార్గదర్శి బొల్లిముంత

శివరామకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

తెనాలిటౌన్: అభ్యుదయ రచయితలకు మార్గదర్శి బొల్లిముంత శివరామకృష్ణ అని సహజకవి అయినాల మల్లేశ్వరరావు కొనియాడారు. స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో గురువారం బొల్లిముంత శివరామకృష్ణ 105వ జయంతి సభ ఘనంగా నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ జయంతి ఏర్పాటు చేయగా సహజకవి అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించి మట్లాడుతూ ప్రగతిశీల అభ్యుదయ భావజాల వ్యాప్తి కోసం జీవితాంతం రచనలు చేసిన మహనీయుడు, సాహితీవేత బొల్లిముంత శివరామకృష్ణ అని అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లక్కరాజు లక్ష్మణబాబు, బొల్లిముంత కృష్ణ, తన్నీరు శివశంకర్, బెల్లంకొండ వెంకట్, ఎంవీ రఘునాథరావు, విజయసారధి, గోపికృష్ణ, బదరీనాథ్, శ్రీరామమూర్తి, సూర్య తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ర్యాలీ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రేపల్లె: చెడు అలవాట్లకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దివ్య తేజోమూర్తి తెలిపారు. మండలంలోని బేతపూడి గ్రామంలో ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా శిబిరం గురువారంతో ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలంటూ వలంటీర్లు గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నాటుసారా, డ్రగ్స్, ఖైనీ, గుట్కా వంటి వాటిని నిర్మూలించాలన్నారు. వీటిని తీసుకోవడంతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వివరించారు. వలంటీర్లు గ్రామాన్ని దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తేజోమూర్తి పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో చెట్లను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.దాసు, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు

మంగళగిరి టౌన్: పాత మంగళగిరిలోని పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం పునర్నిర్మాణ ద్వాదశ వార్షికోత్సవం సందర్భంగా పాత మంగళగిరి పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన, పంచామృత అభిషేకాలు, అలంకారం, హారతులతో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ఊట్ల పాలశ్రీనివాస్, పెద్ద శ్రేష్ఠులు కాండ్రు అమరలింగేశ్వరరావు, ఊట్ల రథంగపాణి, నరసింహమూర్తి, జంజనం దుర్గారావు, మునగాల ఓంకారమూర్తి తదితర సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గుండాలపాడులో 'రైతన్న మీకోసం'

ఫిరంగిపురం: మండలంలోని గుండాలపాడు గ్రామంలో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఏవో వాసంతి పాల్గొని మాట్లాడారు. నీటి భద్రత డిమాండుకు అనుగుణంగా పంటలు పండించడం, సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు వేయడం, రైతులు పండించిన పంటలు అధిక ధరకు అమ్మడం వంటి విషయాలపై రైతులకు వివరించారు. పత్తి రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని అమ్మినట్లయితే మద్దతు ధర పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎం.నరసింహరావు, కె.కోటేశ్వరరావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మీద్ పోర్టల్‌లో వక్ఫ్ ఆస్తుల నమోదు గడువు పెంచాలి

దుగ్గిరాల: రాష్ట్రంలో వక్ఫ్ ఆస్తుల వివరాలను ఉమ్మీద్ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు గడువును పెంచాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం దుగ్గిరాలలోని ముర్తాజానగర్‌లో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు డిసెంబరు 5వ తేదీలోగా నమోదు పూర్తి చేయాలన్న నిర్ణయం అన్యాయమని పేర్కొన్నారు. దీనిని సుమారు 6 నెలల గడువు పెంచాలని కోరారు. షేక్ స్సేన్ సాహెబ్, షేక్ మహబూబ్ జిలానీ పాల్గొన్నారు.

తెనాలిలో బస్సుల కోసం పాట్లు

తెనాలి అర్బన్: పాలకుల అనాలోచిత చర్యల వల్ల ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రాజధాని అమరావతి పరిధిలోని వెంకటపాలెంలో గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఉండటంతో తెనాలి ఆర్టీసీ డిపో నుంచి 15 బస్సులను అధికారులు అక్కడికి పంపారు. తెల్లవారుజామున బస్సులు అక్కడికి వెళ్లటంతో తెనాలి నుంచి గుంటూరు, మంగళగిరి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు లేక గంటలకొద్ది ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని గ్రామాలకైతే బస్సు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. సాయంత్రం బస్సులు తెనాలి డిపోకు రావటంతో ఒక్కసారిగా ప్రయాణికుల తాకిడి పెరిగి బస్సులన్నీ కిక్కిరిసి కన్పించాయి.

భట్టిప్రోలు మండలంలో వరి కోతలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో వరికోతలు ముమ్మరమయ్యాయి. హార్వెస్టర్ ద్వారా, భట్టిప్రోలు-చెరుకుపల్లి, భట్టిప్రోలు-రేపల్లె రహదారిలో కూలీలతో వరి కోతలు జరుగుతున్నాయి. ఎకరా కోత కోయడానికి గంటన్నర వ్యవధి పడుతుంది. హార్వెస్టర్ గంటకు రూ.4 వేలు ఉండగా ఎకరాకు రూ.5,500 నుంచి రూ.6 వేలు వరకూ తీసుకుంటున్నారు. ప్రస్తుతం కూలీల కొరత ఉండడంతో రైతులు యంత్రాల వైపే మొగ్గ చూపుతున్నారు. వ్యవసాయ కూలీలు రూ.5 వేల వరకూ కోత కూలీ తీసుకుంటున్నారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాలుకు పైగా దిగుబడులు వస్తాయని ఆశించిన తమకు ప్రస్తుతం 30 బస్తాలు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతన్నలు వాపోతున్నారు.

యాజమాన్యం కార్మికుల బకాయిలు చెల్లించాలి

కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న యూనియన్ నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు యాజమాన్యం బకాయిలను చెల్లించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు స్టీవెన్ డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు నాయకులు సాంబశివరావు, నాగేశ్వరరావులతో కలిసి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు 359 రోజులుగా దీక్షలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం, యాజమాన్యం ఇప్పటికీ స్పందించకపోవడం దారుణమని అన్నారు. కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా కార్మికులకు న్యాయం జరగలేదని పేర్కొన్నారు. దీక్షల్లో సూర్యప్రకాష్, పిచ్చయ్య, కొండలు, స్వర్ణాల వెంకట రమణ, డి.నాగేశ్వరరావు కూర్చున్నారు. కార్యక్రమంలో జానీ, ఇమాంబి, శారమ్మ, రమాదేవి, శారద, నవనీతమ్మ, లక్ష్మి, రమణమ్మ, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో పెనుమాక విద్యార్థుల సత్తా

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు

తాడేపల్లి రూరల్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయిలో జరిగిన పలు పోటీల్లో తాడేపల్లి రూరల్ పెనుమాక విద్యార్థులు సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 7వ తేదీన ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.మేఘన వక్తృత్వ, క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారని వివరించారు. సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎస్కే అస్లాం క్విజ్ పోటీలో ద్వితీయ బహుమతి.. బైపీసీ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎన్.ఝాన్సీ తృతీయ బహుమతిని సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

విశదలలో సైబర్ క్రైంపై అవగాహన ర్యాలీ

అవగాహన ర్యాలీలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు

మేడికొండూరు: మండల పరిధి విశదల సమీపంలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విశదల గ్రామంలో గురువారం సైబర్ క్రైంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బి.రాధిక విచ్చేసి గ్రామ ప్రజలు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సంజయ్ మాట్లాడుతూ.. తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వలంటీర్లుగా గ్రామాన్ని దత్తత తీసుకుని సైబర్ క్రైంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవికుమార్, గ్రామ ప్రజలు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు, కళాశాల ఏవో సీతారామయ్య ఎన్ఎస్ఎస్ విద్యార్థులను అభినందించారు.

అమరావతి రైతులు ఆందోళన చెందొద్దు

కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని

తాడికొండ: అమరావతి రైతుల భూ సమస్యలకు పరిష్కారమే పరమావధిగా పనిచేస్తున్నట్లు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకోసం అన్ని విషయాలపై సమగ్రంగా సమీక్షిస్తున్నామని గురువారం ఆయనొక ప్రకటనలో తెలిపారు. అర్బన్ డెవలప్‌మెంట్-మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రి పి.నారాయణ, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, సీఆర్డీయే కమిషనర్ కన్నబాబుతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించామని.. రాజధాని సీఆర్డీయే కార్యాలయంలో గత వారం నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలు, తదుపరి సమావేశంలో రైతులకు వివరించాల్సిన విషయాలపై ఈ సమావేశంలో సమగ్రమైన చర్చ జరిగిందని పెమ్మసాని పేర్కొన్నారు. రైతుల సమస్యలైన అసైన్డ్ ల్యాండ్స్, లంక భూములు, జరీబు, మెట్ట భూములు.. రైతుల ప్లాట్ల విభజన, గ్రామ కంఠం, రాజధానికి సంబంధించిన ఆర్అండ్‌బీ రోడ్ల ఏర్పాట్లు, టీడీఆర్ బాండ్లు, వీధిపోటు తదితర అంశాలపై చర్చించామన్నారు. తదుపరి సమావేశంలో రైతుల సమస్యలపై పురోగతిని తెలియజేయాల్సిన అంశాలపై కూడా మాట్లాడినట్లు ఆయన తెలిపారు. రాజధాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని.. త్వరలోనే వారి సమస్యలకు పరిష్కారం చూపిస్తూనే అమరావతి పనులను వేగంగా పూర్తిచేస్తామన్నారు. రానున్న ఆర్నెలల్లో రాజధానికి కావాల్సిన మౌలిక సదుపాయాలను పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. మరో నాలుగు రోజుల్లో జరగనున్న మలివిడత సమావేశంలో రైతులకు మరిన్ని వివరాలు తెలియజేస్తామని పెమ్మసాని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవద్దు

రైతులకు పత్రికను అందిస్తున్న సబ్‌కలెక్టర్ సంజనా సింహ

కొల్లిపర: రైతులు ధాన్యాన్ని దళారీలకు తక్కువ ధరకి అమ్ముకోవద్దని, ప్రభుత్వం ప్రతి రైతు వద్ద నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ సూచించారు. గురువారం మండలంలోని దావులూరు, చివలూరు గ్రామాలలో ధాన్యం కొనుగోలుపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సంజనా సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ధాన్యం కొనుగోలు పై రైతులకి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని రైతులను అడగటంతో రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలల్లో ఆన్‌లైన్ సర్వర్ సరిగ్గా పనిచేయక పోవటం, గోతాలు, వాహనాలు సరిపడా లేవన్న అంశాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె మట్లాడుతూ గోతాలు, వాహనాలు తప్పకుండా అవసరమైన మేరకు ఏర్పాటు చేస్తామని, ఆన్‌లైన్ కూడా ఈ రోజు నుంచి పూర్తి స్థాయి ఎటువంటి అవరోధాలు లేకుండా పనిచేస్తుందని తెలిపారు. కొనుగోలు సమయంలో ఎటువంటి ఇబ్బందులున్నా నేరుగా రైతులు తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి రైతు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఏవో శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

కర్లపాలెం: శీతాకాలంలో సౌకర్యంగా ఉండేందు కు గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని కరుణా జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ఇనకొల్లు పోలీస్‌రావు తెలిపారు. ప్రతినెలా 10 మందికి చేయూతనిద్దాం.. చైతన్య పరుద్దాం కార్యక్రమంలో భాగంగా గురువారం గణపవరం గ్రామంలో నివాసం ఉంటున్న 30 గిరిజన కుటుంబాలకు దాత బొంతా సామ్యూల్ త్యాగరాజ్ సహకారంతో దుప్పట్లు అందజేసినట్లు ఆయన పేర్కొ న్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు పేరలి ధనుంజయ్‌రావు, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏకసిరి నరసింహారావు తదితరులు ఉన్నారు.

సవరణ

[illegible] 2022 సంవత్సరములో ప్రచురితమైన "శ్రీ మంగళాద్రి క్షేత్ర మహాత్మ్యం" అనే గ్రంథములో "మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీ నృసింహ స్తోత్రం" [illegible] వీరరాఘవాచార్య విరచితం అని [illegible]. ఈ శ్లోకాలు వారు రచించినవి కావు. శ్రీ [illegible] శ్రీనివాసాచార్యులు గారు రచించినవి అని తెలియవచ్చినది. ఈ ప్రచురణ పొరపాటే కానీ ఉద్దేశ్యపూర్వకము కాదు. పొరపాటుకు చింతిస్తున్నాము.

ఆర్.రత్న పాల్, [illegible]

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

పదోన్నతుల్లో ఎస్సీల ఉప వర్గీకరణ మేరకు రిజర్వేషన్లు

పబ్లిక్ సర్వీస్, రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు నియమావళిలో సవరణలు

సాక్షి, అమరావతి: ఎస్సీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు అనుగుణంగా పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా పబ్లిక్ సర్వీసెస్ రాష్ట్ర సబార్డినేట్ సర్వీసు నియమావళిలో సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ ఉపకుల వర్గీకరణ మేరకు గ్రూప్–1 రెల్లి ఉప కులాలకు పదోన్నతుల్లో ఒక శాతం, గ్రూప్–2 మాదిగ ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్–3 మాల ఉపకులాల వారికి 7.5 శాతం చొప్పున పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని, పదోన్నతుల రిజర్వేషన్లలో రోస్టర్ పాయింట్స్‌ను పాటించాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. నిర్దిష్ట ప్యానెల్ సంవత్సరంలో పదోన్నతులకు అర్హత గల అభ్యర్థులు లేకపోతే ఆ ఖాళీని తదుపరి ఏడాది ప్యానెల్‌కు బదిలీ చేయాలని పేర్కొన్నారు. ప్రతీ గ్రూపు పదోన్నతుల్లో రిజర్వేషన్లను పాటించాలని, ఎస్సీ కులాల మొత్తం పదోన్నతుల రిజర్వేషన్లు 15 శాతం మించకూడదని స్పష్టం చేశారు. మూడు గ్రూప్‌ల పదోన్నతుల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు అమలు చేయాలని వెల్లడించారు.

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి.

నేడు అమరావతిలో పలు నిర్మాణాలకు శంకుస్థాపనలు

హాజరుకానున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

సాక్షి, అమరావతి: అమరావతిలో శుక్రవారం ఉదయం 11.22 గంటలకు పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థల భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. సీఎం చంద్రబాబు, పలువురు మంత్రులు పాల్గొంటారు.

అభివృద్ధి పేరుతో ప్రజల జేబులకు చిల్లు పెట్టొద్దు: సీపీఐ

సాక్షి, అమరావతి: రహదారుల అభివృద్ధి సాకుతో ప్రజల జేబులకు చిల్లులు పెట్టడం మానుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య చంద్రబాబు ప్రభుత్వానికి హితవు పలికారు. రోడ్ల కోసం ప్రజల నుంచి పన్నులు వసూలుచేయాలనే ప్రభుత్వ యోచనను ఆయన తప్పుబట్టారు. 1500 కిలోమీటర్ల రాష్ట్ర రహదారుల కోసం రూ.22,826 కోట్ల ఖర్చు ప్రజల నెత్తిపై గుదిబండ అవుతుందన్నారు. పెట్రోల్, డీజిల్, ఖనిజాలు, గనులు, మోటార్ వెహికల్ టాక్స్, ఓడరేవుల కార్గో తదితర చార్జీలపై అదనపు సెస్సు విధించాలనుకోవడం, టోల్ వసూలు దుర్మార్గమన్నారు.

దళిత ఐపీఎస్‌ల పట్ల వివక్ష, వేధింపులు

ఐపీఎస్‌లు మొదలు కానిస్టేబుళ్ల వరకు వందలాది మందిపై కక్ష సాధింపు

చంద్రబాబు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న దళిత సంఘాలు



సాక్షి, అమరావతి: దళిత ఐపీఎస్, ఇతర పోలీసు అధికారులపట్ల చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర వివక్ష ప్రదర్శిస్తోంది. అక్రమ కేసులతో కక్ష సాధింపులకు పాల్పడుతూ వేధిస్తోంది. సీనియర్ ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్‌కుమార్, సంజయ్, జాషువా తదితరులకు ఎదురవుతున్న అవమానాలు, వేధింపులు, అక్రమ అరెస్టులు, విచారణకు సమన్లే అందుకు తార్కాణం. ఇక వచ్చే నెల 4న విచారణకు హాజరు కావాలని సీఐడీ అధికారి పీవీ సునీల్ కుమార్‌కు సమన్లు జారీ చేయడం ద్వారా చంద్రబాబు ప్రభుత్వ కుట్రను మరోసారి బహిర్గతం చేసింది. దళితులు, అణగారిన వర్గాల హక్కుల కోసం నినదించే డీజీ స్థాయి ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమారే స్వయంగా వివక్షకు గురికావడం విస్మయ పరుస్తోంది. ఆయనకు ఏడాదిపాటు పోస్టింగు ఇవ్వలేదు. అనంతరం ఆయనపై అక్రమ కేసులు నమోదు చేయడంతోపాటు సస్పెండ్ చేసి, వేధింపులను తీవ్రతరం చేసింది. ఆరు నెలలుగా ఆయన సస్పెన్షన్‌లోనే ఉన్నారు. పీవీ సునీల్‌కుమార్.. ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకుని మరీ వ్యక్తిగత పనుల మీద చేసిన విదేశీ పర్యటనలను కూడా వక్రీకరించి అక్రమ కేసు నమోదు చేయడం గమనార్హం. ఇక సీనియర్ దళిత ఐపీఎస్ అధికారి కాస్త ఖరీదైన వాచీ ధరించడాన్ని కూడా టీడీపీ ప్రభుత్వం, ఆ ప్రభుత్వానికి వత్తాసు పలికే ఎల్లో మీడియా భరించలేక పోవడం విభ్రాంతి పరిచింది. ఆయన వాచీ మీద కూడా ఎల్లో మీడియా దుష్ప్రచారానికి పాల్పడింది. గతంలో ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు.. ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్‌పై చేసిన ఆరోపణలను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఎటువంటి ప్రాథమిక ఆధారాలు లేవని చెప్పింది. అయినా సరే చంద్రబాబు ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు తెగబడుతుండటం గమనార్హం. ఆ కేసులో విచారణకు హాజరు కావాలని సీఐడీ అధికారులు ఆయనకు తాజాగా సమన్లు జారీ చేయడం చర్చనీయాంశమైంది.

- మరో సీనియర్ ఐపీఎస్ అధికారి సంజయ్ కూడా చంద్రబాబు ప్రభుత్వ బాధితుడిగా మారారు. ఆయన కేవలం మూడు నెలలపాటు అగ్ని మాపక శాఖ ఇన్‌చార్జ్‌గా అదనపు డీజీగా వ్యవహరించారు. అగ్ని మాపక శాఖ పరికరాల కొనుగోలు, బిల్లుల చెల్లింపుతో ఆయనకు నేరుగా ప్రమేయం లేదు. కానీ సంజయ్‌పై అక్రమ కేసు నమోదు చేసి సస్పెండ్ చేసింది. అనంతరం ఏకంగా అరెస్టు చేసి జైలు పాలు చేసింది. ఇప్పటికీ అక్రమ కేసులో ఆయన జైలులోనే ఉన్నారు. ఆయన సస్పెన్షన్‌ను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.
- సీనియర్ దళిత ఐపీఎస్ అధికారి జాషువాకు కూడా పోస్టింగు ఇవ్వకుండా చంద్రబాబు ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది.
- దళిత అధికారి విశాల్ గున్నీని అక్రమ కేసులో సస్పెండ్ చేసింది.
- రిటైర్డ్ దళిత పోలీసు అధికారి విజయ్ పాల్‌పై అక్రమ కేసు నమోదు చేసింది. రాజకీయ కక్ష సాధింపుతో ఆయన్ను అరెస్టు చేసి జైలు పాలు చేసింది.
- ఇలా ఐపీఎస్‌లు డీఎస్పీ నుంచి ఎస్సై వరకు ఎంతో మంది దళిత పోలీసు అధికారులను చంద్రబాబు ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోంది.

ఏపీలో దళిత ఐపీఎస్ అధికారులకు వేధింపులు

దళిత ఐపీఎస్ అధికారులపై వివక్ష, వేధింపులు హరియాణలో కంటే ఆంధ్రప్రదేశ్‌లో మరింత తీవ్రంగా సాగుతున్నాయి. కుల వివక్షకు గురైన హరియాణలో పూరన్ కుమార్ అనే దళిత ఐపీఎస్ అధికారి ఆత్మహత్యకు పాల్పడటం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. కానీ, అంతకంటే తీవ్ర స్థాయిలో దక్షిణ భారతదేశంలో ప్రధానంగా ఏపీలో దళిత ఐపీఎస్ అధికారుల పట్ల వివక్షను ప్రదర్శించడమే కాకుండా, వారిని అక్రమ కేసులతో వేధిస్తున్నారు. సీనియర్ ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, సంజయ్‌లపై నమోదు చేసిన అక్రమ కేసులే ఇందుకు నిదర్శనం. అక్రమ కేసులు బనాయించి ఐపీఎస్ సంజయ్‌ని జైల్లో పెట్టారు. దళిత, అణగారిన వర్గాల హక్కుల కోసం నినదించే పీవీ సునీల్ కుమార్‌ను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా వేధిస్తోంది. ఈ వేధింపులపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జోక్యం చేసుకోవాలని కోరుతున్నా.

– 'ఎక్స్'లో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్

ఈ శతాబ్ది జెన్‌జీ దే

ఇతర దేశాల జెన్‌జీ తరానికి ఆదర్శంగా భారత యువత: ప్రధాని మోదీ

సాక్షి, హైదరాబాద్: సృజనాత్మక ఆవిష్కరణలతో దూసుకెళుతున్న భారత దేశ యువత ఇతర దేశాల జెన్‌జీ తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఈ శతాబ్దం జెన్‌జీ దేనని అన్నారు. దేశం ఈ రోజు అంతరిక్ష రంగంలో ఒక అపూర్వ ఘట్టానికి సాక్ష్యంగా నిలిచిందని, విప్లవాత్మక విధానపరమైన మార్పుల ప్రభావంతో ప్రైవేట్ సంస్థలు ఈ రంగంలో దూసుకెళుతున్నాయని చెప్పారు. ఉపగ్రహ ప్రయోగాల విషయంలో దేశం అంతర్జాతీయ స్థాయిలో అగ్రస్థానానికి చేరుకుంటుందని అన్నారు. దేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ రాకెట్ తయారీ సంస్థ 'స్కైరూట్' శంషాబాద్‌లో నిర్మించిన భారీ కార్యాలయం 'ఇన్ఫినిటీ క్యాంపస్'ను ప్రధాని గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. సుమారు రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కార్యాలయంలోనే స్కైరూట్ తన మొట్టమొదటి ఆర్బిటల్ వెహికల్ 'విక్రమ్–1'ను తయారు చేసింది. ఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా విక్రమ్–1ను ఆవిష్కరించిన అనంతరం ప్రధాని మాట్లాడారు.

దేశ ప్రయోజనాలకు యువత పెద్దపీట

'స్కైరూట్ కంపెనీ కార్యాలయం 'ఇన్ఫినిటీ క్యాంపస్'దేశ యువశక్తికి, కొత్త ఆలోచనలకు, సృజనాత్మకతకు ప్రతీకగా నిలుస్తోంది. యువతరం రిస్క్ తీసుకునేందుకు సిద్ధంగా ఉంది. సృజనాత్మకంగా ఆలోచిస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగే ప్రయత్నం చేస్తోంది. దేశ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తోంది. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాణిస్తోంది. అంతరిక్ష రంగమూ దీనికి భిన్నమేమీ కాదు. ఇద్దరు, ముగ్గురు జెన్–జీలతో మొదలైన స్టార్టప్‌లు చాలా తక్కువ వనరులతోనే అద్భుతాలు సృష్టిస్తున్నాయి. స్కైరూట్ సంస్థ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ చందన, నాగ భరత్ డాకాలు దేశ యువతకు స్ఫూర్తినిస్తున్నారు. జెన్–జీ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్లు, సైంటిస్టులు రాకెట్ల చోదక వ్యవస్థలు మొదలుకొని కాంపోజిట్ మెటీరియల్స్, ఉపగ్రహ వ్యవస్థలు, రాకెట్లకు సంబంధించిన కొత్త కొత్త టెక్నాలజీలను ఆవిష్కరిస్తున్నారు. అందుకే 21వ శతాబ్దం జెన్–జీదేనని విశ్వసిస్తున్నా' అని ప్రధాని చెప్పారు.

అణుశక్తి రంగమూ ప్రైవేటీకరణ..

'భారత అంతరిక్ష రంగ ప్రస్థానం చాలా చిన్న స్థాయిలో మొదలైంది. సైకిళ్లపై రాకెట్ విడిభాగాలను మోసుకెళ్లే స్థితి నుంచి ప్రపంచంలోనే అత్యంత నమ్మకమైన లాంచ్ వెహికల్‌ను తయారు చేయగల స్థాయికి చేరగలిగాం. ఈ ప్రస్థానం పరిమితమైన వనరులతోనే మొదలైనప్పటికీ వృద్ధి మాత్రం దేశ శాస్త్రవేత్తల సంకల్ప బలానికి నిదర్శనంగా నిలిచింది. గడచిన దశాబ్ద కాలంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణల కారణంగా దేశవ్యాప్తంగా అంతరిక్ష రంగంలోనే 300కు పైగా స్టార్టప్‌లు వెలిశాయి. సమాచార, వాతావరణ అంచనాలు, వ్యవసాయం, అర్బన్ ప్లానింగ్‌లతో పాటు దేశ భద్రతలోనూ అంతరిక్ష రంగం విస్తృత వినియోగంలోకి వచ్చింది. దేశీయ అంతరిక్ష రంగంపై పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి వ్యక్తమవుతోంది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ కంపెనీలను అనుమతించడం ద్వారా సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకుని సమీప భవిష్యత్తులో అణుశక్తి రంగాన్ని కూడా ప్రైవేటీకరణ చేసే దిశగా అడుగులేస్తున్నాం..'అని మోదీ వెల్లడించారు.

గ్లోబల్ స్పేస్ పవర్‌గా భారత్: కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత దేశం గ్లోబల్ స్పేస్ పవర్‌గా ఎదిగిందని, 400కు పైగా ప్రైవేటు స్టార్టప్స్, 2 వేలకు పైగా ఎంఎస్‌ఎంఈలు, 50 పరిశోధనా కేంద్రాలు స్పేస్ రంగానికి ఊతమిస్తున్నాయని చెప్పారు. ఇవాళ రూ.70 వేల కోట్ల విలువైన భారత స్పేస్ ఎకానమీ.. 2033 నాటికి రూ.4 లక్షల కోట్లకు చేరుకుంటుందని పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ ఏరో స్పేస్ తయారీ రంగంలో పెట్టుబడులకు భారీగా ముందుకు వస్తున్నారని, 2020లో ప్రధాని మోదీ సంస్కరణలు తీసుకొచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.4500 కోట్ల మేర ప్రైవేటు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు.

రెండు నెలల్లో విక్రమ్-1 ప్రయోగం

స్కైరూట్ సొంతంగా తయారు చేసిన ఆర్బిటల్ వెహికల్ 'విక్రమ్–1'ను ఇస్రో సాయంతో రెండు నెలల్లో ప్రయోగించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన పవన్‌కుమార్ చందన తెలిపారు. 2018లో దేశంలోనే మొట్టమొదటి సబ్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్–ఎస్'ప్రయోగం విజయవంతం కావడాన్ని ప్రస్తావిస్తూ.. కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష రంగంలో ప్రైవేటు కంపెనీల భాగస్వామ్యానికి ఓకే చెప్పడం వల్లనే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు.

తిరుమల తరహాలో అమరావతి శ్రీవారి ఆలయం అభివృద్ధి

- రెండు దశల్లో రూ.260 కోట్లతో విస్తరణ పనులు
- వీటి శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

ఆలయ అభివృద్ధి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, టీటీడీ ఛైర్మన్ తదితరులు

సాక్షి, అమరావతి/ తాడికొండ: రాజధాని అమరావతిలో రూ.260 కోట్లతో చేపట్టిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులను రెండున్నరేళ్లలో పూర్తిచేయాలని టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానం)ని సీఎం చంద్రబాబు కోరారు. తిరుమల తరహాలోనే ఈ ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాజధానిలోని వెంకటపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. మొదటి దశలో రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం, రూ.48 కోట్లతో ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయస్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారని.. రెండోదశలో రూ.120 కోట్లతో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు–సిబ్బందికి క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో శ్రీవారి దేవాలయాలను నిర్మిస్తామని.. ఇందుకు భక్తులు కూడా ముందుకొచ్చి సహకరించాలని ఆయన కోరారు. ముంబైలో రేమాండ్స్ సంస్థ రూ.100 కోట్లతో స్వామి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలే అజెండా కావాలి

పార్లమెంట్ వేదికగా రాష్ట్ర సమస్యలను స్పష్టంగా వినిపించాలని సీఎం చంద్రబాబు టీడీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించి రానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సిన వ్యూహంపై పలు సూచనలు చేశారు.

రెండో విడత భూసమీకరణ తప్పదు

రాజధాని ప్రాంతం 29 గ్రామాలకే పరిమితమైతే అదో చిన్న మున్సిపాల్టీగా మిగిలిపోతుందని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. హైదరాబాద్ తరహాలో అమరావతి అభివృద్ధి చెందాలంటే రెండో విడతలోనూ ల్యాండ్ పూలింగ్ కింద భూములు తీసుకోవాల్సిందేనని స్పష్టంచేశారు. సచివాలయంలో గురువారం రాజధాని రైతులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రైతులు తమ సమస్యలను వివరించారు.

చంద్రబాబు పాలనలో మహిళలకు రక్షణ కరువు

టీడీపీ అంటే.. తెలుగు దండుపాళ్యం పార్టీగా మారింది

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

సాక్షి, విశాఖపట్నం: చంద్రబాబు ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికార మదంతో టీడీపీ నేతలే మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ అంటే తెలుగు దండుపాళ్యం పార్టీగా మారిందని ధ్వజమెత్తారు. ఆమె గురువారం విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడారు. 'ఒక మహిళా ఉద్యోగిపై సాక్షాత్తూ రాష్ట్ర మహిళా సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీఏ సతీష్ బెదిరింపులు, లైంగిక వేధింపులకు దిగడం అత్యంత దుర్మార్గం. రాష్ట్రంలో నెలకొన్న దుర్మార్గమైన పరిస్థితులకు ఈ ఘటనే నిదర్శనం. మహిళలకు రక్షణ లేకుండా చేస్తున్నది, వేధిస్తున్నది టీడీపీ నేతలే అని చెప్పడానికి మంత్రి సంధ్యారాణి పీఏ సతీష్ ఉదంతం ఒక ఉదాహరణ. మంత్రి సంధ్యారాణి పీఏ తన దగ్గర తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే పక్కలోకి రావాలని వేధించాడని, అంతేకాకుండా మరింత బరితెగించి మరికొందరు టీడీపీ నాయకుల పక్కలోకి కూడా వెళ్లాలని ఒత్తిడి చేసినట్లు బాధిత మహిళ ఆధారాలతో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకపోవడం దుర్మార్గం. బాధితురాలు నేరుగా మంత్రికే ఫిర్యాదు చేస్తే... ఒక మహిళగా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రిగా సాటి మహిళలకు అండగా నిలవాల్సిందిపోయి, పీఏను వెనకేసుకుని రావడం సిగ్గుచేటు. మీ పీఏ వేధింపులకు తలొగ్గకపోతే సాలూరు నుంచి గుమ్మలక్ష్మీపురం బదిలీ చేస్తారా?' అని కళ్యాణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రిని బర్తరఫ్ చేయాలి

'మహిళలను ఎవరైనా వేధిస్తే వారికి అదే చివరి రోజు అని చెప్పే సీఎం చంద్రబాబు.. మంత్రి పీఏ వేధించాడని ఓ ప్రభుత్వ మహిళా ఉద్యోగి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ప్రభుత్వ మహిళా ఉద్యోగి తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదో హోంమంత్రి సమాధానం చెప్పాలి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే మంత్రి సంధ్యారాణిని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి' అని కళ్యాణి డిమాండ్ చేశారు.

ఉచితంగా విద్య, వైద్యం ప్రభుత్వం బాధ్యతే

- గవర్నర్‌ను కలసిన అనంతరం మీడియాతో బొత్స
- కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు పోరాటం
- కోటి సంతకాల కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, విద్యార్థులు, ప్రజాసంఘాలు, మేధావుల మద్దతు
- కూటమి నేతలు కూడా ఇందులో పాల్గొన్నారు

గవర్నర్‌ను కలిసిన బొత్స సత్యనారాయణ, లేళ్ల అప్పిరెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి, అమరావతి: పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్య, పేదలకు వైద్యాన్ని అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ సేకరించిన కోటి సంతకాలను అందజేసేందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ అపాయింట్‌మెంట్ కోరుతూ గురువారం విజయవాడలో ఆయన్ని కలిశారు. అనంతరం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావులతో కలసి బొత్స మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలన్న చంద్రబాబు నిర్ణయాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులతో పాటు ప్రజా సంఘాలు, మేధావులు పెద్ద ఎత్తున మద్దతు పలుకుతున్నట్లు తెలిపారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల అభిప్రాయాలను క్రోడీకరించి గవర్నర్‌కి సమర్పించనున్నట్లు బొత్స పేర్కొన్నారు. తాము చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో కూటమి నేతలు కూడా పాల్గొన్నట్లు చెప్పారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు.

- ప్రజారోగ్యం ప్రభుత్వం చేతుల్లో ఉండాలే గానీ ప్రైవేటు ఆధీనంలో ఉంటే ప్రజలకు న్యాయం జరగదు. ప్రజారోగ్యం కోసం పరితపించిన వ్యక్తిగా వైఎస్ జగన్ 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఐదు కాలేజీలు పూర్తై తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. వైఎస్ జగన్‌కు పేరు వస్తుందన్న అక్కసుతోనే మిగిలిన వాటిని సీఎం చంద్రబాబు ప్రైవేటీకరణ చేస్తున్నారు. స్కూలు పిల్లలకు ఉచితంగా ట్యాబులిస్తే గేమ్స్ ఆడుకుంటారని మాక్ అసెంబ్లీలో విద్యార్థులతో చెప్పించడం సిగ్గుచేటు.
- ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ ఎలాంటి ప్రభావాన్ని చూపించిందో.. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో చూశాం. ఈ క్రమంలో ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. ఒక్కో కాలేజీకి రూ.500 కోట్లు కేటాయించి, ప్రభుత్వ నిధులతో పాటు వివిధ ఆర్థిక సంస్థలతో టై అప్ చేసి పనులు ప్రారంభించాం. మెడికల్ కాలేజీలకి అనుసంధానంగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కూడా నిర్మించే ఏర్పాట్లు చేశాం. దురదృష్టవశాత్తూ ప్రభుత్వం మారిన తర్వాత మెడికల్ కాలేజీలన్నింటినీ పీపీపీ పేరుతో ప్రైవేటుపరం చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులు లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తారు. ఇప్పటికే ప్రైవేటు ఆసుపత్రుల్లో 30 శాతం పేదలకు చికిత్స చేయాలన్న నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కాని పరిస్థితి నెలకొంది.
- వైఎస్సార్ పేదవాడు కూడా ధనవంతుడితో సమానంగా వైద్య చికిత్స పొందాలన్న ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. వైఎస్ జగన్ హయాంలో ఆరోగ్యశ్రీ కింద 2 వేల వరకు అదనపు ప్రొసీజర్లను చేర్చడంతో పాటు ఉచిత చికిత్స పరిధిని రూ.25 లక్షల వరకు విస్తరించారు. ఈ ప్రభుత్వానికి పేదలపై ఇంత కక్ష ఎందుకు? నెలకు రూ.300 కోట్లు ఆరోగ్యశ్రీ కోసం ఖర్చు చేయలేదా? బిల్లులు విడుదల కాకపోవడంతో నెట్ వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద పేదవాళ్లకు చికిత్స అందని పరిస్థితి నెలకొంది. పథకాన్ని నీరుగార్చి బీమా పరిధిలోకి తెస్తామంటున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 60 లక్షల మందికి ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించాం. రూ.14 వేల కోట్లు ఆరోగ్యశ్రీ కోసం వెచ్చించాం. ఇంత డబ్బు ప్రైవేటు సంస్థలు అందిస్తాయా? ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి ప్రజారోగ్యం నాశనం అయిపోయినా ఫర్వాలేదు అనుకుంటున్నారా? ఇది దోపిడీ కాదా?
- రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను నిర్వీర్యం చేశారు. ఏ పంటకూ మద్దతు ధర లేదు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. రాయలసీమలో అరటి పంట తీవ్ర సంక్షోభంలో పడింది. 18 నెలలుగా శాంతి భద్రతలు దిగజారాయి. సంక్షేమ హాస్టళ్లలో కలుషిత ఆహారం తిని పిల్లలు అనారోగ్యం పాలై చనిపోతున్నారు.
- రాజ్యాంగ ఆమోద దినోత్సవం పేరు ఉచ్చరించడానికి కూడా కూటమి ప్రభుత్వానికి అర్హత లేదు. రాజ్యాంగం అంటే కేవలం అధికార పార్టీలో ఉన్న ముగ్గురేనా? ప్రతిపక్ష నేతలను, వారి ఉనికిని కూడా భరించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. ఇదేనా మీ 40 ఏళ్ల అనుభవం చంద్రబాబూ?
- పవన్ కళ్యాణ్ గతంలో ఆయన చేసిన ప్రసంగాలను ఒక్కసారి మళ్లీ వింటే బాగుంటుంది. ఆయన బూతులు మాట్లాడితే ఒప్పా? కాకినాడ వెళ్లి రేషన్ బియ్యం గురించి హడావుడి చేశారు. ఆ తర్వాత కూడా అక్రమ రవాణా ఎందుకు ఆగలేదు? ఒక డీఎస్పీ అవినీతిపరుడని, పేకాట క్లబ్బులు నడిపిస్తున్నాడని పవన్ కళ్యాణ్ చెప్పారు. మరి అదే డీఎస్పీకి అవార్డులు, రివార్డులు ఎలా ఇచ్చారు?

రైతుల్ని ఆదుకుంటామని ఎందుకు చెప్పడం లేదు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి, అమరావతి: మోంథా తుపాను వల్ల రైతులు నష్టపోయి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకుంటే.. ప్రభుత్వం అండగా ఉండి ఆదుకుంటుందని సీఎం చంద్రబాబు సహా ప్రభుత్వం నుంచి ఏ ఒక్కరూ ఎందుకు చెప్పలేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తుపాను కారణంగా పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బంది పడుతుంటే ఒక్క ఎమ్మెల్యే కూడా పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడలేదన్నారు. అసలు ఈ రాష్ట్రానికి వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నారా అనే సందేహం కలిగేలా అచ్చెన్నాయుడు రైతులను గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యానికి మద్దతు ధర అడిగితే వరి అన్నం తింటే షుగర్ వస్తుందని సీఎం చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటు అని అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా అందించిన రాగి పిండి, గోధుమ పిండిని ఎందుకు ఆపేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు ప్రభుత్వం ఇన్సూరెన్స్ చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో 60 లక్షల మంది రైతులు నష్టపోయారని చెప్పారు.

రైతుకు అడుగడుగునా దగాయే

వైఎస్సార్‌సీపీ హయాంలో పంట కోతకు వస్తుందన్న సమయానికల్లా నాటి సీఎం వైఎస్ జగన్ అధికారులతో సమావేశం నిర్వహించి మద్దతు ధరలపై అప్రమత్తం చేసేవారని కారుమూరి గుర్తు చేశారు. పంటల కొనుగోళ్లలో ప్రభుత్వమే జోక్యం చేసుకోవడం వల్ల మార్కెట్‌లో డిమాండ్ పెరిగి రైతులకు మద్దతు ధరలు దక్కేవన్నారు. టీడీపీ ప్రభుత్వం కనీసం సమీక్ష కూడా చేయకుండా రైతులను అడుగడుగునా దగా చేస్తోందని మండిపడ్డారు. ఆర్బీకే వ్యవస్థను నిర్వీర్యం చేసి దళారీ వ్యవస్థను తీసుకొచ్చిన చంద్రబాబు రైతుల్ని నిలువునా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు.

నా డ్యూటీ నేను చేస్తే టార్గెట్ చేస్తున్నారు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తన డ్యూటీ తాను చేస్తే టార్గెట్ చేసి వేధిస్తున్నారని, అక్రమ బియ్యం రవాణా వాహనంతో తొక్కిచ్చేస్తామని టీడీపీ నేతలు బహిరంగంగా చెబుతున్నారని ఓ హోం గార్డు ఆవేదన వ్యక్తం చేశారు. తాను దళితుడిగా పుట్టడమే తప్పయిందని, నాయుడిగా పుట్టాల్సిందన్నారు. కృష్ణా జిల్లాలో విచ్చలవిడిగా జరుగుతున్న పేకాట, అక్రమ రేషన్ బియ్యం సరఫరా, అక్రమ ఇసుక దందాలను పట్టించినందుకు తనపై కుల వివక్ష చూపుతూ ప్రభుత్వ పెద్దలను అడ్డం పెట్టుకుని కొంత మంది తనను వేధిస్తున్నారని హోంగార్డు కొడాలి రాజేష్ వాపోయారు. తనను ఏ విధంగా వేధించారో వివరిస్తూ జిల్లా ఎస్పీకి పంపిన సెల్ఫీ వీడియో పంపారు. ఆ వీడియో గంటల వ్యవధిలోనే సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యి కలకలం రేపుతోంది. కొడాలి రాజేష్ అనే హోంగార్డు పోలీసు ఉన్నతాధికారుల సూచన మేరకు గతంలో పని చేసిన ప్రాంతంలో జరుగుతున్న పేకాట, అక్రమ రేషన్ బియ్యం దందాపై సమాచారం ఇస్తూనే వచ్చారు. దీన్ని మనసులో పెట్టుకుని టీడీపీ నేతలు తనపై కక్షగట్టారని హోం గార్డు రాజేష్ వాపోయారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

హోంగార్డు సెల్ఫీ వీడియో కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పోలీసు అధికారులను కూడా బెదిరించారు

- పేకాట, అక్రమ రేషన్ బియ్యం, అక్రమ ఇసుక రవాణాను పట్టుకుంటే ఎస్ఐ, సీఐ, డీఎస్పీని సైతం బెదిరిస్తారు. నిజాయితీగా డ్యూటీ చేయడానికి వీలులేదంటారు. మోపిదేవి పోలీస్ స్టేషన్‌లో ఓసీ కులానికి చెందిన దుర్గారావు అనే హోం గార్డు అతని బంధువుగా చెప్పుకునే టీవీ 5 రిపోర్టర్ సుబ్బారావుతో కలసి నన్ను తీవ్రంగా వేధించారు. మోపిదేవి డొంకరోడ్డులో ముగ్గురు తాగుబోతులను పట్టుకుని అప్పగిస్తే ఆ మరుసటి రోజు వారు ఎమ్మెల్యే తాలూకా అని చెప్పి వదిలేశారు. నన్ను కులం పేరుతో దూషించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేతో మాట్లాడి నన్ను అవనిగడ్డకు మార్పించారు. అక్కడ అసాంఘిక కార్యకలాపాల గురించి డీఎస్పీకి సమాచారం ఇస్తే ఇప్పుడు మచిలీపట్నంకు మార్పించారు.
- ఇటీవల పవన్ కళ్యాణ్ మోపిదేవి పర్యటనలో ఒక హోం గార్డు ఎస్పీనే ప్రశ్నిస్తూ మాట్లాడటం బాధేసింది. ఎవరిని చూసుకుని ఆ హోం గార్డు అలా మాట్లాడారు? అతనిపై చర్య తీసుకోరా? ఆ స్థానంలో నా లాంటి దళిత హోంగార్డు ఉండుంటే ఏ చర్య అయినా తీసుకుంటారు.
- నా డ్యూటీ నేను చేస్తే టార్గెట్ చేస్తున్నారు. అక్రమ బియ్యం రవాణా వాహనంతో నన్ను తొక్కిచ్చేస్తామంటున్నారు. యాక్సిడెంట్‌గా చిత్రీకరిస్తామని బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. టీవీ 5 రిపోర్టర్ సుబ్బారావు, ఇద్దరు హోంగార్డులు దుర్గారావు, జరుగు శ్రీను.. ఎమ్మెల్యే కుమారుడు రాజాబాబు (వెంకటరాము), అల్లుడు అశ్విని కుమార్ ద్వారా నన్ను తీవ్రంగా వేధించారు. నాకు ఏదైనా జరిగితే వారిదే బాధ్యత. నన్ను డీఎస్పీ ఆఫీస్‌కు పిలిపించి హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు.
- నా పై అధికారులు చెప్పింది చేయడమే నా డ్యూటీ. నా పనితీరు గురించి విచారించండి. నాది తప్పు ఉంటే మీరు ఏ శిక్ష విధించినా భరిస్తా. నేను దళితుడిగా పుట్టడమే తప్పా.. పోలీస్ వ్యవస్థను చక్కదిద్దాలని కోరుకుంటున్నా' అని వివరించారు. ఇదిలా ఉండగా, హోం గార్డు సెల్ఫీ వీడియోలో పేర్కొన్న అంశాలపై విచారణకు ఆదేశించామని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మీడియాకు వెల్లడించారు.
- రాష్ట్రంలో దోపిడీ ఏ విధంగా సాగుతుందో చెప్పడానికి ఇదో నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

● పోషకాహారం

ఈ రోజుల్లో మహిళల రుతుక్రమంలో సమస్యలు తలెత్తడం ఎక్కువ కనిపిస్తోంది.. హార్మోన్ల హెచ్చుతగ్గులు వీటికి ప్రధాన కారణంగా ఉంటుంటాయి. ఈ సమస్యను సరిదిద్దడానికి మన ప్రాంతీయ సంప్రదాయ ఆహారం ఎంతో మేలు చేస్తుంది. సమతుల ఆహారంతో పాటు సీడ్ సైక్లింగ్ థెరపీ పీసీఓఎస్ సమస్యలో ప్రధాన పాత్ర పోషిస్తుంది అంటున్నారు పోషకాహార నిపుణులు.

రుతుక్రమ సమస్యలకు సీడ్ సైకిల్

30 నుంచి 50 ఏళ్లు పైబడిన మహిళలు ... పీసీఓఎస్, థైరాయిడ్, మెనోపాజ్ సమస్యలు ఎదుర్కొంటున్నప్పుడు రోజువారీ తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకుంటే ఆరోగ్యమూ మెరుగ్గా ఉంటుంది.

● మెటబాలిజంను బ్యాలెన్స్ చేసే క్యాలీఫ్లవర్, క్యాబేజీ, బ్రోకలీలను ఆహారంలో చేర్చాలి. ఇవి ఈస్ట్రోజెన్ హార్మోన్లను వృద్ధి చేస్తాయి. క్యాన్సర్ కారక రిస్క్‌ను కూడా తగ్గిస్తాయి.

● సాల్మన్ ఫిష్, చియా, అవిశ గింజలలో ఆరోగ్యానికి మేలు చేసే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ సమృద్ధిగా లభిస్తాయి. చియా, అవిశ గింజలను ఉదయం అల్పాహారంలో చేర్చుకోవచ్చు. చియా సీడ్స్ మజ్జిగ, నీళ్లలో నానబెట్టి తీసుకోవచ్చు.

● హోల్ గ్రెయిన్స్‌లో ఫైబర్ ఎక్కువ ఉంటుంది. కూరగాయలు, శనగలు, చిరుధాన్యాలు, మిల్లెట్స్, బ్రౌన్ రైస్ తీసుకోవాలి. ఇవి రక్తంలో చక్కెర, ఇన్సులిన్ స్థాయిలను సమం చేస్తాయి. ఈస్ట్రోజెన్ హార్మోన్ సరిగ్గా పనిచేస్తే ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గి, బ్లడ్ షుగర్ లెవల్స్ బ్యాలెన్స్ అవుతాయి.

● పప్పులు, శనగలు, బొబ్బర్లు.. వంటి వాటిలో బి12 ఎక్కువ ఉంటుంది. ఈ రోజుల్లో బి12 లోపం చాలా మందిలో కనిపిస్తుంది. ఈ పప్పులను చేర్చడం వల్ల బి12తో పాటు హార్మోన్ల సమతుల్యత దెబ్బతినదు. పప్పులను ఉడికించి రోజూ ఒక కప్పు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

● బాదంపప్పు, వాల్ నట్స్‌లలో మెగ్నిషియం లభిస్తుంది. నట్స్ అండ్ సీడ్స్ రోజూ మూడు నెలల పాటు రోజూ తీసుకుంటే హార్మోన్ల హెచ్చుతగ్గులు బ్యాలెన్స్ అవుతాయి.

● గట్ హెల్త్‌ని సపోర్ట్ చేసే పెరుగు, యోగర్ట్, మజ్జిగ.. వంటివి ఆహారంలో చేర్చాలి. హార్మోన్ల అసమతుల్యత వల్ల బరువు పెరగడం తగ్గడం సమస్య కూడా ఉంటుంది. థైరాయిడ్, హార్మోన్లకు సపోర్ట్ చేసే ఎగ్ లేదా టోఫూ వంటివి ఉపయోగించాలి.

● కల్తీ నూనెలు కాకుండా ఫ్లాక్స్ సీడ్, అవకాడో, ఆలివ్ ఆయిల్స్, స్వచ్ఛమైన నెయ్యి వాడాలి. ఆకుకూరలు, చిలకడ దుంప, నట్స్ .. మెగ్నిషియం ఉండే పదార్థాలను చేర్చుకుంటే పిఎమ్‌ఎస్ లక్షణాలు తగ్గుతాయి.

గింజలను పొడులు చేసి, నేరుగా తీసుకోవచ్చు. లేదంటే పెరుగు, ఓట్స్‌లో కలుపుకోవడం ద్వారా లేదంటే చిన్న చిన్న లడ్డూలు కట్టి కూడా తీసుకోవచ్చు. ఇతర జంక్‌ఫుడ్ తిని సీడ్ సైక్లింగ్ పాటించడం వల్ల ఉపయోగం ఉండదు. ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు సీడ్ సైక్లింగ్ పాటిస్తూ, వ్యాయామాలు చేస్తూ, రోజువారి జీవనశైలి బాగుండేలా చేసుకుంటే ఇవి సాయపడతాయి. ప్రభావం వెంటనే కనిపించలేదు అనుకోకుండా 2–3 నెలల పాటు ప్రతిరోజూ వాడితే మంచి ఫలితాలు వస్తాయి.

నిల్వ ఉండే పదార్థాలు, జంక్ ఫుడ్ కాకుండా మన సంప్రదాయ ఆహారం ద్వారానే హార్మోన్లు బ్యాలెన్స్ అవుతాయి. నెలసరి సమస్యలు దరిచేరవు.

సీడ్ సైక్లింగ్

పీసీఓఎస్ ఫేజెస్‌ను బట్టి సీడ్ సైక్లింగ్ విధానం ఎంతో మేలు చేస్తుంది. హార్మోన్ల సపోర్ట్ కోసం ఈ విధానాన్ని అనుసరిస్తారు. రుతుక్రమం సరిగా రాని వాళ్లకు ఈ విధానాన్ని అవలంబించమని నిపుణులు చెబుతుంటారు. సీడ్ సైక్లింగ్ మెథడ్‌ను రుతుక్రమం ఆగిపోయిన మొదటి రోజు నుంచి తిరిగి రుతుక్రమం ప్రారంభమయ్యే రోజు వరకు పాటించాలి.

ఫాలిక్యులర్ ఫేజ్

ఇది సీడ్ సైక్లింగ్‌లో మొదటి ఫేజ్. రుతుక్రమం ఆగిపోయిన మొదటి రోజు నుంచి 14వ రోజు వరకు ఒక దశ. దీనిలో గుమ్మడి గింజల పొడి 1–2 టీ స్పూన్లు, అవిశ గింజల పొడి 1–2 టీ స్పూన్లు రోజూ తీసుకోవాలి. దీనివల్ల ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల పనితీరు బాగుంటుంది. నెలసరి సమస్యలు తగ్గుతాయి.

లూటియల్ ఫేజ్

రుతుక్రమం ఆగిపోయిన 15వ రోజు నుంచి 28వ రోజు వరకు సన్‌ఫ్లవర్ గింజలు, నువ్వులు ఉపయోగించాలి. సన్‌ఫ్లవర్, నువ్వులలో విటమిన్–ఇ ఉంటుంది కాబట్టి హార్మోన్ బ్యాలెన్స్ చేయడానికి ఉపయోగపడతాయి. హార్మోన్ల అసమతుల్యత కారణంగా వచ్చే క్రాంప్స్, యాక్నె, నొప్పి, మూడ్ స్వింగ్స్ .. వంటివి కూడా తగ్గుతాయి. మెనోపాజ్, థైరాయిడ్ సమస్యలకు ఈ విధానం సరైన పరిష్కారం.

డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషియనిస్ట్

● హెల్త్ టిప్స్

● ఒక కప్పు నీటిలో అర టీ స్పూన్ అల్లం తురుము, కొద్దిగా టీ పొడి, రెండు మూడు తులసి ఆకులు వేసి పది నిమిషాల పాటు మరిగించి దింపాలి. చల్లారిన తరువాత ఈ కషాయాన్ని తాగితే గొంతులో గరగర పోతుంది.

● రెండు టీ స్పూన్‌ల నువ్వుల నూనెలో ఒక కోడిగుడ్డు సొన వేసి బాగా గిలక్కొట్టాలి. ఈ మిశ్రమాన్ని క్రమం తప్పకుండా మూడు రోజులపాటు తాగితే నెలసరి క్రమబద్ధం అవుతుంది.

● కొన్ని తులసి ఆకులని దంచి రసం తీయాలి. ముఖం మీద గాని, చేతుల మీద గాని ఏర్పడ్డ తెల్లమచ్చలపై ఈ రసాన్ని రాసుకుని, ఆరాక శుభ్రపరుచుకోవాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే మచ్చలు మెల్లిమెల్లిగా తగ్గుముఖం పడతాయి.

● మూడు కప్పుల నీళ్ళలో రెండు తమలపాకులు వేయాలి. నాలుగు మిరియాలను పొడిగా చేసి ఇందులో కలపాలి. అన్నీ కలిపి 15 నిమిషాలపాటు మరగబెట్టి దింపేయాలి. ఇందులో టీ స్పూన్ తేనె కలుపుకుని ఉదయం, సాయంత్రం తాగాలి. ఈ కషాయం తాగడం వల్ల పొడి దగ్గు తగ్గడమే కాకుండా ఛాతీలో పట్టినట్టుగా ఉన్నా కూడా ఉపశమనం లభిస్తుంది.

● కప్పు నీటిలో మూడు మల్బరీ ఆకులను వేసి పది నిమిషాల పాటు మరగబెట్టి దింపి చల్లార్చాలి. ఇందులో కోడిగుడ్డులోని తెల్ల సొన కలుపుకుని తాగాలి. దీర్ఘకాలంగా బాధిస్తున్న దగ్గు తగ్గుతుంది.

ఫ్యాషన్ సీజనల్ ట్రెండ్

ఒకనాడు కోట గోడలలో విలాసంగా వెలిగింది నేడు, అతివల వస్త్ర సంపదలో సుసంపన్నంగా మెరుస్తోంది. పట్టుకుచ్చులాంటి మెత్తదనం, మది దోచే మెరుపుతో మఖమల్ పేరున్న వెల్వెట్ ఈ వింటర్ సీజన్‌లో రారాజులా విరాజిల్లుతుంది. బాలీవుడ్ తారలు వింటర్ సీజన్‌లో వెల్వెట్‌ను ధరించడంలో ముందుంటారు. అందుకు ముందుగా టబు వెల్వెట్ అనార్కలీలో రాచరికపు హుందాతనంతో కనిపించగా ఇప్పుడు యామి గౌతమ్ ఆకుపచ్చని వెల్వెట్ శారీలో గాంభీర్యంగా కనివిందు చేస్తుంది. సల్వార్ సూట్‌లు, లాంగ్ ఓవర్‌కోటులు, సంక్లిష్టమైన ఎంబ్రాయిడరీతో వెల్వెట్ ఎప్పుడూ ఎవర్‌గ్రీన్ మార్కులు కొట్టేస్తూనే ఉంది. ఈ శీతాకాలపు వివాహాలు, పండగ వేడుకలలో అత్యంత ఇష్టమైన ఎంపికగా అతివల మనసును ఆకట్టుకుంటోంది. పచ్చ, ఆకుపచ్చ, నెమలిపింఛం రంగు, రిచ్ బ్రౌన్, బ్లాక్.. వంటి టోన్ షేడ్స్ సెలబ్రిటీ వార్డ్‌రోబ్‌లను రిచ్‌గా మెరిపిస్తున్నాయి.

వెల్వెట్ విలాసం

వెల్వెట్‌కి ఈ సీజన్‌లో మళ్లీ ఊపిరిపోస్తున్నాం అంటే ఒక్క విలాసం గురించే కాదు. మనలోని భావోద్వేగ ప్రతిధ్వనిని కూడా బయటకు వెదజల్లుతుంది. ప్రాచీన ప్రపంచ చక్కదనాన్ని చూపెడుతుంది. చలికాలం మూడ్‌ను ఉత్తేజపరుస్తుంది. ఇండోర్ లైటింగ్‌లో అందమైన ఫొటోలకు మంచి లుక్ ఇస్తుంది. ఎంబ్రాయిడరీ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఫ్యాషన్ మళ్లీ గొప్పగా వెల్వెట్ ఫ్యాబ్రిక్ వెలుగులో నిలిచిపోతుంది.

● ఈ ఏడాది వింటర్ సీజన్‌కి హీనా కొచ్చర్ రూపొందించిన వెల్వెట్ కలెక్షన్ రాయంచలా వచ్చేసింది. బ్రౌన్ అనార్కలీలో టబు ధరించిన వెల్వెట్ రాయల్టీకి ప్రతిరూపంగా నిలిచింది. ధరించిన డ్రెస్‌కు తగినట్టు ఇయర్ హ్యాంగింగ్స్, పొట్లి బ్యాగ్‌తో మ్యాచ్ చేసింది. డ్రెస్ మరింత వైభవంగా వెలిగేలా జుట్టును స్టైల్ చేసింది.

● యామి గౌతమి ఈ ట్రెండ్‌కు రీఫ్రెషింగ్ మినిమలిజాన్ని తీసుకువచ్చింది. దేవనాగరి సెట్ చేసిన ఈ అద్భుతమైన ఆకుపచ్చ వెల్వెట్ చీర సుతిమెత్తని అలలకు నిదర్శంగా నిలిచింది. తక్కువ మేకప్, ఆభరణాలతో అలంకరించింది. ఆమె స్టైలింగ్ అంతా ఫ్యాబ్రిక్ గొప్పదనాన్ని చెప్పకనే చెబుతోంది.

● డిజైనర్ నూరి తయారు చేసిన వెల్వెట్ కఫ్తాన్‌లో శోభిత ధూళిపాళ మెరిసిపోయారు.

అందుకు తగినట్టుగా ఉండే మేకప్, హెయిర్ స్టైల్ కంఫర్ట్‌ని సూచిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

వెల్వెట్ లుక్

ఈ ట్రెండ్‌ను తమదైన సొంత క్రియేషన్‌తో ఎవరైనా స్టైల్ చేయచ్చు.

● నవరత్నాల రంగుల వెల్వెట్‌లో దేనినైనా ఎంచుకోవచ్చు. పచ్చ, టీల్ గ్రీన్, ప్లమ్ కలర్స్ ఎంపికలో సెలబ్రిటీలు ముందున్నారు.

● సందర్భాన్ని బట్టి వెల్వెట్ కఫ్తాన్లు, అనార్కలీలు, కో–ఆర్డ్స్ లేదా చీరలు ధరించవచ్చు. ఏ అకేషన్‌కైనా ఇవి ప్రత్యేకతను తీసుకువస్తాయి.

● ఇతర అలంకరణ వస్తువులను తక్కువ ఉపయోగించాలి. స్టేట్‌మెంట్ ఇయర్ హ్యాంగింగ్స్, సన్నని బంగారు ఆభరణాలతో వెల్వెట్ మరింతగా వెలిగిపోతుంది.

● వెల్వెట్ ధరించినప్పుడు అందుకు తగినట్టు టెక్స్‌చర్డ్ పొట్లి బ్యాగులు, మెటాలిక్ హీల్స్, అలలుగా ఎగిసిపడే వదులైన హెయిర్, పొడవాటి జడలు రాయల్ అనుభూతిని ఇస్తాయి.

● సాంకేతికత



నానోతో పాత ఫొటోలు కొత్తగా!

పాత ఫొటోల్లో అపురూపమైనవి ఉంటాయి. అవి రంగు వెలిసి పాడవుతుంటే అయ్యో అనిపిస్తుంది. పాడైపోతున్న ఫొటోలు కొత్తగా మెరిసి పోవడానికి గూగుల్ నానో బనానా ప్రో ఉపయోగపడుతుంది.

‘ఈ పాత ఫొటోను సహజ రంగులు, స్పష్టమైన వివరాలు, లైటింగ్‌తో రీస్టోర్ చేయండి, ఒరిజినల్ స్టైల్ మిస్ కాకుండా గీతలు, మరకలను తొలగించండి’లాంటి జనరల్ రిస్టోరేషన్ ప్రాంప్ట్‌లతో పాటు పోర్ట్రయిట్ రీస్టోరేషన్, కలర్ కరెక్షన్ ప్రాంప్ట్ రీబిల్డింగ్. టోర్న్ సెక్షన్‌లాంటి ప్రాంప్ట్‌లు ఇవ్వవచ్చు.

కొన్ని టిప్స్:....

● అతిగా మార్పులు చేయడం వల్ల ఫొటో సహజత్వం కోల్పోతుంది

● ప్రతి కాలానికీ తనదైన కలర్ థీమ్ ఉంటుంది. ఆ థీమ్‌కు తగ్గ కలర్‌నే వాడితే బాగుంటుంది.

● షాడోస్ ఫొటోలకు సహజత్వాన్ని ఇస్తాయి. పాత ఫొటోలలో టూ మెనీ షాడోస్, హైలైట్స్ తొలగించడం వల్ల ఫొటో ఫ్లాట్‌గా కనిపిస్తుంది

● చాలామంది ‘ఫిక్స్ దిస్ ఫొటో’ అని మొక్కుబడిగా ప్రాంప్ట్ ఇచ్చి వదిలేస్తుంటారు. దీని వల్ల ఫొటోలో ఫేసియల్ ఫీచర్స్ అసహజంగా కనిపిస్తాయి.

● వోవర్–షార్పెనింగ్ వద్దు.

● ఒరిజినల్, రిస్టోర్డ్ వర్షన్‌లను పక్క పక్కన పెట్టుకొని ఎప్పటికప్పుడు పోల్చి చూసుకోవాలి.

రుచుల రాణి... మన బిర్యానీ!

కాస్త పరికించి చూడండి...
బౌల్‌లో బిర్యానీపైనున్న అనాసపువ్వును చూస్తే
అందాల రాణి తలపైనున్న కిరీటంలా కనిపించడం లేదూ!

మరికాస్త పరిశీలనగా చూడండి... అందులోని
బిర్యానీ ఆకుల్ని చూస్తే అందాలరాణికి
అన్నివైపులా వీస్తున్న వింజామరల్లా లేవూ!

ఇంకాస్త అవలోకించి చూడండి...
ఆ పక్కనున్న మరాఠీమొగ్గల్ని చూడండి...
భల్లాలదేవుడి పక్కనున్న బాహుబలి ఛత్రంలా
పట్టుకున్న బల్లెంలా అనిపించడం లేదూ!

ఇంతింత వర్ణన ఎందుకంటారా? ‘టేస్ట్ అట్లాస్’ సంస్థ ప్రపంచవ్యాప్తంగా రైస్‌తో తయారు చేసే పది 50 వంటకాలను ఎంపిక చేస్తే అందులో మన బిర్యానీ... ఏదీ మన దమ్మున్న బిర్యానీ అయిన హైదరాబాదీ దమ్ బిర్యానీ పదవస్థానంలో నిలిచింది. పదిలో ఉన్న మన బిర్యానీని పద పద తిందామంటూ ఆవురావురంటున్నారట లోకంలోని రైసాహార ప్రియులు.

బెస్ట్ ఫుడ్ అండ్ సిటీస్ అనీ, బెస్ట్ డిష్ అనీ, బెస్ట్ క్యూజిన్ అనీ... ఇలా ఆహారాల విషయంలో సంప్రదాయ ఆహార అవార్డులు (ట్రెడిషనల్ ఫుడ్ అవార్డ్స్) ఇచ్చే ‘టేస్ట్ అట్లాస్’ సంస్థ నిర్వహించిన ఒక ఎంపిక కార్యక్రమంలో రైస్‌తో చేసే ఆహారాల్లో మన బిర్యానీకి దశకం దక్కింది. దక్కిందంటే దక్కదా మరి... బిర్యానీ రైసులోకి వడ్డించే రైతా కోసం మర్డర్లు జరిగిన చరిత్ర ఉన్న మన బిర్యానీకి ఆమాత్రం గౌరవం దక్కొద్దా మరి!

ఇలా పద్ధతిగా పదిలంగా పదోస్థానంలో దక్కించుకున్న తర్వాత ఎట్టకేలకు తెలిసిందేమిటంటే... మనమంటే ఏదో లోకల్ ఫీలింగుతో బిర్యానీని తలకెక్కించుకున్నాం అనుకున్నా... అది తప్పనీ... లోకో భిన్న‘రుచి’ అనుకునే ఈ ప్రపంచవ్యాప్త లోకప్రియత్వంలోనూ మిగతా 50 డిష్షుల్లో మరో 40 స్థానాలకంటే కూడా అది పైనే ఉందని తేలింది. మన ఈ డిష్షు... మిగతా 50 రైసు డిష్షులను డిష్యుం డిష్యుం అని కొట్టేసి మరీ ఈ పదో స్థానం కొట్టేసిందంటే అది మనకు కూడా గ్రేటే కదా!

ఇక క్యూరియాసిటీ కోసం మిగతా తొమ్మిది రైసు డిష్షులేవో చూద్దామా? వీటిల్లో జపాన్‌లోనే వండీనెగిటో రోడాన్‌కు మొదటిస్థానం, సూశీకి రెండో ప్లేసూ, మూడులో కెయిసెండాన్, నాలుగులో ఒటోరో నిగిరీ, ఏడులో చుటోరో నిగిరీ, ఎనిమిదిలో ప్లెయిన్ నిగిరీ, తొమ్మిదిలో మాకీ అనే రైసు వంటకాలున్నాయి. ఇక జపాన్ వంటల ఆధిపత్యానికి గండి కొడుతూ ఐదో స్థానంలో అర్రాజ్ టపోడా, ఆరులో కెన్యావాళ్ల కుకాంగా అనే వంటకాలు నిలిచాయి.

అదీ మరి... రైసు వంటకాల రేసులో మన హైదరాబాద్ బిర్యానికి దక్కిన గౌరవమంటే ఇదే మరి!!

● బ్యూటిప్స్

పిగ్మెంటేషన్‌కు ఈజీగా చెక్ పెట్టండి ఇలా...

ఎంతగా అలంకరించుకున్నా, ఎంత మంచి యాక్సెసరీస్ ధరించినా పిగ్మెంటేషన్ ఉండటం వల్ల ముఖం కళావిహీనంగా కనిపిస్తుంది. దీనిని తొలగించుకునే మార్గం ఆలోచించకుండా చాలామంది మేకప్‌తో కవర్ చేయాలని చూస్తారు. అయితే చిన్న ఇంటి చిట్కాల ద్వారా పిగ్మెంటేషన్ సమస్య నుంచి బయట పడవచ్చు. అవేమిటో చూద్దాం...

అర కప్పు యాపిల్ సిడార్ వెనిగర్ లో అర కప్పు నీరు కలపండి. పిగ్మెంటేషన్ ఉన్న చోట ఈ నీటిని పోయండి. నాలుగైదు నిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. ఇలా రోజుకి రెండుసార్లు నెల రోజుల పాటు చేయడం వల్ల పిగ్మెంటేషన్ మటు మాయం అవుతుంది.

అంతకన్నా సులువైన చిట్కా మరోటి ఉంది. అదేమిటంటే... ఒక బౌల్‌లో ఐదారు టీ స్పూన్ల పసుపు తీసుకుని అందులో తగినంత పాలు పోసి మెత్తటి పేస్ట్‌లా చేయండి. పిగ్మెంటేషన్ ఉన్నచోట ఈ పేస్ట్ అప్లై చేసి ఐదునిమిషాలపాటు గుండ్రంగా మసాజ్ చేయండి. ఆరిన తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. రోజూ స్నానానికి ముందు ఒకసారి ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

ఫేషియల్ క్లెన్సర్

ఒక కప్పు క్యాబేజ్ తురుము, ఒక టీస్పూను ఓట్స్ పొడి కలిపి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చటి నీటితో కడగాలి. పొడి చర్మానికయితే చివరగా ముఖానికి మాయిశ్చరైజింగ్ క్రీమ్ కానిపాల మీగడ లేదా వెన్న రాయాలి.

రెండు టేబుల్ స్పూన్ల ఓట్ పౌడర్ కాని మొక్కజొన్న పొడి కాని తీసుకుని అందులో కోడిగుడ్డు సొన కలిపి నురగ వచ్చే వరకు చిలకాలి. ముందుగా ముఖాన్ని శుభ్రంగా కడిగి తుడిచిన తర్వాత ఈ మిశ్రమాన్ని రాసి ఇరవై నిమిషాల పాటు ఉంచాలి. ఈ ప్యాక్‌ను జాగ్రత్తగా శుభ్రం చేయాలి. ముందుగా తడి టవల్‌తో మెల్లగా రుద్దుతూ ప్యాక్‌ను పూర్తిగా తొలగించిన తరవాత ఒకసారి వేడినీటితోనూ మరొకసారి చన్నీటితోనూ కడగాలి. నార్మల్ స్కిన్, ఆయిలీ స్కిన్ అయితే అలాగే వదిలేయవచ్చు, పొడిచర్మం అయితే మాత్రం శీతకాలం కాబట్టి అవసరమనిపిస్తే కొద్దిగా క్రీమ్ రాసుకోవచ్చు.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) నవంబర్ 27న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,26,410	బంగారం (24 క్యారెట్లు)	1,29,600	బంగారం (24 క్యారెట్లు)	1,27,750	బంగారం (24 క్యారెట్లు)	1,29,600	బంగారం (24 క్యారెట్లు)	1,25,500	బంగారం (24 క్యారెట్లు)	1,28,400
బంగారం (22 క్యారెట్లు)	1,16,110	బంగారం (22 క్యారెట్లు)	1,17,100	బంగారం (22 క్యారెట్లు)	1,17,100	బంగారం (22 క్యారెట్లు)	1,12,610	బంగారం (22 క్యారెట్లు)	1,15,460	బంగారం (22 క్యారెట్లు)	1,17,700
వెండి	1,64,500	వెండి	1,66,100	వెండి	1,80,000	వెండి	1,69,300	వెండి	1,67,200	వెండి	1,80,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● సక్సెస్ స్టోరీ



అమన్ అంటే... అమేయ ప్రతిభ!

యువ ప్రపంచంలో ఇప్పుడు హాట్ టాపిక్... వైబ్ కోడింగ్. వైబ్ కోడింగ్ అనేది ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌తో కోడ్ రాసే విధానం. పెద్దగా సాంకేతిక పరిజ్ఞానం, డిగ్రీలు అక్కర్లేదు. వైబ్ కోడింగ్‌కు సంబంధించి ఏఐ టూల్ 'కర్సర్'ను రూపొందించి ప్రపంచ దృష్టిని ఆకర్షించిన అమన్ సాంగర్ పాతికేళ్ల వయసులోనే బిలియనీర్ అయ్యాడు...

కొన్ని సంవత్సరాల క్రితం వరకు ఎంతో మంది కాలేజీ కోడర్‌లలో అమన్ సాంగర్ ఒకరు. ఇప్పుడు మాత్రం గ్లోబల్ ఏఐ ఇన్నోవేషన్‌కు సంబంధించి ప్రపంచ ప్రసిద్ధ యువకులలో ఒకరిగా పేరు తెచ్చుకున్నాడు.

జనరేటివ్ ఏఐ ప్రపంచంలో 'అమన్ సాంగర్' అనేది సుపరిచిత పేరుగా మారింది. 'ఎనీస్ఫియర్' సహ–వ్యవస్థాపకులలో 25 సంవత్సరాల అమన్ ఒకరు.

ఫాస్ట్–రైజింగ్ ఏఐ టూల్‌గా పేరు తెచ్చుకున్న 'కర్సర్' అనేది ఎనీస్ఫియర్ కంపెనీ సృష్టి. మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)లో తనకు పరిచయం అయిన మైఖేల్ ట్రుయేల్, సుయాలే, ఆర్విడ్ మార్క్‌లతో కలిసి 'ఎనీస్ఫియర్' ప్రారంభించాడు అమన్. అద్భుతమైన సాంకేతిక పరిజ్ఞానం ఉన్న టీమ్‌గా 'ఎనీస్ఫియర్' పేరు తెచ్చుకుంది. అమన్, మైఖేల్ ట్రుయెల్‌లు 'నియో స్కాలర్స్'గా ఎంపికయ్యారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న యువతరాన్ని సిలికాన్ వ్యాలీలోని ఫౌండర్స్, ఇన్వెస్టర్‌లకు పరిచయం చేసే కార్యక్రమమే...నియో స్కాలర్స్.

ఈ పరిచయాల వల్ల కంపెనీ ఫస్ట్ రౌండ్ ఫండింగ్ సాఫీగా సాగింది. మొదట్లో 'ఎనీస్ఫియర్' బృందం కంప్యూటర్–ఎయిడెడ్ డిజైన్‌కు సంబంధించి ఏఐ టూల్‌ను రూపొందించింది. ఆ తరువాత దారి మార్చి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ వైపు అడుగులు వేసింది. ఇది తాము కొన్ని సంవత్సరాల పాటు పనిచేసిన డొమైన్. సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ వైపు రావాలని తీసుకున్న నిర్ణయమే 'కర్సర్'ను రూపొందించడానికి కారణం అయింది. ఈ ఏఐ–పవర్డ్ కోడ్ ఎడిటర్ తక్కువ కాలంలోనే ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 'వైబ్ కోడింగ్' అనే ఐడియాను పరిచయం చేసింది కర్సర్.

వైబ్ కోడింగ్ ద్వారా డెవలపర్స్ నేచురల్ లాంగ్వేజ్ మోడల్స్‌ని ఉపయోగించి కోడ్‌కు సంబంధించి రైట్, ఎడిట్, డీబగ్ చేయవచ్చు. కాలిన్స్ డిక్షనరీ వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా 'వైబ్ కోడింగ్' ఎంపికైంది. తక్కువ టైమ్‌లోనే ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్న 'ఎనీస్ఫియర్' వేగంగా వృద్ధి చెందింది. కంపెనీ కో–ఫౌండర్స్ బిలియనీర్‌లుగా మారారు. పద్నాలుగేళ్ల వయసులోనే కోడింగ్ మొదలుపెట్టాడు అమన్. ప్రోగ్రామింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన విషయాలపై ఆసక్తి ప్రదర్శించేవాడు.

'నా భవిష్యత్ చిత్రపటం' ఇలా ఉండాలని అమన్ ఎప్పుడూ ప్లాన్ చేసుకోలేదు.

అయితే సాంకేతిక అంశాలపై తనలోని ఆసక్తే ఎన్నో దారులలోకి తీసుకువెళ్లింది. చిన్న వయసులోనే సాంకేతికరంగంలో ప్రపంచ ప్రముఖుడిని చేసింది.

'మొదట్లో కంపెనీ పరిస్థితి ఎలా ఉన్నా, ఆ తరువాత మాత్రం పోటీ ఎదురవుతుంది. పోటీని ఎలా తీసుకుంటారు?' అనే ప్రశ్నకు అమన్ ఇచ్చిన జవాబు...

'పోటీ గురించి నిరంతరం పట్టించుకుంటాం. వారి పనితీరు కూడా పరిశీలిస్తాం. పనితీరు, ఆవిష్కరణలు నచ్చితే వారిని స్ఫూర్తిగా తీసుకుంటాం. మాకే అన్నీ తెలుసు అనుకోము. ఎందుకంటే మేము చేయలేనివి కూడా వారు చేసి ఉండవచ్చు.'

ఒక బాటసారి

మనలో ఒక అంశంపై ఆసక్తి ఉంటే అది ఒకేచోట ఆగిపోదు. నాన్‌స్టాప్‌గా ప్రయాణిస్తూనే ఉంటుంది. ఎన్నో దారులలో ఎన్నో విషయాలు తెలుస్తుంటాయి. అలాంటి ఒక బాటసారి అమన్ సాంగర్. వీడియో గేమ్స్ కంటే ఎక్కువగా కోడింగ్ అంటే ఇష్టం. ఆ ఇష్టం అతడిని ఎంతో దూరం నడిపించింది. సిలికాన్ వ్యాలీ వరకు తీసుకువెళ్లి సాంకేతిక దిగ్గజాలను పరిచయం చేసింది. 'పోటీలో మన ముందు ఉన్న వ్యక్తిని చూసి భయపడవద్దు. వెనక్కి తగ్గవద్దు. మన కంటే అతడికి ఎక్కువ తెలిసి ఉంటే అతడిని స్ఫూర్తిగా తీసుకోవాలి. పోటీతో మనల్ని మనం మరింతగా మెరుగుపరుచుకోవచ్చు' అంటున్నాడు అమన్ సాంగర్.

● ట్రెండ్

బనానా 2

నానో బనానా మరోసారి సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. అయితే ఈ సారి 'నానో బనానా2'తో!

ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే 'నానో బనానా' అన్ని ప్లాట్‌ఫామ్‌లలో అత్యంత ప్రియమైన ట్రెండ్‌లలో ఒకటిగా మారింది. దానికి సీక్వెల్‌గా 'బనానా2' తీసుకువచ్చింది గూగుల్.

'నానో బనానా' అనే వింత పేరు వాస్తవానికి గూగుల్ అనధికారిక అంతర్గత కోడ్‌ను సూచించే పేరుగా ప్రారంభమైంది. యూజర్‌లు ఈ పేరును బాగా ఇష్టపడినందున అదే పేరు ఉంచాలని గూగుల్ నిర్ణయించింది.

'మల్టీ–స్టెప్ జనరేషన్ ప్రాసెస్' అనేది నానో బనానా 2ను ప్రత్యేకంగా నిలిపింది. చిత్రాలను తక్షణమే రూపొందించే ఏఐ సాధనాలకు భిన్నంగా 'బనానా2' తగిన సమయం తీసుకుంటుంది.

చిత్రాన్ని ప్లాన్ చేస్తుంది.

దానిని డ్రాఫ్ట్ చేస్తుంది.

లోపాలను వెదికి వాటిని సరిచేస్తుంది.

తుది మెరుగులు దిద్ది చిత్రాన్ని ఆకర్షణీయంగా రూపొందిస్తుంది.

'నానో బనానా 2'తో సరదా ప్రయోగాల నుంచి వింతల వరకు సోషల్ మీడియాలో పోస్ట్‌లు వెల్లువెత్తుతున్నాయి.

'వాస్తవికత ఉట్టిపడే 3డీ క్యారెక్టర్స్‌తో, పర్‌ఫెక్ట్ లైటింగ్‌తో నానో బనానా 2 ఆహా అనుకునేలా ఉంది. నానో బనానా2 అనేది అన్‌లిమిటెడ్ ఫర్ ఏ ఇయర్ ఫర్ ఎవ్రీవన్ జైనింగ్' అని ఒక యూజర్ రాశారు. గూగుల్ లాంచ్ చేసిన అడ్వాన్స్‌డ్ ఏఐ ఇమేజ్–జనరేషన్ మోడల్ (విత్ 4కె రిజల్యూషన్) 'బనానా2'కు సోషల్ మీడియాలో అద్భుత స్పందన లభిస్తున్నప్పటికీ ప్రైవసీకి సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. 'బనానా 2' వల్ల వాస్తవికత ఉట్టిపడే నకిలీ చిత్రాలను జనరేట్ చేసే ముప్పు పెరుగుతుంది. దీని వల్ల తప్పుడు సమాచారం, అనుకరణ, బ్రాండ్‌ల దుర్వినియోగం జరిగే అవకాశం ఉంది.

కొన్ని చిత్రాలు సైబర్ క్రైమ్ పరిధిలోకి కూడా రావచ్చు.

● డిక్షనరీ.కామ్ వర్డ్ ఆఫ్ ది ఇయర్

సిక్స్ సెవెన్

డిక్షనరీ.కామ్ 'వర్డ్ ఆఫ్ ది ఇయర్'గా 6–7 ఎంపికైంది. సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన, తల్లిదండ్రులను కలవరపెట్టిన, పాఠశాలలో నిషేధానికి గురైన పదం ఇది. అల్గోరిథమ్, మీమ్‌ల యుగంలో భాష ఎలా పరివర్తన చెందుతుందో చెప్పే పదం కూడా. **ఇంతకీ 6–7 అంటే?** జెన్ జీ ప్రకారం సిక్స్ అండ్ సెవన్ అంటే.. ఏ ప్రశ్న అడిగినా 'కావచ్చునేమో' 'అవునేమో' అని సమాధానం ఇవ్వడం. మరి కొందరి ప్రకారం ఏ ప్రశ్న అడిగినా వ్యంగ్యంగా సమాధానం ఇవ్వడం. ర్యాపర్ స్క్రిల్లా డూట్ డూట్ (6– 7) పాటతో 'సిక్స్ అండ్ సెవెన్' పాపులర్ అయింది. ఎన్నో వైరల్ క్లిప్‌లు వెల్లువెత్తాయి. టిక్‌టాక్‌లో ఊపందుకున్న 6–7 ధోరణి మిగతా ప్లాట్‌ఫామ్‌లకు చేరింది. 'తరగతి గదిలో అంతరాయం కలిగించే మాట' అంటూ అమెరికాలోని చాలా స్కూల్స్‌లో ఈ మాటను నిషేధించారు. '6–7'ను ఉపయోగించే విద్యార్థులకు రకరకాల అసైన్‌మెంట్స్ ఇవ్వడం నుంచి జరిమానా వేయడం వరకు చేసేవారు. 'అర్థం కోసం కాదు అర్థరహితతకు ప్రత్యేకంగా నిలిచింది...67' అంటున్నారు డిక్షనరీ.కామ్ లెక్సికోగ్రాఫర్‌లు.

● టెక్.. టాక్

మోటరోలా జి57

సైజ్: 6.7 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్
బ్యాటరీ: 7000 ఎంఏహెచ్
ఇంటర్నల్ స్టోరేజ్: 128జీబి
➡ 2కె వీడియో రికార్డింగ్
కెమెరా మోడ్స్: నైట్ వెర్షన్, పోర్ట్రయిట్, ప్రో మోడ్ పనోమరమ

రియల్ మీ జీటి 8 ప్రో

డిస్‌ప్లే: 6.79 అంగుళాలు
రిఫ్రెష్‌రేట్: 144 హెచ్‌జడ్
రిజల్యూషన్: 1440×3136 పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
వోఎస్: ఆండ్రాయిడ్ 16
బ్యాటరీ: 7000 ఎంఏహెచ్
మెమొరీ: 256జీబి 12జీబి ర్యామ్/256జీబి 16జీబి ర్యామ్/ 512 జీబి 12జీబి

హువావే మేట్‌ప్యాడ్ ఎడ్జ్

సైజ్: 14.2 అంగుళాలు
రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జడ్
రిజల్యూషన్: 3120×2080 పిక్సెల్స్
బ్యాటరీ: 12800 ఎంఏహెచ్
కలర్ ఆప్షన్స్: మూన్‌లైట్ సిల్వర్, స్పేస్ గ్రే

ఇన్‌స్టాక్స్ మినీ లింక్ 3 స్మార్ట్‌ఫోన్ ఫొటో ప్రింటర్

బ్రాండ్: ఇన్‌స్టాక్స్
కనెక్టివిటీ: బిల్ట్ టెక్నాలజీ
ప్రింటింగ్: ఫ్యూజీ ఫిల్మ్
బరువు: 210 గ్రా.
మ్యాగ్జిమమ్ ప్రింట్ స్పీడ్ (కలర్): 4

సాక్షి సినిమా

కొత్త సినిమా ఆరంభం

● చైతన్య, శ్రీవిష్ణు, అగస్త్య, శ్రేయ రుక్మిణి

నరేష్ అగస్త్య, శ్రేయ రుక్మిణి జంటగా నటించనున్న కొత్త సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. చైతన్య గండికోట దర్శకత్వంలో డా.ఎం రాజేంద్ర నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి రఘుబాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో శ్రీ విష్ణు క్లాప్ ఇచ్చారు. దర్శకుడు బి.గోపాల్ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. మాజీ ఐఏఎస్ అధికారి సునీల్ శర్మ, ఆయన భార్య షాలినీ శర్మ కలిసి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. ''ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మిక్కీ జె మేయర్.

నా కెరీర్‌లో శివ ప్రత్యేకం

\- నాగార్జున

''నా కెరీర్‌లో 'శివ' సినిమా చాలా ప్రత్యేకం. అలాగే 'గీతాంజలి' చిత్రం కూడా. 'శివ' లాంటి సినిమా మళ్లీ ఇప్పుడు వస్తుందా? అంటే చెప్పలేను. అప్పట్లో జరిగిపోయిందంతే'' అని హీరో నాగార్జున చెప్పారు. గోవా వేదికగా జరుగుతున్న 56వ ఇఫీ (ఇంటర్‌నేషనల్ ఆఫ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) వేడుకలు జరుగుతున్న సంగతి తెలిసిందే. నాగార్జున హీరోగా నటించిన 'శివ, గీతాంజలి' సినిమాలు ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్పెషల్ స్క్రీనింగ్ అయ్యాయి. 'ప్రిజర్వింగ్ ది క్లాసిక్స్: ది జర్నీ ఆఫ్ శివ' కార్యక్రమంలో భాగంగా నాగార్జున గోవా వెళ్లారు. అక్కడ ఆయన మాట్లాడుతూ –''శివ' 36 సంవత్సరాల క్రితం వచ్చినప్పటికీ ఇప్పటి సినిమాలానే ఉంటుంది. కేవలం యాక్టింగ్ పరంగానే కాదు.. సౌండ్ డిజైన్, కెమెరా వర్క్, లైటింగ్ ప్యాట్రన్, డైరెక్షన్ బ్రిలియన్సీ... ఇలాంటి అంశాలు ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తాయి. ఇలా టెక్నికల్ పరంగానూ ఈ సినిమా ఇప్పటికీ రిలవెంట్‌గానే ఉంటుంది. ఇది నా ప్రామిస్. 'శివ 4కె' వెర్షన్ స్క్రీనింగ్ కోసం వచ్చిన మీ అందరికీ (వీక్షకులను ఉద్దేశిస్తూ...) ధన్యవాదాలు'' అన్నారు. దివంగత ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.వైకుంఠ్ బాబ్ శత జయంతి వేడుకలు 'ఇఫీ'లో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన పేరిట ఓ పోస్టల్ స్టాంప్‌ని విడుదల చేశారు.

చికిరి కోసం ట్రెక్కింగ్

● జాన్వీ కపూర్, రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రంలోని 'చికిరి చికిరి...' పాట ఏ స్థాయిలో హిట్ అయిందో చెప్పక్కర్లేదు. ఇప్పటికీ ఆ పాట టాప్ ట్రెండింగ్‌లో దూసుకెళుతోంది. ఈ పాట మేకింగ్ వీడియోని, షూటింగ్ విజువల్స్‌ను గురువారం విడుదల చేసింది యూనిట్. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో జాన్వీకపూర్ హీరోయిన్. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ మూవీ 2026 మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ఈ నెల 7న 'చికిరి చికిరి...' అంటూ సాగే తొలి లిరికల్ వీడియో సాంగ్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ పాట తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో యూట్యూబ్‌లో 100+ మిలియన్ వ్యూస్‌తో రికార్డు నెలకొల్పినట్లు యూనిట్ పేర్కొంది. అంతేకాదు.. ఈ పాట, మ్యాజికల్ వైబ్ కోసం యూనిట్ అంతా 45 నిమిషాల పాటు ట్రెక్కింగ్ చేసినట్లు మేకర్స్ తెలిపారు. ఈ సాంగ్ మేకింగ్ కోసం 'పెద్ది' టీమ్ పడిన కష్టాన్ని వీడియోలో చూపించారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ అందించిన 'చికిరి...' పాటలో రామ్ చరణ్ హుక్ స్టెప్స్ ఇప్పటికీ ట్రెండింగ్‌లో ఉండటం విశేషం.

వారి హృదయంలో హనుమ ఉంటారు

\- మంచు మనోజ్

● మనోజ్, సాయిమాధవ్, అవినాశ్, శంతను

''ఈ రోజుల్లో చిన్న సినిమా, పెద్ద సినిమా అనేది లేదు. కంటెంట్ బాగుండే సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. బాగున్న ప్రతి సినిమా భాషలకు అతీతంగా ఇండియన్ సినిమా అయ్యింది. సాయం చేసే ప్రతి ఒక్కరి హృదయంలో హనుమ(ఆంజనేయస్వామి) ఉంటారు. అవినాశ్, అతని టీమ్ కష్టపడి చేసిన 'వానర' సినిమా సక్సెస్ కావాలి'' అని మంచు మనోజ్ అన్నారు. అవినాశ్ తిరువీధుల హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'వానర'. సిమ్రాన్ చౌదరి హీరోయిన్‌గా నటించగా, నందు విలన్‌గా పాత్ర పోషించారు. శంతను పత్తి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్‌పై అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి సిద్ధం అవుతోంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరైన మనోజ్ మాట్లాడుతూ–''అవినాశ్ ఫాదర్ హనుమంతరావుగారు హీరో కావాలనుకున్నారు. కానీ, పోలీస్ డిపార్ట్‌మెంట్‌కి వెళ్లారు. ఆయన తన కలను కొడుకు అవినాశ్ ద్వారా నిజం చేసుకున్నారు'' అని చెప్పారు. ''వానరుడిలాంటి హీరో బైక్‌ని రావణుడిలాంటి విలన్ తీసుకెళ్లిపోతే, ఆ బైక్‌ను తిరిగి తెచ్చుకునేందుకు ఎలాంటి పోరాటం చేశాడు? అన్నదే ఈ చిత్ర కథ'' అని అవినాశ్ తిరువీధుల తెలిపారు. ''ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు శంతను పత్తి. డైలాగ్ రైటర్ సాయిమాధవ్ బుర్రా, నటులు శివాజీ రాజా, హర్ష, ఎడిటర్ ఛోటా కె ప్రసాద్, స్టోరీ– స్క్రీన్ ప్లే రైటర్ విశ్వజిత్, కెమెరామెన్ సుజాత సిద్ధార్థ్, క్రియేటివ్ డైరెక్టర్ జానకీరామ్ మాట్లాడారు.

శ్రీనివాస మంగాపురం

● జయకృష్ణ

సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, దివంగత నటుడు రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా పరిచయమవుతున్న సంగతి తెలిసిందే. 'ఆర్‌ఎక్స్ 100, మంగళవారం' చిత్రాల ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి రాషా తడాని తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. అశ్వినీదత్ సమర్పణలో చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'శ్రీనివాస మంగాపురం' అనే టైటిల్‌ని ఖరారు చేసి, ప్రీ లుక్ పోస్టర్‌ని ఆవిష్కరించారు మేకర్స్. ''టైమ్‌లెస్ కల్ట్ ప్రేమకథగా రూపొందుతోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. యాక్షన్, రొమాన్స్ వంటి అంశాలు కూడా ఉంటాయి. తన పాత్ర కోసం జయకృష్ణ ఇంటెన్స్‌గా సిద్ధం అయ్యారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం మా సినిమాకు మెయిన్ హైలెట్ కానుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అఖండ 2 ప్రేక్షకులను అలరిస్తుంది

\- బోయపాటి శ్రీను

● అమర్, చోనిత, బోయపాటి శ్రీను

బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన సినిమా 'అఖండ 2: తాండవం'. ఈ చిత్రంలో సంయుక్త, ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఎమ్. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 5న రిలీజ్ కానుంది. 'అఖండ 2'లో బాలకృష్ణ వినియోగించిన వాహనాన్ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోయపాటి శ్రీను మాట్లాడుతూ–''ఒక పవర్ ఉన్న క్యారెక్టర్ దిగి వస్తుంటే దానికి తగ్గ ఒక ఆబ్జెక్ట్ ఉండాలి. క్యారెక్టర్ ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో, ఈ వెహికల్ కూడా అంత పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల్లో ఈ వెహికల్‌ని ఎంత అద్భుతంగా చూపించామో థియేటర్స్‌లోనే చూడాలి. ఈ వెహికల్ డిజైన్ కోసం అమర్ చాలా కష్టపడ్డారు.. అందుకు ఆయన్ను అభినందించాలి. 'అఖండ 2' భారతదేశ ఆత్మ. ప్రేక్షకులు, అభిమానులందరూ హ్యాపీగా ఫీల్ అయ్యే సినిమా ఇది'' అని చెప్పారు. ''అఖండ 2'లాంటి సినిమాకి పని చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఈ వెహికల్ స్క్రీన్‌పై మెస్మరైజ్ చేస్తుంది'' అని చెప్పారు అమర్.

శివుడి గొప్పదనంతో...

● సతీష్, సప్తమి

'లూసియా' మూవీ ఫేమ్ సతీష్ నినాసం హీరోగా, 'కాంతార' మూవీ ఫేమ్ సప్తమి గౌడ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ది రైజ్ ఆఫ్ అశోక'. వినోద్ వి ధోండలే దర్శకత్వంలో వృద్ధి క్రియేషన్, సతీష్ పిక్చర్ హౌస్ బ్యానర్లపై వర్ధన్ హరి, జైష్ణవి, సతీష్ నినాసం నిర్మించారు. పూర్ణచంద్ర తేజస్వి సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'వినరా మాదేవ...' అంటూ సాగే తొలి పాటను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పాటకు శ్రీనివాస్ కాళే సాహిత్యం అందించగా, సతీష్ నినాసం, సాధ్విని కొప్ప, సిద్ధు పాడారు. సంతు మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ''శివుడి గొప్పదనం నేపథ్యంలో 'వినరా మాదేవ..' పాట సాగుతుంది. ఊరంతా కలిసి జరుపుకునే జాతర నేపథ్యంలో వచ్చే ఈ పాటలో లవిత్‌గారు అందించిన విజువల్స్ బాగుంటాయి. త్వరలోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

మరువ తరమా...

● హరీశ్, అవంతిక

హరీశ్ ధనుంజయ, అతుల్య చంద్ర, అవంతిక హరి నల్వా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మరువ తరమా'. చైతన్య వర్మ నడింపల్లి దర్శకత్వం వహించారు. సిల్వర్ స్క్రీన్ పిక్చర్స్‌పై రమణ మూర్తి గిడుతూరి, రుద్రరాజు ఎన్.వి. విజయ్‌కుమార్ రాజు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదల అవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, హీరోలు నారా రోహిత్, శ్రీవిష్ణు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. శ్రీ విష్ణు మాట్లాడుతూ–''డబ్బు కంటే పేరు కోసం ప్రయత్నిస్తున్న వారందరికీ తెలుగు ప్రేక్షకుల సహకారం ఎప్పుడూ ఉంటుంది. ఈ సినిమాని వారు ఆదరిస్తారని కోరుకుంటున్నాను'' అని తెలిపారు. హరీష్ ధనుంజయ్ మాట్లాడుతూ–''మా సినిమా యువ కులకు కనెక్ట్ అవుతుంది. ప్రేక్షకులు థియేటర్ నుంచి చిరునవ్వుతో బయటకు వస్తారు'' అని చెప్పారు. ''మూవీ ఔట్‌పుట్‌తో సంతృప్తి చెందాను'' అన్నారు చైతన్య వర్మ. ''మా సినిమాకి విజయం అందిస్తారని కోరుకుంటున్నాను'' అని రమణ మూర్తి పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	111	85,720
నిఫ్టీ ▲	10	26,216

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,215	▲	189
డోజోన్స్	47,427	▲	315
ఎఫ్‌టీఎస్ఈ 100	9,682	▼	10
డాక్స్	23,760	▲	34
షాంఘై	3,875	▲	11
నికాయ్	50,191	▲	632

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.80	89.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.40	118.36
€	యూరో	ఎస్‌బీఐ	102.20	105.20
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	56.53	57.92
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.18	59.47
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.49	70.20
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.93	24.43
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.42	24.68
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.73	13.55

బుల్ సరికొత్త రికార్డుల్...

- ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు ఆశలు
- కలిసొచ్చిన విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు
- జీవితకాల గరిష్టాలు నమోదు చేసిన సూచీలు

ముంబై: ఇంట్రాడేలో సరికొత్త రికార్డులు నమోదు చేసిన స్టాక్ సూచీలు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 111 పాయింట్లు పెరిగి 85,720 వద్ద ముగిసింది. నిఫ్టీ పది పాయింట్ల స్వల్ప లాభంతో 26,216 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్పలాభాలతో మొదలయ్యాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపుపై ఆశలతో ఐటీ, ఫైనాన్స్ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లూ కలిసొచ్చాయి. ఫలితంగా ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 446 పాయింట్లు బలపడి 86 వేల స్థాయిపైన 86,056 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం105 పాయింట్లు బలపడి 26,310 వద్ద సరికొత్త రికార్డు స్థాయిని లిఖించింది. తద్వారా 2024, సెప్టెంబర్ 27 నాటి సెన్సెక్స్ ఆల్‌టైం హై 85,978, నిఫ్టీ జీవితకాల గరిష్టం 26,277 స్థాయిలు కనుమరుగయ్యాయి. ఆల్‌టైం హై స్థాయిలు నమోదు తర్వాత కీలక రంగాల్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా ఆరంభ లాభాలు కోల్పోయిన సూచీలు స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఆసియాలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు నష్టాల నుంచి పుంజుకున్నాయి. అమెరికా స్టాక్ సూచీలు అరశాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.31%, ఐటీ 0.24%, బ్యాంకెక్స్ 0.15%, టెక్ 0.03 శాతం లాభపడ్డాయి. మరోవైపు రియల్టీ 0.76%, ఇంధన 0.55%, కన్జూమర్ డిస్క్రేషనరీ 0.48%, క్యాపిటల్ గూడ్స్ 0.48%, వినిమయ సూచీ 0.45 శాతం పతనమయ్యాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.38%, 0.01 శాతం నష్టపోయాయి.
- డాలర్ మారకంలో రూపాయి విలువ 14 పైసలు క్షీణించి 89.36 వద్ద స్థిరపడింది. నెలాఖరున బ్యాంకులు, దిగుమతిదార్ల నుంచి డాలర్లకు భారీగా డిమాండ్ పెరగడంతో దేశీయ కరెన్సీ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 89.19 వద్ద రూపాయి ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో 18 పైసలు పతనమై 89.40 వద్ద కనిష్టాన్ని తాకింది. అయితే అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో రూపాయి కొంత కోలుకోగలిగిందని నిపుణులు తెలిపారు.

పేమెంట్ అగ్రిగేటరుగా పేటీఎం

రిజర్వ్ బ్యాంక్ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: పేమెంట్ అగ్రిగేటరుగా కార్యకలాపాలు నిర్వహించేందుకు పేటీఎం పేమెంట్స్ సరీ్వసెస్‌కి (పీపీఎస్ఎల్) రిజర్వ్ బ్యాంక్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఈ ఆగస్టులో సూత్రప్రాయ అనుమతులు ఇచ్చిన ఆర్‌బీఐ తాజాగా సర్టిఫికెట్ ఆఫ్ ఆథరైజేషన్ (సీవోఏ) జారీ చేసినట్లు కంపెనీ మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ వెల్లడించింది. అలాగే కొత్త వ్యాపారులను చేర్చుకోవడంపై 2022 నవంబర్ 25న విధించిన ఆంక్షలను కూడా రిజర్వ్ బ్యాంక్ తొలగించింది. పేమెంట్ అగ్రిగేటరు లైసెన్సు కోసం 2020 నవంబర్‌లో పీపీఎస్ఎల్ దరఖాస్తు చేసుకుంది. అయితే, 2022 నవంబర్‌లో దాన్ని తిరస్కరించిన ఆర్‌బీఐ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలకి అనుగుణంగా మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. దానికి తగ్గట్లు 2022 డిసెంబర్ 14న పీపీఎస్ఎల్ మరోసారి దరఖాస్తు చేసుకుంది.

బాండ్లతో రూ. 12,500 కోట్ల సమీకరణ

ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడి

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో బాండ్ల ద్వారా రూ. 12,500 కోట్లు సమీకరించనున్నట్లు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. ఈటీవల క్విప్ (క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్) మార్గంలో జూలైలో రూ. 25,000 కోట్ల ఈక్విటీ క్యాపిటల్ సమకూర్చుకున్నామని వివరించారు. ఇది రూ. 12 లక్షల కోట్ల రుణ వృద్ధికి తోడ్పడుతుందని, వచ్చే 5–6 ఏళ్ల పాటు క్యాపిటల్ అడెక్వసీ నిష్పత్తిని 15 శాతం స్థాయిలో కొనసాగించేందుకు సరిపోందని ఆయన చెప్పారు. క్విప్‌కి ముందు సైతం తమకు నిధుల సమీకరణ సమస్యేమీ ఉండేది కాదని పేర్కొన్నారు. మరోవైపు వచ్చే వారం పరపతి విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ కీలక పాలసీ రేటును 0.25 శాతం తగ్గించినా ఇబ్బందేమీ లేకుండా తమ నికర వడ్డీ మార్జిన్ (నిమ్) గైడెన్స్ 3 శాతం స్థాయిని సాధించగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో వాస్తవ జీడీపీ వృద్ధి 7.5 శాతంగా, పూర్తి ఆర్థిక సంవత్సరానికి 7 శాతంగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. అధిక వృద్ధి రేటు సాధిస్తున్నప్పుడు కీలక పాలసీ రేట్లను ఎందుకు తగ్గించాల్సి వస్తోందనేది వివరించడమనేది ఆర్‌బీఐకి సవాలుగా ఉండొచ్చని శెట్టి తెలిపారు. అయితే ద్రవ్యోల్బణం నెమ్మదిస్తుండటాన్ని చూస్తే రేట్లను తగ్గించేందుకే అవకాశాలున్నట్లు తెలుస్తోందన్నారు.

పిరమల్ ఫైనాన్స్ లక్ష్యం రూ. 1.5 లక్షల కోట్ల ఏయూఎం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 2028 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 1.5 లక్షల కోట్ల ఏయూఎంని (నిర్వహణలోని అసెట్స్) లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పిరమల్ ఫైనాన్స్ రిటైల్ లెండింగ్ సీఈవో జగదీప్ మల్లారెడ్డి తెలిపారు. ప్రస్తుతం రిటైల్ ఏయూఎం రూ. 75,000 కోట్లుగా ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఇది సుమారు రూ. 8,300 కోట్లుగా ఉన్నట్లు వివరించారు. తమ వ్యాపారంలో సుమారు 11–12 శాతం వాటా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో విస్తరణపై మరింత దృష్టి పెడుతున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రధాన నగరాల్లో 59 శాఖలు ఉన్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా కొత్తగా 50–75 శాఖలు ప్రారంభించనున్నామని, వీటిలో కొన్ని ఇక్కడ కూడా ఉంటాయని జగదీప్ పేర్కొన్నారు. ప్రస్తుత గృహ, ఎస్ఎంఈ, వ్యక్తిగత, వాహన రుణాలందిస్తున్న తమ సంస్థ త్వరలో పసిడి రుణాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఈ పండుగ సీజన్‌లో సెమీ అర్బన్ మార్కెట్లలో డిమాండ్ నెలకొనడంతో రిటైల్ రుణాల మంజూరు 45 శాతం పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

మహీంద్రా ఎక్స్ఈవీ9 సెవెన్ సీటర్

ప్రారంభ ధర రూ. 19.95 లక్షలు

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా కొత్తగా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఎక్స్ఈవీ9ని ప్రవేశపెట్టింది. ఈ సెవెన్ సీటర్ ధర రూ. 19.95 లక్షల నుంచి రూ. 29.45 లక్షల వరకు (ఎక్స్–షోరూం) ఉంటుంది. 2027, 2028 క్యాలెండర్ సంవత్సరాల నాటికి తమ మొత్తం అమ్మకాల్లో ఎలక్ట్రిక్ వాహనాల వాటాని 25 శాతానికి పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ జెజూరికర్ వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరుకల్లా ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకు 8,000 ఈవీల స్థాయికి పెంచుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రస్తుతం ప్రతినెలా 4,000–5,000 ఈవీలను విక్రయిస్తుండగా, దీన్ని 7,000కు పెంచుకునే ప్రణాళికలు ఉన్నాయన్నారు. గత ఏడు నెలల్లో 30,000 పైగా ఈవీలను (బీఈ 6, ఎక్స్ఈవీ 9) విక్రయించామని, రూ. 8,000 కోట్ల ఆదాయం లభించిందని పేర్కొన్నారు. 2027 కల్లా 1,000 చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. తమ బీఈ6 వాహనాల తయారీకి సంబంధించి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) స్కీము కోసం దరఖాస్తు చేసుకుంటున్నామని రాజేష్ చెప్పారు.

త్వరలో 25 వేల మందికి ఐటీ మెసేజ్‌లు

రిటర్నుల్లో విదేశీ ఆస్తుల వివరాలు వెల్లడించనందుకే

న్యూఢిల్లీ: 2025–26 అసెస్‌మెంట్ ఇయర్‌కి (ఏవై) గాను దాఖలు చేసిన ఆదాయ పన్ను రిటర్నుల్లో విదేశీ ఆస్తుల వివరాలను వెల్లడించని వారికి ఆదాయ పన్ను శాఖ త్వరలో ఎస్ఎంఎస్‌లు/ఈ–మెయిల్స్ పంపించనుంది. చట్టపరమైన చర్యలను నివారించేందుకు 2025 డిసెంబర్ 31లోగా సవరించిన ఐటీఆర్‌ను దాఖలు చేయాలంటూ తొలి దశలో 25,000 'హై–రిస్క్' కేసులుగా పరిగణిస్తున్న వారికి వీటిని పంపించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రెండో దశలో డిసెంబర్ మధ్య నుంచి మిగతా కేసులను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు వివరించాయి. ఆటోమేటిక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ (ఏఈఓఐ) కింద విదేశీ జ్యూరిస్‌డిక్షన్ల నుంచి వచ్చిన సమాచారాన్ని బట్టి, విదేశాల్లో ఆస్తులున్నప్పటికీ ఆ వివరాలను వెల్లడించని నిర్దిష్ట ట్యాక్స్‌పేయర్లకు డిపార్ట్‌మెంట్ గతేడాది కూడా ఇలాగే ఎస్ఎంఎస్‌లు, ఈమెయిళ్లు పంపించింది. దీంతో నోటీసులు వచ్చిన వారు, రాని వారు మొత్తం మీద 24,678 మంది రూ. 29,208 కోట్ల విలువ చేసే విదేశీ అసెట్స్ వివరాలను పొందుపరుస్తూ సవరించిన ఐటీఆర్‌లను దాఖలు చేశారు. ఈ ఏడాది జూన్ వరకు ఆదాయ పన్ను శాఖ 1,080 కేసులను మదింపు చేసి, రూ. 40,000 కోట్లకు సంబంధించి డిమాండ్ నోటీసులు పంపింది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, పుణే తదితర నగరాల్లో పలు సోదాలు నిర్వహించింది.

సాక్షి స్పోర్ట్స్

అంధుల మహిళల ప్రపంచకప్ విజేతలకు ప్రధాని మోదీ ప్రశంస

న్యూఢిల్లీ: అంధుల టి20 ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టు సభ్యులు ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకున్నారు. ఫైనల్ గెలిచిన రోజు 'ఎక్స్' వేదికగా అభినందించిన మోదీ... గురువారం విజేత జట్టు సభ్యుల్ని ఆత్మీయంగా పలకరించారు. 'చరిత్ర సృష్టించిన భారత అంధుల జట్టుకు అభినందనలు. ఆరంభ మెగా ఈవెంట్‌లో టోర్నీ మొత్తం అజేయంగా నిలిచారు. మీ కఠోర శ్రమకు, జట్టు సమష్టి కష్టానికి ఈ ట్రోఫీ ఓ నిదర్శనం. ప్రతీ ఒక్కరు అంకితభావంతో ఆడారు. మైదానంలో నిబద్ధతను చూపారు' అని మోదీ ఈ సందర్భంగా క్రికెటర్ల ప్రతిభను కొనియాడారు. యువతరానికి స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అద్వితీయ విజయాలెన్నో సాధించాలని ఆకాంక్షించారు. ఇటీవల కొలంబో వేదికగా ఆరు జట్లతో జరిగిన ఈ మెగా ఈవెంట్ ఫైనల్లో భారత మహిళల జట్టు 7 వికెట్ల తేడాతో నేపాల్‌పై గెలిచింది.

దీప్తి ధమాకా

రూ. 3.20 కోట్లకు సొంతం చేసుకున్న యూపీ వారియర్స్

వరల్డ్ కప్ స్టార్‌కు వేలంలో భారీ మొత్తం ● శ్రీచరణి రూ.1.30 కోట్లతో ఢిల్లీ జట్టుకు

వేలంలో మొత్తం 67 మంది ఎంపిక ● ముగిసిన డబ్ల్యూపీఎల్ వేలం

భారత జట్టు తొలిసారి వన్డే వరల్డ్ కప్ టైటిల్ సాధించడంలో కీలకపాత్ర పోషించిన 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' దీప్తి శర్మకు మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో భారీ విలువ దక్కింది. 2026 సీజన్ కోసం నిర్వహించిన మెగా వేలంలో దీప్తిని అత్యధికంగా రూ.3 కోట్ల 20 లక్షలకు ఆమె గత జట్టు యూపీ వారియర్స్ సొంతం చేసుకుంది. డబ్ల్యూపీఎల్ వేలం చరిత్రలో అత్యధిక మొత్తం 2023లో స్మృతి మంధాన (రూ.3.40 కోట్లు)కు దక్కగా... దీప్తి రెండో స్థానంలో నిలిచింది. కెప్టెన్‌గా మూడుసార్లు ఢిల్లీని ఫైనల్‌కు చేర్చిన ఆస్ట్రేలియా దిగ్గజం మెగ్ లానింగ్‌ను రూ.1.9 కోట్లకు కొనుగోలు చేసిన యూపీ తమ సారథిగా ఎంచుకునే అవకాశం ఉంది. వరల్డ్ కప్ విజయంలో భాగమైన ఆంధ్రప్రదేశ్ అమ్మాయి, వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణిని ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.30 కోట్లు ఇచ్చి మళ్లీ తమ జట్టులోకి తీసుకుంది.

న్యూఢిల్లీ: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)–2026 సీజన్ కోసం గురువారం నిర్వహించిన వేలంలో 67 మంది మహిళా క్రికెటర్లను ఐదు ఫ్రాంచైజీలు ఎంచుకున్నాయి. వీరిలో 23 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. మొత్తం 276 మంది ప్లేయర్లు వేలంలోకి రాగా, గరిష్టంగా 73 ఖాళీలు ఉండగా... తమకు కావాల్సిన ఆటగాళ్లను సొంతం చేసుకునేందుకు టీమ్‌లు ఓవరాల్‌గా రూ.40.80 కోట్లు ఖర్చు చేశాయి. భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు అత్యధికంగా రూ.3.20 కోట్లు దక్కాయి. విదేశీ ఆటగాళ్లలో న్యూజిలాండ్ స్టార్ అమేలియా కెర్‌కు రూ. 3 కోట్లు లభించగా... 11 మంది ప్లేయర్లకు కనీసం రూ.1 కోటి లేదా అంతకంటే ఎక్కువ మొత్తాలు దక్కాయి.

వచ్చే ఏడాది జనవరి 9 నుంచి ఫిబ్రవరి 5 వరకు రెండు నగరాల్లో డబ్ల్యూపీఎల్ జరుగుతుంది. ముంబైలోని డీవై పాటిల్, వడోదరలోని కొటాంబి స్టేడియంలను టోర్నీకి వేదికలుగా నిర్ణయించారు. 2023లో మొదటిసారి డబ్ల్యూపీఎల్ వేలం జరిగింది. ఆ తర్వాత జరిగిన మెగా వేలం ఇదే కావడం గమనార్హం. తొలిసారి జట్లకు రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కార్డును వాడుకునే అవకాశం కల్పించారు. వేలానికి ముందు యూపీ వారియర్స్ వద్ద ఏకంగా రూ.14.50 కోట్లు ఉండటంతో ఆ జట్టు చురుగ్గా పాల్గొని గరిష్టంగా 17 మంది ఆటగాళ్లను ఎంచుకుంది.

డబ్ల్యూపీఎల్ వేలం విశేషాలు

- ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీతో వేలం మొదలైంది. వన్డే వరల్డ్ కప్‌లో చెలరేగిన ఆమె ప్రాథమిక ధర రూ.50 లక్షలు కాగా... ఏ జట్టు కూడా తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించింది.
- దీప్తి కోసం 2023లో యూపీ వారియర్స్ రూ. 2.60 కోట్లు ఖర్చు చేసింది. అయితే ఈ సీజన్‌కు ముందు ఆమెను విడుదల చేసింది. వేలంలో దీప్తి కనీస విలువ రూ. 50 లక్షలకు తీసుకునేందుకు ఢిల్లీ సిద్ధం కాగా... యూపీ ఆర్‌టీఎం కార్డును వాడుకొని తమ జట్టులోకి ఎంచుకుంది.
- డబ్ల్యూపీఎల్‌లో మూడుసార్లు కెప్టెన్‌గా ఢిల్లీని ఫైనల్ చేర్చిన ఆసీస్ దిగ్గజం మెగ్ లానింగ్ కనీస ధర రూ.50 లక్షల నుంచి ఢిల్లీ, యూపీ పోటీ పడగా, చివరకు రూ.1.9 కోట్లతో యూపీ సొంతమైంది.
- వేలంలో భారీ మొత్తం పలికిన ప్లేయర్ల జాబితాలో శిఖా పాండే కాస్త ఆశ్చర్యకరంగా అనిపించింది. భారత జట్టుకు ఎప్పుడో దూరమైన 36 ఏళ్ల శిఖా అంతర్జాతీయ మ్యాచ్ ఆడి దాదాపు మూడేళ్లవుతోంది. అయితే ప్రస్తుతం కరీబియన్ లీగ్ సహా ప్రపంచవ్యాప్తంగా సత్తా చాటుతూ ఫిట్‌గా ఉండటం ఆమె ఎంపికకు ప్రధాన కారణం. ఆర్‌సీబీతో పోటీ పడిన యూపీ చివరకు శిఖాను సొంతం చేసుకుంది.

టాప్ ఆటగాళ్ల జాబితా

1.	దీప్తి శర్మ (యూపీ)	- రూ. 3.20 కోట్లు
2.	అమేలియా కెర్ (ముంబై)	- రూ. 3.00 కోట్లు
3.	శిఖా పాండే (యూపీ)	- రూ. 2.40 కోట్లు
4.	సోఫీ డివైన్ (గుజరాత్)	- రూ. 2.00 కోట్లు
5.	మెగ్ లానింగ్ (యూపీ)	- రూ. 1.90 కోట్లు
6.	శ్రీచరణి రెడ్డి (ఢిల్లీ)	- రూ. 1.30 కోట్లు
7.	షినెల్ హెన్రీ (ఢిల్లీ)	- రూ. 1.30 కోట్లు
8.	ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (యూపీ)	- రూ. 1.20 కోట్లు
9.	లారా వోల్‌వార్ట్ (ఢిల్లీ)	- రూ.1.10 కోట్లు
10.	ఆశా శోభన (యూపీ)	- రూ. 1.10 కోట్లు
11.	జార్జ్ వేర్‌హామ్ (గుజరాత్)	- రూ. 1.00 కోట్లు

శ్రీచరణి స్థాయి పెరిగింది...

వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన నల్లపు రెడ్డి శ్రీచరణి 2025 డబ్ల్యూపీఎల్‌లో రూ.55 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడింది. ఇటీవలి వన్డే వరల్డ్ కప్ విజయంలో ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రధాన పాత్ర పోషించడంతో సహజంగానే ఆమె స్థాయి పెరిగింది. వేలానికి ముందు ఆమెను విడుదల చేసిన ఢిల్లీ ఇక్కడ మళ్లీ పోటీ పడింది. కనీస విలువ రూ.30 లక్షలతో మొదలై ఢిల్లీ, యూపీ మధ్య పోరు సాగింది. చివరకు రూ.1.30 కోట్ల వద్ద వేలం ముగిసింది.

అరుంధతి

త్రిష

మమత

క్రాంతి

మన అమ్మాయిలకు అవకాశం...

డబ్ల్యూపీఎల్ వేలంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు అమ్మాయిలు అవకాశం దక్కించుకున్నారు. ఇటీవల వన్డే వరల్డ్ కప్ విజయంలో భాగమైన శ్రీచరణి, అరుంధతి రెడ్డి (హైదరాబాద్) మరో సందేహం లేకుండా ఎంపికయ్యారు. అరుంధతి రెడ్డిని రూ. 75 లక్షలకు ఆర్‌సీబీ జట్టు ఎంచుకుంది. అండర్–19 వరల్డ్ కప్ విజయంలో భాగమైన హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిషకు తొలిసారి డబ్ల్యూపీఎల్‌లో చాన్స్ లభించడం విశేషం. మమత మాదివాల, నల్లా క్రాంతి రెడ్డి కూడా ఎంపికయ్యారు. త్రిషను రూ. 10 లక్షలకు యూపీ వారియర్స్... మమతను రూ. 10 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్... క్రాంతి రెడ్డిని రూ. 10 లక్షలకు ముంబై ఇండియన్స్ సొంతం చేసుకున్నాయి.

వీరికి నిరాశ

అంతర్జాతీయ క్రికెట్‌లో తమదైన గుర్తింపు ఉన్న పలువురు ప్లేయర్లకు ఈసారి డబ్ల్యూపీఎల్ వేలంలో నిరాశే మిగిలింది. అలీసా హీలీ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా ...విదేశీ ప్లేయర్లలో ఎమీ జోన్స్, హీతర్ నైట్, చమరి అటపట్టు, అలానా కింగ్, తజ్‌మీన్ బ్రిట్స్, సోఫీయా డంక్లీ, సుజీ బేట్స్ తదితరులను ఎవరూ పట్టించుకోలేదు. గతంలో లీగ్‌లో అవకాశం దక్కించుకొని ఈసారి వేలంలో ఎంపిక కాని భారత ప్లేయర్ల జాబితాలో ఉమా ఛెత్రి, సైమా ఠాకూర్‌లతోపాటు సబ్బినేని మేఘన, స్నేహ దీప్తి, అంజలి శర్వాణి (ఆంధ్రప్రదేశ్), యషశ్రీ (హైదరాబాద్) ఉన్నారు.

వేలంలో అమ్ముడుపోయిన ఆటగాళ్ల వివరాలు (విలువ రూ.లలో)

ఢిల్లీ క్యాపిటల్స్: షినెల్ హెన్రీ (1.30 కోట్లు), శ్రీచరణి (1.30 కోట్లు), వోల్‌వార్ట్ (1.10 కోట్లు), స్నేహ్ రాణా (50 లక్షలు), మిన్ను మణి (40 లక్షలు), లిజెల్ లీ (30 లక్షలు), తానియా భాటియా (30 లక్షలు), నందిని శర్మ (20 లక్షలు), దియా యాదవ్ (10 లక్షలు), మమత మదివాల (10 లక్షలు), లూసీ హామిల్టన్ (10 లక్షలు).

గుజరాత్ జెయింట్స్: సోఫీ డివైన్ (2 కోట్లు), జార్జ్ వేర్‌హామ్ (1 కోటి), భారతి ఫుల్‌మలీ (70 లక్షలు), కాశ్వీ గౌతమ్ (65 లక్షలు), రేణుకా సింగ్ (60 లక్షలు), కిమ్ గార్త్ (50 లక్షలు), యస్తిక భాటియా (50 లక్షలు), డానీ వ్యాట్ (50 లక్షలు), తనూజ కన్వర్ (45 లక్షలు), అనుష్క శర్మ (45 లక్షలు), రాజేశ్వరి గైక్వాడ్ (40 లక్షలు), టిటాస్ సాధు (30 లక్షలు), కనిక అహుజా (30 లక్షలు), ఆయుషి సోని (30 లక్షలు), హ్యాపీ కుమారి (10 లక్షలు), శివాని సింగ్ (10 లక్షలు).

ముంబై ఇండియన్స్: అమేలియా కెర్ (3 కోట్లు), సజీవన్ సజన (75 లక్షలు), షబ్నిమ్ ఇస్మాయిల్ (60 లక్షలు), నికోలా క్యారీ (30 లక్షలు), సైకా ఇషాక్ (30 లక్షలు), సంస్కృతి గుప్తా (20 లక్షలు), త్రివేణి వశిష్ట (20 లక్షలు), రాహిలా ఫిర్దోస్ (10 లక్షలు), పూనమ్ ఖెమ్మార్ (10 లక్షలు), నల్లా క్రాంతి రెడ్డి (10 లక్షలు), మిలీ ఇలింగ్‌వర్త్ (10 లక్షలు).

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: లారెన్ బెల్ (90 లక్షలు), పూజ వస్త్రకర్ (85 లక్షలు), అరుంధతి రెడ్డి (75 లక్షలు), గ్రేస్ హారిస్ (75 లక్షలు), డిక్లెర్క్ (65 లక్షలు), రాధ యాదవ్ (65 లక్షలు), జార్జ్ వోల్ (60 లక్షలు), లిన్సీ స్మిత్ (30 లక్షలు), హేమలత దయాళన్ (30 లక్షలు), ప్రేమ రావత్ (20 లక్షలు), గౌతమ్ నాయక్ (10 లక్షలు), ప్రత్యూష కుమార్ (10 లక్షలు).

యూపీ వారియర్స్: దీప్తి శర్మ (3.20 కోట్లు), శిఖా పాండే (2.40 కోట్లు), మెగ్ లానింగ్ (1.90 కోట్లు), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (1.20 కోట్లు), ఆశా శోభన (1.10 కోట్లు), సోఫీ ఎకెల్‌స్టోన్ (85 లక్షలు), డియాండ్రా డాటిన్ (80 లక్షలు), కిరణ్ నవ్‌గిరే (60 లక్షలు), హర్లీన్ డియోల్ (50 లక్షలు), క్రాంతి గౌడ్ (50 లక్షలు), ప్రతీక రావల్ (50 లక్షలు), క్లో ట్రయాన్ (30 లక్షలు), శిప్రా గిరి (10 లక్షలు), సిమ్రన్ షేక్ (10 లక్షలు), తారా నోరిస్ (10 లక్షలు), సుమన్ మీనా (10 లక్షలు), గొంగడి త్రిష (రూ. 10 లక్షలు).

నేటి నుంచి చెన్నై, మదురైలలో జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీ

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

పర్యాటక రంగంలో రాపిడో సేవలు

సాక్షి, అమరావతి: పర్యాటక రంగంలో రాపిడో సంస్థ సహకారంతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం 'డ్రైవర్-కం-గైడ్' సేవలను అందించనుంది. ఈ మేరకు సీఐఐ సదస్సుల్లో రాపిడో సహ-వ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లితో పర్యాటక శాఖ ఒప్పందం చేసుకోగా, సేవలను అందుబాటులోకి తెస్తున్నట్టు గురువారం పర్యాటక శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. మంచి రేటింగ్ ఉన్న డ్రైవర్లను ఎంపిక చేసి, వారికి రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, ఆతిథ్యం, భద్రతపై వచ్చే నెల నుంచి ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. త్వరలోనే విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో ఈ సేవలు ప్రారంభించనుంది. రాపిడో యాప్‌లోనే టూరిస్ట్ ఆటోలు/క్యాబ్‌లు, పర్యాటక సర్క్యూట్ల వివరాలు అందుబాటులో ఉంచనుంది.

కృష్ణకిషోర్‌పై తదుపరి చర్యలు నిలిపివేత

సాక్షి, అమరావతి: గత చంద్రబాబు ప్రభుత్వంలో ఏపీఈడీబీ సీఈవోగా పనిచేసి, ప్రస్తుతం పదవీ విరమణ చేసిన ఐఆర్‌ఎస్ అధికారి జె.కృష్ణకిషోర్‌పై తదుపరి చర్యలను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏపీఈడీబీ సీఈవోగా పనిచేసిన కాలంలో అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు రావడంతో సీఐడీ కేసు నమోదు చేయగా, ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. అనంతరం కిషోర్‌పై కేసును హైకోర్టు రద్దు చేయడంతో ఆయనపై తదుపరి చర్యలను నిలిపివేశారు.

క్లైమాక్స్‌కు చేరిన కర్ణాటకం!

సీఎం మార్పు వివాదంపై దృష్టి సారించిన కాంగ్రెస్ అధిష్టానం

- ఎవరి ప్రయత్నాలను వారు ముమ్మరం చేసిన సిద్ధరామయ్య, డీకే
- మరోవైపు ఇద్దరి మధ్య ట్వీట్ల వార్
- త్వరలోనే పరిష్కారం లభిస్తుందంటున్న పరిశీలకులు

సాక్షి, బెంగళూరు/శివాజీనగర: కర్ణాటక రాజకీయం క్లైమాక్స్‌కు చేరింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ అనుకూల వర్గాల వరుస భేటీలు, రహస్య మంతనాలు, మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాల నేపథ్యంలో అధిష్టానం పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. రాహుల్ గాంధీ జోక్యంతో కర్ణాటక రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తిరుగుబాటు ధోరణిపై రాహుల్ గాంధీ అసహనం వ్యక్తం చేస్తున్నట్లు పార్టీలోని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయా అంశాలు ముఖ్యమంత్రి పీఠంపై కొనసాగడానికి సంబంధించి సిద్ధరామయ్యకు ఇబ్బందికరంగా పరిణమించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వెరసి ఈ పరిణామాలు ముఖ్యమంతి రేసులో డీకే శివ కుమార్‌కు అనుకూలంగా మారుతున్నట్లు కూడా పరిశీలకులు భావిస్తున్నారు. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం సిద్ధరామయ్యపై రాహుల్ అసహనానికి కారణాలను విశ్లేషిస్తే...

అధిష్టానం ఎవరనే చర్చకు తావిచ్చిన సీఎం

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమై మీ సమస్యలు, విజ్ఞప్తులు ఏమైనా ఉంటే ఆయనకు తెలియజేయాలని సిద్ధరామయ్యకు రాహుల్ గాంధీ గడచిన వారాంతంలో సూచించారు. అయితే ఖర్గేను సిద్ధరామయ్య కలుసుకున్నప్పటికీ.. తాను రాహుల్‌తో మాత్రమే చర్చిస్తానని, నేరుగా అధిష్టానంతో తేల్చుకుంటానని చెప్పినట్లు సమాచారం. బహుషా ఈ కారణంతోనే మీడియాతో ఖర్గే మాట్లాడుతూ అధికార మార్పిడి విషయం పార్టీ హైకమాండ్ నిర్ణయిస్తుందని వ్యాఖ్యలు చేసి ఉంటారని గుసగుసలు వినిపిస్తున్నాయి. స్వయంగా ఏఐసీసీ అధ్యక్షుడే 'పార్టీ హైకమాండ్ ఒక నిర్ణయం తీసుకుంటుందని చెప్పినప్పుడు మరి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎవరనే ప్రశ్న ఉత్పన్నం అయ్యింది. ఖర్గే ఈ 'అసహాయ వ్యాఖ్యలు' చర్చనీయాంశమయ్యాయి. దీనంతటికీ సిద్ధరామయ్య తిరుగుబాటు ధోరణే కారణమని రాహుల్ భావిస్తున్నారు. ఇక ప్రభుత్వ వ్యవహారాల్లో సీఎం కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్య జోక్యం చేసుకుంటున్నట్లు నివేదికల అందడం రాహుల్ అసహనానికి మరొక కారణం.

దేవరాజు అరస్ రికార్డును అధిగమించిన తర్వాత రాజీనామా?

మరోవైపు ముఖ్యమంత్రి స్థానం వదులుకునేందుకు సిద్ధరామయ్య కూడా మానసికంగా సిద్ధంగా ఉన్నారని ఆయన వర్గానికి చెందిన కొందరు మంత్రులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. ఒత్తిడి ఎక్కువయితే ఫిబ్రవరి, మార్చి మొదటి వారంలో వచ్చే బడ్జెట్‌ను ప్రవేశపెట్టి తప్పుకునే అవకాశం ఉందని మాట్లాడుకుంటున్నారు. అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పని చేసిన దేవరాజు అరస్ రికార్డును సిద్ధరామయ్య డిసెంబర్‌లో అధిగమిస్తారు. దీంతో అప్పటివరకు ముఖ్యమంత్రిగా పని చేసి అనంతరం తన పదవికి రాజీనామా చేసే అవకాశం కూడా ఉందని కూడా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం 'ట్వీట్ల' యుద్ధం!

కర్ణాటక పరిణామాలు తాజాగా 'ట్వీట్ల' రాజకీయానికి దారితీశాయి. డిప్యూటీ సీఎం చేసినట్లు చెబుతున్న ఒక ట్వీట్‌కు కౌంటర్‌గానా అన్నట్లు సీఎం మరో ట్వీట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. 'ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే ప్రపంచంలో పెద్ద శక్తి' (వర్డ్ పవర్ ఈజ్ వరల్డ్ పవర్) అని డీకే శివ కుమార్ 'ట్వీట్' చేశారు. రెండున్నరేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన మాటను డీకే 'ఈ ట్వీట్ ద్వారా' గుర్తు చేసినట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఆ ట్వీట్ తాను చేయలేదని, అదొక నకిలీ పోస్టు అని డీకే శివకుమార్ కొట్టిపారేశారు. కాగా 'ప్రజల కోసం మంచి ప్రపంచం నిర్మించలేనప్పుడు ఆ మాటకు శక్తి లేనట్లే' అని అర్థం వచ్చేలా సీఎం ట్వీట్ చేశారు. కర్ణాటక ప్రజలు ఇచ్చిన తీర్పు ఐదేళ్ల పరిపూర్ణ బాధ్యత అని పేర్కొంటూ ప్రభుత్వ చేపట్టిన పలు పథకాలను వివరించారు. కర్ణాటక అనేది ఒక నినాదం కాదని, అది మాకు ఒక ప్రపంచమని ట్వీట్ చేశారు.

హైకమాండ్ అంటే అదొక బృందం: ఖర్గే

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు మరో ముగ్గురు నలుగురు కీలక నాయకులను ఢిల్లీకి పిలిపించుకుని చర్చించి అన్నింటికి పరిష్కారం చూపుతామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం బెంగళూరులో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ అంటే ఒకే ఒక్కరు కాదని, అదొక బృందమని, పార్టీ పెద్దలంతా కలసికట్టుగా కూర్చొని మాట్లాడుకుని రాష్ట్ర సమస్యకు పరిష్కారాన్ని తీసుకొస్తామన్నారు. సోనియాగాంధీ శుక్రవారం విదేశాల నుంచి వచ్చాక ఈ సమస్య పరిష్కారం ఒక కొలిక్కి వచ్చే వీలుంది.

అబద్ధపు వాంగ్మూలం కోసం సునీల్‌రెడ్డిపై సిట్ ఒత్తిడి

తనకు ఏమాత్రం సంబంధం లేదని స్పష్టం
తన వ్యాపార లావాదేవీలన్నీ సక్రమంగా ఉన్నాయని వెల్లడి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లేని మద్యం కుంభకోణాన్ని ఉన్నట్టుగా చూపించేందుకు అష్టకష్టాలు పడుతున్న చంద్రబాబు ప్రభుత్వం.. ఆ దిశగా మరిన్ని కుతంత్రాలకు పదును పెడుతోంది. సిట్‌ను అడ్డం పెట్టుకుని అబద్ధపు వాంగ్మూలాల ద్వారా నిందితులను అప్రూవర్లుగా మార్చే కుట్ర చేస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన న్యాయవాది, వ్యాపారవేత్త నర్రెడ్డి సునీల్ రెడ్డిని సిట్ అధికారులు విచారణ పేరుతో వేధింపులకు గురి చేశారు. ఆయన విజయవాడలో సిట్ కార్యాలయంలో గురువారం విచారణకు హాజరయ్యారు. దాదాపు ఏడు గంటలపాటు ఆయన్ను విచారించిన సిట్ అధికారులు అబద్ధపు వాంగ్మూలం కోసం తీవ్ర ఒత్తిడి చేసినట్టు తెలుస్తోంది. గతంలో ఓసారి తనిఖీల పేరుతో సాగించిన సిట్ కుట్ర బెడిసి కొట్టడంతో ఈసారి విచారణ పేరుతో అదే కుతంత్రానికి మరింత పదును పెట్టినట్టు స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ముంబయికి చెందిన వ్యాపారి అనిల్ ఛోకరాతో సంబంధాలున్నాయా అనే కోణంలో సునీల్‌రెడ్డిని ప్రశ్నించినట్టు సమాచారం. తనకు అనిల్ ఛోకరాతోగానీ మరెవరితోగానీ ఎటువంటి సంబంధాలు లేవని ఆయన స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏపీలో ఎటువంటి ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార లావాదేవీలలో తన ప్రమేయం లేదని ఆయన విస్పష్టంగా వివరించినట్లు తెలిసింది. తనకు ఏమాత్రం సంబంధం లేని వ్యవహారాల్లో తనను ప్రశ్నించడం ఏమిటని ఆయన సిట్ అధికారులను నిలదీసినట్టు సమాచారం. తన వ్యాపార సంస్థల బ్యాంకు, ఇతర లావాదేవీలన్నీ సక్రమంగా ఉన్నాయని, ఆ మేరకు రికార్డులను పరిశీలించుకోవచ్చని కూడా ఆయన స్పష్టం చేశారు. అబద్ధపు వాంగ్మూలం నమోదు చేయించేందుకు సిట్ అధికారులు చేసిన ఒత్తిడిని ఆయన సమర్థవంతంగా తిప్పికొట్టినట్టు తెలుస్తోంది. దాంతో సిట్ అధికారులు కూడా ఓ దశలో ఇక ఏమీ చేయలేమనే భావనకువచ్చినట్టు సమాచారం.

బంగాళాఖాతంలో 'దిత్వా' తుపాను

రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన/అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

సాక్షి, అమరావతి: నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని శ్రీలంక తీరంలో తుపాను ముప్పు పొంచి ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ తుపానుకు యెమెన్ దేశం 'దిత్వా'(అక్కడి ప్రసిద్ధ జలాశయం దిత్వా లగూన్ పేరు మీద)గా నామకరణం చేసినట్లు పేర్కొంది. దీని ప్రభావం ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దానికి ఆనుకొని ఉన్న దక్షిణ కోస్తా తీరాలపై ఉంటుందని తెలిపింది. గడిచిన 6 గంటల్లో 17 కిలోమీటర్ల వేగంతో తుపాను ముందుకు కదులుతోందని వెల్లడించింది. ట్రింకోమలీ(శ్రీలంక)కి 200 కి.మీ, పుదుచ్చేరికి 610 కి.మీ, చెన్నైకి ఆగ్నేయంగా 700 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. కాగా, ఈ తుపాను ప్రభావంతో ఉత్తర కోస్తా, యానాంలో శుక్ర, శనివారాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. దక్షిణ కోస్తాలో పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని తెలిపింది. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కొంది.

ముందు జాగ్రత్తలు తీసుకోండి

తుపాను నేపథ్యంలో నాలుగు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నందున కలెక్టర్లు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాలు, కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ధాన్యం తడవకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. తుపాను సమాచారాన్ని ఎస్‌ఎంఎస్‌ల ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ధాన్యం తడిచిపోయి.. తక్కువ ధరకు రైతులు బయట విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత జాయింట్ కలెక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఎస్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడాలని ఆదేశించారు.

నెలాఖరు వరకు వర్షాల్లేవు

పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నెలాఖరు వరకు వర్షాలు ఉండవని, ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందుల్లేవని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడలోని పౌర సరఫరాల సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ.. డిసెంబర్ ప్రారంభంలో కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో వర్ష సూచన నేపథ్యంలో ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోవద్దని.. ధాన్యం తరలింపునకు 24 వేల లారీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాల నుంచి కౌలు రైతులను ఆదుకునేందుకు టార్పాలిన్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ-క్రాప్ నమోదైన పొలంలో వచ్చే దిగుబడిని పూర్తిగా కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 7.53 కోట్ల గోనె సంచులను రైతుభరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. దళారులు రైతులను మోసం చేసేలా వ్యవహరిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 75 కిలోల బస్తాకు రూ.1,792 మద్దతు ధర చెల్లిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌కు
ముందస్తు బెయిల్ ఇవ్వద్దు

అదే జరిగితే ట్రయల్‌పై తీవ్ర ప్రభావం చూపుతుంది
హైకోర్టులో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుబంధ పిటిషన్లు

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో అప్రూవర్లుగా మారుతామని, అందువల్ల తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ప్రధాన నిందితులైన అప్పటి ఏపీ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, ఎక్సైజ్ శాఖ స్పెషలాఫీసర్ దొడ్డా వెంకట సత్యప్రసాద్ దాఖలు చేసిన వ్యాజ్యాలను వ్యతిరేకిస్తూ మరో నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హైకోర్టులో అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. ముందస్తు బెయిల్ కోసం వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్‌లలో తనను ప్రతివాదిగా చేర్చుకుని తన వాదనలు కూడా వినాలని హైకోర్టును కోరారు. వీరివురి ముందస్తు బెయిల్ పిటిషన్లు ఈ నెల 28వ తేదీన (శుక్రవారం) హైకోర్టులో విచారణకు రానున్న నేపథ్యంలో చెవిరెడ్డి తాజా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిలోని ముఖ్యాంశాలు ఇవీ..

బెయిల్‌తో సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం

'మద్యం అక్రమ కేసులో 2, 3 నిందితులుగా ఉన్న వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్ అప్రూవర్లుగా మారి ముందస్తు బెయిల్ పొందితే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉంది. సాక్షులను బెదిరించే అవకాశం ఉంది. వారికి ముందస్తు బెయిలిస్తే అది కేసుతో పాటు ట్రయల్‌పై, సహనిందితులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వీరిద్దరూ ఇచ్చిన వాంగ్మూలాలు నమ్మదగినవి కావు. అందువల్ల వాటిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఈ కేసులో ట్రయల్ మొత్తం పూర్తయ్యేంత వరకు వారిద్దరినీ కస్టడీలోకి తీసుకోవాలి. వారికి ముందస్తు బెయిల్ నిష్పాక్షిక దర్యాప్తు సూత్రాలకు విరుద్ధం. దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు 150 మంది సాక్షులను విచారించారు. 50 మందిని ఈ కేసులో చట్ట విరుద్ధంగా నిందితులుగా చేర్చారు. తప్పు చేయకపోయినా కొందరు నిందితులు ఇప్పటికీ జైల్లోనే మగ్గుతున్నారు. ఎఫ్ఐఆర్ ప్రకారం ఈ కేసులో పబ్లిక్ సర్వెంట్‌లుగా వీరిద్దరి పాత్ర కీలకం. అయితే ఇప్పటికీ వారిని అరెస్ట్ చేయలేదు. వారిపై ఎలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకోలేదు. దర్యాప్తు సంస్థ రాజ్యాంగంలోని అధికరణ 14, 20, 21 నిర్దేశించిన నిష్పాక్షిక దర్యాప్తు సూత్రాలను ఉల్లంఘించినట్లు దీని ప్రకారం అర్థం అవుతోంది. ఈ అక్రమ కేసులో కొందరిపై రాజకీయ కక్ష సాధింపులకు వీరిరువురి వాంగ్మూలాలను వినియోగించుకోవాలని బాబు సర్కార్ కనుసన్నల్లోని దర్యాప్తు సంస్థ కుట్ర పన్నుతోంది. ప్రధాన నిందితులుగా ఉన్న వారిని రక్షిస్తోంది. న్యాయపరమైన పర్యవసానాల నుంచి కాపాడుతోంది. ఇదే విషయంలో వీరు దాఖలు చేసిన పిటిషన్లను ఏసీబీ కోర్టు తిరస్కరించింది. దీంతో వారిద్దరూ ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు' అని భాస్కర్‌రెడ్డి ఆపిటిషన్లలో వివరించారు.

ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణలో నీటిపారుదల అభివృద్ధి

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట సీనియర్ న్యాయవాది జైదీప్‌గుప్తా వాదన

సాక్షి, అమరావతి: ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ ప్రాంతం సమగ్రంగా అభివృద్ధి చెందిందనడానికి రికార్డులే నిదర్శనమని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా నివేదించారు. బచావత్ ట్రిబ్యునల్ తెలంగాణ ప్రాంతానికి కృష్ణానది జలాల్లో 279 టీఎంసీలు కేటాయిస్తే.. 1972–2008 మధ్య ఏటా సగటున 286.90 టీఎంసీలు వినియోగించుకుందని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనకు, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు నీటిపారుదలలో చారిత్రక అన్యాయం కారణం కానేకాదని.. ఆ ప్రాంత ప్రజల రాజకీయ, ప్రజాస్వామ్య ఆకాంక్షలను నెరవేర్చడానికేనని 2016 అక్టోబర్ 19న ట్రిబ్యునల్ జారీచేసిన ఆదేశాలే నిదర్శనమని గుర్తుచేశారు. ఆంధ్ర రాష్ట్రంలో తెలంగాణ విలీనమై ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పాటైన సమయంలో తెలంగాణకు ఎలాంటి హామీ ఇవ్వలేదని చెప్పారు. ఆ సమయంలో తెలంగాణ అభివృద్ధికి హామీ ఇచ్చినట్లుగా ఆ రాష్ట్రం ఎలాంటి రికార్డులు చూపించలేదన్నారు. కానీ ఉమ్మడి రాష్ట్రాన్ని 2014లో విభజించినప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని విభజన చట్టం అందించిందని గుర్తుచేశారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా తుది వాదనలు కొనసాగిస్తూ.. ఉమ్మడి రాష్ట్రంలో నీటిపారుదల రంగంలో అన్యాయం జరిగిందంటూ తెలంగాణ చేస్తున్న వాదన దురుద్దేశంతో కూడుకున్నదన్నారు. అన్యాయం జరిగిందనడానికి చట్టప్రకారం బలమైన రుజువులు చూపాలని ముతా అసోసియేట్స్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో కృష్ణా బేసిన్‌తోపాటు గోదావరి బేసిన్‌లోనూ భారీ ఎత్తున నీటిపారుదల వ్యవస్థ అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ ప్రాంతంపై ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం లేదని హైకోర్టు (టి.రామచంద్రరావు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, 2001 ఎస్‌సీసీ/ఏపీ 194) తీర్పు ఇచ్చిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 16 ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల్లో 8 తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయన్నారు. నీటిపారుదల విధాన నిర్ణయాల్లో సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాలు, అంతర్‌రాష్ట్ర ఒప్పందాలు, ట్రిబ్యునల్ అవార్డులు, ప్రజాప్రయోజనాలు ముడిపడి ఉంటాయని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో 1956–2014 మధ్య తెలంగాణ ప్రాంతం అభివృద్ధికి రూ.4.98 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు తెలంగాణ ఆర్థికశాఖ విడుదల చేసిన శ్వేతపత్రంలో పేర్కొందన్నారు. ఆ సమయంలో నాగార్జునసాగర్, జూరాల, కోయిల్‌సాగర్, దేవాదుల, శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టులు పూర్తయ్యాయని.. మంజీర, కృష్ణ, గోదావరి నదుల నుంచి హైదరాబాద్‌కు తాగు నీటిని అందించే ప్రాజెక్టులు పూర్తయ్యాయన్నారు.

హైదరాబాద్ అధికారులదే నిర్లక్ష్యం

తుంగభద్ర ఎడమ గట్టు ప్రధాన కాలువ పొడిగింపుగా ఎగువ కృష్ణ, బీమా ప్రాజెక్టులను బచావత్ ట్రిబ్యునల్ పరిగణించిందని చెప్పారు. ఆ ప్రాజెక్టులను 1956 నవంబర్ 1కి ముందు మంజూరు చేయలేదని స్పష్టం చేశారు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్–108(2) వాటికి వర్తించదన్నారు. ఈ ప్రాజెక్టుల విషయంలో ఏదైనా నిర్లక్ష్యం ఉంటే అది ఏపీ అధికారులది కాదని.. హైదరాబాద్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఆంధ్ర రాష్ట్రంలో తెలంగాణ విలీనమైన తర్వాత తెలంగాణ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేసిందన్నారు. జూరాల తొలిదశకు 23 టీఎంసీలు కేటాయించాలని బచావత్ ట్రిబ్యునల్‌ను డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. కర్ణాటకతో కలిసి ఉమ్మడి బీమా ప్రాజెక్టును ప్రతిపాదించిందని.. కానీ కర్ణాటక సహకరించకపోవడంతో బీమా ఎత్తిపోతలను చేపట్టిందని చెప్పారు. కృష్ణా డెల్టా ఆధునికీకరణలో 29 టీఎంసీలు మిగులుగా తేలితే.. అందులో 20 టీఎంసీలను తెలంగాణ ప్రాంతంలోని బీమా ఎత్తిపోతలకు కేటాయించిందని గుర్తుచేశారు. కేడబ్ల్యూడీటీ–2లో తెలంగాణ ప్రాంతం కోసం జూరాలకు అదనంగా 9 టీఎంసీలు కేటాయించాలని డిమాండ్ చేసి, ఆ మేరకు కేటాయింపులు రాబట్టిందని వివరించారు. తదుపరి విచారణను డిసెంబర్ 17–18 తేదీలకు వాయిదా వేసింది. వచ్చే నెలలో ట్రిబ్యునల్ నిర్వహించే విచారణలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా తుది వాదనలు కొనసాగించనున్నారు.



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

రెండో రోజు ముగిసిన జోగి రమేష్ సోదరుల కస్టడీ

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): నకిలీ మద్యం కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాముల రెండో రోజు కస్టడీ ముగిసింది. ఇరువురిని కోర్టు నాలుగు రోజుల కస్టడీకి అనుమతించగా, గురువారం (రెండో రోజు) ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలీసులు విచారించారు. అనంతరం ఇరువురికి జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి విజయవాడ జైలుకు తరలించారు.

తిరుపతిలో 600 ఎకరాల్లో ధార్మిక టౌన్‌షిప్

సాక్షి, అమరావతి: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో 600 ఎకరాల్లో వసుధైక కుటుంబం పేరుతో నిర్మిస్తున్న ధార్మిక టౌన్‌షిప్‌నకు సహాయ సహకారాలు అందించాలని డెల్లా కంపెనీ ప్రతినిధులు జిమ్మి మిస్త్రీ, దిబ్యేందు బెనర్జీయేలు రాష్ట్ర రెవెన్యూ మంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కోరారు. వారు గురువారం సచివాలయంలో మంత్రిని కలిసి ఈ ప్రాజెక్టు గురించి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తిరుపతి ప్రపంచస్థాయి టూరిస్ట్ హబ్‌గా మారుతుందని చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఈ ప్రాజెక్టుకు నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు త్వరగా ఇచ్చేలా కృషిచేస్తామని తెలిపారు.

డ్రగ్స్ కేసులో కొండారెడ్డికి రిమాండ్

విజయవాడ లీగల్: బెంగళూరు నుండి డ్రగ్స్ తీసుకొచ్చి సరఫరా చేస్తున్నాడనే ఆరోపణలపై నమోదైన కేసులో విశాఖపట్నం జైలులో రిమాండ్‌లో ఉన్న కొండారెడ్డిని పోలీసులు పీటీ వారెంటుపై విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ మేజిస్ట్రేట్ కోర్టులో గురువారం హాజరుపరిచారు. డ్రగ్స్‌తో పట్టుబడ్డ విద్యార్థుల నుండి ఈగల్, టాస్క్‌ఫోర్స్ సేకరించిన సమాచారం మేరకు కొండారెడ్డిపై విజయవాడలో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి కొండారెడ్డి నుండి మరింత సమాచారం రాబట్టేందుకు దాఖలు చేసిన పీటీ వారెంటును కోర్టు అనుమతించింది. న్యాయమూర్తి కొండారెడ్డికి వచ్చే నెల 5వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. అనంతరం విశాఖపట్నం జైలుకు పోలీసులు తరలించారు.

యూరియా సమస్య తలెత్తకూడదు

మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి : రబీ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో యూరియా కొరత తలెత్తకూడదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖలపై గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. యూరియా నిల్వలు సమృద్ధిగా ఉండేలా చూడాలన్నారు. అవసరమైతే బఫర్ స్టాక్స్‌ని ఉపయోగించుకోవాలని, ఆర్ఎస్‌కేలలో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. రబీ సీజన్‌కు మొత్తం 20.69 లక్షల టన్నుల ఎరువుల అవసరం ఉండగా, ఇప్పటివరకు 2.38 లక్షల టన్నులు రాష్ట్రానికి చేరుకున్నాయని.. అలాగే, 4.01 లక్షల టన్నులు నిల్వ ఉండగా, 2.10 లక్షల టన్నుల యూరియా రైతులకు సరఫరా చేశామని అధికారులు చెప్పారు. ఇక ఆగ్రోస్ సంస్థ మీద వస్తున్న అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ ద్వారా దర్యాప్తు చేయించాలని మంత్రి చెప్పారు.

ఈహెచ్ఎస్ అమలుపై సీఎస్ నేతృత్వంలో కమిటీ

సాక్షి, అమరావతి: ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలు, నిర్వహణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైంది. ప్రస్తుతం ఈహెచ్ఎస్ కింద 24 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్య సేవల్లో భాగంగా ఈహెచ్ఎస్ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, లోపాలను గుర్తించి పరిష్కార మార్గాలను ఈ కమిటీ సూచించాల్సి ఉంటుంది. ఈ కమిటీలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ముఖ్యకార్యదర్శి(జీఏడీ), వ్యయ విభాగ కార్యదర్శి, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో, ఇద్దరు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉంటారని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ అధ్యయనం చేసి 8 వారాల్లో నివేదిక సమర్పిస్తుందని పేర్కొన్నారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు నైజీరియన్లు అరెస్టు

అల్లిపురం (విశాఖ) : ఈగిల్ ఫోర్స్ తెలంగాణ, ఢిల్లీ, గ్రేటర్ నోయిడా, గ్వాలియర్, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన ప్రత్యేక అధికారుల ఆపరేషన్‌లో మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న ముగ్గురు నైజీరియన్స్‌ను గురువారం విశాఖలో అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టుచేసి హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన 100 మంది అధికారులు, ఈగిల్ ఫోర్స్ తెలంగాణకు చెందిన మొత్తం 124 మంది అధికారులు కలిసి భారీ ఆపరేషన్ చేపట్టారు. ఢిల్లీలోని మెహ్రౌలి, సంత్‌గఢ్, ప్రతాప్ ఎంక్లేవ్, పృథ్వీ పార్క్, నిలోథి, చంద్రనగర్, మునిర్కా వంటి 20కు పైగా ప్రదేశాల్లో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో దేశంలో 50 మందికి పైగా నైజీరియన్ పౌరులను అరెస్టుచేసి పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరందరూ నైజీరియన్ డ్రగ్ కార్టెల్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో.. విశాఖపట్నంలో కూడా ముగ్గురు నైజీరియన్‌లు మాదకద్రవ్యాల విక్రయం, సరఫరా చేస్తున్నట్లు సమాచారం రావడంతో విశాఖ పోలీసులు అరెస్టుచేసి హైదరాబాద్‌కు తరలించారు.

టీకా.. అందని ఆరోగ్యరక్ష



- అర్బన్ ప్రాంతాల్లో టీకాల కోసం ప్రదక్షిణలు
- ఆస్పత్రులకు పరుగులు..తప్పని ఛీవాట్లు
- క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అలసత్వం
- పర్యవేక్షణ శూన్యం
- తల్లడిల్లుతున్న పిల్లల తల్లిదండ్రులు

చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం టీకాలు ఉచితంగా అందిస్తోంది. వీటిని వేయిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఎదగడంతోపాటు వారికి భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుంది. అయితే వైద్య సిబ్బంది నిర్లక్ష్యం.. అలసత్వం.. ఉదాసీనత కారణంగా చిన్నారులకు టీకాలు సక్రమంగా అందడం లేదు. ఫలితంగా తల్లిదండ్రులు తమ బిడ్డలకు టీకాలు వేయించడానికి ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. పొద్దస్తమానం ఆస్పత్రుల వద్ద నిరీక్షణతోపాటు సిబ్బందితో ఛీవాట్లు తినాల్సివస్తోంది. ఇలా టీకాలు వేయించక చిన్నారులకు ఆరోగ్యరక్షణ కొరవడుతోంది.

చిత్తూరు జిల్లా కేంద్రం నుంచి వ్యాక్సిన్ సరఫరా అయ్యే కేంద్రాలు

పీహెచ్‌సీలు 101	యూపీహెచ్‌సీ 37
సీహెచ్‌సీలు 17	ఏహెచ్ 5
డీహెచ్ 2	మొత్తం 162

కాణిపాకం: చిత్తూరు జిల్లాలో టీకా లక్ష్యం నీరుగారుతోంది. అర్బన్ ప్రాంతాల్లో నిర్లక్ష్యం ఆవహించింది. పిల్లలకు టీకాలు వేయడంలో వైద్యసిబ్బంది అలసత్వం స్ప ష్టంగా కనిపిస్తోంది. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడం విమర్శలకు తావిస్తోంది. సకాలంలో టీకాలు వేయించలేక తల్లులు తల్లడిల్లిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. చి న్నారులు ఏ వ్యాధుల బారిన పడకుండా ఎదిగితేనే ఆరోగ్యకర సమాజం రూపొందుతుంది. పూర్వం టీ కాలు అందుబాటులో లేకపోవడం, ఉన్నా సరైన అ వగాహన లేకపోవడం తదితర కారణాలతో మాతా శిశుమరణాలు జరిగేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు చక్కటి టీకాలు అందుబాటులోకి వచ్చాయి.

అందని ఫలితం?

నిరుపేదల వైద్యం కోసం ప్రభుత్వం ఏటా రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రాకపోగా, చిన్నారులకు బాల్యంలో వేయించలేకపోవడంతో వారు వ్యాధుల బారిన పడుతున్నారు. పేద, ధనిక తేడా లేకుండా ఎక్కడ జన్మించిన శిశువులైనా ప్రభుత్వాస్పత్రుల్లో ప్రతి బుధ, శనివారాల్లో టీకాలు వేస్తున్నారు. ఏటా సాధారణ రోజులతోపాటు పల్స్ పోలియో కార్యక్రమం ఏటా రెండు సార్లు, ఇంద్రధనస్సు పేరుతో ఏడాదికి రెండుసార్లు టీకాలు అందిస్తున్నారు. ఇంత చేస్తున్నా చిన్నారులకు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పించే టీకాలు పూర్తి స్థాయిలో వేయించడం లేదని పలువురు తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేయాల్సిన పనులివీ..

వ్యాధులు దరి చేరకుండా రోగ నిరోధక శక్తి తగ్గకుండా ఉండేందుకు పుట్టినప్పటి నుంచి 16 ఏళ్లలోపు వారికి, గర్భిణులు, బాలింతలకు 10 రకాల టీకాలు అందించాలి. విటమిన్–ఏ కూడా ఇందులో భాగమే బీఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో బాధితులను గుర్తించి సకాలంలో సమాచారం అందించాలి. మరోవైపు అధికారులకు తెలియజేయాలి. ప్రతి బుధవారం ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గుర్తించిన ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం అమలు చేయాలి. కానీ చాలా చోట్ల ఈ ప్రక్రియ సాగడం లేదు.

అర్బన్‌లో అవస్థ

అర్బన్ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది టీకా లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. వ్యాక్సినేషన్ అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. సిబ్బంది వారి పరిధిలో టీకాలు వేయడం లేదు. టీకాకు వెళితే.. ఇక్కడి రండి.. అక్కడకు వెళ్లండంటూ తిప్పిస్తున్నారు. లేదంటే వ్యాక్సిన్ అయిపోయిందని, తీసుకెళ్లి ఇచ్చేశామని, వచ్చేవారం రమ్మని వాయిదా వేస్తున్నారు. లేకుంటే తేలికగా పిల్లల తల్లులను జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీలకు పంపుతున్నారు. లేదంటే పక్కన్న ఉన్న సెంటర్లకు వెళ్లాని సూచిస్తున్నారు. దీంతో తల్లులు పిల్లలతో ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. టీకా మీ పరిధిలో వేసుకోవాలని...ఇక్కడకు ఎందుకు వచ్చారని ఆస్పత్రి సిబ్బంది తల్లులపై కసుబుసులాడుతున్నారు. ఛీవాట్లు పెట్టి గంటలకొద్ది పరీక్ష పెడుతున్నారు. ఇక ప్రసవించిన తర్వాత శిశువులకు ప్రాథమిక టీకాలు వేయించిన తర్వాత తల్లిదండ్రులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. దీంతో వారు నివాసం ఉండే ప్రాంతాల్లో టీకాలు వేయించేందుకు ఆసక్తి చూపడం లేదు. క్షేత్రస్థాయిలోని ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు టీకాలు వేయించడంలో ఆసక్తి చూపడం లేదు. పల్లె ప్రాంతాల్లో కూడా చాలా ఇదే పరిస్థితి ఎదరవుతోంది. టీకాల అందించడంలో అలసత్వం చూపుతూ జిల్లా కేంద్రానికి పంపుతున్నారు. ఈ కారణంగా తల్లులు కన్నీళ్లు పెడుతున్నారు. ఇక సకాలంలో వ్యాధినిరోధక టీకాలు అందించక శిశు మరణాలు సంభవిస్తున్నాయని వైద్య నిపుణులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కార్యాలయానికి పరిమితం చేశారు. అనుమతితోనే పరిశీలనకు వెళ్లాలని చెప్పడంతో టీకాల అధికారులు తోలుబొమ్మలా మారారనే విమర్శలు వస్తున్నాయి.

చిత్తూరు నుంచే..

చిత్తూరు జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వ్యాధి నిరోధక టీకాల విభాగముంది. ఇక్కడి నుంచి చిత్తూరు జిల్లా, తిరుపతి, అన్నమయ్య జిల్లాలోని ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలకు టీకాలు చేరుతాయి. డిమాండ్ల, కాలమానిని ప్రకారం ప్రాంతీయ, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు వ్యాక్సిన్లు సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 162 ఆరోగ్య కేంద్రాలకు సరఫరా అవుతున్నాయి. 4,97,668 మంది పిల్లులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ అందించాల్సి ఉంది. అయితే స్థానిక వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వ్యాక్సినేషన్ వేయడంతో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

వ్యాధులు.. టీకాలు ఇలా...

వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

- ప్రసవం నుంచి 24 గంటలలోపు టీబీ, జాండిస్ నుంచి రక్షణకు బీసీసీ, పోలియో, నివారణకు ఓపీవీ 0 డోసు, కామెర్ల వ్యాధి అరికట్టేందుకు హెపటైటిస్ టీకాలు వేయాల్సి ఉంది.
- 45 రోజులకు పోలియో నివారణకు ఓపీవీ–1, ఓపీవీ–2, ఓపీవీ–3, ఐపీవీ
- 75 రోజులకు కంఠ సర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, మెదడువాపు, న్యుమోనియా నివారణకు పెంటా–1, 2, 3 టీకాలు వేయాల్సి ఉంది.
- 105 రోజులకు తీవ్ర నీళ్ల విరోచనాలు, వాంతులు, జ్వరం, కడుపునొప్పి, మూత్ర విసర్జన, బరువు తగ్గడం వంటి నివారణకు ఆర్వీవీ–1, 2, 3 టీకాలు వేయాలి.
- 9–12 నెలల మధ్య తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు ఎంఆర్–1, అంధత్వ నివారణకు విటమిన్–ఏ, మెదడువాపు నివారణకు జేఈ–1, దగ్గు, జ్వరం, శ్వాసలో ఇబ్బందుల నివారణకు ఎఫెవీవీ–3, అంధత్వ నివారణకు విటమిన్–22 టీకాలు వేయాల్సి ఉంది.
- 5–6 సంవత్సరాల మధ్య కంఠ సర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం నివారణకు డీపీటీ–2 వేయాల్సి ఉంది. అయితే ఈ మేరకు టీకాలు వేయడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చలి కాలంలో ఛిల్!

- శీతాకాల విహారయాత్రకు భారీగా పెరిగిన డిమాండ్
- గతేడాదితో పోల్చితే 35 శాతం పెరిగిన బుకింగ్స్
- అంతర్జాతీయంగా యూరప్, దుబాయ్, థాయ్‌లాండ్, వియత్నాంకి డిమాండ్
- దేశీయంగా గోవా, గోకర్ణ, మనాలీ, ధర్మశాల, రాజస్థాన్ వైపు మొగ్గు
- విలాసవంతమైన రూమ్ బుకింగ్స్‌కు పెరిగిన డిమాండ్
- ఇదే అదనుగా ఎయిర్ టికెట్స్, రూమ్ ధరలను పెంచేస్తున్న సంస్థలు

విదేశాల్లో వీటికే డిమాండ్.

సాక్షి, అమరావతి: ఏడాది చివరిలో శీతాకాల విహారయాత్రలకు యువత మొగ్గు చూపుతోంది. క్రిస్మస్, కొత్త ఏడాది సంబరాలను సుదూరప్రాంతాల్లో లగ్జరీగా ఎంజాయ్ చేయడానికి ఏమాత్రం వెనుకాడటం లేదు. విమాన టికెట్లు, లగ్జరీ రూమ్ ధరలు పెరుగుతున్నా.. ఛిల్ అవ్వడానికి రెడీ అంటున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది డిసెంబర్‌లో దుబాయ్ విమాన టికెట్ ధరలు రెట్టింపైనా తగ్గేదే లే అంటున్నారు. విమానాల్లో క్యాబిన్స్‌ను బుక్ చేసుకుని మరీ ప్రయాణిస్తున్నట్లు యాడోట్రిప్ పేర్కొంది. అక్టోబర్ నెలతో పోల్చితే దుబాయ్, స్విట్జర్లాండ్, బాలి, థాయ్‌లాండ్ వంటి ప్రాంతాలకు విమాన టికెట్ల ధరలు 20 నుంచి 25 శాతం పెరిగినట్లు ట్రావెల్ ఏజెన్సీలు పేర్కొంటున్నాయి. అయినప్పటికీ ఈ శీతాకాలంలో ప్రైవేట్ ఐల్యాండ్స్‌లో కుటుంబం, స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేయడానికి అత్యధికంగా ఇష్టపడుతున్నారు. దేశీయ యువత ప్రపంచానికి సంబంధం లేకుండా ఏకాంతంగా ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి జపాన్‌లో ఉండే సంప్రదాయ గ్రామాలు, ఇటలీ వైన్ యార్డ్స్, దుబాయ్ ఆకాశహర్మ్యాలు, స్విట్జర్లాండ్, యూకే, థాయ్‌లాండ్, బాలి వంటి ప్రాంతాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. దేశీయంగా అయితే రాజస్థాన్, గోవా, మనాలి, గోకర్ణం వంటి ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. స్టే చేయడానికి కూడా ఫైవ్‌స్టార్ రేంజ్ గదులనే ఎంచుకుంటున్నారు. ఫ్యామిలీతో వెళ్లేవారు దుబాయ్, అబుదాబి వంటివి ఎంచుకుంటే.. స్నేహితులతో వెళ్లేవారు థాయ్‌లాండ్‌ను ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నారు. ఇక జంటల విషయానికొస్తే వియత్నాం, బాలి వంటి వాటికి ప్రాధాన్యం ఇస్తున్నారు. చిన్న పిల్లలతో అయితే మలేషియా, సింగపూర్‌కు వెళ్తున్నారు. కొవిడ్ తర్వాత ఇన్నాళ్లకు విహారయాత్రలకు డిమాండ్ బాగుందని, గతేడాదితో పోల్చితే బుకింగ్స్‌లో 35 శాతంపైన వృద్ధి నమోదైందని ట్రావెలింగ్ సంస్థలు పేర్కొంటున్నాయి. కొత్త ఏడాదిలోనూ ఇదే ట్రెండ్ కొనసాగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

చట్టాల సవరణతో కార్మికులకు మరింత సంక్షేమం: మంత్రి వాసంశెట్టి

సాక్షి, అమరావతి: కేంద్రం చేసిన కార్మిక చట్టాల సంస్కరణల ద్వారా కార్మికులకు సామాజిక భద్రత, సురక్షితమైన పని వాతావరణం లభిస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గురువారం కొత్త లేబర్ కోడ్స్ అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడారు. కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని, కేంద్రం తీసుకువచ్చిన సామాజిక భద్రత కోడ్ 2020, పారిశ్రామిక వివాదాల కోడ్, వేతనాల కోడ్, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ వర్కింగ్ కండీషన్స్ కోడ్ అమలులో రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. అసంఘటిత రంగం, గిగ్–ప్లాట్‌ఫామ్ వర్కర్లను సామాజిక భద్రత కిందికు తీసుకురావడం ద్వారా లక్షలాది కార్మికులకు రక్షణ లభిస్తుందని చెప్పారు. మహిళా ఉద్యోగుల కోసం మాతృత్వ సెలవులు, వర్క్ ఫ్రం హోమ్ సౌకర్యాలు, రాత్రిపూట పని అనుమతులు వంటి సంస్కరణలు మహిళల సాధికారతకు ఉపయోగపడుతున్నాయన్నారు. లేబర్ కమిషనర్ సెక్రటరీ శేషగిరి బాబు మాట్లాడుతూ.. కార్మికుల కోసం రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సోషల్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి సంస్థలో హెల్త్ చెకప్‌లు, సేఫ్టీ కమిటీలు, అపాయింట్‌మెంట్ లెటర్లు తప్పనిసరి చేస్తున్నామని తెలిపారు.

ఏపీలో కేన్సర్ నియంత్రణకు కేంద్రం చేయూత

సాక్షి, అమరావతి: ఏపీలో కేన్సర్ నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చేయూతనిస్తున్నట్టు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కేన్సర్ రిజిస్ట్రీ, ట్యూమర్ బోర్డు ఏర్పాటు చేయాలని సూచించినట్టు పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన ఎన్సీడీ, కేన్సర్ కేర్ వర్క్‌షాప్‌లో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఈ మేరకు హామీ ఇచ్చిందన్నారు. కేన్సర్ మందుల కొనుగోలులో ఆర్థిక తోడ్పాటుతో పాటు వ్యాధి నిర్ధారణ పరికరాల కొనుగోలుకు 80 శాతం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) అందిస్తుందని తెలిపారు. అలాగే, పీపీపీ విధానంలో మందుల నిల్వకు గోడౌన్ల నిర్మాణానికి, సెకండరీ ఆసుపత్రుల్లో అమ్రిత్ పథకం కింద 50 శాతం రాయితీతో మందులు, కృత్రిమ అమరికల(ఇంప్లాంట్స్)ను సరఫరా చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని వివరించారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన షుబ్లీ

సాక్షి, అమరావతి: ఏపీ ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా విజయవాడకు చెందిన మహ్మద్ ఫరూక్ షుబ్లీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ వెంటనే మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సమక్షంలో షుబ్లీ బాధ్యతలు స్వీకరించారు.

షుబ్లీ ముసుగు తొలగింది..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లిం సమాజానికి చేసిన మంచిని మరుగుపరిచేలా ఏ పార్టీకీ చెందని తటస్థుడిగా నటిస్తూ నిత్యం అసత్య ఆరోపణలతో విషం చిమ్మిన ఫరూక్ షుబ్లీ ముసుగు తొలగిపోయిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి అన్నారు. పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీపై ఇంత వరకు షుబ్లీ బురద చల్లింది టీడీపీ ప్రయోజనం, సొంత లాభం కోసమే అనేది ముస్లిం సమాజం గమనించాలని విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ చట్ట సవరణ విషయంలో ముస్లిం పక్షాన మాట్లాడుతున్నట్టు నటిస్తూ టీడీపీ కోసం పనిచేసిన షుబ్లీ తాజాగా మైనార్టీ దినోత్సవాన చంద్రబాబు ప్రాపకం కోసం పడిన తాపత్రయంతో పదవి దక్కించుకున్నాడని విమర్శించారు.

33 మంది కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ కొనసాగింపు

సాక్షి, అమరావతి : శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ (తిరుపతి)లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో పనిచేస్తున్న 33 మంది కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీలను మరో ఏడాది పాటు కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వీరికి రూ.57,700ల చొప్పున పారితోషికం ఇస్తారు. ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీచేసే వరకు వీరు తాత్కాలిక ప్రాతిపదికన కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే, కొబ్బరి అభివృద్ధి బోర్డు (కొచ్చి) అధికారిక సభ్యునిగా ఏపీ నుంచి ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

టీచర్స్ గేమ్స్‌కు రూ.53.95 లక్షలు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు ఈనెల 29 నుంచి జనవరి 4 వరకు జరిగే ఆటల పోటీల నిర్వహణకు సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం నిధులను విడుదల చేసింది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో 2 లక్షల మంది ఉపాధ్యాయులకు పోటీలు నిర్వహించనున్నారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు ఉన్నాయి. ఇందుకోసం మండలానికి రూ.5 వేలు చొప్పున రూ.33.95 లక్షలు, డివిజన్‌కు రూ.20 వేల చొప్పున రూ.14.80 లక్షలు, జిల్లాస్థాయి పోటీలకు రూ.20 వేల చొప్పున 26 జిల్లాలకు రూ.5.20 లక్షలు మొత్తం రూ.53.95 లక్షల నిధులను విడుదల చేస్తూ ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేశారు. కాగా, జనరల్ ఉపాధ్యాయులకు, పీఈటీలకు వేర్వేరు టీమ్‌లు ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ విద్యా శాఖను కోరారు. ప్రకటించిన ఆటలతో పాటు కబడ్డీ, కోకోను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

నూతన ఆవిష్కరణలకు ఆర్టీఐహెచ్ ప్రోత్సాహం

సాక్షి, అమరావతి : నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) 'స్పార్క్' పేరుతో ఐడియా ఎక్స్‌ప్లోరేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మంగళగిరి ఆర్‌టీఐహెచ్‌లో గురువారం ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి యువ పారిశ్రామికవేత్తలు ఇంకా రావాల్సిన అవసరముందని, ఇందుకోసం ఆర్‌టీఐహెచ్‌ను వేదికగా చేసుకోవాలన్నారు. ప్రారంభ స్థాయిలో ఉన్న నూతన ఆవిష్కరణలను వాణిజ్యపరంగా తీర్చిదిద్దడానికి స్పార్క్ తోడ్పాటునందిస్తుందని ఆర్‌టీఐహెచ్ సీఈఓ ధాత్రి రెడ్డి తెలిపారు. మూడ్రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, మొదటి బ్యాచ్‌లో 100 మందికి పైగా ఔత్సాహికులు నమోదుచేసుకోవడమే దీనికి నిదర్శనమన్నారు.

స్మార్ట్ మిథ్యాహ్నం

క్లౌడ్ కిచెన్

విద్యార్థుల కడుపుమాడ్చేసి..మధ్యాహ్న భోజన కార్మికులను రోడ్డున పడేసి తమ అనుయాయుల జేబులు నింపేందుకు చంద్రబాబు ప్రభుత్వం బరితెగించింది. స్మార్ట్ కిచెన్ల పేరుతో ప్రభుత్వం ఏళ్ల తరబడి పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పొట్టకొట్టేందుకు కుయుక్తులు పన్నుతోంది. ప్రభుత్వం సకాలంలో బిల్లులు ఇచ్చినా ఇవ్వకపోయినా అప్పోసప్పో చేసి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం వండి విద్యార్థుల కడుపులు నింపుతున్నారు. బాబు అధికారంలోకి వచ్చిన వెంటనే పాత వారిని తొలగించి పచ్చ పార్టీ సానుభూతిపరులను నియమించుకోవాలని ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు చేశారు. అది కుదరకపోవడంతో ఇప్పుడు స్మార్ట్ కిచెన్ల పేరుతో అసలుకే ఎసరు పెట్టాలని చూస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వేడి అన్నం స్థానంలో తమ పిల్లలు ఎప్పుడో తెల్లవారి వండిన భోజనాన్ని తినాల్సి వస్తుందని విద్యార్థులతల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

- స్మార్ట్ కిచెన్‌ల ద్వారా మరో దోపిడీకి రంగం సిద్ధం
- తమ అనుయాయుల జేబులు నింపేందుకు బాబు సర్కార్ కుట్ర
- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నోట్లో మన్ను
- ఏళ్ల తరబడి దీనినే నమ్ముకున్న కార్మికులను రోడ్డుపైకి..
- ప్రకాశం జిల్లా వ్యాప్తంగా తొలిదశలో 10 స్మార్ట్ కిచెన్లు
- 187 పాఠశాలల్లో 22 వేల మంది విద్యార్థులకు భోజనం తయారు
- విద్యార్థులకు ఇక వేడి అన్నంలేనట్లే
- ఈ పథకాన్ని నీరుగార్చే కుట్రగా అభివర్ణిస్తున్న యూనియన్ నాయకులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు : ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 2,327 ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూళ్లు ఉన్నాయి. వీటిల్లో 1,35,444 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాల్సి ఉంది. అయితే రోజూ సుమారు 87 వేల మంది విద్యార్థులు మాత్రమే భోజన పథకానికి హాజరవుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి డొక్కాసీతమ్మ పేరు పెట్టారు. దీని ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాల్సింది పోయి తమ అనుయాయలకు మేలు జరిగే రీతిలో ప్రభుత్వ పెద్దలు సిద్ధమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్మార్ట్‌కిచెన్ పేరుతో పార్టీ వారి జేబులు నింపేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి నివేదికలు పంపాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆమేరకు జిల్లా అధికారులు ఆగమేఘాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. పైలట్ ప్రాజెక్టు పేరుతో జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున, మిగతా సంతనూతలపాడు, కొండపి, దర్శి, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేయనున్నారు. 10 స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేసి 18 రూట్ల ద్వారా 187 పాఠశాలలకు చెందిన 22,031 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేసి అందించాలని ప్రతిపాదించారు. ఒక చోట భోజనం తయారు చేసి 1 నుంచి 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న విద్యార్థులకు భోజనం అందించాలన్నది ప్రభుత్వం ఆలోచన.

పైలెట్ ప్రాజెక్టుగా..

ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసే స్మార్ట్ కిచెన్ ద్వారా 2 కిలోమీటర్ల పరిధిలోని 21 పాఠశాలలకు భోజనం అందించాలని, త్రోవగుంట జెడ్పీ స్కూల్‌లో స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేసి చుట్టు పక్కల ఉన్న మరో 21 పాఠశాలలకు భోజనం అందించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ రెండు కిచెన్లతో 40 మందికి పైగా ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది. అలాగే మార్కాపురం, పొదిలి కేంద్రాల్లో ఏర్పాటు చేసే కేంద్రాల ద్వారా 27 మంది కార్మికులు రోడ్డున పడనున్నారు. ఈ పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తే ప్రభుత్వం ఈ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వేలాది మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడిపోతాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

విద్యార్థులకు వేడి అన్నం లేనట్లే...

ఎక్కడో 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న విద్యార్థులకు ఒక చోట భోజనం వండి వాహనాల్లో తీసుకెళ్లి ఇవ్వడం అన్నది వ్యయప్రసాలతో కూడుకుంది. దీనివలన విద్యార్థులకు వేడి అన్నం తినే భాగ్యం లేనట్లే అని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలు పరిశీలిస్తే తెల్లవారు జామున వంట ప్రారంభిస్తే కానీ విద్యార్థులకు సకాలంలో భోజనం అందించలేని పరిస్థితి. ఇప్పటి దాకా పాఠశాల ఆవరణలోనే మధ్యాహ్న భోజనం వండేవారు. ఈ పథకాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షించేవారు. ఏరోజుకారోజు వండిన ఆహారాన్ని ఉపాధ్యాయులు స్వయంగా రుచి చూసిన తరువాతే విద్యార్థులకు వడ్డించేవారు. ఆహారం నాణ్యత, రుచి గురించి టెస్టింగ్ రిజిస్టర్‌లో నమోదు చేసేవారు. మెనూ ప్రకారం వంటవండేలా చూసేవారు. ఇప్పుడా పరిస్థితి కాంట్రాక్టర్ల చేతుల్లోకి పోతుంది. వారు వండిందే వడ్డించే పరిస్థితి ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీని వలన విద్యార్థులకు పౌష్టికాహారం అనుమానమేనని సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని సంతృప్తి పరచడానికి స్మార్ట్ కిచెన్లు తీసుకొస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఆధారంగా ఉన్న ఈ పథకాన్ని బడా వ్యక్తులకు ఆదాయ వనరుగా ఎందుకు మారుస్తున్నారని నిలదీస్తున్నారు. సొంత పార్టీ నాయకుల బొజ్జలు నింపేందుకే స్మార్ట్ కిచెన్ పథకం రూపకల్పన జరిగినట్లు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

రోడ్డున పడనున్న మధ్యాహ్న భోజన కార్మికులు...

ఈ స్మార్ట్ కిచెన్లతో వేలాది మంది మధ్యాహ్న భోజన కార్మికుల జీవితాలు రోడ్డున పడే దుస్థితి నెలకొందన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఈ పథకం కింద జిల్లాలో మొత్తం 4112 మంది కార్మికులు పనిచేస్తున్నారు. స్మార్ట్ కిచెన్‌లు అమలైతే పాఠశాలలో ఉన్న వంటశాలలు మూతపడి కార్మికులు ఇంటిదారి పట్టాల్సిందే. వీరిలో 25 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వారున్నారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికుల పొట్టలు కొట్టి పార్టీ నాయకుల బొజ్జలు నింపేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

సాగుబడి

అనూరాధ కార్తె: డిసెంబర్ 3 వరకు

- అడవి ఉంటేనే వ్యవసాయానికి ప్రాణాధారమైన వర్షం పడేది

అడవే సేద్యానికి ఆధారం!

"వ్యవసాయ విస్తరణ కోసం భూమి అవసరమైనప్పుడల్లా అడవులు, చెట్లు వ్యవసాయంతో పోటీ ఏర్పడుతుంది. కానీ, అడవులను సంరక్షించడం, పునరుద్ధరించడం వాస్తవానికి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించటానికి దోహదం చేసే చాలా ముఖ్యమైన పని!"
- డా. జిమిన్ వు, ఫారెస్ట్రీ డైరెక్టర్, యూఎన్-ఎఫ్ఏవో

- ఉష్ణమండ దేశాల్లో అడవి ఏ దేశంలో ఉన్నప్పటికీ విదేశాల్లో సేద్యానికి మేలు

అడవి... వ్యవసాయానికి శత్రువని సాధారణంగా చాలా మంది అనుకుంటూ ఉంటారు. అయితే, అది నిజం కాదు. నిజానికి అడవుల వల్ల వ్యవసాయానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది. అడవి, చెట్లు అందించే పర్యావరణ సేవలు వ్యవసాయాన్ని ప్రతికూల వాతావరణ పరిస్థితులకు ఎదురొడ్డి నిలబడే శక్తినిస్తాయి. వర్షపాతం తగినంత పొందటానికి అడవులు అత్యవసరం. పంట భూముల్లో భూసారాన్ని పెంచుకునేందుకు అడవులు దోహదపడతాయి. ముఖ్యంగా ఉష్ణమండల ప్రాంతాల్లో ఉండే అడవులు ఆ అడవులున్న దేశాలకే కాదు వందలాది ఇతర దేశాలకు కూడా పర్యావరణ సేవలు అందిస్తున్నాయని గుర్తించండి. అడవి ఏ దేశ భూభాగంలో ఉన్నప్పటికీ అంతర్జాతీయ సంపదేనని గమనంలో పెట్టుకోండి. ఈ వ్యవసాయ ప్రాణాధార అడవుల్లో నరికివేసిన విస్తీర్ణంలో సగానికి సగంలోనైనా తిరిగి చెట్లను పెంచితే ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయానికి భూతాపోన్నతిని తట్టుకొని నిలబడే వనరులను సమకూర్చుతుందని పాలకులు గుర్తెరగాలి.అందుకు అనుగుణంగా విధానాలను రూపొందించి అమల్లోకి తేవాలి. స్థానిక ప్రజలను, రైతులను ఈ అడవుల పునరుజ్జీవన కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేస్తే లక్ష్యం సాధించటం సులభమవుతుంది. అడవిని రక్షించుకుంటే వ్యవసాయం చల్లగా పది కాలాలు బతుకుతుందని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (యూఎన్-ఎఫ్ఏవో) ఇటీవల వెలువరించిన ఓ కీలక నివేదికలో ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం చేసింది.

అడవుల నరికివేతతో ఏటా 28 వేల మరణాలు

స్థానికంగా అడవులు నీడ, బాష్పీభవన ప్రేరణ ద్వారా చల్లని సూక్ష్మ వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఉష్ణ ఒత్తిడిని తగ్గిస్తాయని నివేదిక వివరించింది. అదే సమయంలో అటవులను నిర్మూలిస్తే ఆ కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఇది వ్యవసాయం పైన మాత్రమే కాకుండా మానవ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా, 2001–2020 మధ్య, ఉష్ణమండలంలో అడవుల నరికివేత వల్ల ఏటా సుమారు 28,000 అదనపు ఉష్ణ సంబంధిత మరణాలకు దారితీసిందని ఎఫ్ఏవో అంచనా. అటవీ విస్తీర్ణం తగ్గితే పర్యావరణ సమస్యలు రావటంతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు ఎలా వస్తోందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

అడవులు, చెట్లు వ్యవసాయానికి ముఖ్యమైన అనేక ప్రయోజనాలు చేకూరుస్తున్నాయి. పరాగ సంపర్కం, తెగుళ్ల జీవ నియంత్రణ, పోషక చక్రం పరిరక్షణ, రక్షక కవచం, వాతావరణ నియంత్రణ వంటి ప్రయోజనాలు చేకూరతాయి. ఇవి పంట దిగుబడిని పెంచుతాయి. పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడుతాయని ఎఫ్ఏవో పేర్కొంది. అందువల్ల అడవులు, చెట్లను వ్యవసాయ పొలాలతో ఆశ్రయ కేంద్రాలు, నదీ తీర బఫర్ జోన్లు, అటవీ ప్రాంతాలుగా అనుసంధానించి అభివృద్ధి చేసే విధానాలను పాలకులు రూపొందించటం చాలా ముఖ్యం. ఈ వ్యూహాలు వ్యవసాయంలో కృత్రిమ ఎరువులు తదితర ఉత్పాదకాల వినియోగంపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. పంట పొలాలకు ప్రతికూల వాతావరణ పరిస్థితులను దీటుగా తట్టుకునే శక్తినిస్తాయి. వైవిధ్యమైన, పోషక-సాంద్రత కలిగిన ఆహార పదార్థాల ఉత్పత్తికి దోహదం చేస్తాయని నివేదిక పేర్కొంది.



'అడవి-వ్యవసాయం మధ్య పోటీ లేద'ని ఆహార వ్యవసాయ సంస్థ (యూఎన్-ఎఫ్ఏవో) తెలిపింది. బ్రెజిల్‌లో ఇటీవల ముగిసిన వాతావరణ మార్పుపై అంతర్జాతీయ శిఖరాగ్ర వార్షిక సమావేశం (కాప్ 30) సందర్భంగా ఒక కీలకమైన నివేదికను ఎఫ్ఏవో వెలువరించింది. 'అడవులు, చెట్లు వ్యవసాయం కోసం వాతావరణ, పర్యావరణ సేవల ప్రయోజనాలు 2025' పేరిట ఈ నివేదికను ఎఫ్ఏవో విడుదల చేసింది. చెట్లు, అడవుల వల్ల వ్యవసాయానికి ఒనగూరే ప్రయోజనాలను లెక్కగట్టే పద్ధతులను ఈ నివేదిక వెల్లడించింది. ఆహార భద్రత అడవులపై ఆధారపడి ఉంటుంది. వ్యవసాయ పొలాల్లో ఉత్పాదకతను పెంచడానికి అడవుల పరిరక్షణ, పునరుద్ధరణ కీలకమైన చర్యలుగా ఉపయోగపడతాయని నివేదిక వెల్లడించింది.

ప్రపంచ అడవులు భూగోళంపైన వ్యవసాయ-ఆహార పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసే ముఖ్యమైన సేవలను అందిస్తాయి. అయితే, ఈ సేవల విలువను చాలా సార్లు తక్కువగా అంచనా వేస్తుండటం విచారకరం. అందుకే ఈ రెండు రంగాలను సమన్వయంతో అభివృద్ధి చేసేలా తగిన విధానాలు రూపొందించాలి, పెట్టుబడులను ప్రోత్సహించాలని నివేదిక పిలుపునిచ్చింది.

'వ్యవసాయ విస్తరణ కోసం భూమి అవసరమైనప్పుడల్లా అడవులు, చెట్లు వ్యవసాయంతో పోటీ ఏర్పడుతుంది. కానీ, అడవులను సంరక్షించడం, పునరుద్ధరించడం వాస్తవానికి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించటానికి దోహదం చేసే చాలా ముఖ్యమైన పని' అని ఎఫ్ఏవో ఫారెస్ట్రీ డైరెక్టర్ డా. జిమిన్ వు అన్నారు.

అడవులు, చెట్ల వల్లే 50% వర్షపాతం

ఎఫ్ఏవో, స్టాక్‌హోమ్ ఎన్విరాన్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, కన్జర్వేషన్ ఇంటర్నేషనల్, ది నేచర్ కన్జర్వెన్సీ సంయుక్తంగా ప్రచురించిన నివేదిక ఇది. అడవుల నరికివేత వల్ల వాతావరణంపై, వ్యవసాయంపై తక్షణం పడే ప్రభావాలను, కొలవగల ప్రభావాలను ఈ నివేదిక నొక్కి చెబుతుంది. అడవులను పరిరక్షిస్తే కలిగే ప్రయోజనాలు.. పర్యావరణ వ్యవస్థలు ఉష్ణోగ్రతలను తగ్గించడంతో పాటు వర్షపాతాన్ని నిలబెట్టుకుంటాయి. నీటి చక్రాన్ని నియంత్రిస్తాయి. పంట ఉత్పాదకతపై నేరుగా ప్రభావం చూపుతాయి. స్థానిక వాతావరణ పరిస్థితులను స్థిరీకరిస్తాయి. గ్రామీణ ప్రజల ఆరోగ్యం, భద్రత, జీవనోపాధిని మెరుగుపరుస్తాయి.

155 దేశాల్లోని వ్యవసాయ భూములు ఇతర దేశాల్లోని అడవులు అందించే పర్యావరణ సేవలపై ఆధారపడి వార్షిక వర్షపాతంలో 40% పొందుతున్నాయి. ఇది ముఖ్యంగా ఆఫ్రికాకు వర్తిస్తుంది. ఒక సర్వే ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50 శాతం వర్షపాతం అడవులు, చెట్లు వాతావరణంలోకి వదిలే నీటి తేమ ద్వారా లభిస్తుంది. కాంగో వర్షారణ్యం దాని తేమలో 40 శాతానికి పైగా స్థానికంగా రీసైకిల్ చేస్తుంది. ఆఫ్రికాలో మారుమూల వ్యవసాయ ప్రాంతాలకు కూడా 10 శాతానికి పైగా వర్షపాతాన్ని అందిస్తుందని ఈ నివేదిక వెల్లడించింది.

సగం అడవులను పునరుద్ధరిస్తే 1 డిగ్రీ వేడి తగ్గుతుంది

ప్రపంచంలో కోల్పోయిన ఉష్ణమండల అడవుల్లో సగాన్ని పునరుద్ధరిస్తే నేలపై ఉష్ణోగ్రతలు 1 డిగ్రీల సెల్సియస్ మేరకు తగ్గుతాయి. వ్యవసాయం, నీటి భద్రత సాధన కోసం అడవులు చెట్ల నీటి చక్రాల పునరుద్ధరణకు, వాతావరణ నియంత్రణ విధులను పునరుద్ధరణకు ఇది సహాయపడుతుంది. అయితే, ఈ లక్ష్యాల సాధన కోసం అడవుల పునరుద్ధరణకు దృఢచిత్తంతో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంటుందని నివేదిక వివరించింది. ఆహార భద్రత, ప్రజారోగ్యం, వాతావరణ ప్రతికూలతలను తట్టుకోవటం కోసం సుస్థిరమైన అటవీ నిర్వహణ బాధ్యతను బహుళ రంగాలకు ప్రయోజనం చేకూర్చే వ్యూహంగా గుర్తించాలని ఎఫ్ఏవో నివేదిక పేర్కొంది.

రైతులు, స్థానిక ఆదివాసీ సమాజాలను భాగస్వాముల్ని చెయ్యాలి. అటవీ పునరుజ్జీవన, పరిరక్షణ పథకాల రూపకల్పనలో, పర్యవేక్షణ కార్యకలాపాలను మెరుగుపరచడంలో వారిని పాల్గొనేలా చేయడం ద్వారా వారికి సాధికారత కల్పించాలి. అటవీ సంరక్షణ, పునరుద్ధరణ, సుస్థిరమైన పద్ధతుల్లో అడవిని ఉపయోగించుకోవటంపై పెట్టే పెట్టుబడులన్నీ వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయం కోసం, గ్రామీణ జీవనోపాధులు పెంపొందించటం కోసం, ప్రపంచ ఆహార భద్రత, నీటి భద్రత కల్పించటం కోసం పెట్టే మంచి పెట్టుబడులేనని అర్థం చేసుకోవాలి. అడవిని వ్యవసాయంతో సమన్వయీకరించి ప్రోత్సహించడం ద్వారా ప్రజలు మరింత ఉత్పాదక, సుస్థిరమైన, సమానతతో కూడిన భవిష్యత్తు కోసం పని చేయటం సాధ్యపడుతుందని నివేదిక చివరలో ఎఫ్ఏవో స్పష్టం చేసింది.

"155 దేశాల్లోని వ్యవసాయ భూముల్లో కురిసే వార్షిక వర్షపాతంలో 40% ఇతర దేశాల్లోని అడవులందించే పర్యావరణ సేవలే ఆధారం"

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్

'అత్యవసర పట్టుబడి' వైఫల్యం కాదు!



రొయ్యల సాగు సున్నితమైనది. నీటి నాణ్యతలో మార్పులు, వ్యాధులు, వాతావరణ మార్పులు వంటి అంశాలకు చాలా త్వరగా మార్పు కనిపిస్తుంది. ఎంత మంచిగా నిర్వహణ చేసినా, కొన్ని సందర్భాల్లో సాగును కొనసాగించడం ప్రమాదకరంగా మారుతుంది. అలాంటి పరిస్థితుల్లో రైతులు అత్యవసర పట్టుబడి చేస్తారు. అంటే నిర్ణయించిన తుది తేదీకి ముందే పట్టుబడి జరుపుతారు. ఇలా చేయడం ద్వారా జీవించి ఉన్న మిగిలిన రొయ్యలను కాపాడవచ్చు. ఆర్థిక నష్టాలను తగ్గించవచ్చు. రోగాలు ఇతర చెరువులకు వ్యాపించకుండా ఆపవచ్చు. డిస్ట్రెస్ హార్వెస్ట్ అనేది వైఫల్యం కాదు. భారీ నష్టాలను తప్పించుకునే ఒక తెలివైన నిర్ణయం.

అత్యవసర పట్టుబడి అంటే?

రొయ్యల చెరువులో పరిస్థితులు హానికరంగా మారినప్పుడు, ముందుగానే రొయ్యలను పట్టుబడి చేసుకోవడం. ఇది సాధారణంగా ప్రమాద నిర్వహణ కోసం తీసుకునే నిర్ణయం. పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నప్పుడు వెంటనే అత్యవసర పట్టుబడి చెయ్యటం సాగును కొనసాగించడం కన్నా మంచి పని.

అత్యవసర పట్టుబడి ఎప్పుడు చెయ్యాలి?

1. వ్యాధులు సోకినప్పుడు లేదా అనుమానం ఉన్నప్పుడు...

రొయ్యల చెరువుల్లో వ్యాధులు చాలా వేగంగా వ్యాపిస్తాయి. రైతులు ఈ లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే అప్రమత్తంగా ఉండాలి:

- ఫీడ్ తీసుకోవడం ఆకస్మికంగా తగ్గటం
- బలహీనంగా కనిపించడం లేదా ఉపరితలంపై ఈదటం
- ఎర్రగా కనిపించటం, గుల్ల వదులుగా ఉండడం
- అకస్మాత్తుగా మరణాలు
- డబ్ల్యూఎస్ఎస్‌వీ, ఈహెచ్‌పీ, ఐఎంఎన్‌వీ, ఐహెచ్‌హెచ్ఎన్‌వీ వంటి వ్యాధులు కొన్ని గంటల్లోనే/ రోజుల్లోనే చెరువును పూర్తిగా నాశనం చేయగలవు. త్వరగా హార్వెస్ట్ చేయటం పెద్ద నష్టాన్ని నివారిస్తుంది.

2. నీటి నాణ్యత తీవ్రంగా క్షీణించినప్పుడు...

కొన్నిసార్లు నీటి నాణ్యత చాలా వేగంగా పడిపోతుంది. దాన్ని సరిచేయడానికి సమయం సరిపోదు.

కీలకమైన నిరోధక చర్యలు

అత్యవసర పట్టుబడి అవసరం రాకుండా ఉండాలంటే...

- ఎస్‌పీఎఫ్/ వ్యాధి రహిత సీడ్ ఉపయోగించాలి
- బలమైన బయోసెక్యూరిటీ పాటించాలి
- ఓవర్ స్టాకింగ్, ఓవర్ ఫీడింగ్ చేయకూడదు
- చెరువు అడుగును శుభ్రంగా ఉంచాలి
- ప్రోబయోటిక్స్ వాడాలి - అత్యవసర ఎయిరేటర్లు సిద్ధంగా ఉంచాలి
- రోజూ చెరువు రికార్డులు రాయాలి
- నీటకరిగిన ఆక్సిజన్, అమోనియా, నైట్రైట్, పీహెచ్, అల్కలినిటీ రెగ్యులర్‌గా చెక్ చెయ్యాలి

సాధారణ కారణాలు... ● మబ్బు వాతావరణం లేదా మరణాలు ● అధిక అమోనియా లేదా నైట్రైట్ ● అలాగే ప్లాంక్టాన్ నీరు రంగు మారటం ● భారీ వర్షాల వల్ల సెలినిటీ లేదా పి.హెచ్. ఒక్కసారిగా పడిపోవటం ● ఇవి అదుపులోకి రాకపోతే అత్యవసర పట్టుబడి ఉత్తమం.

3. చెరువు అడుగు పాడై విషతుల్యం కావటం...

రొయ్యలు చెరువు అడుగులోనే ఎక్కువ కాలం ఉంటాయి. అడుగు భాగం చెడితే అవి త్వరగా ప్రభావితమవుతాయి.

జాగ్రత్త సంకేతాలు... ● కుళ్ళిన గుడ్డు వాసన ● రొయ్యలు అంచులకు లేదా ఎయిరేటర్ల దగ్గరకు చేరటం ● అధిక బురద లేదా నల్లటి నేల ● పేగు ఖాళీగా ఉండటం, బలహీనంగా కనిపించటం ● ఇవి వ్యాధులకు ముందు వచ్చే సూచనలు

4. తీవ్రమైన వాతావరణం / ప్రకృతి వైపరీత్యాలు

తుఫాన్లు, భారీవర్షాలు, వరదలు వంటి సందర్భాల్లో చెరువు రక్షణకు ప్రమాదం ఉంటుంది. చెరువు గట్లు తెగిపోవటం లేదా నీరు నిండిపోవడం లాంటి పరిస్థితుల్లో ముందుగానే హార్వెస్ట్ చేయటం సురక్షితం.

5. ఆర్థిక / మార్కెట్ కారణాలు

చాలాసార్లు మార్కెట్ పరిస్థితుల వల్ల కూడా ముందుగానే హార్వెస్ట్ చేస్తారు.

ఉదాహరణకు:

- రొయ్యల ధరలు ఒక్కసారిగా పడిపోవటం
- ప్రాసెసర్లు కొనుగోలు తగ్గించటం
- ఫీడ్ విద్యుత్ ఖర్చులుపెరగటం
- ప్రస్తుత సైజుకు మంచి మార్కెట్ ధర లభించడం..

అత్యవసర పట్టుబడిలో రకాలు:

1. పాక్షిక పట్టుబడి

స్టాక్‌లో కొంత భాగమే ఒత్తిడిలో ఉన్నప్పుడు లేదా చెరువులో బయోమాస్ అధికంగా ఉన్నప్పుడు పాక్షిక పట్టుబడి చేస్తారు. సాధారణంగా కొంత నీరు వదిలి లాగుడు వలలు, చేతి వలలతో పట్టుబడి చేస్తారు. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. మిగిలిన రొయ్యలు పెరగటానికి అవకాశం ఉంటుంది.

2. పూర్తి పట్టుబడి

ఈ క్రింది సందర్భాల్లో పూర్తిగా పట్టుబడి చేస్తారు:
● వ్యాధులు వేగంగా వ్యాపిస్తున్నప్పుడు ● మరణాలు పెరిగినప్పుడు ● నీటి నాణ్యత పూర్తిగా క్షీణించినప్పుడు ● తీవ్రమైన వాతావరణ హెచ్చరికలున్నప్పుడు

ఈ సందర్భంలో చెరువును పూర్తిగా వదిలి, రొయ్యలను వెంటనే పట్టుబడి చేయాలి.

అత్యవసర పట్టుబడి చేసే విధానం:

● మొదటగా చెరువు పరిస్థితి త్వరగా అంచనా వేయాలి. రొయ్యల సైజు, సర్వైవల్, మేత తీసుకోవటం, సమస్యకు కారణం వంటి అంశాలు చూడాలి. దీనిపై ఆధారపడి పాక్షిక లేదా పూర్తి పట్టుబడి చేపట్టాలి. ● నిర్ణయం తీసుకున్న వెంటనే ఏర్పాట్లు మొదలు పెట్టాలి. కొనుగోలుదారులకు సమాచారం ఇవ్వాలి. ఫీడ్ ఇవ్వటం తగ్గించాలి ఎయిరేషన్ పెంచాలి. పని వారు, వలలు, ఐస్, వాహనం వంటివి సిద్ధం చేయాలి. ● పట్టుబడి సమయంలో రొయ్యలను జాగ్రత్తగా హ్యాండిల్ చెయ్యాలి. పాక్షిక పట్టుబడి కోసం లాగుడు వలలు, చేతి వలలు అనువైనవి. పూర్తి హార్వెస్ట్ కోసం నీటిని నెమ్మదిగా వదలాలి/దింపాలి. రొయ్యలను వెంటనే ఐస్‌లో ఉంచాలి. ● రొయ్యలను శుభ్రపరిచి, గ్రేడింగ్ చేసి, చల్లని పరిస్థితుల్లో కొనుగోలుదారునికి పంపాలి.

అత్యవసర పట్టుబడి తర్వాత చెరువు నిర్వహణ

● అత్యవసర పట్టుబడి తర్వాత చెరువులో చనిపోయిన రొయ్యలు ఉంటే వాటిని సరిగ్గా ఏరి దూరంగా పాతిపెట్టాలి. కాలువలు లేదా వాగుల్లో వేస్తే వ్యాధులు వ్యాపిస్తాయి. ● చెరువును పూర్తిగా శుభ్రపరచి డిస్ఇన్ఫెక్ట్ చెయ్యాలి. అడుగున పేరుకుపోయిన సేంద్రియ వ్యర్థాలను తొలగించాలి. అవసరమైనంత క్లోరిన్ లేదా సున్నం వేయాలి. చెరువు అడుగు పూర్తిగా ఆరాలి. అదనపు బురదను తొలగించాలి. ఇన్లెట్, అవుట్‌లెట్ ప్రాంతాలను కూడా శుభ్రం చేయాలి. ● తదుపరి సాగు ప్రారంభించే ముందు ప్రధాన కారణాన్ని గుర్తించాలి. సీడ్ నాణ్యత, నీటిపరీక్షలు, ఎయిరేషన్, బయోసెక్యూరిటీ, ఫీడింగ్ తదితర విషయాల్లో లోపాలున్నాయా అని పరిశీలించాలి.

ఒక ముఖ్యమైన రక్షణ చర్య

సరైన సమయంలో తీసుకున్న నిర్ణయం పెద్ద నష్టాలను నివారించగలదు. వ్యాధులు ప్రబలకుండా ఆపగలదు. రైతును ఆర్థికంగా రక్షించగలదు. అవసరమైనప్పుడు అత్యవసర పట్టుబడి చెయ్యాల్సిన పరిస్థితిని వైఫల్యంగా కాకుండా, తెలివైన, సమయోచిత నిర్ణయంగా చూడాలి. మంచి బయోసెక్యూరిటీ, నీటినాణ్యతపై నిత్యపర్యవేక్షణ, సమర్థవంతమైన చెరువు నిర్వహణ ద్వారా డిస్ట్రెస్ హార్వెస్ట్ అవసరాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

- డా. పి. రామ్మోహన్‌రావు (9885144557)
మత్స్యశాఖ ఉప సంచాలకులు (విశ్రాంత), కాకినాడ

నిరీక్షణ ముగించాలని...

మూడో ప్రపంచకప్ టైటిల్ లక్ష్యంగా బరిలోకి భారత్

నేటి నుంచి జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నీ • తొలిసారి 24 జట్లతో మెగా ఈవెంట్

భారత సీనియర్ పురుషుల హాకీ జట్టు ప్రపంచ కప్ టైటిల్ సాధించి 50 ఏళ్లు గడిచాయి. 1975లో ఒకసారి మాత్రమే భారత సీనియర్ జట్టు ప్రపంచకప్ టైటిల్‌ను అందుకుంది. ఆ తర్వాత 12 సార్లు ప్రపంచకప్ టోర్నీ జరిగినా భారత జట్టు మాత్రం కనీసం సెమీఫైనల్‌కు కూడా చేరుకోలేక పోయింది. సీనియర్ జట్టుతో పోలిస్తే భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు ప్రపంచకప్‌లో నిలకడగా రాణిస్తోంది. రెండుసార్లు జగజ్జేతగా నిలిచింది. ఒకసారి రన్నరప్ ట్రోఫీని అందుకుంది. మూడుసార్లు మూడో స్థానంలో నిలిచింది. చివరిసారి 2016లో సొంతగడ్డపై ప్రపంచకప్‌ను ముద్దాడిన భారత్... తొమ్మిదేళ్ల టైటిల్ నిరీక్షణకు సొంతగడ్డపై తెర దించాలని, ముచ్చటగా మూడోసారి విశ్వవిజేతగా అవతరించాలనే లక్ష్యంతో నేడు మొదలయ్యే మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగనుంది.

చెన్నై/మదురై: గత 12 ఏళ్లలో నాలుగోసారి జూనియర్ పురుషుల ప్రపంచకప్ అండర్–21 హాకీ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వనుంది. చెన్నై, మదురై నగరాల్లో జరిగే ఈ మెగా టోర్నీకి నేడు తెర లేవనుంది. 46 ఏళ్ల ఈ టోర్నమెంట్ చరిత్రలో తొలిసారి 24 జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. 2009లో 20 జట్లు బరిలోకి దిగగా... ఆ తర్వాత జరిగిన నాలుగు ప్రపంచకప్‌లలో 16 జట్లు పోటీ పడ్డాయి. ఈసారి 24 జట్లకు అవకాశం కల్పించారు. మాజీ చాంపియన్ పాకిస్తాన్ జట్టు అర్హత సాధించినా... భారత్‌తో ఉద్రిక్త వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. పాకిస్తాన్ స్థానాన్ని ఒమన్ జట్టుతో భర్తీ చేశారు. నేడు జరిగే తమ తొలి లీగ్ మ్యాచ్‌లో చిలీ జట్టుతో భారత్ ఆడుతుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి గం. 8:30 నుంచి ఈ మ్యాచ్ జరుగుతుంది. అనంతరం భారత్ 29న ఒమన్ జట్టుతో, డిసెంబర్ 2న స్విట్జర్లాండ్ జట్టుతో తలపడుతుంది.

సీనియర్ జట్టు దిగ్గజ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్ హెడ్ కోచ్‌గా ఉన్న భారత జూనియర్ జట్టుపై భారీ అంచనాలే ఉన్నాయి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న భారత్‌కు ప్రపంచ నంబర్‌వన్, ఏడుసార్లు విజేత జర్మనీ జట్టు నుంచి గట్టిపోటీ ఎదురవనుంది. ఇటీవల మలేసియాలో జరిగిన సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్‌లో భారత జట్టు రజత పతకం సాధించి మంచి ఫామ్‌లో ఉంది. అయితే పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచే అంశమే భారత్‌ను వేధిస్తోంది. జొహోర్ కప్‌లో భారత జట్టుకు 53 పెనాల్టీ కార్నర్‌లు లభించగా... కేవలం ఎనిమిదింటిని మాత్రమే గోల్స్‌గా మలిచింది. 'అవును. పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచే అంశంపై మేము దృష్టి పెట్టాం. ప్రాక్టీస్ సెషన్స్‌లో రోజుకు 200–300 సార్లు డ్రాగ్ ఫ్లిక్ చేశాము. ఈ సాధన ఫలితాలు ఇస్తుందని ఆశాభావంతో ఉన్నాం' అని హెడ్ కోచ్ శ్రీజేశ్ వ్యాఖ్యానించాడు. రోహిత్ సారథ్యంలో భారత జట్టు ఈ మెగా టోర్నీలో ఆడనుంది. ఇప్పటికే భారత సీనియర్ జట్టుకు 21 మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించిన డ్రాగ్‌ఫ్లికర్ అరిజిత్ సింగ్ హుండల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి.

ఏ గ్రూప్‌లో ఎవరున్నారంటే...

- గ్రూప్ 'ఎ': కెనడా, జర్మనీ, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా.
- గ్రూప్ 'బి': భారత్, చిలీ, ఒమన్, స్విట్జర్లాండ్.
- గ్రూప్ 'సి': జపాన్, న్యూజిలాండ్, చైనా, అర్జెంటీనా.
- గ్రూప్ 'డి': బెల్జియం, స్పెయిన్, ఈజిప్ట్, నమీబియా.
- గ్రూప్ 'ఇ': ఇంగ్లండ్, మలేసియా, నెదర్లాండ్స్, ఆస్ట్రియా.
- గ్రూప్ 'ఎఫ్': ఆస్ట్రేలియా, కొరియా, బంగ్లాదేశ్, ఫ్రాన్స్.

5 ఇప్పటి వరకు ఐదు జట్లు మాత్రమే జూనియర్ ప్రపంచకప్‌లో విజేతలుగా నిలిచాయి. ఈ జాబితాలో జర్మనీ, భారత్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, పాకిస్తాన్ ఉన్నాయి.

4 జూనియర్ ప్రపంచకప్ టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వడం ఇది నాలుగోసారి. గతంలో భారత్ 2013, 2016, 2021లలో కూడా ఈ మెగా ఈవెంట్‌కు వేదికగా నిలిచింది.

ముందుకెళ్లాలంటే...

మొత్తం 24 జట్లను ఆరు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో నాలుగు జట్లకు చోటు కల్పించారు. వరుసగా ఐదు రోజులపాటు లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. తొలి మూడు రోజులు ఎనిమిది లీగ్ మ్యాచ్‌ల చొప్పున... ఆ తర్వాతి రెండు రోజులు నాలుగు మ్యాచ్‌ల చొప్పున నిర్వహిస్తారు. లీగ్ దశ ముగిశాక ఆరు గ్రూప్‌ల్లో అగ్రస్థానంలో నిలిచిన ఆరు జట్లు... ఆ తర్వాత రెండో స్థానంలో నిలిచిన మేటి రెండు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. మిగతా 16 జట్లు వర్గీకరణ మ్యాచ్‌లు ఆడతాయి.

7 ఇప్పటి వరకు 13 సార్లు జూనియర్ ప్రపంచ కప్ జరిగింది. అత్యధికంగా జర్మనీ జట్టు 7 సార్లు టైటిల్ సాధించింది. భారత్ (2001, 2016) అర్జెంటీనా (2005, 2021) జట్లు రెండు సార్లు చొప్పున చాంపియన్స్‌గా నిలిచాయి. ఆస్ట్రేలియా (1997), పాకిస్తాన్ (1979) ఒక్కోసారి టైటిల్ అందుకున్నాయి.

సెల్వం కార్తీ

ఫైనల్‌పై భారత్ గురి

- నాలుగో లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై విజయం
- రేపు కెనడాపై గెలిస్తే టైటిల్ పోరుకు అర్హత

ఇపో (మలేసియా): అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్న భారత పురుషుల హాకీ జట్టు సుల్తాన్ అజ్లాన్ షా కప్ టోర్నీలో ఫైనల్ బెర్త్‌పై గురి పెట్టింది. న్యూజిలాండ్‌తో గురువారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో సంజయ్ సారథ్యంలోని టీమిండియా 3–2 గోల్స్ తేడాతో గెలిచింది. ఈ టోర్నీలో భారత్‌కిది మూడో విజయం. భారత్ తరఫున అమిత్ రోహిదాస్ (4వ నిమిషంలో), సంజయ్ (32వ నిమిషంలో), సెల్వం కార్తీ (54వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. న్యూజిలాండ్ జట్టుకు జార్జి బాకెర్ (42వ, 48వ నిమిషాల్లో) రెండు గోల్స్ అందించాడు. ఆరు జట్లు పోటీ పడుతున్న ఈ టోర్నీలో నాలుగు మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న భారత్ తొమ్మిది పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. బెల్జియం జట్టు పది పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో... న్యూజిలాండ్ ఏడు పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాయి. రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లు ముగిశాక తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. నేడు మ్యాచ్‌లకు విశ్రాంతి దినం. శనివారం జరిగే చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో కెనడాతో భారత్; బెల్జియంతో న్యూజిలాండ్; మలేసియాతో దక్షిణ కొరియా ఆడతాయి. కెనడాపై భారత్ గెలిస్తే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ఫైనల్ చేరుకుంటుంది. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌ను బెల్జియం 'డ్రా' చేసుకున్నా భారత్‌తో కలిసి ఫైనల్లోకి అడుగు పెడుతుంది. బెల్జియంపై 13 గోల్స్ తేడాతో గెలిస్తేనే న్యూజిలాండ్‌కు ఫైనల్ చేరే అవకాశం ఉంటుంది.

జట్టును సిద్ధం చేయడమే కోచ్ పని...

మైదానంలో ఆడాల్సింది ఆటగాళ్లే: గావస్కర్

గావస్కర్

న్యూఢిల్లీ: భారత జట్టు 25 ఏళ్ల తర్వాత సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయింది. దాంతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ గంభీర్‌కు అండగా నిలిచాడు. కోచ్ కేవలం జట్టును సిద్ధం చేస్తాడని... మైదానంలో ఆడాల్సింది ఆటగాళ్లే అని గావస్కర్ అన్నాడు. దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో 30 పరుగులతో ఓడిన టీమిండియా... రెండో టెస్టులో 408 పరుగుల తేడాతో పరాజయం మూటగట్టుకుంది. గంభీర్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం భారత జట్టు మూడో టెస్టు సిరీస్ ఓటమి చవిచూసింది. స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో 0–3తో ఓడిన టీమిండియా, ఆస్ట్రేలియాలో 1–3తో సిరీస్ కోల్పోయింది. ఈ నేపథ్యంలో గావస్కర్ మాట్లాడుతూ... 'అతడు ఒక కోచ్. జట్టును సిద్ధం చేయడం అతడి పని. తనకున్న అనుభవంతో ఎలా ఆడాలో చెప్పగలడు. కానీ, మైదానంలో ఆడాల్సింది ప్లేయర్లే. ఈ సిరీస్ పరాజయానికి గంభీర్‌ను బాధ్యుడిని చేయాలంటున్న వారికి నేను ఓ సూటి ప్రశ్న వేస్తున్నా. గంభీర్ నేతృత్వంలోనే భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ గెలిచింది. అప్పుడు అతడిని వన్డే, టి20ల్లో జీవితాంతం కోచ్‌గా ఉంచాలని మీరు చెప్పారా. మరి అలాంటిది ఇప్పుడు టెస్టు సిరీస్ ఓడినప్పుడు అతడిని తొలగించాలని ఎలా డిమాండ్ చేయగలరు. ఒక జట్టు బాగా రాణించనప్పుడు మాత్రమే కోచ్ వైపు చూస్తారు' అని గావస్కర్ అన్నాడు. మూడు ఫార్మాట్లకు గంభీర్‌ను కోచ్‌గా కొనసాగించడాన్ని సన్నీ సమర్థించాడు. ఇంగ్లండ్ జట్టుకు బ్రెండన్ మెకల్లమ్ అన్ని ఫార్మాట్లలో కోచింగ్ ఇస్తున్న అంశాన్ని గుర్తు చేశాడు.

గంభీర్‌కు అండగా అశ్విన్

దక్షిణాఫ్రికా చేతిలో సిరీస్ పరాజయానికి కోచ్ గౌతమ్ గంభీర్‌ను బాధ్యుడిని చేయడం తగదని... భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. గంభీర్ కాంట్రాక్టు 2027 వరకు ఉండగా... అతడిని కోచ్ పదవి నుంచి తొలగించాలనే డిమాండ్ వ్యక్తమవుతున్న నేపథ్యంలో అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో కీలక వ్యాఖ్యలు చేశాడు. 'ఇదొక క్రీడ. గెలుపోటములు సహజం. జట్టును నిర్వహించడం అంత సులభం కాదు. ఈ పరాజయానికి గంభీర్ కూడా బాధపడుతున్నాడు. మనం దాన్ని అర్థం చేసుకోవాలి. దీనికి ఎవరినో ఒకరిని బాధ్యులను చేసి తప్పిస్తే మంచిదని అనిపించవచ్చు. కానీ అది సరైంది కాదు. ప్రతి ఒక్కరూ జవాబుదారీతనం ఆశిస్తుంటారు. భారత క్రికెట్ ఆర్థికంగా చాలా పటిష్టంగా ఉంది. అందుకే బాధ్యత ఎవరు తీసుకుంటారు అని అందరూ ఎదురుచూస్తున్నారు. అలా అని కోచ్ బ్యాట్ పట్టుకొని మైదానంలోకి దిగి ఆడలేడు కదా. ఆటగాళ్లు కూడా బాధ్యత తీసుకోవాలి. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి పైనా దాడి చేయడం తగదు' అని అశ్విన్ వివరించాడు.

ధ్రువ్ జురేల్
గంభీర్

తన్వీ శర్మ

తన్వీ శర్మ సంచలనం

- ప్రపంచ మాజీ చాంపియన్ ఒకుహారాను ఓడించిన భారత టీనేజర్
- ప్రణయ్‌కు మన్‌రాజ్ షాక్
- సయ్యద్ మోడీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

లక్నో: భారత యువ షట్లర్ తన్వీ శర్మ సంచలనం సృష్టించింది. సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రపంచ మాజీ చాంపియన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ నొజోమి ఒకుహారా (జపాన్)ను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 16 ఏళ్ల తన్వీ శర్మ 13–21, 21–16, 21–19తో రెండో సీడ్ ఒకుహారాపై విజయం సాధించింది. 59 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ కోల్పోయిన అనంతరం పుంజుకున్న తన్వీ... అద్వితీయ ఆటతీరుతో 2017 ప్రపంచ చాంపియన్ ఒకుహారాను కంగుతినిపించింది. ఈ ఏడాది యూఎస్ ఓపెన్ సూపర్–300 టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లిన తన్వీ... ఒకుహారాపై గెలవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొంది. 'ఈ ఏడాది నాకు గొప్పగా సాగుతోంది. ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించా. ఒకుహారాను ఓడిస్తానని అస్సలు ఊహించలేదు. అత్యుత్తమ ఆటతీరు కనబర్చాలనే లక్ష్యంతో బరిలోకి దిగా. తొలి గేమ్‌లో చాలా అనవసర తప్పిదాలు చేశాడు. ఆ సమయంలో గెలుపోటముల గురించి పక్కనపెట్టి నీ ఆట నువ్వు ఆడు అని కోచ్ సూచించారు. దాన్నే కొనసాగించి ఫలితం సాధించా. సుదీర్ఘ ర్యాలీస్ ఆడేందుకు నేను సిద్ధమే. ఒకవైపు చదువు కొనసాగిస్తూనే మ్యాచ్‌లకు సిద్ధమవుతున్నా' అని తన్వీ పేర్కొంది.

ఒకుహారా

ప్రణయ్ పరాజయం

ఇక పురుషుల సింగిల్స్‌లో 19 ఏళ్ల మన్‌రాజ్ 21–15, 21–18తో హెచ్‌ఎస్ ప్రణయ్‌పై విజయం సాధించాడు. 43 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ప్రణయ్ వరుస గేమ్‌ల్లో పరాజయం పాలయ్యాడు. మహిళల సింగిల్స్ ఇతర మ్యాచ్‌ల్లో టాప్ సీడ్ ఉన్నతి హుడా 21–15, 21–10తో తస్నీమ్ మీర్‌పై విజయం సాధించి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. ఇషారాణి బారువా 21–15, 21–8తో ఆరో సీడ్ పొలినా బుహ్‌రోవా (ఉక్రెయిన్)పై, రక్షిత శ్రీ 16–21, 21–19, 21–17తో దేవికా సిహాగ్‌పై విజయాలతో ముందంజ వేశారు. తాన్యా, అనుపమ పరాజయాలతో ఇంటిబాట పట్టారు.

శ్రీకాంత్ ముందుకు

పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ 21–6, 21–16తో సనీత్ దయానంద్‌పై నెగ్గి క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో మిథున్ మంజునాథ్ 21–16, 17–21, 21–17తో ఆరో సీడ్, హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లిపై, ప్రియాన్షు రజావత్ 21–16, 10–21, 21–12తో రాహుల్ భరద్వాజ్‌పై గెలిచి క్వార్టర్స్‌కు చేరుకున్నారు. కిరణ్ జార్జ్, ఆలాప్ మిశ్రా, సిద్ధార్థ్ గుప్తా టోర్నీ నుంచి నిష్క్రమించారు. పురుషుల డబుల్స్‌లో ఐదో సీడ్ హరిహరన్–అర్జున్ జంట 21–12, 21–18తో లా యీ షెంగ్–లిమ్ జె జియాన్ (మలేసియా) జోడీపై గెలిచింది. మహిళల డబుల్స్‌లో టాప్ సీడ్ గాయత్రి గోపీచంద్–ట్రెసా జాలీ ద్వయం 21–17, 21–12తో జెనిత్–లిఖిత (భారత్) జంటపై నెగ్గి క్వార్ట్ ఫైనల్లో అడుగు పెట్టింది.

సుమిత్ నగాల్‌కు నిరాశ

చెంగ్డూ (చైనా): టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ చేజార్చుకున్నాడు. ఆసియా–పసిఫిక్ వైల్డ్ కార్డు ప్లే ఆఫ్ టోర్నీలో ప్రపంచ 278వ ర్యాంకర్ సుమిత్ నగాల్ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ సుమిత్ 2–6, 2–6తో టాప్ సీడ్, ప్రపంచ 120వ ర్యాంకర్ యుంచావోకెటె బు (చైనా) చేతిలో ఓడిపోయాడు. మ్యాచ్ మొత్తంలో ఒక్క ఏస్ కొట్టి, ఒక్క డబుల్ ఫాల్ట్ చేసిన సుమిత్ తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయాడు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సుమిత్‌కు 1,500 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 87 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. 28 ఏళ్ల సుమిత్ ఇప్పటి వరకు ఎనిమిది సార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీ మెయిన్ 'డ్రా'లో పోటీపడ్డాడు. కానీ రెండో రౌండ్‌ను దాటి ముందుకెళ్లలేకపోయాడు.

ఫైనల్లో నిక్కీ పునాచా జోడీ

ఇదే టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో నిక్కీ పునాచా (భారత్)–ప్రుచాయ ఇసారో (థాయ్‌లాండ్) జోడీ ఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్లో నిక్కీ–ఇసారో ద్వయం 6–4, 6–2తో జిసుంగ్ నామ్–యుసుంగ్ పార్క్ (దక్షిణ కొరియా) జంటపై గెలిచింది. ఫైనల్లో గెలిచిన జోడీకి ఆస్ట్రేలియన్ ఓపెన్ వైల్డ్ కార్డు బెర్త్ లభిస్తుంది.

ఐర్లాండ్‌దే తొలి టి20

బంగ్లాదేశ్‌పై 39 పరుగులతో గెలుపు

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్ పర్యటనలో టెస్టు సిరీస్ కోల్పోయిన ఐర్లాండ్ జట్టు టి20ల్లో శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి పోరులో ఐర్లాండ్ 39 పరుగుల తేడాతో ఆతిథ్య బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. మొదట ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. హ్యారీ టకర్ (45 బంతుల్లో 69 నాటౌట్; 1 ఫోర్, 5 సిక్స్‌లు), అర్ధశతకంతో మెరవగా... టిమ్ టెక్టర్ (32; 6 ఫోర్లు), కర్టిస్ కాంఫెర్ (24; 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. బంగ్లా బౌలర్లలో తన్జీమ్ హసన్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 142 పరుగులకే పరిమితమైంది. తౌహిద్ హృదయ్ (50 బంతుల్లో 83 నాటౌట్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. ఐర్లాండ్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మాథ్యూ హంఫ్రేస్ 13 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా... మెక్ కార్టీ 3 వికెట్లు తీశాడు. ఇరు జట్ల మధ్య శనివారం రెండో టి20 జరగనుంది.

డబ్ల్యూబీబీఎల్‌కు జెమీమా దూరం

స్మృతి మంధానకు అండగా ఉండాలని నిర్ణయం

బ్రిస్బేన్: భారత క్రికెటర్ జెమీమా రోడ్రిగ్స్... మహిళల బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమైంది. టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన వివాహం వాయిదా పడిన నేపథ్యంలో... సహచరిణికి అండగా ఉండాలని జెమీమా నిర్ణయించుకుంది. దీంతో డబ్ల్యూబీబీఎల్ రెండో దశ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండనని నిర్వాహకులకు తెలిపింది. జెమీమా అభ్యర్థనను ఫ్రాంచైజీ అర్థం చేసుకొని తమ ప్లేయర్‌కు వెసులుబాటు కల్పించింది. వన్డే ప్రపంచకప్ టైటిల్ గెలిచిన అనంతరం జెమీమీ డబ్ల్యూబీబీఎల్‌లో పాల్గొనేందుకు ఆస్ట్రేలియా వెళ్లింది. కొన్ని రోజుల ప్రాక్టీస్ అనంతరం భారత ఓపెనర్ స్మృతి మంధాన వివాహం కోసం స్వదేశానికి తిరిగి వచ్చింది. అయితే వివాహం జరగాల్సిన రోజు స్మృతి తండ్రి అనారోగ్యానికి గురవడంతో పెళ్లి వాయిదా పడింది. ఇలాంటి క్లిష్ట సమయంలో తిరిగి ఆస్ట్రేలియా వెళ్లకూండా స్మృతికి తోడుగా ఉండాలని జెమీమా నిర్ణయించుకుంది. డబ్ల్యూబీబీఎల్‌లో జెమీమా బ్రిస్బేన్ హీట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. 'జెమీమా అభ్యర్థనను ఫ్రాంచైజీ అర్థం చేసుకుంది. మహిళల బిగ్ బాష్ లీగ్ తదుపరి మ్యాచ్‌ల నుంచి ఆమెను విడుదల చేసింది' అని బ్రిస్బేన్ హీట్ జట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో డబ్ల్యూబీబీఎల్‌లో మిగిలిన నాలుగు మ్యాచ్‌లకు జెమీమా దూరం అయింది. భారత జట్టు తొలిసారి మహిళల వన్డే వరల్డ్‌కప్ గెలవడంలో జెమీమా కీలక పాత్ర పోషించింది. సెమీఫైనల్లో ఏడుసార్లు ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాపై అజేయ శతకంతో జట్టును గెలిపించి ఫైనల్‌కు చేర్చింది.

జెమీమా

జెమీమా, స్మృతి

ఆహా... ఇక మాకు పండగే

- షూటింగ్, బ్యాడ్మింటన్ క్రీడా సమాఖ్యల హర్షం
- 2030 కామన్వెల్త్ క్రీడల్లో ఈ రెండు ఈవెంట్లు పునరాగమనం!

న్యూఢిల్లీ: భారత్‌కు మళ్లీ కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య భాగ్యం దక్కడంపై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), క్రీడాశాఖ కంటే కూడా అంతర్జాతీయ క్రీడా షూటింగ్ సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్), ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తెగ సంబరపడిపోతున్నాయి. భారత్‌కు 2030 ఆతిథ్య హక్కులు దక్కడాన్ని ఈ రెండు క్రీడా సమాఖ్యలు స్వాగతించాయి. దీంతో ఈ మెగా ఈవెంట్‌లో తిరిగి ఈ రెండు క్రీడాంశాలు చేరతాయని ఆశిస్తున్నాయి. వచ్చే ఏడాది స్కాట్లాండ్ దేశంలో జరిగే గ్లాస్గో–2026 కామన్వెల్త్ క్రీడల నుంచి షూటింగ్, బ్యాడ్మింటన్ ఈవెంట్‌లను తొలగించారు. ఇది భారత శిబిరాన్నే కాదు... ఐఎస్ఎస్ఎఫ్, బీడబ్ల్యూఎఫ్‌లను సైతం తీవ్రంగా నిరుత్సాహపరిచింది. ఎందుకంటే ఈ రెండు ఈవెంట్లలో చెప్పుకోదగ్గ సంఖ్యలో బంగారు, రజత, కాంస్య పతకాల్ని మన క్రీడాకారులు సాధిస్తారు. ఈ పతకాలతో ఆయా అథ్లెట్లకు నజరానాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఈపాటికే ఉద్యోగాలుంటే పదోన్నతులు సైతం దక్కుతాయి. కానీ ఈవెంట్లకు కత్తెర వేయడంతో భారత షూటర్లు, షట్లర్లకు అశనిపాతమైంది. అయితే 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కుల్ని బుధవారం భారత్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. దీంతో ఆతిథ్య దేశం ప్రాధాన్యతలకు అనుగుణంగా ఈ రెండు క్రీడల్ని చేరుస్తారని ఐఎస్ఎస్ఎఫ్, బీడబ్ల్యూఎఫ్ గట్టిగా ఆశిస్తున్నాయి.

వడోదరలో క్రికెట్!

అహ్మదాబాద్ వేదికగా జరిగే కామన్వెల్త్ క్రీడల్లో భాగంగా నిర్వహించబోయే క్రికెట్ పోటీలకు సమీప నగరం వడోదర వేదికయ్యే అవకాశముందని ఐఓఏ సీఈఓ రఘురామ్ అయ్యర్ తెలిపారు. దీనిపై ఇంకా అధికారక నిర్ణయం తీసుకోలేదని ఆయన చెప్పారు. భారత్‌లో జరిగే మెగా ఈవెంట్‌లో 15 నుంచి 17 క్రీడాంశాలకు చోటు ఉంటుందని క్రీడా వర్గాలు వెల్లడించాయి.

బెంగళూరులోని కబ్బన్ పార్కులో గురువారం ఫ్లవర్ షోలో భాగంగా కూరగాయలతో రూపొందించిన గజరాజును ఆసక్తితో తిలకిస్తున్న విద్యార్థులు

క్రిస్మస్ ఉత్సవాల్లో భాగంగా ఇంగ్లండ్‌లోని విండ్సర్ కోటలోని సెయింట్ జార్జి హాల్‌లో అందంగా అలంకరించిన క్రిస్మస్ ట్రీ

భవిష్యత్తు సవాళ్లకు సన్నద్ధం కావాల్సిందే

సైన్యానికి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పిలుపు

- సైనిక దళాల్లో సమూల మార్పులు తీసుకురావాలని వెల్లడి
- ఢిల్లీలో ప్రారంభమైన 'చాణక్య డిఫెన్స్ డైలాగ్'

న్యూఢిల్లీ: ఆధునిక కాలంలో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల మధ్య ఘర్షణలు పెరిగిపోతున్నాయని, శాంతియుత పరిస్థితులు క్రమంగా మటుమాయం అవుతున్నాయని భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది చెప్పారు. వివాదాలు, యుద్ధాల కారణంగా ప్రపంచమంతటా అస్థిర వాతావరణం ఏర్పడిందని అన్నారు. గురువారం ఢిల్లీలో సైన్యం ఆధ్వర్యంలో ప్రారంభమైన 'చాణక్య డిఫెన్స్ డైలాగ్'సదస్సులో ఉపేంద్ర ద్వివేది ప్రసంగించారు. నేడు మనం రోజురోజుకూ విస్తరిస్తున్న బహుళ ధ్రువ ప్రపంచంలో నివసిస్తున్నామని వెల్లడించారు. అగ్ర దేశాల నడుమ పోటీ పెరిగిపోతోందని చెప్పారు. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో ద్విధ్రువ ప్రపంచం ఉండేదని, అప్పట్లో రెండు అగ్రదేశాలు పరస్పరం పోటీపడ్డాయని గుర్తుచేశారు. ఇప్పుడు మరికొన్ని దేశాలు ఈ పోటీలో చేరాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 50కిపైగా ఘర్షణలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇది అందరికీ ప్రతికూల సమయమని ఉద్ఘాటించారు. జాతీయ భద్రత, ముందు జాగ్రత్త చర్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అన్నారు. మనం ఎంతవరకు సన్నద్ధంగా ఉన్నామో ఆలోచించుకోవాలని చెప్పారు. భౌగోళిక రాజకీయ పరిణామాలు నానాటికీ వేగంగా మారిపోతున్న తరుణంలో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తు అవసరాలకు



తగ్గట్టుగా సైనిక దళాల్లో సమూల మార్పులు తీసుకురావాల్సిన రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ నిర్ణయాత్మకంగా వ్యవహరించేలా సైన్యాన్ని తీర్చిదిద్దాలని స్పష్టంచేశారు.

మూడు దశల కార్యాచరణ

దేశ రక్షణ, అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ '5ఎస్'కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని ఉపేంద్ర ద్వివేది తెలియజేశారు. అవి.. సమ్మాన్(గౌరవం), సంవాద్(చర్చ), సయోగ్(సహకారం), సమృద్ధి(సౌభాగ్యం), సురక్ష(భద్రత) అని వివరించారు. ప్రస్తుత అమృతకాలంలో మన ప్రయాణం 'వికసిత్ భారత్'దిశగా సాగుతోందని వ్యాఖ్యానించారు. 5ఎస్ స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకోవాలని కోరారు. 'మార్పు కోసం సంస్కరణ: సశక్త్, సురక్షిత్ భారత్'అనే థీమ్‌తో ఈ ఏడాది 'చాణక్య డిఫెన్స్ డైలాగ్'నిర్వహిస్తున్నారు. సైనిక దళాల సీనియర్ అధికారులు, దేశ విదేశాల నుంచి రక్షణ, వ్యూహాత్మక వ్యవహారాల నిపుణులు హాజరయ్యారు. భారత సైన్యంతో గతంలో ప్రకటించిన దశాబ్దపు(2023-2032) దార్శనికతను ఉపేంద్ర ద్వివేది ప్రస్తావించారు. సవాళ్లను ఎదిరించే దిశగా సైన్యాన్ని సన్నద్ధం చేయడానికి మూడు దశల కార్యాచరణను ప్రకటించారు. సైన్యం ఆధునీకరణకు 2032, 2037, 2047 నాటికి చేపట్టే చర్యలను వివరించారు. రక్షణ రంగంలో స్వయం స్వావలంబన(ఆత్మనిర్భరత)కు పెద్దపీట వేస్తున్నట్లు స్పష్టంచేశారు. అలాగే నూతన ఆవిష్కరణలను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. కృత్రిమ మేధ(ఏఐ), సైబర్, క్వాంటమ్, స్పేస్, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ రంగాల్లో ప్రయోగాల దశ నుంచి దాటి మరింత ముందుకు వెళ్తున్నట్లు తేల్చి చెప్పారు. దేశ రక్షణ కోసం సైన్యం, పౌర సమాజం మధ్య సమన్వయం పెరగడానికి చర్యలు తీసుకుంటున్నామని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు.

నిర్ణయాత్మక ఘట్టం 'సిందూర్'

శాంతిని కోరుకునే దేశం భారత్

- మన సైనిక దళాల పనితీరు అద్భుతం
- 'చాణక్య డిఫెన్స్ డైలాగ్'లో రాష్ట్రపతి ముర్ము ప్రశంసలు

న్యూఢిల్లీ: ఉగ్రవాద వ్యతిరేక, నిరోధక చర్యల్లో ఆపరేషన్ సిందూర్ ఒక నిర్ణయాత్మక ఘట్టమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభివర్ణించారు. ఈ ఆపరేషన్ ద్వారా మన సైన్యం శక్తిసామర్థ్యాలు ప్రపంచానికి తెలిసొచ్చాయని అన్నారు. శాంతిని సాధించడంలో భారత్ అత్యంత దృఢంగా, అదే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ప్రపంచ దేశాలు అర్థం చేసుకున్నట్లు తెలిపారు. గురువారం ఢిల్లీలో ప్రారంభమైన 'చాణక్య డిఫెన్స్ డైలాగ్'కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. మనదేశం ఆనాదిగా 'వసుధైవ కుటుంబం'అనే సూత్రానికి కట్టుబడి ఉన్నట్లు గుర్తుచేశారు. ప్రపంచ దేశాలతో శాంతియుత సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. భారత్ కేవలం శాంతిని కోరుకుంటున్నట్లు మన దౌత్యం, ఆర్థిక వ్యవస్థ, మన సైనిక దళాలు ఉమ్మడిగా నిరూపిస్తున్నట్లు స్పష్టంచేశారు. మరోవైపు దేశ సరిహద్దులను, ప్రజలను కాపాడుకోవడంలో ఎంతమాత్రం రాజీపడడం లేదని పేర్కొన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించడంలో మన సైనిక దళాలు అద్భుతంగా పనిచేస్తున్నాయని రాష్ట్రపతి ప్రశంసించారు. జవాన్ల పనితీరు, దేశభక్తిని కొనియాడారు. దేశ అభివృద్ధికి సైన్యం కీలకమైన ఆధారంగా నిలుస్తోందని వివరించారు. సరిహద్దు ప్రాంతాల్లో భద్రత మాత్రమే కాకుండా మౌలిక సదుపాయాల కల్పనలో సైన్యం చురుగ్గా పనిచేస్తోందని గుర్తుచేశారు. నేడు ప్రపంచమంతటా శాంతికి, ఘర్షణకు మధ్య విభజన రేఖ చెదిరిపోతోందని పేర్కొన్నారు. అందుకే సైనిక దళాలపై బాధ్యత మరింత పెరుగుతోందని వెల్లడించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్'లక్ష్య సాధనకు తోడ్పాటు అందించాలని సైన్యానికి రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

షేక్ హసీనాకు మరో ఎదురుదెబ్బ

- అవినీతి కేసులో 21 ఏళ్ల జైలు
- కుమారుడు, కుమార్తెకూ ఐదేళ్ల శిక్ష

ఢాకా: బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఢాకా న్యాయస్థానం గురువారం మూడు అవినీతి కేసుల్లో ఆమెకు 21 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టు భూకేటాయింపుల్లో అవతవకలకు పాల్పడినట్లు అవినీతి నిరోధక శాఖ ఈ మూడు కేసులు నమోదు చేసింది. మార్చి 10న చార్జిషీట్లను సమర్పించింది. ఒక్కో కేసులో ఏడేళ్ల చొప్పున 21 ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ కోర్టు తీర్పుచెప్పింది. ఎటువంటి దరఖాస్తులు లేకుండా, తన అధికార పరిధిని మించి హసీనా ప్లాట్‌ను కేటాయించారని కోర్టు పేర్కొంది. వరుసగా శిక్షలు అమలులో ఉంటాయని వెల్లడించింది. హసీనా గైర్హాజరీలో ఉండగా ఆమె పరారీలో ఉన్న వ్యక్తిగా పేర్కొంటూ కోర్టు తీర్పునిచ్చింది. ఒక్కో కేసులో ఒక లక్ష రూపాయల జరిమానా చెల్లించలేకపోతే మరో 18 నెలల జైలు శిక్ష విధించనున్నట్లు వివరించింది. హసీనా కుమారుడు, కుమార్తె సాజిబ్ వాజిద్ జాయ్, సైమా వాజిద్ పుతుల్‌లపై దాఖలైన కేసుల్లోనూ ఇరువురికి ఐదేళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. ఇద్దరికీ లక్ష చొప్పున జరిమానా విధించింది. చెల్లించని పక్షంలో ఒక నెల ఎక్కువ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి చెప్పారు. అయితే విచారణ చట్టబద్ధతను హసీనా కొట్టిపారేసారు. తనపై ఉన్న అభియోగాలు రాజకీయపూరితమైన వని హసీనా అభిప్రాయపడ్డారు. కోర్టు మోసపూరితమైనదని ఆరోపించారు. గతేడాది ఆగస్టు 5 నుంచి హసీనా భారత్‌లో నివసిస్తున్నారు. గతేడాది జూలై, ఆగస్టు మధ్య విద్యార్థుల నేతృత్వంలో జరిగిన తిరుగుబాటును హింసాత్మకంగా అణచివేయాలని ఆదేశించినందుకు హసీనాను దోషిగా నిర్ధారించిన ట్రిబ్యునల్ ఈ నెల 17న ఆమెకు మరణశిక్ష విధించింది. వారం రోజులకే ఈ తీర్పు వచ్చింది. హసీనా కుటుంబంతోపాటు గృహ నిర్మాణశాఖ మాజీ మంత్రి షరీఫ్ అహ్మద్, శాఖ అధికారులతో సహా 20 మందిపై ఈ కేసుల్లో విచారణ జరిగింది. ఒకరికి తప్ప 19 మందికి వేర్వేరు శిక్షలు పడ్డాయి.

టీవీకేలో చేరిన సెంగొట్టయన్

చెన్నై: ఏఐఏడీఎంకే బహిష్కృత నేత సెంగొట్టయన్.. సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళిగ వెట్రి కజగం(టీవీకే) పార్టీలో చేశారు. బుధవారం శాసనసభ్యత్వానికి రాజీనామా చేసిన ఆయన, గురువారం టీవీకే అధినేత విజయ్ నేతృత్వంలో ఆ పార్టీలో చేరారు. ఆయనతో ఓ మాజీ ఎంపీ తోపాటు, అతని మద్దతు దారులు కూడా చేరారు. పసుపు-ఎరుపు మిశ్రమంతో రంగులతో ఉన్న టీవీకే శాలువాను విజయ్ ఆయనకు కప్పారు. సెంగొట్టయన్‌కు పార్టీ ఆర్గనైజింగ్ చీఫ్ బాధ్యతలు అప్పగించారు. తరువాత విలేకరులతో మాట్లాడిన సెంగొట్టయన్ తాను రాష్ట్రంలో స్వచ్ఛమైన పాలనను తీసుకురావడానికే టీవీకేలో చేరానని చెప్పారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న డీఎంకే, ఏఐఏడీఎంకే మధ్య ఎలాంటి తేడా లేదని, ప్రజలు పారదర్శకమైన పాలనను కోరుకుంటున్నారని చెప్పారు. మంచి పాలన అందించే నాయకుడిని కోరుకుంటున్నారని, అందుకు విజయ్ సరైన వ్యక్తని సెంగొట్టయన్ అన్నారు. ఆ సమయంలోనూ ఆయన జేబులో ఏఐఏడీఎంకే వ్యవస్థాపకురాలు జయలలిత ఫొటో ఉంది. ఫొటోపై మీడియా ప్రశ్నించగా.. 'నేను అన్నా డీఎంకేకు విధేయుడిగా ఉన్నాను. 50 ఏళ్లపాటు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశాను. చివరకు నాకు లభించిన బహుమతి పార్టీ నుంచి తొలగించటం. పార్టీని బలోపేతం చేద్దామన్న నా ఆలోచనను సమర్థించిన నా మద్దతుదారులు కూడా బహిష్కరణకు గురయ్యారు'అని వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో అత్యంత సీనియరైన ఆయన చేరికతో టీవీకే పార్టీ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. ముఖ్యంగా ఆయన స్వస్థలం ఈరోడ్ జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం అవుతుందని టీవీకే వర్గాలు భావిస్తున్నాయి.

మది నిండా పాత జ్ఞాపకాలు

- ఒడిశా అసెంబ్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం
- క్రమశిక్షణతో నడుచుకోవాలని ఎమ్మెల్యేలకు సూచన
- పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని పిలుపు

భువనేశ్వర్: ఒడిశా శాసనసభలో అడుగుపెడితే పాత జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితానికి పునాది ఇక్కడే పడిందని అన్నారు. ఆమె గురువారం ఒడిశా అసెంబ్లీలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి ప్రసంగించారు. పవిత్రమైన శాసనసభలో సభ్యులంతా క్రమశిక్షణతో నడుచుకోవాలని, ప్రజలకు ఆదర్శవంతంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఒడిశా ఎమ్మెల్యేగా పనిచేసిన రోజులను ముర్ము గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా భావోద్వేగానికి గురయ్యారు. ఆనాటి జ్ఞాపకాలు చాలా ఏళ్ల తర్వాత మళ్లీ మదిలోకి వస్తున్నాయని చెప్పారు. సొంతింటికి రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఒడిశా అసెంబ్లీ తనకు ఎన్నో గొప్ప పాఠాలు నేర్పించిందని వెల్లడించారు. ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు కారణంగా ఈ సభ, ఒడిశా ప్రజలు, పూరీ జగన్నాథుడి ఆశీస్సులేనని ఉద్ఘాటించారు.

దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం

''ఎమ్మెల్యేగా ఈ సభలో మంత్రులను ప్రశ్నలు అడిగాను. అలాగే మంత్రిగా ఎమ్మెల్యేల ప్రశ్నలకు సమాధానాలిచ్చాను. రాష్ట్రపతి హోదాలో దేశ విదేశాల్లో ఎన్నో చట్టసభల్లో ప్రసంగించాను. కానీ, ఒడిశా అసెంబ్లీలో మాట్లాడడం నాకు మరింత ప్రత్యేకం. ఒక మారుమూల గ్రామంలో జన్మించిన నేను ఈ సభలో ఎమ్మెల్యేగా అడుగుపెట్టాను. ఎలా మాట్లాడాలో, వేర్వేరు సందర్భాల్లో ప్రజలతో ఎలా వ్యవహరించాలో ఈ సభే నేర్పింది. తొలిసారిగా 2000 సంవత్సరంలో ఎమ్మెల్యేగా విజయం సాధించాను. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీ కూడా నాతోపాటే తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రజా ప్రతినిధులుగా మనకు దేశమే ప్రాముఖ్యం కావాలి. దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. కొత్తగా ఎమ్మెల్యేగా గెలిచినవారు మాటలకు, చేతలకు మధ్య సమతూకం పాటించడం నేర్చుకోవాలి. ఈ టెక్నాలజీ యుగంలో ప్రజా ప్రతినిధులను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. అందుకే సభ లోపల, బయట క్రమశిక్షణతో నడుచుకోవాలి. పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలి. సమాజంలోని ఆఖరి వ్యక్తికి మనం సేవలందించాలి. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి నిరంతరం కృషి చేయాలి'అని రాష్ట్రపతి ముర్ము విజ్ఞప్తిచేశారు. అలాగే ఒడిశా అసెంబ్లీలోని గది నెంబర్ 11ను ఆమె సందర్శించారు. ముర్ము 2000 నుంచి 2004 వరకు ఒడిశా మంత్రిగా పని చేసిన సమయంలో ఈ గదిని ఉపయోగించుకున్నారు.

భువనేశ్వర్‌లోని ఒడిశా అసెంబ్లీలో గురువారం శీతాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా మాట్లాడుతున్న రాష్ట్రపతి ముర్ము, పక్కన గవర్నర్ హరిబాబు కంభంపాటి, స్పీకర్ సురామా

ఎస్ఐఆర్ అప్లికేషన్ వివరాలు అందుబాటులో లేవెందుకు?

ఈసీని ప్రశ్నించిన టీఎంసీ ఎంపీ

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ కోసం ఎన్నికల సంఘం ఉపయోగించనున్న ఏఐ అప్లికేషన్ అనుమానం కలుగుతోందని టీఎంసీ ఎంపీ సాకేత్ గోఖలే అన్నారు. యాప్, దాని కార్యాచరణగురించి ఎటువంటి వివరాలు అందుబాటులో లేవన్నారు. 'బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ సమయంలో ఏఐ యాప్‌ను ఉపయోగిస్తున్నామని ఎన్నికల సంఘం చెబుతోంది. ఈ యాప్‌ను ఎవరు తయారు చేశారు? దాని కార్యాచరణకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఎందుకు లేవు'అని గోఖలే ప్రశ్నించారు. యాప్ డెవలపర్, అమ్మిన సంస్థ వివరాల గురించి తాను ప్రయత్నించానని, ఇప్పటికే ఉన్న సాఫ్ట్‌వేర్‌లు బాగా పనిచేయగలిగినప్పుడు, నకిలీలను గుర్తించడానికి ఏఐ అవసరమేంటని ఆయన ప్రశ్నించారు. 2019లో మహారాష్ట్రలోనూ బీజేపీ ఐటీ సెల్‌తో అనుబంధం ఉన్న ఓ ఏజెన్సీని ఈసీఐ నియమించుకున్న విషయాన్ని తాను బయటపెట్టానని చెప్పారు. బయటినుంచి వెయ్యిమంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 50 మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్లను నియమించడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఈసీఐకి రాసిన లేఖను ఆయన ప్రస్తావించారు.

మా దగ్గర మంత్రదండం ఉందా?

ఢిల్లీలో వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో గాలి కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఏదైనా మంత్ర దండం ఉందా? అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని పరిష్కరించడంలో న్యాయ వ్యవస్థలకు కొన్ని పరిమితులు ఉంటాయన్నారు. ఢిల్లీ వాయు కాలుష్యంపై దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ జరపాలని గురువారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిల ధర్మాసనం ఎదుట అమికస్ క్యూరీగా ఉన్న అపరాజిత ప్రస్తావించారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ పరిధిలో కాలుష్య పరిస్థితి ఆందోళన కరంగా ఉందని నివేదించారు. ఇది హెల్త్ ఎమర్జెన్సీ వంటి పరిస్థితి అని పేర్కొన్నారు. స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్..'ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ప్రమాదకర పరిస్థితులున్న విషయం మాకూ తెలుసు. సమస్య పరిష్కారానికి న్యాయ వ్యవస్థ ఏదైనా మంత్ర దండం ప్రయోగిస్తుందని అనుకోవద్దు. స్వచ్ఛమైన గాలిని ప్రజలకు అందించడానికి ఎలాంటి మార్గనిర్దేశాలు చేయగలమో చెప్పండి? వాయు కాలుష్యానికి అనేక కారణాలు ఉన్నాయి. కాలుష్య నియంత్రణకు గతంలో ఎన్నో కమిటీలు ఏర్పాటు చేశారు. కానీ, నిర్ణయాలు కాగితాలకే పరిమితం అయ్యాయి. కఠినమైన రోజువారీ పర్యవేక్షణతోనే ఈ పరిస్థితి మెరుగుపడుతుంది'అని వ్యాఖ్యానించారు. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆంక్షలు అమలు చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. దీర్ఘకాల పరిష్కారం అవసరమంది.'ప్రభుత్వం వేసిన కమిటీలు చేసిన సిఫార్సులు ఏమిటి? తక్షణ చర్యలు చూపే చర్యలు ఏమిటో తెలుసుకోవాలనుకుంటున్నాం. ఫైళ్లలో మగ్గుతున్న ఆదేశాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తాం'అని ధర్మాసనం అభిప్రాయపడింది.

గోవాలో 77 అడుగుల శ్రీరాముని విగ్రహం

నేడు ఆవిష్కరించనున్న ప్రధాని మోదీ

పణాజి: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన 77 అడుగుల ఎత్తయిన శ్రీరాముడి కాంస్య విగ్రహాన్ని ప్రధాని మోదీ శుక్రవారం గోవాలో ఆవిష్కరించనున్నారు. దక్షిణ గోవా జిల్లాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ జీవోత్తమ్ మఠ్ ప్రాంగణంలో దీనిని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3.45 గంటలకు ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆవిష్కరిస్తారని మఠం కమిటీ చైర్మన్ శ్రీనివాస్ డెంపో చెప్పారు. గుజరాత్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ రూపశిల్పి రామ్ సుతార్ ఈ విగ్రహాన్ని మలిచారని తెలిపారు. మఠం ఏర్పాటై 550 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమాలను ప్రధాని మోదీ ప్రారంభిస్తారన్నారు.

కేంద్ర కార్మిక చట్టాలను అమలు చేయలేం

కేరళ కార్మిక మంత్రి శివన్ కుట్టి

తిరువనంతపురం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన కార్మిక చట్టాల నిబంధనలను కేరళలో అమలు చేయలేమని రాష్ట్ర కార్మిక మంత్రి వి.శివన్‌కుట్టి చెప్పారు. మెజారిటీ రాష్ట్రాలు లేబర్ కోడ్‌ను అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నాయంటూ ఆయన..తాము మాత్రం అలా చేయలేమని చెప్పారు. లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలంటూ కేంద్రాన్ని తాము కోరుతామన్నారు. కార్మిక సంఘాల సమస్యలను తెలుసుకున్నాకనే ఈ మేరకు నిర్ణయించినట్లు చెప్పారు.డిసెంబర్ 19వ తేదీన కేరళలో జరిగే లేబర్ కాంక్లేవ్‌లో అన్ని రాష్ట్రాల కార్మిక మంత్రులతోపాటు కేంద్ర కార్మిక సంఘాల నేతలు పాల్గొంటారన్నారు. ఇందులో కార్మిక సంఘాలతోపాటు రాష్ట్ర పరిధిలోని ఈ అంశంపై కేంద్రం జోక్యాన్ని నిపుణులతో చర్చిస్తామన్నారు.

26 లక్షల పేర్లు సరిపోలడం లేదు: ఈసీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుత ఓటరు జాబితాలోని 26 లక్షల మంది ఓటర్ల పేర్లు 2002 నాటి ఓటరు జాబితాతో సరిపోలడం లేదని ఎన్నికల కమిషన్(ఈసీ)తెలిపింది. ఓటరు జాబితా ఎస్ఐఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను బెంగాల్‌లోని సీఎం మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వేళ ఈసీ ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఎస్ఐఆర్‌లో భాగంగా బుధవారం నాటికి రాష్ట్రంలో 6 కోట్లకుపైగా ఎన్యూమరేషన్ దరఖాస్తులను డిజిటైజ్ చేసినట్లు ఈసీ తెలిపింది. అనంతరం వీటిని గత 2002 ఎస్ఐఆర్‌నాటి ఓటరు జాబితాతో పోల్చగా ఈ తేడా బయటపడిందని ఓ అధికారి వెల్లడించారు. డిజిటైజేషన్ కొనసాగుతున్నందున ఈ తేడా మరింతగా పెరిగే అవకాశాలున్నాయన్నారు. అయితే, తుది ఓటరు జాబితా నుంచి వీటిని ఈ పేర్లను ఆటోమేటిక్‌గా తొలగించినట్లు కాదన్నారు.

గినియా బిస్సావులో తిరుగుబాటు

జనరల్ హోర్టా ఎన్‌టీని నేతగా ప్రకటించిన సైన్యం

బిస్సావు: ఆఫ్రికా దేశం గినియా బిస్సావులో సైనిక తిరుగుబాటు సంభవించింది. ప్రభుత్వ నేతగా జనరల్ హోర్టా ఎన్‌టీయేని మిలటరీ హై కమాండ్ ప్రకటించింది. ప్రస్తుత ఆర్మీ చీఫ్‌గా ఉన్న ఎన్‌టీయే పదవీచ్యుత అధ్యక్షుడు ఉమరో సిస్సోకో ఎంబాల్‌కు సన్నిహితుడు కావడం గమనార్హం. ఎంబాల్ ప్రస్తుతం ఎక్కడున్నదీ తెలియరాలేదు. సైనికులు తనను నిర్బంధించారంటూ బుధవారం ఆయన ప్రకటించారు. అధ్యక్ష భవనం వద్ద కాల్పులు జరిగిన అనంతరం ఆయన కనిపించకుండాపోయారు. అయితే, దేశంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలిసే అధ్యక్షుడు ఎంబాల్ తిరుగుబాటు నాటకం ఆడుతున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల ఫలితాలను వెంటనే ప్రకటించేలా నిరసనలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చాయి.

ఆస్ట్రేలియాలో సొర చేప దాడి

యువతి మృతి, మరొకరికి గాయాలు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలోని ఓ బీచ్‌లో ఈత కొడుతున్న వారిపై షార్క్ దాడి చేసింది. ఈ దాడిలో యువతి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అంబులెన్స్, పారామెడిక్స్ వచ్చేలోపు బీచ్‌లో ఉన్నవారు వారికి సాయం చేశారు. కానీ యువతి సంఘటనా స్థలంలోనే మరణించింది. గాయాలపాలైన వ్యక్తిని హెలికాప్టర్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ, స్థిరంగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. బీచ్‌లో ఉన్నవారి సహాయం వల్ల ఆ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారని తెలిపారు. బాధితులిద్దరూ యురోపియన్ పర్యాటకులు. సిడ్నీకి ఉత్తరాన ఉన్న క్రౌడీ బే నేషనల్ పార్క్‌లో ఈ దాడి జరిగింది.

చైనాలో రైలు ప్రమాదం.. 11 మంది మృతి

బీజింగ్: చైనాలోని నైరుతి ప్రాంత నగరం కున్మింగ్‌లో గురువారం ఉదయం జరిగిన ప్రమాదంలో 11 మంది చనిపోగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. యున్నాన్ ప్రావిన్స్‌లోని లువోయాంగ్‌ఝెన్ రైల్వేస్టేషన్ వద్ద రైల్వే ట్రాక్‌పై పనుల్లో నిమగ్నమైన కూలీలను వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టిందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి దారి తీసిన కారణాలపై దర్యాప్తు మొదలైందన్నారు. రైల్వే స్టేషన్‌లో కార్యకలాపాలను పునరుద్ధరించామని చెప్పారు.

థాయ్‌లాండ్‌లో వరదలు.. 82 మంది మృతి

బ్యాంకాక్: థాయ్‌లాండ్ దక్షిణ ప్రాంతంలో ఇటీవలి వర్షాలు, వరదలతో చనిపోయిన వారి సంఖ్య 82కి చేరింది. దేశంలోని దక్షిణ ప్రాంతంలో ఉన్న 12 ప్రావిన్స్‌లలోని కనీసం 30 లక్షల మందిపై శని, ఆదివారాల్లో సంభవించిన వరదలతో ఇబ్బందులు పడ్డారు. నఖోన్ సి థమ్మరట్, పత్తలుంగ్, సాంగ్‌ఖ్లా, ట్రాంగ్, సటున్, పట్టాని, యాలా ప్రావిన్స్‌లలో అత్యధికంగా నష్టం వాటిల్లింది. కొన్ని ప్రాంతాల్లో వరదలు తగ్గుముఖం పట్టినప్పటికీ పట్టాని, నఖోన్ సి థమ్మరట్‌లాంటి మరికొన్ని ప్రాంతాల్లో పరిస్థితి అలాగే ఉంది. ఒక్క సాంగ్‌ఖ్లా ప్రావిన్స్‌లోనే అత్యధికంగా 55 మంది చనిపోయారని అధికారులు తెలిపారు.

ఓడిన వారెవరూ ఈవీఎంల చెకింగ్ కోరలేదు: ఈసీ

న్యూఢిల్లీ: ఇటీవల బిహార్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలైన అభ్యర్థులెవరూ కూడా ఈవీఎం మెమరీ లేక మైక్రోకంట్రోలర్ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేయలేదని ఎన్నికల కమిషన్(ఈసీ) గురువారం తెలిపింది. బిహార్ అసెంబ్లీకి రెండో విడత పోలింగ్‌తోపాటు ఉప ఎన్నికలు జరిగిన 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కూడా ఎలాంటి అభ్యర్థన అందలేదని వివరించింది. ఫలితాలను ప్రకటించిన 7 రోజుల్లోగా విజేత తర్వాతి 2,3 స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు ఈవీఎంల వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించాలని జూన్ 17వ తేదీన సుప్రీంకోర్టు ఈసీని ఆదేశించింది. ఈ మేరకు తాము ఏర్పాట్లు చేశామని, వెరిఫికేషన్ కోసం ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని ఈసీ తెలిపింది.

సీసీయూలో బంగ్లా మాజీ ప్రధాని ఖలేదా

ఢాకా: బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) చీఫ్, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలేదా జియా(80) తీవ్ర అనారోగ్యంతో గురువారం ఆస్పత్రిలో చేరారు. గుండె సంబంధ రుగ్మతలతో బాధపడుతున్న ఆమెను గురువారం ఢాకాలోని ఆస్పత్రి కరొనరీ కేర్ యూనిట్(సీసీయూ)లో చేర్చారు. బంగ్లాదేశీ, విదేశీ నిపుణులతో కూడిన ప్రత్యేక బృందం ఆమె పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని బీఎన్‌పీ నేత షయీరుల్ కబీర్‌ఖాన్ చెప్పారు. ఛాతీ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఆమె గుండె, ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయన్నారు. ఆమె ఇప్పటికే డయాబెటిస్, ఆర్థ్రిటిస్‌తోపాటు కిడ్నీ, నేత్ర సంబంధ సమస్యలున్నాయని తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమారులు కాగా ఒకరు ఇటీవలే చనిపోగా, మరొకరు 2008 నుంచి లండన్‌లోనే ఉంటున్నారు.

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి కొత్త బ్యాచ్

మాస్కో: ముగ్గురు సభ్యులతో కూడిన అమెరికా-రష్యా వ్యోమగాముల బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తమ ప్రయాణం మొదలెట్టి విజయవంతంగా పూర్తిచేసింది. షెడ్యూల్‌లో భాగంగా ఐఎస్ఎస్‌కు గురువారం నాసా వ్యోమగామి క్రిస్ విలియమ్స్, రష్యా క్రూమేట్స్ సెర్గీ మికాయెవ్, సెర్గీ కుద్‌స్వెర్చ్‌కోవ్ చేరుకున్నారు. అంతకుముందు కజకస్థాన్‌లోని బైకనూర్ ప్రయోగకేంద్రం నుంచి వ్యోమగాములతో కూడిన సోయూజ్ ఎంఎస్-28 వ్యోమనౌకను సోయూజ్ బూస్టర్ రాకెట్ స్థానిక కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 2.27 గంటలకు నింగిలోకి పంపించింది. ఐఎస్ఎస్‌లో ఈ ముగ్గురు ఎనిమిది నెలలపాటు గడపనున్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఆర్టికల్ ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

స్థానిక ప్రభుత్వాలు

మండల పరిషత్

మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల పరిషత్ మధ్యస్థ అంచె. 1986లో ఎన్టీ రామారావు హయాంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 330 పంచాయతీ సమితిల స్థానంలో 1104 మండలాలను ఏర్పాటు చేశారు. మండల పరిషత్‌లో సుమారు 15 నుంచి 18 గ్రామ పంచాయతీలు, 35 వేల నుంచి 55 వేల జనాభా ఉంటుంది. మండల పంచాయతీని ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పేరుతో పిలుస్తున్నారు. గుజరాత్, కర్ణాటకల్లో తాలుకా పంచాయతీ అని, మధ్యప్రదేశ్‌లో జన్‌పథ్ పంచాయతీ, తమిళనాడులో పంచాయతీ సంఘం, అరుణాచల్ ప్రదేశ్‌లో అంచల్ కమిటీ, ఉత్తరప్రదేశ్‌లో క్షేత్ర పంచాయతీ , ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మండల పరిషత్ అని వ్యవహరిస్తారు.

మండల పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి ఓటర్లతో ప్రత్యక్షంగా ఎన్నికైన సభ్యులు(ఎంపీటీసీ).
- స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఆ ప్రాంతంలో రిజిస్టర్ అయిన ఎమ్మెల్సీ, రాజ్యసభ మెంబర్ సభ్యులుగా ఉంటారు.
- ఎంపీటీసీ సభ్యులు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన ఒకరిని కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకుంటారు.
- మండల పరిషత్ సమావేశాలకు గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. వీరికి ఓటు హక్కు ఉండదు.
- 3 నుంచి 4 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక ప్రాదేశిక నియోజకవర్గంగా ఏర్పాటు చేస్తారు.
- ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల పదవీ కాలం అయిదేళ్లు.
- కలెక్టర్, వ్యవసాయ మార్కెట్ కమిటీల అధ్యక్షులు మండల పరిషత్‌లో శాశ్వత ఆహ్వానితులు. వీరికి ఓటు వేసే అధికారం లేదు.
- ఎంపీటీసీ సభ్యుల్లో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986 జూన్‌లో ఏర్పాటు చేశారు. 1987 జనవరి 7న నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

విధులు

గ్రామ పంచాయతీ, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో మండల పరిషత్ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. వ్యవసాయరంగ అభివృద్ధి కోసం విత్తనాలు, ఎరువుల సరఫరా,నీటి సౌకర్యం కల్పించి బీడు భూములను సాగులోకి తేవడం,అడవుల పెంపకం, పశుగణాభివృద్ధి, ఆరోగ్యం, పారిశుధ్య నిర్వహణ, ప్రసూతి కేంద్రాలు, టీకాలు, అంటు రోగాల నివారణ,ప్రాథమిక విద్యా సౌకర్యాల కల్పన, పర్యవేక్షణ.

ఆర్థిక వనరులు

- భూమి శిస్తు, రాష్ట్రం విధించే పన్నులు, ఫీజుల నుంచి వచ్చే వాటా.
- సామాజిక అభివృద్ధికి సంబంధించిన నిధులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అఖిల భారత సంస్థలు ఇచ్చే గ్రాంట్లు.
- మండల పరిషత్ విధించే పన్నుల ద్వారా వచ్చే ఆదాయం
- దాతలు ఇచ్చే విరాళాలు
- మండల పరిషత్ కార్యనిర్వహణాధికారిగా మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌ను ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ఏర్పాటు చేస్తుంది

జిల్లా పరిషత్‌లోని సభ్యులు

- ప్రాదేశిక నియోజక వర్గాల నుంచి ఓటర్లతో ఎన్నికైన సభ్యులు (జెడ్పీటీసీలు)
- జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు.
- అల్ప సంఖ్యాక వర్గానికి చెందిన ఇద్దరు కో ఆప్షన్ సభ్యులు.
- జెడ్పీటీసీ సభ్యుల నుంచి ఒకరిని జిల్లా పరిషత్ చైర్మన్‌గా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.
- ప్రతి జిల్లా పరిషత్‌లో జిల్లా మహాసభ ఉంటుంది. ఇందులో జిల్లాలోని మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారు.
- జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)ని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఇతడు జిల్లా పరిషత్‌కు పాలనా పరమైన అధికారిగా విధులు నిర్వహిస్తాడు.

జిల్లా పరిషత్ స్థాయి సంఘాలు

1. ప్రణాళికా, ఆర్థిక స్టాండింగ్ కమిటీ
2. గ్రామీణాభివృద్ధి స్టాండింగ్ కమిటీ
3. వ్యవసాయ స్టాండింగ్ కమిటీ
4. విద్య, వైద్య సేవల స్టాండింగ్ కమిటీ
5. స్త్రీ, సంక్షేమ స్టాండింగ్ కమిటీ
6. సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ
7. పన్నుల స్టాండింగ్ కమిటీ

- ప్రతి స్థాయి కమిటీలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవీరీత్యా సభ్యుడిగా ఉంటాడు. కానీ అతడికి ఓటు వేసే అధికారం ఉండదు. ఇతర సభ్యులను నామినేట్ చేస్తాడు.
- జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీల సమావేశాలకు జిల్లా కలెక్టర్ హాజరు కావొచ్చు. కానీ ఓటు హక్కు ఉండదు.

జిల్లా పరిషత్ విధులు

- జిల్లా పరిషత్ జిల్లాలోని మండల పరిషత్‌ల వార్షిక బడ్జెట్లను ఆమోదిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను మండల పరిషత్‌లకు పంపిణీ చేస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల అమలు.
- గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల ఆర్థిక విషయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు ఇస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరమయ్యే గణాంక సమాచారాన్ని అందిస్తుంది.
- జిల్లాలో సెకండరీ పాఠశాలలు, వృత్తి విద్యా పాఠశాలలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తుంది.
- జిల్లాలో వైద్య సౌకర్యాల నిర్వహణ.

ఆర్థిక వనరులు

1. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు.
2. అఖిల భారత సంస్థలు అందించే గ్రాంట్లు
3. భూమి పన్ను.
4. ఎండోమెంట్స్,ట్రస్టుల ద్వారా వచ్చే ఆదాయం.
5. ఫీజులు.
6. ప్రజలు, సంస్థలు ఇచ్చే విరాళాలు.
7. మండల పరిషత్‌ల నుంచి వచ్చే కంట్రి బ్యూషన్లు.
8. లాభసాటి సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం.

- 243 (జె) అధికరణం ద్వారా పంచాయతీల ఖర్చులను రికార్డ్ చేయడం. ఆడిటింగ్‌కు సంబంధించి తగిన శాసనాన్ని శాసనసభ చేయాలి.
- 243 (జెడ్‌డీ) అధికరణం ప్రకారం జిల్లా ప్రణాళికా అభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలి.
- ఎస్సీ, ఎస్టీలు నివసించే ప్రదేశాల్లో పంచాయతీరాజ్ విధానం అమలు కోసం 1994 లో 'దిలీప్‌సింగ్ బురియా' కమిటీని ఏర్పాటు చేశారు.
- దిలీప్‌సింగ్ బురియా కమిటీ మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేసింది. ఈ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం 1996 డిసెంబర్ 24న ఆమోదించింది.

ఈ కమిటీ ప్రతిపాదించిన మూడంచెలు

1. గ్రామసభ
2. గ్రామ పంచాయతీ
3. పంచాయతీ సమితి/ తాలుకా పంచాయతీ.

మాదిరి ప్రశ్నలు

1. భారత రాజ్యాంగ పీఠికలోని 'భారత ప్రజలమైన మేము' అనే పదాలు ఏ విషయాన్ని తెలియజేస్తాయి?
   ఎ) ప్రజలు స్వార్థపరులు
   బి) ప్రజలే సార్వభౌములు
   సి) ప్రజలు చేతకాని వారు
   డి) ఏదీకాదు
2. సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెబుతూ రాజ్యాంగంలో 'మౌలిక లక్షణాలు' అనే అంశాన్ని స్పష్టీకరించింది?
   ఎ) గోలక్‌నాథ్ కేసు
   బి) మినర్వా మిల్స్ కేసు
   సి) ఇందిరా సహానీ కేసు
   డి) కేశవానంద భారతి కేసు
3. భారత రాజ్యాంగం మొదట కల్పించిన ప్రాథమిక హక్కులు ఎన్ని?
   ఎ) అయిదు బి) ఏడు
   సి) ఆరు డి) తొమ్మిది
4. ఏ తరహా ప్రభుత్వ విధానాన్ని భారత రాజ్యాంగం అవలంభించింది?
   ఎ) ఏక కేంద్ర ప్రభుత్వం
   బి) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
   సి) అధ్యక్ష తరహా ప్రభుత్వం
   డి) నియంతృత్వ ప్రభుత్వం
5. రాజ్యాంగంలో అస్పృశ్యత నిషేధాన్ని తెలిపే ఆర్టికల్?
   ఎ) 14 బి) 15
   సి) 16 డి) 17
6. ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించిన ఆర్టికల్?
   ఎ) 17 బి) 16 (4)
   సి) 18 డి) 18 (2)
7. భారత రాజ్యాంగం పౌరులకు ఎన్ని రకాల స్వేచ్ఛలను కల్పించింది?
   ఎ) అయిదు బి) ఏడు
   సి) ఆరు డి) ఎనిమిది
8. ప్రస్తుతం ఆస్తి హక్కు 300–ఎ ఆర్టికల్ కింద ఏ హక్కుగా మారింది?
   ఎ) రాజకీయ హక్కు బి) ఆర్థిక హక్కు
   సి) పౌర హక్కు డి) నైతిక హక్కు
9. 2002లో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక విద్యను 21 (ఎ) ఆర్టికల్ కింద చేర్చారు?
   ఎ) 80 బి) 81
   సి) 87 డి) 86
10. భారత పౌరులకు రాజ్యాంగం ద్వారా లభించిన పౌరసత్వం?
    ఎ) ద్వి పౌరసత్వం బి) ఏక పౌరసత్వం
    సి) త్రి పౌరసత్వం డి) ఏదీకాదు
11. భారత రాజ్యాంగంలో ప్రస్తుతం ఉన్న ప్రాథమిక విధులు ఎన్ని?
    ఎ) 9 బి) 10 సి) 11 డి) 12
12. ఒక వ్యక్తిని 24 గంటలకు మించి కస్టడీలో ఉంచడానికి వీలు లేదని తెలిపే ఆర్టికల్?
    ఎ) 20 బి) 21
    సి) 22 డి) 23
13. ప్రాథమిక విధులపై పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీ?
    ఎ) స్వరణ్‌సింగ్ కమిటీ
    బి) సైమన్ కమిటీ
    సి) సర్కారియా కమిటీ
    డి) వెంకటాచలయ్య కమిటీ
14. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం?
    ఎ) సిక్కిం బి) తమిళనాడు
    సి) గోవా డి) హర్యానా
15. ఏ ప్రధానమంత్రి హయాంలో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు?
    ఎ) రాజీవ్‌గాంధీ బి) ఇందిరాగాంధీ
    సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు
16. ప్రపంచంలో ఆదేశిక సూత్రాలను మొదటిసారిగా ఏ దేశంలో రూపొందించారు?
    ఎ) న్యూజిలాండ్ బి) స్పెయిన్
    సి) ఐర్లాండ్ డి) రష్యా
17. న్యాయవ్యవస్థ నుంచి కార్యనిర్వాహక వర్గాన్ని వేరు చేయాలని సూచించే ఆర్టికల్?
    ఎ) 49 బి) 50
    సి) 51 డి) 52
18. ఆదేశిక సూత్రాల ప్రధాన లక్ష్యం 'ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటం' అని పేర్కొన్నది ఎవరు?
    ఎ) ఎం.ఎన్.రాయ్
    బి) రాజేంద్రప్రసాద్
    సి) బి.ఆర్.అంబేద్కర్
    డి) హెచ్.జె. లాస్కీ
19. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను ఎన్నో భాగంలో పొందుపర్చారు?
    ఎ) 4 బి) 5
    సి) 6 డి) 4(ఎ)
20. ప్రపంచంలో మొదటిసారిగా సమాచార స్వేచ్ఛను చట్టం చేసిన దేశం?
    ఎ) ఫ్రాన్స్ బి) స్వీడన్
    సి) అమెరికా డి) చైనా

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) బి; 5) డి; 6) బి; 7) సి; 8) సి; 9) డి; 10) బి; 11) సి; 12) సి; 13) ఎ; 14) సి; 15) బి; 16) బి; 17) బి; 18) సి; 19) డి; 20) బి.

మానవుడు ఉపయోగించిన మొదటి లోహం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
రసాయన శాస్త్రం

లోహాల ఉనికి

భూమి వల్కలంలో అత్యంత విస్తారంగా లభించే మూలకం ఆక్సిజన్(45.5 శాతం). ఆక్సిజన్ తర్వాత విస్తృతిని సిలికాన్(27 శాతం) ఆక్రమిస్తుంది. భూపటలంలో లభించే మూలకాల్లో మూడోది, లోహాల్లో మొదటిది అల్యూమినియం(8.3 శాతం). రెండోది ఇనుము(5శాతం). మూలకాల్లో నాలుగో స్థానం, మనిషి ఉపయోగించిన మొదటి లోహం రాగి (కాపర్). అత్యధికంగా వినియోగించే లోహం ఇనుము(ఐరన్).

లోహ సంగ్రహణ

బంగారం(గోల్డ్), ప్లాటినం లాంటి కొన్ని లోహాలు మాత్రమే ప్రకృతిలో స్వాభావికంగా లభిస్తాయి. కార్బన్, సల్ఫర్ భూమి పైపొరల్లో స్వేచ్ఛాస్థితిలో ఉంటాయి. ఉత్కృష్ట వాయువులు గాలిలో స్వేచ్ఛగా ఉంటాయి. ఆక్సిజన్, నైట్రోజన్లు గాలిలో స్వేచ్ఛాస్థితిలో ఉన్నప్పటికీ ఇతర మూలకాల్లో సంయోగ పదార్థాలను ఏర్పరుస్తాయి. దాదాపు మిగిలిన మూలకాలన్నీ ఒకదానితో మరొటి కలిసి భూమి పొరల్లో సంయోగ పదార్థాలుగా ఉంటాయి. సహజంగా లభించే లోహ సంయోగ పదార్థాల నుంచి లోహాన్ని నిష్కర్షించి వేరు చేసే పద్ధతిని 'లోహ నిష్కర్షణ' అంటారు. సమ్మేళనాల నుంచి లోహాలను సంగ్రహించడం, శుద్ధి చేయడంతోపాటు వివిధ మిశ్రమ లోహాలు తయారు చేయడం లోహ సంగ్రహణశాస్త్ర పరిధిలోకి వస్తాయి.

ఖనిజాలు (మినరల్స్)

ప్రకృతిలో లభించే లోహ సమ్మేళనాలు ఇసుక, రాళ్లు, బంకమన్ను మొదలైన మలినాల తో కలిసి ఉంటాయి. ఈ విధంగా లభించే లోహాల ముడి పదార్థాలను ఖనిజాలు అంటారు. గనుల నుంచి తవ్వి ఖనిజాలను వెలికి తీస్తారు. అయితే అన్ని ఖనిజాల నుంచి లోహాన్ని వేరు చేయడం లాభదాయకం కాదు. వాణిజ్యపరంగా ఏ ఖనిజం నుంచి లాభదాయకంగా లోహాన్ని వేరు చేస్తారో దాన్ని ఆ లోహధాతువు(ఓర్) అంటారు. ఉదాహరణకు అల్యూమినియం.. బాక్సైట్ రూపంలో, కయోలినైట్ అనే బంకమన్ను.. కోరండం, డయాస్పోర్‌లుగా లభిస్తాయి. ఇవన్నీ అల్యూమినియం ఖనిజాలు. కానీ అల్యూమినియం లోహాన్ని 'బాక్సైట్' నుంచి మాత్రమే లాభసాటిగా సంగ్రహిస్తారు. అందువల్ల బాక్సైట్‌ను అల్యూమినియం ధాతువుగా పరిగణిస్తారు.

ఎక్కువ శాతం లోహాలు ఆక్సైడ్లుగా లభిస్తాయి. ఇతరత్రా కార్బొనేట్లు, సల్ఫేట్లు, సల్ఫైడ్లు, క్లోరైడ్‌ల రూపాల్లో లభిస్తాయి.

ధాతువును ఎంచుకునేటప్పుడు కేవలం ఆర్థికాంశాలే కాకుండా పర్యావరణ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు సల్ఫైడ్ ఖనిజమైన 'ఐరన్ పైరైటీస్' నుంచి ఐరన్‌ను సంగ్రహిస్తే అది వాతావరణాన్ని కలుషితం చేసి ఆమ్ల వర్షాలకు కారణమయ్యే 'సల్ఫర్ డై ఆక్సైడ్'ను విడుదల చేస్తుంది. కాబట్టి ఆక్సైడ్ ఖనిజాలైన హైమటైట్ లాంటి ఖనిజాలను ఉపయోగిస్తారు.

ఖనిజ రూపం	ఖనిజాలు
ఆక్సైడ్	బాక్సైట్, హెమటైట్, మాగ్నటైట్, మోనోజైట్, సిలికా, జింకైట్ (ఫిలాసఫర్స్ ఊల్).
కార్బొనేట్	సున్నపురాయి, మాలకైట్, కాలమైన్, డోలమైట్, సిడరైట్
సల్ఫేట్	బెరైటీస్, జిప్సం.
సల్ఫైడ్	పైరైటీస్, సిన్నబార్, గెలీనా, కాపర్ గ్లాన్స్.
క్లోరైడ్	కార్నలైట్, హార్న్ సిల్వర్, రాతి ఉప్పు(రాక్‌సాల్ట్).

సాంద్రీకరణ

ముడి ఖనిజాల్లో చాలా వరకు మాలిన్యాలు ఉంటాయి. వీటి నుంచి శుద్ధ లోహాన్ని పొందడానికి కొన్ని రసాయన ప్రక్రియల ద్వారా మలినాలను తొలగిస్తారు. ఈ పద్ధతిని 'సాంద్రీకరణ' అంటారు.

సాంద్రీకరణ పద్ధతులు

లెవిగేషన్: గురుత్వాకర్షణ సూత్రంపై ఆధారపడిన సాంద్రీకరణ పద్ధతిలో వేగంగా వచ్చే నీటి ధారతో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని కడుగుతారు. తేలికైన మాలిన్య కణాలు నీటి ప్రవాహంతో కొట్టుకుపోగా బరువైన శుద్ధ ముడి ఖనిజ కణాలు నిలిచిపోతాయి. ఇది భౌతిక పద్ధతి.

ప్లవన క్రియ: సల్ఫైడ్ ఖనిజాల నుంచి మలినాలను తొలగించడానికి ఈ పద్ధతిలో చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని నీటిలో అవలంబనం చేస్తారు. అనంతరం నూనె సమక్షంలో గాలిని పంపిస్తూ గిలకరించడం వల్ల పైన ఏర్పడే నురుగులోకి ఖనిజ కణాలు వస్తాయి. నురుగు కోసం పైన్ ఆయిల్, కొవ్వు ఆమ్లాలు, గ్జాంథేట్‌లను కలుపుతారు. జింక్, లెడ్ లాంటి లోహాల ఖనిజాలను ఈ విధంగా సాంద్రీకరిస్తారు. ఇది కూడా భౌతిక పద్ధతి.

లీచింగ్ (నిక్షాళనం): ఇది ఒక రసాయన పద్ధతి. ఇందులో ధాతువు రసాయన స్వభావాన్ని అనుసరించి, తగిన కారకాన్ని ఉపయోగించి, ధాతువు మాత్రమే ద్రావణంలో కరిగేలా చేస్తారు. కరగకుండా మిగిలిపోయిన మలినాలను వడపోత ద్వారా వేరు చేస్తారు. ఉదాహరణకు బాక్సైట్‌ను సోడియం హైడ్రాక్సైడ్‌ను ఉపయోగించి లీచింగ్ చేస్తారు.

అయస్కాంత వేర్పాటు పద్ధతి: ముడి ఖనిజానికి కానీ, మలినానికి కానీ అయస్కాంత ధర్మం ఉంటే ఈ పద్ధతిలో సాంద్రీకరిస్తారు. చూర్ణం చేసిన ముడి ఖనిజాన్ని అయస్కాంత రోల్లర్ మీద తిరిగే కన్వేయర్ బెల్ట్ మీద పడేలా చేస్తే ఖనిజం మాలిన్యం నుంచి వేరు అవుతుంది. ఈ పద్ధతిలో ఇనుప ఖనిజాలను, టిన్ స్టోన్‌ను సాంద్రీకరిస్తారు.

కొన్ని ముఖ్యమైన లోహాలు - వాటి ఖనిజాలు

లోహం	ముఖ్య ఖనిజాలు
అల్యూమినియం	బాక్సైట్, కోరండం, డయాస్పోర్, కయోలినైట్
బేరియం	బెరైటీస్
కాపర్	కాపర్ పైరెటీస్, చాల్కో పైరెటీస్, మాలకైట్, క్యూప్రైట్, కాపర్ గ్లాన్స్.
ఐరన్	ఐరన్ పైరెటీస్ (ఫూల్స్ గోల్డ్), హెమటైట్, మాగ్నటైట్, సిడరైట్, లియొనైట్, సిడరైట్.
కాల్షియం	సున్నపురాయి (కాల్షియం కార్బొనేట్), జిప్సం.
మెగ్నీషియం	కార్నలైట్, మాగ్నసైట్, ఎప్సం లవణం.
థోరియం	మోనోజైట్
మెర్క్యూరీ	సిన్నబార్
జింక్	కాలమైన్, జింక్‌బ్లెండ్, జింకైట్.
మాంగనీస్	పైరోలుసైట్
సిల్వర్	అర్జెంటైట్, హార్న్ సిల్వర్
లెడ్ (సీసం)	గెలీనా
సోడియం	రాతి ఉప్పు (రాక్ సాల్ట్), చిలీ సాల్ట్ పీటర్.

ముడి లోహాన్ని సంగ్రహించడం

ధాతువు నుంచి లోహాన్ని సంగ్రహించడానికి కొన్ని రసాయన ప్రక్రియలను అవసరానికి తగినట్లు ఉపయోగిస్తారు. వాటిలో ముఖ్యమైన ప్రక్రియలు.

భస్మీకరణం(కాల్సినేషన్): ధాతువును గాలి లేకుండా బాగా వేడి చేసి బాష్పశీల (వాయురూప) మలినాలను తొలగించే పద్ధతిని భస్మీకరణం అంటారు. కార్బొనేట్, బైకార్బొనేట్ ఖనిజాలకు ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు కాల్షియం కార్బొనేట్ (సున్నపురాయి)ని భస్మీకరణం చేస్తే కాల్షియం ఆక్సైడ్ (సున్నం) ఏర్పడుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ వేరు పడుతుంది.

భర్జనం(రోస్టింగ్): గాలి సరఫరా చేస్తూ లోహ ద్రవీభవన స్థానం కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద కొలిమిలో ముడి ఖనిజాన్ని వేడి చేసే ప్రక్రియ భర్జనం. ప్రధానంగా సల్ఫైడ్ ఖనిజాలను ఆక్సైడ్‌లుగా మార్చేందుకు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఉదాహరణకు రివర్బరేటరీ కొలిమిలో కాపర్ సల్ఫైడ్ ఖనిజాన్ని భర్జనం చేస్తారు.

ప్రగలనం: ధాతువును ద్రవకారి(ధాతువు ద్రవీకరణ ఉష్ణోగ్రతను తగ్గించే పదార్థం) కలిపి కానీ లేకుండా కానీ వేడిచేసి లోహాన్ని ద్రవస్థితిలో పొందే ప్రక్రియను ప్రగలనం అంటారు.

క్షయకరణం: లోహ ఆక్సైడ్‌లను సాధారణంగా కోక్(కార్బన్) లేదా కార్బన్ మోనాక్సైడ్ (CO) కలిపి వేడి చేస్తారు. ఈ ప్రక్రియలో అవి ఆక్సిజన్‌ను కోల్పోయి లోహాలుగా క్షయకరణం చెందుతాయి. ఉదాహరణకు 'బ్లాస్ట్ ఫర్నేసు'లో కోక్ మండటం వల్ల ఏర్పడిన కార్బన్ మోనాక్సైడ్.. ఐరన్ ఆక్సైడ్‌ను ఐరన్‌గా క్షయకరణం చేస్తుంది.

లోహ సంగ్రహణ - ముఖ్యాంశాలు

- ధాతువులో లోహంతోపాటు ఉండే మలినాలను 'గాంగ్' అంటారు.
- ఇనుము సంగ్రహణలో 'బ్లాస్ట్ కొలిమి'ని ఉపయోగిస్తారు. కొలిమిలోకి ప్రవేశపెట్టే కోక్, ధాతువు, సున్నపురాయిల మిశ్రమాన్ని చార్జ్ అంటారు.
- రివర్బరేటరీ కొలిమిలో ప్రగలనం, వేడి చేయడం ద్వారా కాపర్‌ను నిష్కర్షణ చేస్తారు.
- గలన స్థితిలో ఉండే లోహాన్ని పచ్చి కర్రలతో కలియబెట్టి మాలిన్యాలను వేరు చేస్తారు. ఈ పద్ధతిని 'పోలింగ్' అంటారు.
- విద్యుద్విశ్లేషణ పద్ధతిలో లోహాన్ని శుద్ధి చేసే ప్రక్రియలో అపరిశుద్ధ లోహాన్ని ఆనోడ్‌గా, శుద్ధమైన లోహ రేకును కాథోడ్‌గా వాడతారు.
- బ్లాస్ట్ ఫర్నేసులో 750° సెంటీగ్రేడ్ వద్ద ఏర్పడిన ఇనుము ఘన స్థితిలో, గుల్లబారి ఉంటుంది. దీన్ని 'స్పాంజ్ ఐరన్' అంటారు.
- స్పాంజ్ ఐరన్ కొలిమి అడుగు భాగం ద్రవరూపంలోకి మారుతుంది. ఈ స్థితిలో కార్బన్, ఫాస్ఫరస్, సిలికా చేరి దుక్క ఇనుము లేదా పోత ఇనుము(కాస్ట్ ఐరన్)గా మారుతుంది. దీనిలో కార్బన్ 3 నుంచి 4 శాతం ఉంటుంది.
- దుక్క ఇనుము సంఘటనలో మార్పుల ద్వారా చేత ఇనుము(వ్రాట్ ఐరన్), స్టీల్ తయారు చేస్తారు.
- చేత ఇనుము శుద్ధమైన ఇనుము. ఇందులో కార్బన్ 0.1 – 0.25 శాతం మాత్రమే ఉంటుంది.
- ఉక్కు(స్టీల్)లో కార్బన్ 0.1–1.5 శాతం మాత్రమే. కార్బన్ శాతం పెరుగుతున్న కొద్దీ పెలుసుదనం పెరుగుతుంది.
- ఉక్కు ప్రధానంగా ఇనుము, కార్బన్ల మిశ్రమ లోహం. కార్బన్‌తోపాటు వివిధ పరిమాణాల్లో మాంగనీస్, నికెల్, క్రోమియం, మాలిబ్డినం, వెనేడియం, టంగ్‌స్టన్ మొదలైన లోహాలను మిశ్రమం చేసి ప్రత్యేక ధర్మాలు ఉన్న ఉక్కును తయారు చేస్తారు.
- స్టెయిన్‌లెస్ స్టీల్‌లో ఇనుము, కార్బన్‌తోపాటు క్రోమియం, నికెల్ ఉంటాయి.
- దుక్క ఇనుము నుంచి స్టీల్ తయారీకి 'ఓపెన్ హార్త్ కొలిమి'ని ఉపయోగిస్తారు.

మాదిరి ప్రశ్నలు

1. సిన్నబార్ దేని ధాతువు?
   1) బంగారం 2) యురేనియం
   3) సీసం 4) మెర్క్యూరీ
2. చార్జ్ అంటే ఏమిటి?
   1) విద్యుదావేశం 2) ఖనిజ చూర్ణం
   3) కోక్, సున్నపురాయి, ధాతువుల మిశ్రమం
   4) కోక్, ధాతువుల మిశ్రమం
3. బ్లాస్ట్ ఫర్నేస్‌లో లభించే గుల్లబారిన ఇనుమును ఏమంటారు?
   1) స్టీల్ 2) బ్లిస్టర్ ఐరన్
   3) స్పాంజ్ ఐరన్ 4) చేత ఇనుము
4. చేత ఇనుములో కార్బన్ శాతం?
   1) 2 శాతం 2) 0.1 శాతం
   3) 0.8 శాతం 4) 0.2 శాతం
5. గాలి లేకుండా ధాతువును వేడి చేసి బాష్పశీల మలినాలను తొలగించే ప్రక్రియ?
   1) భస్మీకరణం 2) భర్జనం
   3) నిక్షాళనం 4) పోలింగ్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 1.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. పైరైటీస్ రూపంలో ఇండియాలో లభించే ముడి ఖనిజం?
   1) అల్యూమినియం 2) ఇనుము
   3) బంగారం 4) ప్లాటినం
2. అల్యూమినియం లోహం ధాతువు?
   1) బాక్సైట్ 2) బెరైటీస్
   3) సిన్నబార్ 4) హెమటైట్
3. భూపటలంలో పుష్కలమైన లోహం?
   1) ఇనుము 2) బంగారం
   3) అల్యూమినియం 4) లెడ్
4. ఫిలాసఫర్స్ ఊల్ అంటే ఏమిటి?
   1) జింక్ బ్రోమైడ్ 2) జింక్ నైట్రేట్
   3) జింక్ ఆక్సైడ్ 4) జింక్ క్లోరైడ్

సమాధానాలు

1) 2; 2) 1; 3) 3; 4) 3.

వీరోచితంగా పోరాడిన సమ్మక్క

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయుల సామంతులు

నతవాడి వంశం

నందిగామ, మధిర తాలూకాలు, మహబూబాబాద్, జనగామ తాలూకాలు నతవాడి రాజ్యపరిధిలో ఉండేవి. ఈ రాజ్యాన్ని నతవాడి వంశం పాలించింది. ఈ వంశీయులు మొదట కల్యాణీ చాళుక్యుల సామంతులుగా ఉండి తర్వాత కాకతీయుల సామంతులయ్యారు.ఈ వంశానికి ఆద్యుడు బేతరాజు. ఇతడు కాకతీయ రెండో ప్రోలరాజుకు తన కూతురునిచ్చి వివాహం చేశాడు. ఇతడి కుమారుడైన దుర్గరాజు(1104-1157) కల్యాణీ చాళుక్య ఆరో విక్రమాదిత్యుడికి, మూడో సోమేశ్వరుడికి సామంతుడిగా పనిచేశాడు. దుర్గరాజు కుమారుడైన బుద్ధరాజును కాకతి రుద్రదేవుడు, మహాదేవుడు నతవాడి పాలకుడిగా నియమించారు. ఇతడి పెద్ద కుమారుడు రుద్రుడు. కాకతి మహాదేవుడు ఇతడికి తన కూతురునిచ్చి వివాహం చేశాడు. బుద్ధరాజు రెండో కుమారుడు వక్కడి మల్ల రుద్రుడు. ఇతడు గణపతిదేవుడి సోదరి అయిన మైలాంబను వివాహం చేసుకున్నాడు. రుద్రమదేవి కాలం వరకు నతవాడి రాజులు కాకతీయ సామంతులుగా పనిచేశారు.

గోనవంశం

రుద్రదేవుడు కందూరి చోడులను పానుగల్లు, దేవరకొండ ప్రాంతాలకు పరిమితం చేసినందువల్ల వారు వర్ధమానపురాన్ని విడిచి వెళ్లారు. మళ్లీ రుద్రదేవుడే వర్ధమానపురం (కందూరినాటి) పాలకుడిగా గోన బుద్ధరాజు(రంగనాథ రామాయణ కర్త)ను నియమించి ఉంటాడని భావిస్తున్నారు. అతడి కుమారుడైన గోన గన్నారెడ్డి గణపతిదేవుడి వల్ల వర్ధమానపుర రాజ్యాన్ని తిరిగి పొందాడు. ఇతడి తమ్ముడు విఠల నరేంద్రుడు. వీరిద్దరూ యాదవ రాజులు ఆక్రమించిన ఆదవాని, తుంబుళాలను జయించి రాయచూరు దుర్గాన్ని ఆక్రమించారు. విఠలుడు హోళువ, మాణువ రాజ్యాలను జయించాడు. కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ప్రదేశాన్ని ఆక్రమించి దక్షిణాంధ్ర భూభాగాలను కాకతీయ సామ్రాజ్యంలో కలిపాడు. గోన గన్నారెడ్డి సోదరి కుప్పాంబిక. ఆమె భర్త మల్యాల గుండ దండాధీశుడు. గోన గన్నారెడ్డి తర్వాత ఇతడు వర్ధమానపుర పాలకుడయ్యాడు. ఇతడు 1245-46లో వర్ధమానపుర శాసనం వేయించాడు. 1259లో బూదపూర శాసనం, 1272లో మరో శాసనం వేయించాడు. ఇతడి మరణానంతరం భార్య కుప్పాంబిక తన భర్త పేరు మీద 1276లో గుండేశ్వరాలయం నిర్మించి శాసనం వేయించింది. ఇందులో ఆమె చిన్న తమ్ముడు గోనబుద్ధయ, గోన విఠయ కుమారుడు గుండయ గురించి పేర్కొన్నారు.

వావిలాల వంశం

వీరు రెడ్డి వంశస్థులు. రుద్రమదేవి కాలంలో ఆమనగల్లు, వంగూరు విషయాల (సీమ) పాలకులుగా ఉన్నారు. చెరకు రెడ్లతో వీరికి వివాహ సంబంధాలు ఉన్నాయి.

కాయస్థ వంశం (1239-1304)

మహారాష్ట్ర నుంచి వచ్చి స్థిరపడిన కాయస్థ వంశస్థుల్లో ఆద్యుడు గంగయ సాహిణి(1239-1257). ఇతడు కాకతి గణపతిదేవ చక్రవర్తికి సామంతుడు, ఆప్తుడు, అశ్వసైన్యాధిపతి. ఇతడి సువిశాల రాజ్యంలో మార్జవాడి, పలనాడు, కడప మొదలైన ప్రాంతాలతో పాటు, నల్లగొండ జిల్లాలోని పానగల్లు కూడా ఉండేవి. ఇతడి రాజధాని కడప జిల్లా వల్లూరు. దేవగిరి యాదవ రాజు ఆజ్ఞ మేరకు అతడి సామంతుడైన దామోదరుడు కాకతీయ భూభాగాలను ఆక్రమించాడు. గణపతిదేవుడి ఆజ్ఞతో గంగయ సాహిణి దామోదరుణ్ని ఓడించాడు. దీంతో గణపతిదేవుడు అతడికి మహామండలేశ్వర పదవిని ఇచ్చాడు.

గంగయ సాహిణి తర్వాత అతడి మేనల్లుడైన జన్నిగదేవుడు గణపతిదేవుడు, రుద్రమదేవి వద్ద సామంతుడిగా పనిచేశాడు. ఇతడి రాజ్యంలో నల్లగొండ మండలం అంతర్భాగంగా ఉండేది. ఇతడి సోదరుడు త్రిపురాంతకుడుకూడా సామంతుడే. తర్వాత ఇతడి సోదరుడు అంబదేవుడు(1275-1302) స్వతంత్రించి కాకతీయులకు శత్రువయ్యాడు. అంబదేవుడి రాజ్యంలో నల్లగొండ జిల్లాలోని కృష్ణా నది ఉత్తర ప్రాంతాలు, దోర్నాల ఉండేవి. ఇతడి కుమారుడైన రెండో త్రిపురాంతకుడి కాలంలో ఈ రాజ్యం కాకతీయ రాజ్యంలో కలిసిపోయింది.

సమ్మక్క సారక్క

పగిడిద్దరాజు, సమ్మక్క-సారక్కల తిరుగుబాటు వృత్తాంతానికి చారిత్రక ఆధారాలు లేవు. కానీ శతాబ్దాల నుంచి వీరి గాథలు ప్రజల్లో ప్రచారంలో ఉన్నాయి. వాటి ప్రకారం..

గోదావరి తీర ప్రాంతమైన మేడారం పరగణాను కోయ తెగకు చెందిన పగిడిద్దరాజు పాలించేవాడు. ఇతడు ప్రతాపరుద్రుడి సామంతుడు. కరీంనగర్ రాజధానిగా పాలించే మరో కోయ రాజైన మేడరాజు తన కుమార్తె సమ్మక్కను పగిడిద్దరాజుకిచ్చి పెళ్లి చేశాడు. సారలమ్మ, నాగులమ్మ, జంపన్నలు వారి సంతానం. కొన్నాళ్లకు మేడారం పరగణాలో నాలుగేళ్లపాటు తీవ్రమైన కరువు వచ్చింది. ప్రజలు పన్నులు కట్టలేని దుస్థితి తలెత్తింది. దీంతో పగిడిద్దరాజు కూడా ప్రతాపరుద్రుడికి పన్నులు కట్టలేదు. దీన్ని ధిక్కారంగా భావించిన ప్రతాపరుద్రుడు మంత్రి యుగంధరుడి ఆధ్వర్యంలో అతడిపైకి పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపాడు. మేడారం సమీపంలోని సంపెంగవాగు వద్ద పగిడిద్దరాజు సైనికులు కాకతీయ సైన్యంతో వీరోచితంగా పోరాడారు. ఆయుధ బలం, సంఖ్యాబలం ఉన్న కాకతీయ సైన్యాన్ని నిలువరించలేక పగిడిద్దరాజుతో సహా ఆయన బిడ్డలు సారలమ్మ, నాగులమ్మ, అల్లుడు గోవిందరాజు వీరమరణం పొందారు. ఈ పరాజయాన్ని భరించలేక పగిడిద్దరాజు కుమారుడైన జంపన్న వాగులోకి దూకి చనిపోయాడు. అప్పటి నుంచి ఈ వాగుకు జంపన్నవాగు అని పేరొచ్చింది. పగిడిద్దరాజు భార్య సమ్మక్క కాకతీయ సేనతో పోరాడుతుండగా, ఒక సైనికుడు దొంగచాటుగా వచ్చి బల్లెంతో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన సమ్మక్క ప్రస్తుతం జాతర జరుగుతున్న స్థలంలో నేలకొరిగింది.

లక్షలాది మంది పూజలందుకుంటున్న ఈ వీరుల గాథలు, కథనాల్లో చిన్న చిన్న తేడాలున్నాయి. కాకతీయులకు, ఆదివాసీలకు యుద్ధం జరగడానికి సహజవనరుల పంపకాల వివాదం కారణమని కొన్ని కథనాలు, కప్పం చెల్లించకపోవడం కారణమని ఇంకొన్ని కథనాలు చెబుతున్నాయి. వీరి నుంచి కాకతీయులు కప్పం వసూలు చేశారనడానికి ఆధారాల్లేవని చరిత్రకారులు తెలిపారు. కానీ ఎక్కువ కథలు అదే కారణమని చెబుతున్నాయి. కాకతీయులు రాష్ట్ర కూట వంశం వారు కాదని పులింద జాతికి చెందిన వారని కొందరు చరిత్రకారుల అభిప్రాయం. ఈ యుద్ధానికి పుళింద, కోయజాతి వైరం కారణమా? కప్పమే కారణమా? అన్నది పరిశోధించి తేల్చాల్సి ఉంది.

ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకర విధానం అమలైంది. ఇది ఒక రకమైన జాగిర్దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనాధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనేవారు. వీరు నిర్ణీత మొత్తంలో సైన్యాన్ని పోషించి, యుద్ధసమయంలో చక్రవర్తికి తోడ్పడేవారు.

మాదిరి ప్రశ్నలు

1. రెండో బేతరాజు ఎవరి ద్వారా శైవమతాన్ని అవలంభించాడు?
   1) రామేశ్వర పండితుడు
   2) అప్పయాచార్యులు
   3) పాల్కురికి సోమన 4) బసవేశ్వరుడు
2. కాకతీయుల కాలంలో గ్రామరక్షణ బాధ్యత ఎవరిది?
   1) కరణం 2) పురోహితుడు
   3) రెడ్డి 4) తలారి
3. కాకతీయుల కాలంలో స్థూలంగా ఉన్న పన్నుల సంఖ్య?
   1) 5 2) 7 3) 6 4) 4
4. సెట్టి, కేసరి సముద్రాలను తవ్వించిన కాకతీయ రాజు?
   1) మొదటి బేతరాజు 2) రెండో బేతరాజు
   3) రుద్రదేవుడు 4) గణపతిదేవుడు
5. పాకాల చెరువును తవ్వించింది?
   1) రుద్రదేవుడు 2) జాయపసేనాని
   3) రేచర్ల రుద్రుడు 4) ప్రతాపరుద్రుడు
6. 'రామప్పచెరువు'ను తవ్వించింది?
   1) రేచర్ల రుద్రుడు 2) రుద్రదేవుడు
   3) జాయపసేనాని 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు

1) 1; 2) 4; 3) 1;4) 2;5) 3; 6) 1.

కాకతీయ యుగ విశేషాలు

పాలనా విధానం: కాకతీయుల ప్రభుత్వం సంప్రదాయ రాచరికం. సాధారణంగా రాజ్యం తండ్రి నుంచి కుమారుడికి వారసత్వంగా సంక్రమిస్తుంది. కుమార్తెకు కూడా ఆ హక్కు కల్పించడం కాకతీయ వంశంలోనే జరిగింది. సిద్ధాంత రీత్యా అధికారం అంతా రాజుదే. కానీ ఆచరణలో రాజ్యాధికారానికి కొన్ని పరిమితులు ఉండేవి. పాలనలో రాజుకు సహకరించేందుకు మంత్రి పరిషత్తు ఉండేది. వర్ణధర్మం, కుల ధర్మం, ఆచారం, సంప్రదాయం, శాస్త్ర నియమాలు రాజుకైనా అనుల్లంఘనీయాలు. నాటి శాసనాల్లో చాతుర్వర్ణ సముద్ధరణ అనే బిరుదు తరచుగా కనిపిస్తుంది. నిర్ణీత సమయంలో రాజు ప్రజలకు దర్శనం ఇవ్వాలని రుద్రదేవుడి నీతిసారం తెలుపుతోంది. కాకతీయులు ఆరోగ్యశాలలు, ప్రసూతి ఆసుపత్రులు, కళాశాలలు, మఠాలు, సత్రాలు, చలివేంద్రాలను నెలకొల్పారు.

కాకతీయుల మంత్రులలో అన్ని కులాల వారు ఉండేవారు. కాకతీయులు కులాన్ని బట్టి కాక వ్యక్తుల అర్హతలను బట్టి మంత్రి పదవులు ఇచ్చారు. గణపతిదేవ చక్రవర్తికి రేచర్ల రుద్రారెడ్డి, మల్యాల హేమాద్రిరెడ్డి ప్రధానులు. ప్రతాపరుద్రుడికి ముప్పిడి నాయకుడు మహా ప్రధాని. ప్రతాపరుద్రుడి కాలంలో నాయంకర విధానం అమలైంది. ఇది ఒక రకమైన జాగిర్దారీ విధానం. రాజ్యాన్ని అనేక మండలాలుగా విభజించి వాటికి పరిపాలనాధికారులుగా సైన్యాధ్యక్షులను నియమించేవారు. ఈ పాలకులనే నాయంకరులు అనేవారు. నాయంకరులు దుర్గాధ్యక్షులు. వారి మండలంలో వచ్చే ఆదాయంతో నిర్ణీత సైన్యాన్ని పోషించి, యుద్ధ సమయంలో చక్రవర్తికి తోడ్పడేవారు. ప్రతాపరుద్రుడు తన రాజ్యంలో నాలుగో వంతు భూమిని నాయంకరుల ఆధీనంలో ఉంచాడు. ప్రతాపరుద్రుడి కాలంలో 75 మంది నాయంకరులున్నారు. కాకతీయరాజ్య పతనం తర్వాత విజయనగర రాజులు నాయంకర విధానాన్ని అనుసరించారు. ఆంగ్లేయులు పాలన చేపట్టే వరకూ ఈ విధానం కొనసాగింది. కాకతీయులకు పూర్వీకులైన చోళులు, చాళుక్యులు కేంద్రీకృత పాలనా విధానాన్ని అనుసరించారు. అందుకు భిన్నంగా కాకతీయులు వికేంద్రీకృత పాలనా వ్యవస్థను అమలు పరిచారు. అందుకే మాండలికులు, నాయంకరులకు సైనిక విషయాలలో మినహా పూర్తి స్వేచ్ఛను ఇచ్చారు. వారిపై అధికారాన్ని రుద్దలేదు. అణచి ఉంచే పద్ధతిని విడిచి పెట్టారు. వీరు తమను మహామండలేశ్వరులుగానే భావించారు తప్ప, రాజాధిరాజుగా, చక్రవర్తిగా భావించలేదు. ఒక రకంగా ఇది ప్రజాస్వామిక భావన.

నాయంకరుల్లో తెలంగాణకు సంబంధించిన కొందరి వివరాలు: యాదవ విశ్వనాథుడు గణపతిదేవుడి కాలంలో యుద్ధాల్లో పాల్గొన్నాడు. నల్లగొండ జిల్లాలో ఒక ప్రాంతాన్ని పరిపాలించాడు. అక్షయ చంద్రదేవుడు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించాడు. సారంగ పాణి దేవుడనే యాదవరాజు పానగల్లును పాలించాడు. సింద కుటుంబానికి చెందిన భైరవుడు రుద్రమ కాలంలో బీదర్ ప్రాంతాన్ని పాలించాడు.

పరిపాలనా సౌలభ్యం కోసం కాకతీయ సామ్రాజ్యాన్ని స్థలం, సీమ, వాడి, నాడు, పాడి, భూమి అనే ప్రాంతీయ విభాగాలుగా విభజించారు. 10 నుంచి 60 గ్రామాల సముదాయాన్ని స్థలంగా వ్యవహరించేవారు. కొన్ని స్థలాల సముదాయమే నాడు. ఉదాహరణ: అనుమకొండనాడు, కందూరునాడు, సబ్బినాడు, అయిజనాడు.

ఆయగార్లు

గ్రామపాలనను ఆయగార్లు నిర్వహించేవారు. గ్రామసేవ, రాజ్యసేవ చేసినందుకు పన్ను లేకుండా వీరు భూమిని పొందేవారు. ఆయం అంటే పొలం వైశాల్యం. సాధారణంగా ఆయగార్ల సంఖ్య పన్నెండు. వారు

1. కరణం, 2. రెడ్డి, 3. తలారి 4. పురోహితుడు, 5. కమ్మరి, 6. కంసాలి, 7. వడ్రంగి, 8. కుమ్మరి 9. చాకలి, 10. మంగలి, 11. వెట్టి, 12. చర్మకారుడు. వీరిలో మొదటి ముగ్గురు ప్రభుత్వ సేవకులు. మిగతా వారు గ్రామ సేవకులు. గ్రామ విస్తీర్ణం, ఆయకట్టు, పోరంబోకు భూమి, తోట భూమి, గడ్డిభూముల విస్తీర్ణం, వ్యక్తుల ఆస్తుల లెక్కలు, దేవాలయ ఆస్తుల లెక్కలు మొదలైన దస్తరం నిర్వహణ కరణం బాధ్యత. కరణం ఇచ్చే లెక్కల ఆధారంగా రాజ్యభాగం(పన్ను)ను వసూలు చేసి ప్రభుత్వానికి అందజేసే బాధ్యత రెడ్డి లేదా పెద కాపుది. గ్రామ రక్షణ బాధ్యత తలారిది. దొంగతనాలు జరిగినప్పుడు నేరస్థులను పట్టుకోవడం, అపహరించిన సొత్తుని తెచ్చి ఇవ్వడం అతడి విధి. అష్టాదశవర్ణాల వారికి సంఘాలుండేవి. వీటిని సమయాలనేవారు.

Elections are essential for the..

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Special programs of study (1)/ are tailored (2)/ to the needed (3)/ of specific groups. (4) No error (5)

2. Most travel agents (1)/ are prepared to (2)/ customize travel arrangements (3)/ to meet individual requirement. (4) No error (5)

3. The rise in inflation (1)/ was just one symptoms (2)/ of the poor state (3)/ of the economy. (4) No error (5)

4. Her arm was beginning (1)/ to swell up (2)/ where the bee (3)/ has stung her. (4) No error (5)

5. The next morning (1)/ the team surveyed (2)/ the damage (3)/ caused in the fire. (4) No error (5)

Directions (Q. 06-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Elections are essential for the ____ of parliamentary decisions.
1) Continuous 2) monitoring
3) vital 4) approval
5) surveillance

7. Barons had to swear an oath of ____ to the king.
1) Allegiance 2) administration
3) silence 4) request
5) promiscuous

8. Always chew food well before ____ it.
1) Thrusting 2) putting
3) eating 4) swallowing
5) digesting

9. The ____ was released to await trial but had to ________ her passport.
1) Defendant, surrender
2) plaintiff, give in
3) dependant, submit
4) accused, give of
5) convict, abide

10. When you first meet her, she gives a _______ impression of warmth and friendship.
1) Supper 2) superfluous
3) superficial 4) superlative
5) superiority

11. His career was cut short when he _______ to cancer.
1) Affect 2) effect
3) diagnosed 4) succumbed
5) suffered

12. The party suffered a _______ defeat in the general election.
1) Vast 2) majority
3) devastate 4) possible
5) humiliating

13. Keep your answers as _______ as possible.
1) Success 2) verbatim
3) succinct 4) modulate
5) length

14. I agreed _______ what she said in substance, though not _____ every detail.
1) In, with 2) to, in
3) with, with 4) for, at
5) from, for

15. Climate change is still ____ much a subject ____ debate.
1) Mostly, to 2) many, from
3) much, form 4) very, for
5) pretty, from

Directions: (Q. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

16. Millions <u>faces</u> starvation next year as a result of the drought.
1) Are facing 2) faced
3) will face 4) will have faced
5) No correction required

17. Leaving him out of the team may sound the <u>alarm</u> for our chances.
1) Winning 2) ringing bell
3) death knell 4) blowing off
5) No correction required

18. The meeting ended on a <u>turn around</u> with several people walking out.
1) Happy mood
2) mixed reaction
3) sordid
4) sour note
5) No correction required

19. If you say you're sorry <u>we would</u> forgive you.
1) We might 2) we will
3) we had 4) we have
5) No correction required

20. They <u>carry up</u> research into the roles of men and women in today's society.
1) Carried away 2) carried out
3) carry forward 4) carry upon
5) No correction required

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Finance minister Arun Jaitley on Saturday ______ (21) a Budget that put boosting growth before painful reforms, slowing the pace of fiscal deficit cuts and seeking to put ______ (22) and foreign capital to work. In his first full-year Budget since Prime Minister Narendra Modi's landslide election victory ______ (23) May, Jaitley said India's economy was about to take off. Modi tweeted that the Budget would "further reignite our growth engine".Billed as a test of the nationalist premier's willingness to ____ (24) a $2 trillion economy with a bloated public sector and weak private investment, the Budget was short on structural reforms and contained revenue targets some called unrealistic. It drew a__ (25) reception from economists, with some calling it a path to an investor-friendly India, but ______ (26) seeing a missed opportunity to tackle deep-seated structural problems. Jaitley promised higher investment in India's decrepit roads and railways, offered the ______ (27) of tax cuts to global companies and the stick of tighter______(28) to get Indian tycoons to invest at home rather than stash wealth abroad. Tax evaders face ______ (29) sentences of up to 10 years, he warned.The tax changes and tougher enforcement would raise $2.5 billion next year, he said. Tax receipts overall would rise 15 percent and government asset sales would raise $11 billion - goals that past experience ______ (30) may be hard to meet.

21. 1) announced 2) proclaimed
3) decree 4) stated
5) publicize

22. 1) family 2) domestic
3) familial 4) household
5) domicile

23. 1) most recent 2) very last
3) last 4) end 5) final

24. 1) improvement
2) restructuring
3) reorganization
4) reform
5) development

25. 1) uniform 2) assertive
3) minor 4) magical
5) mixed

26. 1) others 2) extra 3) further
4) supplementary 5) spare

27. 1) bribe 2) carrot 3) lure
4) candy 5) bite

28. 1) system 2) convention
3) rules 4) laws
5) policy

29. 1) penitent 2) dungeon
3) confined 4) jail
5) detaining

30. 1) showing 2) showed
3) shown 4) show 5) shows

Directions (Q. 31-35): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) We only remember learning history on war, not of other types of historical subjects.

B) History, to some degree is important, but it is typically taught in a memorization manner.

C) But the reality is that history is so universal because nearly every country is interconnected whether it is through economics, culture, business, finances, goods and services, and ecological perspectives.

D) This is where we go wrong with learning history. There is no process of looking at it from a productive perspective.

E) Furthermore, we typically only learn history of our own country.

F) Never in any educational background was a student challenged to reflect or re-evaluate how history works, but rather how much one could retain.

31. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) C 4) E 5) F

32. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E

33. What is the FOURTH sentence after rearrangement?
1) A 2) C 3) D 4) E 5) F

34. What is the FIRST sentence after rearrangement?
1) B 2) A 3) C 4) E 5) F

35. What is the SECOND sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Directions (Q. 36-38): Choose the word which is wrongly spelt from the five options given.

36. 1) garbage 2) delegeta
3) monitor 4) commission
5) ensconce

37. 1) courageous2) contagios
3) commandeer
4) convulsion 5) complement

38. 1) referre
2) explicit
3) sabotage 4) supplement
5) surreptitious

Directions (Q. 39-40): Read each sentence which has four parts to find out whether there is any grammatical mistake or spelling mistake in it. Certain words are given in bold in each part to identify the error. Mark the number of that part with error as your answer.

39. **Apollo 11 is** (1) the first **manned** (2) mission **to land** (3) on **the moon.** (4)

40. The **cashere** (1) **gave** (2) me **two hundred** (3) and twenty **rupees.** (4)

Key

1) 3	2) 4	3) 2	4) 4	5) 2
6) 5	7) 1	8) 4	9) 1	10) 2
11) 4	12) 5	13) 3	14) 3	15) 4
16) 3	17) 3	18) 4	19) 2	20) 2
21) 1	22) 2	23) 3	24) 4	25) 5
26) 1	27) 2	28) 3	29) 4	30) 5
31) 3	32) 1	33) 4	34) 1	35) 5
36) 2	37) 2	38) 1	39) 1	40) 1